
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 05-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 155 Published from Hyderabad,Rangareddy,Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50




చెల్లని మోడీ మ్యాజిక్

మెజార్టీ ఫిగర్‌కు బీజేపీ దూరం

- హిందీ రాష్ట్రాల్లో ఎదురు దెబ్బలు
- ఆదుకోని అయోధ్య రామయ్య
- గణనీయంగా పుంజుకున్న 'ఇండియా'
- స్వల్ప ఆధిక్యతలో ఎన్డీఏ


న్యూఢిల్లీ : సొంత బలంతో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని ఆశించిన కమలదళానికి పరాభవం తప్పలేదు. నరేంద్ర మోడీ ప్రధాని పదవిని అధిష్టించాలంటే మిత్రపక్షాల మద్దతు తప్పనిసరైంది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 స్థానాలు గెలుచుకుంటుందని, ఎన్డీఏ కూటమి 400కు పైగా స్థానాలు సాధించి అఖండ విజయాన్ని సొంతం చేసుకుంటుందని బీరాలు పలికిన కమలనాథులు ఖంగుతిన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 272ని కూడా బీజేపీ చేరుకోలేకపోయింది. గత ఎన్నికల్లో 353 స్థానాలు సాధించిన ఎన్డీయే కూటమి ఇప్పుడు 300 స్థానాలు గెలుచుకోవడమే కష్టమైపోయింది. మోడీ-షా ద్వయం ఇమేజ్ బీజేపీకి ఓట్ల వర్షం కురిపించలేకపోయింది. కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఆ పార్టీని అయోధ్య రామయ్య ఆదుకోలేదు. యూపీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, హర్యానాలో కాషాయ పార్టీకి ప్రజలు కషాయం తాగించి చేదు అనుభవాన్ని రుచి చూపించారు. ఈ రాష్ట్రాల నుంచి గతంలో గెలుచుకున్న స్థానాల్లో సగం స్థానాలను కూడా ఆ పార్టీ ఈసారి దక్కించుకోలేదు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్ రాష్ట్రాలు బీజేపీ పరువు కాపాడాయి. దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆదుకున్నాయి. రాజధాని ఢిల్లీలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ విజయాలు లేకుంటే కేంద్రంలో ఇండియా బ్లాక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఉండేది. కాంగ్రెస్‌తో ప్రధాన పోటీ ఉన్న చోట్ల బీజేపీ కొంతమేర నష్టపోయింది. గత పది సంవత్సరాల కాలంలో ఈ విధంగా కాంగ్రెస్ చేతిలో బీజేపీకి ఎదురు దెబ్బలు తగలడం ఇదే మొదటిసారి. ఉత్తరప్రదేశ్ ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. 80 లోక్‌సభ స్థానాలు ఉన్న ఈ రాష్ట్రంలో రామమందిర నిర్మాణం తమకు కలిసొస్తుందని, రాష్ట్రంలో క్లీన్‌స్వీప్ చేస్తామని బీజేపీ నేతలు ఆశించారు. అయితే వారి కలలు కల్లలయ్యాయి. యోగి డబుల్ ఇంజిన్ మంత్రం పారలేదు. కమలదళం జోరుకు ఇండియా కూటమి కళ్లెం వేసింది. బీజేపీ కంటే సమాజ్‌వాదీ-కాంగ్రెస్ బ్లాక్‌కే ఎక్కువ స్థానాలు లభించాయి. రైతు నేత చౌదరి చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడం ద్వారా రాష్ట్రీయ లోక్‌దళ్‌ను ప్రతిపక్ష కూటమి నుంచి వేరుచేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ, అప్నాదళ్ (సోనేలాల్), నిషాద్ పార్టీ వంటి చిన్నా చితకా పక్షాలతో జట్టు కట్టి గోదాలో దిగినా చతికిలపడాల్సి వచ్చింది. ఇప్పటి వరకూ బీజేపీకి అండగా నిలిచిన గుజ్జర్లు, రాజ్‌పుట్‌లు, బ్రాహ్మణులు ఈసారి దూరమయ్యారు. మరోవైపు ఆర్థిక పరిస్థితులు, రైతు కష్టాలు వంటి అంశాలను లేవనెత్తడం ద్వారా సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీలు ఓటర్ల మెప్పు పొందాయి. మందిర నిర్మాణం జరిగిన అయోధ్యలో (ఫైజాబాద్) కూడా బీజేపీ ఓటమి పాలైంది. బీజేపీ పాలనలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య సంస్థలను ఏ విధంగా నిర్వీర్యం చేసిందీ ప్రజలకు ...15లో



ఖేదం...మోదం

ఖాతా తెరవని బీఆర్ఎస్

- పెరిగిన బీజేపీ బలం
- కాంగ్రెస్ కట్టడి
- రాజకీయ చైతన్యాన్ని వెల్లడించిన ఓటర్లు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉత్కంఠకు తెరపడింది. లోక్‌సభ ఫలితాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని 17 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ సమానంగా 8-8 సీట్లు పంచుకోగా, ఎంఐఎం హైదరాబాద్ స్థానాన్ని నిలబెట్టుకుంది. అనూహ్యంగా బీఆర్ఎస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. కేవలం రెండు స్థానాల్లో మినహా మిగిలిన చోట్ల కనీసం రెండో స్థానంలో కూడా నిలబడలేదు. బీఆర్ఎస్ ఓట్‌బ్యాంక్ మొత్తం బీజేపీకి బదలాయింపు జరిగిందనే విశ్లేషణలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ రాజకీయ చరిత్రలో ఇంత దారుణంగా పరాజయం పొందడం ఇదే తొలిసారి. అదే సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి దూకుడును ఓటర్లు నియంత్రించినట్టు కనిపించింది. మల్కాజ్‌గిరి ఎంపీగా సిట్టింగ్ స్థానంలో ఉండి, అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీచేసి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. తన సిట్టింగ్‌గా ఉన్న మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని రేవంత్‌రెడ్డి గెలిపించుకోలేకపోయారు. ఆ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి ఏ దశలోనూ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. ఈటల రాజేందర్ ఇక్కడినుంచి 3.86 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మరోవైపు సీఎం సొంత ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. ఇక్కడి ఆ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ చేతిలో పరాజయం పొందారు. దీనితో సీఎం రేవంత్‌రెడ్డి దూకుడును రాష్ట్ర ప్రజలు నియంత్రిస్తున్నట్టే కనిపిస్తుంది. ఇక బీఆర్ఎస్ ఏ దశలోనూ తన ప్రాభవాన్ని చూపలేకపోయింది. ఫలితాలు నిరాశ కలిగించాయని ఆపార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కే తారకరామారావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆపార్టీ అధ్యక్షులు కే చంద్రశేఖరరావు ఈ ఫలితాలపై ఎలాంటి కామెంట్ చేయకుండా, సైలెంట్ అయిపోయారు. అయితే రాష్ట్రంలో బీజేపీ బలం పెరుగుతున్న విషయాన్ని ...15లో

తెలంగాణ (17/ 17)	
కాంగ్రెస్	8
బీఆర్ఎస్	0
బీజేపీ	8
ఎంఐఎం	1

బీజేపీకి భారీ షాక్

- ప్రగల్భాలు పలికిన మోడీకి భంగపాటు
- ఈసీ సక్రమంగా ఉన్నట్టయితే ఎన్డీఏకు మరింత ప్రతికూలమే : సీపీఐ(ఎం)



న్యూఢిల్లీ : 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీకి పెద్ద ఎదురు దెబ్బ అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. గత రెండు ఎన్నికల్లోనూ లోక్‌సభలో వచ్చిన మెజారిటీ ఈసారి తుడిచిపెట్టుకుపోయిందని పేర్కొంది. ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని పదే పదే ప్రగల్భాలు పలికిన నరేంద్ర మోడీ ...15లో

బీజేపీ, ఎన్డీయేపై ప్రజల్లో విశ్వాసం

- ఓటర్లందరికీ ప్రధాని నరేంద్ర మోడీ కృతజ్ఞతలు



నేటి విజయం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది భారత తిరుగులేని విధేయత సాధించిన విజయం. ఇది అభివృద్ధి చెందిన భారతదేశ వాగ్దానాల విజయం' అని ప్రధాని మోడీ అభివర్ణించారు. బీజేపీ, ఎన్డీయేపై ...9లో


మోడీతో పాటు అదానీ ఓడిపోయారు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



దేశానికి తమ కూటమి కొత్త విజన్ ఇచ్చిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఎన్నికల్లో మోడీతో పాటు అదానీ ఓడిపోయారని విమర్శించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో కలిసి ఆయన ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఎన్నికల్లో బీజేపీతో పాటు అనేక సంస్థలతో పోరాడామని ...9లో

మోడీకి నైతిక ఓటమే



ప్రజా తీర్పును వినమ్రంగా స్వీకరిస్తున్నాం. రాజ్యాంగాన్ని కాపాడటంలో తొలి విజయం సాధించాం. మోడీకి, ప్రజలకు మధ్యనే ఈ పోరు అని మొదటి నుంచి చెబుతున్నాం. ఈ సారి ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. కానీ ప్రజలు మోడీకి వ్యతిరేకంగా ఉన్నారని స్పష్టమైన సందేశమిచ్చారు. ఇది మోడీకి రాజకీయంగానే గాక, నైతిక పరాజయం కూడా. కాంగ్రెస్, ఇండియా ఫోరం ఈ ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంది. ప్రభుత్వ యంత్రాంగం అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా ప్రజలు ఇంతటి విజయాన్ని అందించారు. ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన విజయం.

- మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అఖిల భారత అధ్యక్షులు

కొత్త ఆశలు చిగురించాయి



ప్రజానీకం కొత్త ఆశలు చిగురింపజేశారు. ఉత్తరప్రదేశ్ ప్రజానీకం దేశానికి మరోమారు కొత్త మార్గం చూపారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను పరిరక్షించుకునేందుకు ఈ తీర్పు ఎంతో దోహదం చేస్తుంది. సామాజిక న్యాయ రక్షణ కోసం ప్రజలు తీర్పునిచ్చారు. యుపిలోని ప్రగతిశీల భావజాలమున్న ప్రజానీకం ఓట్ల రూపంలో తమ వాణిని బలంగా వినిపించారు. ప్రజలను విచ్ఛిన్నం చేసే రాజకీయాలకు వ్యతిరేకంగా సానుకూల దృక్పథ రాజకీయాలకు మద్దతుగా, సోదరభావానికి, సౌభ్రాతృత్వానికి, సామరస్యతకు మద్దతుగా ప్రజలు అందించిన విజయమిది. ఇది 'ఇండియా' ఐక్యతకు దక్కిన విజయం.

- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత

నాలుగు ఎంపీ స్థానాల్లో సీపీఐ(ఎం) విజయం

తమిళనాడులో భారీ మెజార్టీ

- ఒడిశాలో అసెంబ్లీ స్థానంలో ఘన విజయం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) నాలుగు లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. మూడు రాష్ట్రాల్లో నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. తమిళనాడులో రెండు, కేరళ, రాజస్థాన్‌లో ఒక్కో స్థానం గెలిచింది. తమిళనాడులో దిండిగల్ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థి ఎంఎ మహ్మద్ ముబారక్ (2,22,975)పై సీపీఐ(ఎం) అభ్యర్థి ఆర్. సచ్చితానందం 4,40,051 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆయన 6,63,026 ఓట్లతో ఘన విజయం సాధించారు. మధురై నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎస్.వెంకటేషన్ 2,09,409 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రామ శ్రీనివాసన్‌కు 2,22,914 ఓట్లు రాగా వెంకటేషన్ 4,30,323 ఓట్లతో ఘన విజయం సాధించారు. రాజస్థాన్‌లో సికార్ లోక్‌సభ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి, రైతు నేత ...15లో

కాంగ్రెస్ అంచనాలు మిస్‌ఫైర్

ముందు 14 సీట్లు లక్ష్యం.. తర్వాత 12 గెలుస్తామన్న ధీమా

- చివరికి ఎనిమిదింటితో సరిపెట్టుకున్న వైనం
- మిగిలింది గతం కంటే పెరిగాయనే సంతృప్తి మాత్రమే



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అంచనాలు మిస్ ఫైరయ్యాయి. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ తొలుత 14 సీట్ల గెలుపే లక్ష్యంగా పెట్టుకుంది. అదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర ముఖ్య నాయకులు ఎన్నికల ప్రచార సభల్లోనూ, కార్నర్ మీటింగుల్లోనూ పదే పదే చెప్పారు. అయితే 12 సీట్లు తగ్గకుండా గెలుస్తున్నట్టు తమ క్యాడర్‌లో భరోసా నింపారు. ఆ దిశగా కృషి చేయాలంటూ రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. బూత్ స్థాయి నేతలకు సైతం పార్టీ లక్ష్యాన్ని వివరించారు. బయటకు 14 సీట్లు గెలుస్తామంటూ ఢంకా భజాయించి చెప్పినా... అంతర్గత సమావేశాల్లో మాత్రం 12 సీట్లలో హస్తం పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తామనే ధీమాను వ్యక్తం చేస్తూ వచ్చింది. ఇదే క్రమంలో ప్రభుత్వ ప్రజాపాలనకు ఈ ఎన్నికలు రిఫరెండమ్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పలు మార్లు చెప్పారు. ప్రభుత్వ పాలనా తీరు నచ్చితేనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలంటూ ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఆమేరకు ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ఓటర్లు ఆ పిలుపునందుకున్నారు. ఆయా జిల్లాల్లో ...15లో

విజయం చేకూర్చిన ప్రజలకు ధన్యవాదాలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వివరాలు 15లో

కాంగ్రెస్‌దే కంటోన్మెంట్

- ఉప ఎన్నికల్లో శ్రీ గణేష్ విజయం
- సిట్టింగ్ సీటు కోల్పోయిన బీఆర్ఎస్ 15లో





దలాల్ స్ట్రీట్ అల్లకల్లోలం

రూ.31లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 4300 పాయింట్ల పతనం
- చరిత్రలోనే అతిపెద్ద నష్టం
- మదుపరి విలవిల
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చేరని బీజేపీ

వివరాలు 6లో




ఏపీ సైకిల్‌దే..

జనసేన, బీజేపీతో కలిసి ఘనవిజయం

- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీకి వాత
- సీఎం జగన్ రాజీనామా
- నేడు ఢిల్లీకి చంద్రబాబు
- ఎన్డీయే కూటమితో భేటీ
- ఇక జాతీయ రాజకీయాల్లోనూ కీలకపాత్ర

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం ఘనవిజయం సాధించింది. జనసేన, బీజేపీతో కలిసి అసెంబ్లీతోపాటు లోక్‌సభ సమరం లోనూ విజయఢంకా మోగించింది. అధికార వైసీపీని సింగిల్ డిజిట్‌కే పరిమితం చేస్తూ అప్రతిహతమైన విజయాన్ని నమోదు చేసింది. ఈ ఎన్నికల్లో విజయం కోసం గత ఆరు నెలలుగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పడిన కష్టం ఎట్టకేలకు ఫలితాలను ఇచ్చింది. అలాగే బీజేపీ సైతం అనూహ్యమైన ఫలితాలు సాధించడానికి వారిద్దరూ తోడ్పడ్డారు. ఏపీలో గెలిచిన సీట్లు ఇప్పుడు ఢిల్లీ ప్రధాని పీఠంపై మోడీ కూర్చోవడానికి సైతం ఉపయోగ పడుతుండటం గమనార్హం. సొంత మెజారిటీ సాధించలేకపోయినా బీజేపీ టీడీపీపై ఆధార పడాల్సిన పరిస్థితులు ఉత్పన్నం కావడం గమనార్హం. ఏపీలో తెలుగుదేశం 135 అసెంబ్లీ నియోజకవర్గాలు, 16 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. అధికారం చేపట్టేందుకు ...3లో



అప్పుడలా.. ఇప్పుడిలా...

అధికార పార్టీ స్థాయి నుంచి అట్టడుగుకు...

- అసెంబ్లీ ఎన్నికల్లో పల్టీలు కొట్టి.. లోక్‌సభ ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డ కారు
- ఎంపీ ఎన్నికల్లో ఖాతాయే తెరవని బీఆర్ఎస్
- 2014లో 11 సీట్లు.. 2019లో 9 స్థానాలతో సత్తా చాటిన గులాబీ దళం
- ఇప్పుడు ఒక్క సీటూ దక్కని దైన్య స్థితి
- స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగినా ఫలితం శూన్యం
- గులాబీ శ్రేణుల్లో నైరాశ్యం


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజకీయాల్లో ఒక పార్టీ గెలవటం, మరో పార్టీ ఓడిపోవటం సర్వసాధారణం. అధికారంలో ఉన్న వారు ప్రతిపక్షంలోకి, ప్రతిపక్షంలో ఉన్న వారు అధికార పక్షంలోకి రావటం కూడా మామూలే. కానీ ఒకనాడు ఉచ్ఛస్థితిలో ఉన్న పార్టీ.. అందునా ఉద్యమంలోంచి పుట్టిన పార్టీ... ఇప్పుడు సాధారణ స్థితిలో కాదు గదా... ఒక్కటంటే ఒక్క సీటు గెలవని, కనీసం పోటీ కూడా ఇవ్వలేని స్థితిలోకి నెట్టబడటం దాని దైన్యస్థితికి దర్పణంగా నిలుస్తోంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఇప్పుడు అలాంటి దీనస్థితినే ఎదుర్కొంటోంది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 16 సీట్లు గెలుస్తాం, అవసరమైతే ప్రధాని రేసులో ఉంటానంటూ ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గంభీరంగా చెప్పిన మాటలు... ...5లో

బీజేపీకి కలిసొచ్చిన క్రాస్ ఓటింగ్

తవ్వుకున్న గోతిలో తానే పడ్డ గులాబీ పార్టీ

- కాంగ్రెస్ గెలువొద్దని ఓట్లను మళ్లించారనే విమర్శలు
- కారు పార్టీకి చరిత్రలో తొలిసారి రిక్తహస్తం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బీజేపీ పెరగడానికి బీఆర్ఎస్ సహకరించిందా? అందులో భాగంగానే పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ చేయించిందా? తాను గెలువకపోయినా సరేగానీ కాంగ్రెస్ అభ్యర్థులను గెలువొద్దనే బీఆర్ఎస్ నేతల ఎత్తుగడ ఆ పార్టీ మనుగడకే ఇబ్బందికరంగా మారబోతున్నదా? అధికారంలో ఉన్నప్పుడు..ఇప్పుడు ప్రతిపక్షంలో వచ్చాక ప్రత్యక్షంగా, పరోక్షంగా బీజేపీ ఎదుగుదలకు బీఆర్ఎస్ సహకరిస్తోందా? రాజకీయ విమర్శకులు అన్నింటికీ అవుననే సమాధానమిస్తున్నారు. తెలంగాణలో బీజేపీకి గతంతో పోలిస్తే ఓట్‌షేరింగ్, సీట్ల సంఖ్య పెరగడానికి బీఆర్ఎస్‌నే కారణమని విమర్శలు ఎక్కుపెడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ లోక్‌సభలో ఆ పార్టీ ప్రాతినిధ్యం లేకపోవడం ఇదేతొలిసారనీ, దీనికి ఆ పార్టీ స్వయంకృపరాధమే కారణమనే పొలిటికల్ చర్చ జరుగుతున్నది.

ఇద్దరి మధ్య కొట్లాట మూడొగనికి సందు అన్నట్టుగా.. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు రానివ్వద్దనే బీఆర్ఎస్ ఆరాటం అంతిమంగా బీజేపీకి లబ్ది చేకూర్చి పెట్టింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఒక ఎంఐఎం ఎమ్మెల్యే ఉన్నారు. దానం నాగేందర్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్‌కు ఐదుగురు ఎమ్మెల్యేలు మిగిలారు. తమ పార్టీలో గెలిచి కాంగ్రెస్ వైపు వెళ్లడంతో ఆయన్ను ఎలాగైనా ఓడించాలనే బీఆర్ఎస్ నేతల లక్ష్యం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గెలుపునకు దోహదపడినది. వాస్తవానికి ఆ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా భారీ మెజార్టీ గెలిచిన విషయం విదితమే.

ఆ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుకు కేవలం లక్షా 29 వేల ఓట్లే దక్కాయి. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన మెజార్టీల్లో కూడా సగం ఓట్లు పడలేదంటనే ఎంత పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందనేది అర్థం చేసుకోవచ్చు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు సెగ్మెంట్లలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. అది ఆ పార్టీకి సానుకూల అంశం. కానీ, నామినేషన్లు వేసిన దగ్గర నుంచే ఆ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు ఈటలకు అంతర్గతంగా సహకరించారనే ప్రచారం జోరుగా సాగింది. ఇప్పుడు అది ఫలితాల్లో ప్రస్ఫుటంగా కనిపించింది. ఆ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరగడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, ఉద్యమకారుడనే సానుకూలత ప్రజల్లో ఉండటం ఈటలకు కలిసొచ్చింది. దీంతో అతనికి 3,91,475 ఓట్ల భారీ మెజార్టీ దక్కింది. వాస్తవానికి ఆ ఎంపీ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బీనగర్, కంటోన్మెంట్ అన్ని నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుపొందారు. వారందరికీ కలిపి 9.5 లక్షల ఓట్లు దక్కాయి. ఇప్పుడు అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థికి కేవలం మూడు లక్షల ఓట్లే వచ్చాయి. దీనిని బట్టే బీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున క్రాస్‌ఓటింగ్ జరిగినట్టు అర్థమవుతున్నది. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోనూ అదే తంతు జరిగింది. ఆ పార్లమెంట్ స్థానం పరిధిలో నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నారు. మొత్తం ఏడు సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌కు 707456 ఓట్లు లభించాయి. అదే బీజేపీ అభ్యర్థులకు 3.40 లక్షల వరకు ఓట్లు దక్కాయి. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చే సరికి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 8,09,882 ఓట్లు దక్కగా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు కేవలం 1, 78,968 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీనిని బట్టే క్రాస్ ఓటింగ్ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అభ్యర్థిత్వాన్ని ప్రకటించాక రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోయారు.

అతన్ని ఎలాగైనా ఓడగొట్టాలనే కొండాకు సపోర్టు చేశారనీ, అక్కడ కాసాని నామమాత్రంగానే బరిలో ఉన్నారనే ప్రచారం జోరుగా జరుగుతున్నది. మెదక్ పార్లమెంట్ పరిధిలో మెదక్ అసెంబ్లీ స్థానం మినహా అన్నీ బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. మాజీ సీఎం, మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గాలు ఈ నియోజకవర్గ పరిధిలోనివే. అక్కడ కూడా క్రాస్ ఓటింగ్ జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. కొందరు బీఆర్ఎస్ నేతలు గులాబీ కండువాలు కప్పుకుని బీజేపీ ఓట్లు వేయించారనే విమర్శలు కూడా వచ్చాయి. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం ఉండటంతో అక్కడ ఎలాగైనా కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని ఓడించాలనే లక్ష్యంతో అక్కడా బీఆర్ఎస్ ఓటింగ్‌ను బీజేపీ వైపు మళ్లించారనే చర్చ నడుస్తున్నది. మిగతా నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్ చేయించందనే విమర్శ ఉంది. అంతిమంగా బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్‌తో బీజేపీ లాభపడింది. పెద్దపాము చిన్నపామును మింగేస్తుందనే సామెత భవిష్యత్తు కాలంలో బీఆర్ఎస్‌కు వర్తిస్తుందనీ, బీజేపీ ఎత్తుగడలతో బీఆర్ఎస్ మరింత చతికిల పడటం ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
ఆసిఫ్‌నగర్ బ్రాంచ్, పట్వాపు ఎన్‌క్లేవ్, విజయనగర్ కాలనీ, హైదరాబాద్-500028.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ బి.నాగేశ్వరరావు, తండ్రి : శ్రీ.బి.భాస్కర్‌రావు తన ఒరిజినల్ డాక్యుమెంట్‌ను అనగా అమ్మకపు దస్తం నెం.908/2003, తేది 27.01.2003, సబ్-రిజిస్ట్రార్, చంపాపేట, ఆఫీస్‌లో రిజిస్టర్ చేసిన దానిని డిపాజిట్ చేయడం ద్వారా షెడ్యూల్ ఆస్తి యొక్క సమానమైన తాకట్టును సృష్టించారు. చెప్పబడిన రుణగ్రహీత మొత్తాలను చెల్లించడంలో విఫలమైనందున, రంగారెడ్డి జిల్లా, ఎల్‌బి నగర్, సీనియర్ సివిల్ జడ్జి వద్ద ఫైల్ ఓ.ఎస్. నెం. 853 ఆఫ్ 2006తో బ్యాంక్‌వారు ఫైల్ చేసినారు. ఆ తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్,2002 యొక్క నిబంధనలను అనుసరిస్తూ సదరు ఆస్తిని బ్యాంక్ అమ్మేసింది. చెప్పబడిన ఒరిజినల్ అమ్మకపు దస్తంను కోర్టు నుండి బ్యాంక్ తీసుకున్నది. చెప్పబడిన అమ్మకపు దస్తం తప్పిపోయినది మరియు బ్రాంచ్‌లో దొరకలేదు. సదరు ఆస్తిని బ్యాంక్ అమ్మివేసింది మరియు షెడ్యూల్ ఆస్తిపై ఎలాంటి క్లెయిమ్ రాలేదు.

షెడ్యూల్

ప్లాట్ నెం. 207/బి కలిగియున్న భూమి మొత్తం మరియు భాగం, విస్తీర్ణం: 100 చ.గజాలు లేదా 83.61 చ.మీటర్లు, సర్వే నెం.88లో, బడంగ్‌పేట గ్రామం యొక్క శ్రీ నిలయ టౌన్‌షిప్ వద్ద ఉన్నది, సరూర్‌నగర్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట గ్రామపంచాయతీ కింద, రిజిస్ట్రేషన్ ఉప-జిల్లా : చంపాపేట మరియు **సరిహద్దులు:-ఉత్తరం** : ప్లాట్ నెం. 207/ఎ, **దక్షిణం** : ప్లాట్ నెం. 208/ఎ, **తూర్పు** : ప్లాట్ నెం. 197/బి, **పడమర** : 30 అడుగుల వెడల్పు రోడ్.

స్థలం : హైదరాబాద్, తేది : 03.06.2024 — చీఫ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

VICEROYHOTELS
VICEORY HOTELS LIMITED
CIN: L55101TG1965PLC001048
Regd.Off: 8-2-120/112/88 & 89, Aparna Crest, 3rd Floor, Road No. 2, Banjara Hills, Hyderabad – 500 034, Telangana; Ph: 040 40204383
Website: www.viceroyhotels.in Email: secretarial@viceroyhotels.in

మొదటి అసాధారణ సర్వసభ్య సమావేశపు వాటాదారులకు ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ఇజీఎం నిర్వహణకు సర్క్యులేట్ చేయబడిన ఇజీఎం నోటీసులో ఇచ్చినట్లుగా వ్యాపారాల నిర్వహణకు వైస్రాయ్ హోటల్స్ లిమిటెడ్ ("కంపెనీ") యొక్క వాటాదారుల ("వాటాదారులు" లేదా "సభ్యులు") కంపెనీ యొక్క ఆర్థిక సంవత్సరం 2024-2025 కొరకు మొదటి అసాధారణ సర్వసభ్య సమావేశం ("ఇజీఎం") శనివారం, 29 జూన్, 2024న ఉ.11.30గం.లకు ఐఎస్టీకి వీడియో కాన్ఫరెన్స్/ఇతర ఆడియో విజువల్ మీన్స్ ద్వారా నిర్వహించబడును.

కొనసాగుతున్న కోవిడ్-19 మహమ్మారి మరియు పర్యవసానంగా ప్రజల కదలికలపై విధించిన ఆంక్షల దృష్ట్యా, సర్క్యులర్ నెం.14/2020 తేదీ.ఏప్రిల్ 08, 2020 మరియు సర్క్యులర్ నెం.17/2020 తేదీ.ఏప్రిల్ 13, 2020, 22/2020 తేదీ.జూన్ 15, 2020, 33/2020 తేదీ.సెప్టెంబర్ 28, 2020, 39/2020 తేదీ.డిసెంబర్ 31, 2020, 10/2021 తేదీ.జూన్ 23, 2021, 20/2021 తేదీ.డిసెంబర్ 08, 2021 మరియు 11/2022 తేదీ.28.12.2022 (సమిష్టిగా "ఎంసిఎ సర్క్యులర్‌లు"గా సూచిస్తారు) మరియు సెబీ సర్క్యులర్ నెం.సెబీ/హెచ్‌ఓ/సిఎఫ్‌డి/సిఎండి1/సిఐఆర్/పి/2020/79 తేదీ.మే 12,2020 మరియు సెబీ/హెచ్‌ఓ/సిఎఫ్‌డి/సిఎండి2/సిఐఆర్/పి/2021/11 తేదీ.జనవరి15, 2021, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్) రెగ్యులేషన్, 2015లోని 44వ రెగ్యులేషన్ (లిస్టింగ్ రెగ్యులేషన్), ఎంసిఎ సర్క్యులర్‌లు కొన్ని మంజూరైన సడలింపులతో చదవగల కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ("ఎంసిఎ") దీని జనరల్ సర్క్యులర్ నెం.02/2021 తేది.13 జనవరి, 2021ను అనుసరించి ఉమ్మడి వేదిక వద్ద సభ్యుల భౌతిక హాజరు లేకుండా వీసీ/ఓఏవిఎం ద్వారా కంపెనీల యొక్క అసాధారణ సర్వసభ్య సమావేశం (ఇజీఎం) నిర్వహించుటకు అనుమతి ఉంది.కావున, కంపెనీల చట్టం, 2013 (చట్టం)లోని నియమాలు, సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 ("సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్") మరియు ఎంసిఎ/సెబీ సర్క్యులర్స్ వర్తించునట్లుగా, కంపెనీ యొక్క ఇజీఎం వీసీ/ఓఏవిఎం (ఇ-ఇజీఎం) ద్వారా నిర్వహించబడును.

కంపెనీ/డిపాజిటరీలు/ ఆర్‌టీఏ ఏజెంట్‌తో వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేసిన అట్టి సభ్యులందరికీ ఇజీఎం నోటీసును ఇ-మోడ్ ద్వారా పంపబడుతున్నది. సభ్యులు గమనించాల్సిందేమనగా నోటీసు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.viceroyhotels.in, స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్లు అనగా బిఎస్ఇ లిమిటెడ్: www.bseindia.com and www.nseindia.com లో అందుబాటులో ఉన్నాయి. ఇజీఎం నోటీసు సిడిఎస్ఎల్ (ఇజీఎం సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ వసతి మరియు ఇ-ఓటింగ్ సిస్టం కల్పించుటకు ఏజెన్సీ) [illegible] www.evotingindia.com [illegible]

[illegible] www.viceroyhotels.in [illegible] www.bseindia.com and www.nseindia.com [illegible] secretarial@viceroyhotels.in or aarthi consultants@gmail.com [illegible]

కటాఫ్ తేది అనగా శుక్రవారం, 21 జూన్, 2024 నాటికి డిపాజిటరీలచే నిర్వహించబడుతున్న సభ్యుల రిజిస్టర్‌లో లేదా బెనిఫిషియల్ ఓనర్స్ రిజిస్టర్‌లో పేర్లు రికార్డుబడిన సభ్యులు ఇజీఎం తేదిన రిమోట్ ఇ-ఓటింగ్ అదేవిధంగా ఇ-ఓటింగ్ సిస్టం వసతిని పొందుటకు అర్హులు.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 4 జూన్, 2024

బోర్డు ఉత్తర్వుల మేరకు
వైస్రాయ్ హోటల్స్ లిమిటెడ్ తరపున
సిఎస్ టిపి వీనా అర్వింద్
కంపెనీ సెక్రటరీ
ఎఐఎం నెం.ఎసిఎస్ 17013

बैंक ऑफ इंडिया Bank of India BOI
మలక్‌పేట్ బ్రాంచ్
10-02-677/2 & 2/1, జడ్జీల కాలనీ, హైదరాబాద్-500036. ఫోన్ నెం.040-24548897/443

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారులు **బ్యాంక్ ఆఫ్ ఇండియా, మలక్‌పేట్ బ్రాంచ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్‌రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు దీ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని [illegible] 22.05.2023 [illegible] రూ.8,83,605.00 [illegible]

[illegible]

తేది: 01-06-2024 ప్రదేశం: హైదరాబాద్ — బ్యాంక్ ఆఫ్ ఇండియా, అధీకృత అధికారి, మలక్‌పేట్ బ్రాంచ్

---

pnb Housing Finance Limited Ghar Ki Baat

అనుబంధం-IV-A- స్థిరాస్తు/ల యొక్క ఇ-వేలం బహిరంగ అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమంతో చదవబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

రిజిస్టర్డ్ ఆఫీసు: 9వ అంతస్తు, అంత్రిక్ష భవన్, 22, కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూ ఢిల్లీ-110001. ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

బ్రాంచ్ చిరునామా: 4వ అంతస్తు, హోల్డీ దేవదిసన్ పోరమ్ పైన, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034

[illegible]

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
HOU/HYD/0321/871469 [illegible]	Rs. 47,47,396.94 as on date 14.03.2023	(భౌతిక)	ప్లాట్ నెం.6-2, [illegible] 11-13-1363/2, [illegible] 500035 [illegible]	Rs. 42,16,000/-	Rs. 4,21,600/-	19.06.2024 between 11:00 AM to 05:00 PM	Rs. 10,000/-	12.06.2024 between 11:00 AM to 05:00 PM	20.06.2024 between 01:00 PM to 02:00 PM	నిల్/ తెలియదు

[illegible] ... 3) సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9(3) నియమాలను ... అమ్మకపు ధరలో 25%ను బిడ్డరుదారు/ కొనుగోలుదారు చట్టబద్ధంగా డిపాజిట్ చేయాలి. ... అమ్మకం ధరలో 25% స్వీకరణ తరువాత మాత్రమే బిడ్డరుదారు/కొనుగోలుదారు పేరున అమ్మకం నిర్ధారించబడును. అమ్మకం నిర్ధారణ మొత్తంలో మిగిలిన 75%ను ... కొనుగోలుదారు డిపాజిట్ చేయాలి. సదరు డిపాజిట్ విఫలం చెందితే, ఆస్తి/సెక్యూర్డు అసెట్ తిరిగివిక్రయించబడును. 4) ఇ-వేలం అమ్మకం ద్వారా అమ్మకం నిర్వహించుటకు అధీకృత ... కార్పొరేట్ ఆఫీసు: ప్లాట్ నెం.68, 3వ అంతస్తు, సెక్టార్ 33, గుర్గామ్, హర్యానా-122003, వెబ్‌సైట్: www.bankeauctions.com సహాయం అందిస్తుంది. ... 9948562888/ 7428193765/ 9703801419 వారితో కోఆర్డినేట్ చేసుకోండి, ఇమెయిల్ ఐడి:auction@pnbhousing.com లేదా www.pnbhousing.com ను రిఫర్ చేయండి.

ప్రదేశం: బంజారాహిల్స్, తేది: 04-06-2024 — సం/- అధీకృత అధికారి, పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

Vijay TEXTILES LIMITED
Registered Office: Surya Towers, Ground Floor, 104, Sardar Patel Road, Secunderabad - 500 003.
Tel: 27848479 / 27844086. Facsimile: +91 40 2784 6849
E-Mail: info@vijaytextiles.in. Web: www.vijaytextiles.in
CIN: L18100TG1990PLC010973

01/2014-25 అసాధారణ సర్వసభ్య సమావేశం మరియు రిమోట్ ఇ-ఓటింగ్ సమాచారం ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ఇజీఎం నోటీసులో ఇచ్చినట్లుగా వ్యాపార నిర్వహణకు విజయ్ టెక్స్‌టైల్స్ లిమిటెడ్ యొక్క సభ్యుల 01/2014-25 అసాధారణ సర్వసభ్య సమావేశం (ఇజీఎం) బుధవారం, 26 జూన్, 2024న ఉ.11.00గం.లకు వీడియో కాన్ఫరెన్సింగ్ ("వీసీ")/ ఇతర ఆడియో విజువల్ మీన్స్ ("ఓఏవిఎం") ద్వారా నిర్వహించబడును.

ఇజీఎం నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీని కమ్యూనికేషన్ నిమిత్తం కంపెనీ/ డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో నమోదుచేసిన ఇమెయిల్ ఐడిలకు 06.04.2024న సభ్యులందరికీ పంపబడుతుంది లేనిచో ఎవరైనా సభ్యులు వాటి హార్డు కాపీ కోసం అభ్యర్థించవచ్చును. సభ్యులు ఎవరైతే వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేసుకోలేదో వారి ఇజీఎం నోటీసు భౌతిక కాపీలను అనుమతించిన విధానంలో పంపబడును.

కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 మరియు సెబీ (ఎల్‌ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్‌ను అనుసరించి, ఇజీఎం (రిమోట్ ఇ-ఓటింగ్) యొక్క వేదిక కాకుండా ఇతర ప్రదేశం నుండి సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సిడిఎస్ఎల్) యొక్క ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ ద్వారా ఇజీఎం నోటీసులో పేర్కొన్న అన్ని తీర్మానాలపై ఎలక్ట్రానిక్ విధానంచే వారి ఓటు హక్కును వినియోగించుటకు సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తున్నది. సభ్యులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా:

(1) 01/2024-25 నోటీసులో పేర్కొన్న వ్యాపారం లావాదేవీలు ఎలక్ట్రానిక్ విధానంచే ఓటింగ్ ద్వారా జరుగును.
(2) రిమోట్ ఇ-ఓటింగ్ 23.06.2024న ఉ.9.00గం.లకు ప్రారంభమగును.
(3) రిమోట్ ఇ-ఓటింగ్ 25.06.2024న సా.5.00గం.లకు ముగియును.
(4) ఎలక్ట్రానిక్ విధానంచే లేదా ఇజీఎం వద్ద ఓటింగ్‌కు అర్హతను నిర్ణయించుటకు కటాఫ్ తేది: 14.06.2024
(5) కంపెనీ వాటాలను కొనుగోలుచేసిన ఎవరైనా వ్యక్తి మరియు ఇజీఎం నోటీసు డిస్పాచ్ తరువాత కంపెనీ యొక్క సభ్యునిగా మారినా వ్యక్తి helpdesk.evoting@cdslindia.com వద్ద అభ్యర్థను పంపించుటచే లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందవచ్చును మరియు ఇజీఎం నోటీసు కాపీలను స్వీకరించుటకు రిజిస్ట్రార్ అండ్ షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ అనగా ఆర్తీ కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వారిని సంప్రదించండి.
(6) రిమోట్ ఇ-ఓటింగ్ మోడ్యూల్ 25.06.2024న సా.5.00గం.ల తరువాత సిడిఎస్ఎల్‌చే డిసబుల్ చేయబడునని సభ్యులు గమనించగలరు, ఇజీఎం సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ మోడ్యూల్ కొరకు వసతి అందుబాటులో ఉండును మరియు ఇజీఎంకు ముందుగా రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారిఓటును వినియోగించిన అట్టి సభ్యులు కూడాను ఇజీఎంకు హాజరు కావచ్చును కానీ మళ్ళీ ఓటును వినియోగించుటకు అనుమతి ఉండదు.
(7) కటాఫ్ తేది నాటికి డిపాజిటరీచే నిర్వహించబడుతున్న సభ్యుల రిజిస్టర్ లేదా బెనిఫిషియల్ ఓనర్స్ రిజిస్టర్‌లో పేరు రికార్డుకాబడిన వ్యక్తి మాత్రమే రిమోట్ ఇ-ఓటింగ్ అదే విధంగా ఓటింగ్ ద్వారా ఇజీఎం వద్ద సదుపాయం పొందుటకు అర్హులు.
(8) ఇజీఎం నోటీసు కంపెనీ యొక్క వెబ్‌సైట్: http://vijayatextiles.in పై మరియు సిడిఎస్ఎల్ యొక్క వెబ్‌సైట్: https://www.evotingindia.com/ పై కూడా అందుబాటులో ఉంటుంది.
(9) ఏవేని ప్రశ్నల విషయంలో, సభ్యుల కొరకు తరచుగా అడిగిన ప్రశ్నలు (ఎఫ్ఏక్యూస్) మరియు http://www.evotingindia.co.in యొక్క డౌన్‌లోడ్ సెక్షన్ వద్ద అందుబాటులో వాటాదారుల కొరకు ఇ-ఓటింగ్ యూజర్ మ్యానువల్స్‌ను సభ్యులు పరిశీలించవచ్చును లేదా సంప్రదించండి: శ్రీ జె.రవి శంకర్, మేనేజర్ అకౌంట్స్, సూర్య టవర్స్, గ్రౌండ్ ఫ్లోర్, 104, సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాద్-500003, తెలంగాణ, ఫోన్ నెం.040-27848479, ఇమెయిల్: info@vijayatextiles.in వారిని సంప్రదించండి.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 04-06-2024

బోర్డు తరఫున& కొరకు, విజయ్ టెక్స్‌టైల్స్ లిమిటెడ్
సం/- విజయ్ కుమార్ గుప్తా
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
(డిఐఎన్: 01050958)

B.N. RATHI SECURITIES LIMITED
Corporate Member: NSE, BSE & MCX
Corporate Office: # 6-3-652, IV Floor, "Kautilya", Amrutha Estates, Somajiguda, Hyderabad -82. Tel: 040 - 40527777, 40727777, Fax: 040 - 40526283.
e-mail: bnrsl@bnrsecurities.com www.bnrsecurities.com CIN: L65993TG1985PLC005838

38వ వార్షిక సర్వసభ్య సమావేశం, పుస్తక ముగింపు మరియు ఇ-ఓటింగ్ సమాచార ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ఏజీఎం నోటీసులో పేర్కొన్నట్లుగా వ్యాపార నిర్వహణకు సంబంధించి మెసర్స్ బి.ఎన్.రాతి సెక్యూరిటీస్ లిమిటెడ్ యొక్క వాటాదారుల 38వ ఏజీఎం గురువారం, 27 జూన్, 2024న ఉ.10.00గం.లకు ఎఫ్టీసీసీఐ సురనా హాల్, ది ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, (ఎఫ్టీసీసీఐ) ఫెడరేషన్ హౌస్, ఫెడరేషన్ మార్గ్, రెడ్‌హిల్స్, హైదరాబాద్-500004, తెలంగాణ నిర్వహించబడును.

38వ ఏజీఎం నోటీసు మరియు సంవత్సరం 2023-24 కొరకు వార్షిక రిపోర్టు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలను కంపెనీస్ రిజిస్ట్రార్ & షేర్‌ట్రాన్స్‌ఫర్ ఏజెంట్, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (కెఫిన్‌టెక్)/ డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇమెయిల్ ఐడిలను నమోదుచేసిన వాటాదారులందరికీ పంపబడినది. 38వ ఏజీఎం నోటీసు మరియు సంవత్సరం 2023-24 కొరకు వార్షిక రిపోర్టు కంపెనీ వెబ్‌సైట్: www.bnrsecurities.com పై అందుబాటులో ఉంటాయి.

కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 91 మరియు అందులోని రూల్స్‌కు అనుగుణంగా మరియు సెబీ (ఎల్‌ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015ను అనుసరించి, 31 మార్చ్, 2024తో ముగిసిన సంవత్సరానికి ప్రకటించిన డివిడెండ్ ఎన్‌టైటిల్‌మెంట్ నిర్ణయించుటకు మరియు 38వ ఏజీఎం నిమిత్తం కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్ మరియు వాటా బదిలీ పుస్తకాలు 21.06.2024 నుండి 27.06.2024 వరకు మూసియుండును. గురువారం, 20.06.2024న వ్యాపార పనివేళలు ముగిసేవరకు సభ్యుల రిజిస్టర్‌లో పేర్లుగల వాటాదారులకు డివిడెండ్ చెల్లించబడును.

సవరించినట్లు కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014లోని రూల్ 20తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108 ప్రకారం మరియు సెబీ (ఎల్‌ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44ను అనుసరించి, నోటీసులో పేర్కొన్న అన్ని తీర్మానాలపై ఎలక్ట్రానిక్ విధానం ద్వారా వారి ఓటును వినియోగించుటకు వసతిని కంపెనీ దీని వాటాదారులకు కల్పిస్తున్నది. కంపెనీల చట్టం, 2013లోని నియమాలు మరియు రూల్స్‌లోను అనుసరించి వివరాలు దిగువ ఇవ్వబడినవి:

(1) నోటీసులను పంపించుట పూర్తిచేసిన తేది: **04-06-2024**
(2) ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా ఓటింగ్ ప్రారంభ తేది& సమయం: **24 జూన్, 2024న ఉ.9.00గం.లు** (ఐఎస్టీ) నుండి.
(3) ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా ఓటింగ్ ముగింపు తేది& సమయం: **26 జూన్, 2024న సా.5.00గం.లు** (ఐఎస్టీ) వరకు.
(4) బుధవారం, **26 జూన్, 2024**న సా.**5.00**గం.ల తరువాత ఎలక్ట్రానిక్ విధానం ద్వారా ఓటింగ్‌కు అనుమతి ఉండదు.
(5) 38వ ఏజీఎం నోటీసు కంపెనీ వెబ్‌సైట్: www.bnrsecurities.com పై అందుబాటులో ఉంటాయి.
(6) ఎలక్ట్రానిక్ ఓటింగ్ సూచనల కొరకు, వాటాదారులు 38వ ఏజీఎం నోటీసులో సూచనలను అనుసరించాలి మరియు ఎలక్ట్రానిక్ ఓటింగ్‌కు సంబంధించిన ఏదేని ప్రశ్నలు/ సాధకబాధకల విషయంలో వాటాదారులు, తరచుగాఅడిగిన ప్రశ్నలు(ఎఫ్ఏక్యూస్) మరియు http:// evoting@kfintech.com వద్ద డౌన్‌లోడ్ సెక్షన్‌లో లభించు వాటదారులకు ఇ-ఓటింగ్ యూజర్ మ్యానువల్స్‌ను పరిశీలించుకోవచ్చు లేదా సంప్రదించండి: కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్, హైదరాబాద్, einward.ris@kfintech.com, టెలిఫోన్ నెం.18003454001 (టోల్ ఫ్రీ).

ప్రదేశం: హైదరాబాద్
తేది: 04-06-2024

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరఫున మరియు కొరకు
సం/-
మెసర్స్ బి.ఎన్.రాతి సెక్యూరిటీస్ లిమిటెడ్
హరి నారాయణ్ రాతి
మేనేజింగ్ డైరెక్టర్

Canara Bank A Government of India Undertaking — Syndicate
సైదాబాద్ కాలనీ బ్రాంచ్ (2818)
PHONE NO. 040-23438731/26, MOBILE NO. 7282082480

డిమాండ్ నోటీసు (సెక్షన్ 13(2))

02/DN/GTR/1OD/2TL/2818 — Dated: 01.06.2024

[illegible]

ఒకవేళ పైన పేర్కొన్న వ్యక్తులైన మీరు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి60 రోజుల్లోగా SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసులోని నియమాలలో పైన చూపినట్లుగా తదుపరి వడ్డీ మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులతోసహా మీరు బాకీయున్న పైన పేర్కొన్న మొత్తాలను, తిరిగిచెల్లించుటలో మీరు విఫలం చెందినచో, సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్నిలేదా ఏవేని హక్కులను వినియోగిస్తుంది. తదుపరిగా, మా అనుమతి లేకుండా ఏదేని విధానంలో షెడ్యూలులో పేర్కొన్న సెక్యూర్డు అసెట్స్‌తో ఏదేని రూపంలో లావాదేవీల నుండి మీరు నిషేధించబడినారు. సంబంధిత చట్టం/అమలులోవున్న ఏదేని చట్టం క్రింద మాకు లభించిన ఏదేని ఇతర హక్కులకు దురభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడినది. సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను మీదృష్టికి తెస్తున్నాం. డిమాండ్ నోటీసును బ్రాంచ్ రికార్డుల్లో చివరగా నమోదైన మీ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా జారీచేయబడినది.

తేది : 01-06-2024 ప్రదేశం : హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

Coromandel — murugappa

COROMANDEL INTERNATIONAL LIMITED
Regd. Office: "Coromandel House", 1-2-10, Sardar Patel Road, Secunderabad – 500 003, Telangana
Email ID: investorsgrievance@coromandel.murugappa.com, Website: www.coromandel.biz
CIN: L24120TG1961PLC000892, Tel: +91-40-6699 7000, Fax: 040-2784 4117

ప్రకటన

ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌కు ఈక్విటీ వాటాల బదిలీకి సంబంధించి షేర్‌హోల్డర్లకు

ఇక్కడ ఇస్తున్న ప్రకటన ఏమనగా, కంపెనీల చట్టం,2013(ద యాక్ట్) యొక్క సెక్షన్ 124(6) మరియు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ(అకౌంటింగ్, ఆడిట్, ట్రాన్స్‌ఫర్ అండ్ రీఫండ్) రూల్స్, 2016 ("రూల్స్")తో చదవగల, తేదీకి సవరించిన, **ఆగస్టు 31, 2024 వరకు ఏవైతే డివిడెండ్ మొత్తాలు గత ఏడు సంవత్సరాలుగా లేదా ఎక్కువకాలం,** క్లెయిమ్ చేయకుండా ఉండినాయో, ఆయొక్క ఈక్విటీ వాటాలను ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్("ఐఇపిఎఫ్")కు **అక్టోబర్ 03, 2024** న లేదా ముందుగా కంపెనీ బదిలీ చేయాల్సి ఉన్నది.

క్లెయిమ్ చేసుకోబడని డివిడెండ్లను ఆగస్టు 14, 2024న లేదా ముందే నగదు/క్లెయిమ్ చేసుకోవాల్సిందిగా షేర్‌హోల్డర్లను కోరనైనది. లింక్ www.coromandel.biz/investors/dividend/ ను యాక్సెస్ చేసుకోవాల్సిందిగా షేర్‌హోల్డర్లను కోరనైనది మరియు షేర్‌హోల్డర్లు కలిగియున్న వాటాల సంఖ్య తెలుసుకొనుటకు, పైన పేర్కొన్న నిబంధనలమేరకు ఎవరివైతే వాటాలు ఐఇపిఎఫ్‌కు బదిలీ చేయబడ్డాయో, వారి యొక్క డివిడెండ్లను నగదు/క్లెయిమ్ చేసుకోలేదో సదరు షేర్‌హోల్డర్లు, ఫోలియో నెంబర్లు/డిపిఐడి & క్లయింట్ ఐడి ల్లోకి ప్రవేశించాలి.

కోర్టు లేదా ట్రిబ్యునల్ లేదా చట్టబద్ధమైన అథారిటీ యొక్క ప్రత్యేక ఆదేశాలమేరకు సదరు వాటాలు మరియు డివిడెండ్ చెల్లింపులు నిలిపివేయబడ్డాయో లేదా సదరు వాటాలు తనఖా పెట్టబడినాయో లేదా హైపోథికేట్ చేయబడినాయో, ద డిపాజిటర్స్ యాక్ట్, 1956 యొక్క నిబంధనల కింద, సదరు వాటాలను ఫండ్‌కు కంపెనీ బదిలీ చేయజాలదు.

అయితే, సదరు వాటాల విషయంలో సంబంధిత షేర్‌హోల్డర్ల నుండి ఆగస్టు 14, 2024 వరకు లేదా ముందుగా ఏవిధమైన సమాచారం అందనిపక్షంలో, నిబంధనలమేరకు తదుపరి ఎలాంటి నోటీస్ లేకుండానే చెప్పబడిన ఈక్విటీ వాటాలను ఐఇపిఎఫ్‌కు బదిలీ చేయుటకు పూనుకొనును.

ఈ విషయంలో ఈ కింద పేర్కొన్న దానిని షేర్‌హోల్డర్లు గమనించగలరు :

1) వాటాలు భౌతిక రూపంలో ఉన్నయెడల	షేర్ సర్టిఫికెట్లను డీమ్యాట్ రూపంలోకి మార్చుటకు మరియు ఐఇపిఎఫ్‌కు బదిలీ చేయుటకు డిపాజిటరీకి కార్పొరేట్ చర్య ద్వారా కంపెనీ సమాచామందించాలి.
2) వాటాలు డీమెటీరియలైజ్ రూపంలో ఉన్నయెడల	ఐఇపిఎఫ్‌కు వాటాలను బదిలీ చేయుటకు కార్పొరేట్ చర్య ద్వారా మీయొక్క డీమ్యాట్ ఖాతా డెబిట్ చేయబడును.

డివిడెండ్/వాటాలను ఐఇపిఎఫ్‌కు బదిలీ చేయుటకు, అవసరమైన డాక్యుమెంట్లతో ఐఇపిఎఫ్ కంపెనీకి ఫిజికల్ కాపీని పంపించడం ద్వారా షేర్‌హోల్డర్లు క్లెయిమ్ చేయని డివిడెండ్ మొత్తం మరియు ఐఇపిఎఫ్ అథారిటీ యొక్క డీమ్యాట్ ఖాతాకు బదిలీ చేసిన వాటాలను క్లెయిమ్ చేసుకోవచ్చును, ఐఇపిఎఫ్ అథారిటీ జారీ చేసిన సర్క్యులర్, తేది : జులై 20, 2022ను అనుసరించి ఎంటైటిల్‌మెంట్ లెటర్ పొందుటకు, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించుటకు ఐఇపిఎఫ్-5 నిర్దేశించిన ఫారమ్‌ను ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ యొక్క వెబ్‌సైట్ www.iepf.gov.in/IEPF/corporates.html వద్ద పొందవచ్చును. దీనికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే, మీరు రిజిస్ట్రార్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్, కె ఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్, సెలీనియం టవర్ బి, ప్లాట్ 31-32, గచ్చిబౌలి, ఆర్థిక జిల్లా: నానక్‌రామ్‌గూడ, శేరిలింగంపల్లి, హైదరాబాద్-500032, టోల్‌ఫ్రీ నెం.1800-3094-001, ఇమెయిల్ : einward.ris@kfintech.com, వెబ్‌సైట్ www.kfintech.com లను సంప్రదించగలరు.

స్థలం : సికింద్రాబాద్,
తేది : జూన్ 04, 2024

కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కొరకు,
బి.షణ్ముగం సుందరం,
కంపెనీ సెక్రటరీ అండ్ కాంప్లియెన్స్ ఆఫీసర్.

TCIEXPRESS — LEADER IN EXPRESS

టీసిఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్
CIN: L62200TG2008PLC061781
రిజిస్టర్డ్ కార్యాలయం: ఫ్లాట్ నెంబర్లు 306 &307, 1-8-271 నుండి 273, 3వ అంతస్తు, అశోకా భూపాల్ ఛాంబర్స్, ఎస్.పి. రోడ్డు, హైదరాబాద్-500 003 (తెలంగాణ)
కార్పొరేట్ కార్యాలయం: టీసిఐ హౌస్, 69, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, సెక్టర్-32, గురుగ్రామ్-122 001 (హర్యానా)
Tel.: +91 124 2384090-94, E-mail: secretarial@tciexpress.in, Website: www.tciexpress.in

ప్రకటన

ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఇపిఎఫ్) అథారిటీకి ఈక్విటీ వాటాల బదిలీ (ఈక్విటీ షేర్‌హోల్డర్ల యొక్క దయాపూర్వక శ్రద్ధ కోసం)

ఇక్కడ ఇస్తున్న ప్రకటన ఏమనగా, కంపెనీల చట్టం,2013("ద యాక్ట్") మరియు (ఐఇపిఎఫ్ అథారిటీ(అకౌంటింగ్, ఆడిట్, ట్రాన్స్‌ఫర్ అండ్ రీఫండ్) రూల్స్, 2016) ('ఐఇపిఎఫ్ రూల్స్')ను అనుసరించి, ఎవరైతే సభ్యుల ఈక్విటీ వాటాలు, గత ఏడు సంవత్సరాలుగా లేదా ఎక్కువకాలం, చివరి డివిడెండ్ ఆర్థిక ఏడాది 2016-17 నుండి ప్రారంభించి, ఎవరైతే డివిడెండ్‌ను క్లెయిమ్/నగదుగా మార్చుకోవడం చేయలేదో, అవి కంపెనీ చేత ఐఇపిఎఫ్ అథారిటీ(అథారిటీ) యొక్క డీమ్యాట్ ఖాతాకు బదిలీ చేయబడును.

చట్టం యొక్క మరియు ఐఇపిఎఫ్ రూల్స్‌కు కట్టుబడి, ఎవరివైతే డివిడెండ్ మరియు ఈక్విటీ వాటాలు చెప్పబడిన డివిడెంట్‌కు అసోసియేట్ అయి ఉన్నాయో, అథారిటీకి **సెప్టెంబర్ 06, 2024** న బదిలీ చేయబడ్డాయో, సంబంధిత షేర్‌హోల్డర్లకు వ్యక్తిగత నోటీస్ మరియు రిమైండర్లు పంపబడును. కంపెనీ తన యొక్క వెబ్‌సైట్ www.tciexpress.in లోకి సదరు షేర్‌హోల్డర్ల పూర్తి వివరాలను కూడా అప్‌లోడ్ చేసినది. సదరు వాటాలపై సమకూరే ఇతర ప్రయోజనాలతోపాటు డివిడెండ్ మరియు ఈక్విటీ వాటాలను క్లెయిమ్ చేయుటకు **ఆగస్టు 30, 2024న లేదా ముందుగానే** కంపెనీకి దరఖాస్తు చేయాల్సిందిగా షేర్‌హోల్డర్లను మరోసారి కోరనైనది.

పైన పేర్కొన్న తేదీ తర్వాత చేసిన క్లెయిమ్ ఏదైనా అనర్హమైనదిగా పరిగణించబడును మరియు రికార్డులోకి తీసుకోబడదు మరియు ఆ తర్వాత కంపెనీకి వ్యతిరేకంగా క్లెయిమ్‌కు వీల్లేదు మరియు, పైన చెప్పిన ఐఇపిఎఫ్ రూల్స్‌ను అనుసరించి, క్లెయిమ్ చేయని డివిడెండ్ (డివిడెండ్ యొక్క సంబంధిత ఈక్విటీ వాటాలతోపాటు)ను ఐఇపిఎఫ్ అథారిటీ యొక్క డీమ్యాట్ ఖాతాకు బదిలీ చేయును, రూల్స్ కింద ఏర్పాటైన ప్రొసీజర్‌ను అనుసరించి.

ఐఇపిఎఫ్ రూల్స్‌లోని ప్రొసీజర్‌ను అనుసరించిన తర్వాత, క్లెయిమ్ చేయని డివిడెండ్ మరియు చెప్పబడిన డివిడెండ్‌కు లింకైన ఈక్విటీ వాటాలను, ఐఇపిఎఫ్ అథారిటీ నుండి తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చునని షేర్‌హెల్డర్లు గమనించగలరు. ఈ అంశంపై షేర్‌హోల్డర్లకు ఏవైనా ఫిర్యాదులున్నచో, ఇవ్వబడిన వివరాల ప్రకారం కంపెనీని మరియు దానియొక్క రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ల(ఆర్‌టిఏ)ను సంప్రదించవచ్చును.

పేరు	టిసిఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ (కంపెనీ)	కె ఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆర్‌టిఏ)
చిరునామా	టిసిఐ హౌస్, ప్లాట్ నెం.69, సెక్టార్-32, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, గురుగ్రాం- 122001	సెలీనియం టవర్ బి, ప్లాట్ 31-32, గచ్చిబౌలీ, ఆర్థిక జిల్లా: నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్-500032
సంప్రదించుటకు	Tel: 91-124-238-4090-94	Tel: 040 - 67161500, Fax: 040 - 23001153
ఇ-మెయిల్	secretarial@tciexpress.in	einward.ris@kfintech.com

టిసిఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ కొరకు

స్థలం : గురుగ్రామ్,
తేది : జూన్ 04, 2024

ప్రియాంక
కంపెనీ సెక్రటరీ అండ్ కాంప్లియెన్స్ ఆఫీసర్

KVB Karur Vysya Bank — ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్.

[illegible]

సర్ఫేసి చట్టం, 2002 కింద డిమాండ్ నోటీసు

Reg: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (SARFAESI చట్టం) లోని సెక్షన్ 13(2) క్రింద [illegible]

[illegible] 18.05.2024 [illegible] రూ.21,28,610.84 [illegible] 16.05.2024 [illegible] SARFAESI [illegible]


[illegible]

స్థలం : మలక్‌పేట్, తేది : 18.05.2024 — సం/- అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

మితిమీరిన విశ్వాసం ముంచేసింది

- వికటించిన '400 పార్' నినాదం
- మోడీ ఇమేజ్ పైనే ఆధారం
- ప్రభావం చూపని మందిరం
- ఫలించని వ్యూహాలు
- బీజేపీ ఎదురు దెబ్బలకు కారణాలెన్నో

కర్ణుడి చావుకు ఆరు కారణాలు అన్న చందంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 'అబ్ కీ బార్ 400 పార్' నినాదాన్ని ఏడు అంశాలు నీరుకార్చాయి. ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ స్థానాలు వచ్చినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 272కు 30-35 స్థానాల దూరంలో నిలిచింది. అయోధ్యలో రామమందిరం నిర్మించాలన్న బీజేపీ అజెండా పూర్తయిన తర్వాత జరిగిన ఎన్నికలు ఇవి. ఆర్టికల్ 370 కింద జమ్మూకాశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక హోదాను రద్దు చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చిన తర్వాత జరిగిన ఎన్నికలు ఇవి. అయినప్పటికీ ఆ పార్టీ అనుకున్నది సాధించలేక చతికిలపడింది. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని కావచ్చునేమో కానీ ఎన్డీఏ మిత్రపక్షాల మద్దతు లేకుండా మాత్రం అది సాధ్యం కాదు.



బాబు, నితీష్ దయతో...

న్యూఢిల్లీ : ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీ బీజేపీకి రాకపోవడంతో ఇప్పుడు ఆ పార్టీ తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ అధిపతి నితీష్ కుమార్‌ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడక తప్పని పరిస్థితి. కూటములను తరచూ మార్చడం ద్వారా నితీష్ ఇప్పటికే చెడ్డ పేరు తెచ్చుకున్నారు. తాను ఎన్డీఏను వీడబోనని నితీష్ చెబుతున్నప్పటికీ ఆయన గత చరిత్రను గమనించిన వారికి అనుమానాలు కలగక మానవు. నితీష్ కుమార్‌కు ఉప ప్రధాని పదవి ఇస్తారన్న ప్రచారం కూడా జరుగుతోంది. అటు చంద్రబాబుతో కూడా మంతనాలు సాగుతున్నాయి.

దెబ్బతీసిన అతి విశ్వాసం

ఇంతకీ బీజేపీకి ఎదురు దెబ్బలు తగలడానికి కారణాలేమిటి? ప్రధానంగా అతి విశ్వాసమే కొంప ముంచిందని పరిశీలకులు అంటున్నారు. 'అబ్ కీ బార్ 400 పార్' నినాదం కూడా ఎదురు తన్నింది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరగడం, మోడీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కన్పించకపోవడంతో బీజేపీలో అత్యుత్సాహం, మితిమీరిన విశ్వాసం కన్పించాయి. అవే ఆ పార్టీని దెబ్బ తీశాయి. 2004లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలో కూడా ఇవే ధోరణులు కన్పించాయి. 'ఫీల్‌గుడ్', 'ఇండియా షైనింగ్' రూపంలో మితిమీరిన విశ్వాసం వ్యక్తమైంది. అదే ఆనాడు కొంప ముంచింది.

మోడీ గ్యారంటీల పైనే ఆధారం

ఈ ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తామని బీజేపీ విశ్వాసంతో ఉంది. ఆ విశ్వాసంతోనే ఈసారి ఆ పార్టీ కనీసం ఏ ఒక్క పథకాన్నీ ప్రకటించలేదు. ఫలితంగా ఎన్నికలకు ముందు సమాజంలోని ఏ ఒక్క వర్గాన్నీ ఆకర్షించలేకపోయింది. గత ఎన్నికల సమయంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ప్రకటించారు. కానీ ఈసారి అలాంటి ఏ పథకాన్ని ముందుకు తీసుకురాలేదు. అదే సమయంలో ప్రతిపక్షాలు పలు ప్రజాకర్షక హామీలు కురిపించాయి. బీజేపీ మాత్రం 'మోడీ గ్యారంటీ'లపై మాత్రమే ఆధారపడింది. కానీ అవి పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి.

ఓట్లు రాల్చని మందిరం

పది సంవత్సరాల పాలన తర్వాత మోడీ ప్రభుత్వం వ్యతిరేక పవనాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ వాటిని గుర్తించడంలో సర్కారు విఫలమైంది. రామ మందిర నిర్మాణం బీజేపీకి ఓట్లు రాల్చలేదు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో అత్యద్భుతమైన రామ మందిరాన్ని నిర్మించిన తర్వాత జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలు ఇవి. హిందూత్వ శక్తులు శతాబ్దాల తరబడి ఎదురు చూపులు చూసిన తర్వాత అక్కడ మందిర నిర్మాణం జరిగింది. జనవరి 22న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మందిర నిర్మాణం నుండి బీజేపీ రాజకీయ ప్రయోజనం పొందుతుందని యూపీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఓ అభిప్రాయం నెలకొంది. అందుకే ఎన్నికల సమయంలో కూడా మందిర నిర్మాణ ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ ప్రయత్నించింది. అయినప్పటికీ యూపీలో ఆ పార్టీ భారీ పరాజయాలు చవిచూసింది. మందిర నిర్మాణం బీజేపీకి ఏ మాత్రం ఉపయోగపడలేదని స్పష్టమైపోయింది. ఫైజాబాద్‌లో (అయోధ్య ఈ నియోజకవర్గం పరిధిలోకే వస్తుంది) సైతం బీజేపీ పరాజయం పొందింది. గత ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన కొందరు ప్రజలు మందిర నిర్మాణం పట్ల సంతోషం వ్యక్తం చేసినప్పటికీ చాలా మంది మాత్రం ఇతర కారణాలతో మండిపడ్డారు.

ఈ రాష్ట్రాలే కారణం

మధ్యప్రదేశ్, ఒడిషా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ అద్భుత పనితీరు కనబరచినా, కేరళలో బోణీ కొట్టినా గత ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు బీజేపీ బలం పడిపోయింది. దీనికి కారణం...ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో దెబ్బతినడమే. ప్రధాని స్వరాష్ట్రమైన గుజరాత్‌లో సైతం బీజేపీ క్లీన్‌స్వీప్ చేయలేకపోయింది. 2014, 2019 ఎన్నికల్లో గుజరాత్‌లోని అన్ని స్థానాలనూ కాషాయ పార్టీ గెలుచుకున్న సంగతి తెలిసిందే.

ఫిరాయింపుదారులకు పెద్ద పీట

నరేంద్ర మోడీ పేరుతోనే ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యంకాదని ఫలితాలు నిరూపించాయి. 'బ్రాండ్ మోడీ' మెరుపు మసకబారింది. ప్రధాని మోడీ సైతం గత ఎన్నికలతో పోలిస్తే వారణాసిలో తక్కువ మెజారిటీతోనే విజయం సాధించారు. స్థానికంగా అభ్యర్థుల పట్ల ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహం బీజేపీకి భారీ నష్టాన్ని మిగిల్చింది. సిట్టింగ్ ఎంపీల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదని గ్రహించిన బీజేపీ నాయకత్వం వారిలో పలువురికి టిక్కెట్లు నిరాకరించింది. అదే సమయంలో ఫిరాయింపుదారులకు పెద్ద సంఖ్యలో టిక్కెట్లు ఇచ్చింది. ప్రతి నలుగురు బీజేపీ అభ్యర్థుల్లో ఒకరు ఫిరాయింపుదారే. ఫలితంగా ఆ పార్టీ భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి

వారిది సూపర్ హిట్ జోడీ

దేశవ్యాప్తంగా ముస్లింలు ఏకపక్షంగా ఇండియా కూటమికి ఓటేయడంతో బీజేపీ చావు దెబ్బలు తిన్నది. యూపీలో రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ జోడీ సూపర్ హిట్ కొట్టింది. ఈ జోడీ కలిసే ప్రచారం చేసింది. ప్రతి మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని, పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీ ఇచ్చింది. బీజేపీ గెలిస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు అంతమవుతాయని, నియంతృత్వం వస్తుందని ప్రతిపక్షాలు చేసిన ప్రచారం ప్రజల్లో ఆలోచనలు రేపింది. బీజేపీని తొలగించి దేశాన్ని రక్షించండంటూ ఇచ్చిన నినాదం ఓటర్లపై ప్రభావం చూపింది. తరచుగా ఉద్యోగ నియామక పరీక్షా పత్రాలు లీక్ కావడం యువతలో ఆగ్రహాన్ని కలిగించింది. రాజకీయంగా దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన యూపీలో బీజేపీకి సీట్లు తగ్గడం ఆ పార్టీ పరిస్థితి దిగజారడానికి కారణమైంది. అగ్నిపథ్ పథకాన్ని రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారాంశంగా మార్చేశారు. అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని రద్దు చేస్తామని చెప్పారు. పేపర్ లీకేజీలు, నిరుద్యోగం వంటి అంశాలను అఖిలేష్, రాహుల్ తమ ఎన్నికల ప్రచార సభల్లో ప్రముఖంగా ప్రస్తావించారు. తద్వారా యువతలో ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో మలచుకునేందుకు శాయశక్తులా కృషి చేశారు.

ఫలించని ఎత్తుగడలు

రిజర్వేషన్లు, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయంటూ ప్రతిపక్షాలు చేసిన ప్రచారం ఫలితాన్ని ఇచ్చింది. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే నియంతృత్వం తప్పదని అవి పదేపదే చెప్పాయి. బీజేపీ తనకు 400కు పైగా స్థానాలు కావాలని కోరుకుంటోందని, అదే జరిగితే రిజర్వేషన్లు ఉండవని ప్రతిపక్ష పార్టీలు చేసిన ప్రచారం ప్రజల మనసుల్లో బాగా నాటుకుంది. ఈ ప్రయత్నంలో ప్రతిపక్షాలు విజయం సాధించాయని ఫలితాలు రుజువు చేశాయి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలను బీజేపీ వైపు ఆకర్షించడానికి ప్రధాని మోడీ చేయని ప్రయత్నమంటూ లేదు. ముఖ్యంగా పస్మందా ముస్లింలకు చేరువ కావడానికి ఆయన ఓ ప్రత్యేక ప్రచారాన్నే మొదలు పెట్టారు. అయితే అది పూర్తిగా విఫలమైంది. ముఖ్యంగా యూపీలో పస్మంద కార్డు ఏ మాత్రం ఉపయోగపడలేదు. 2019లో సమాజ్‌వాదీ, బీఎస్పీ పార్టీలు చేతులు కలిపినప్పటికీ ఎన్డీఏ 64 స్థానాలు గెలుచుకుంది. ఈసారి సమాజ్‌వాదీ, కాంగ్రెస్ చేరువై అద్భుత విజయాలు నమోదు చేశాయి.

కిషోరీలాల్ శర్మకు ప్రియాంకాగాంధీ అభినందనలు

స్మృతి ఇరానీపై భారీ మెజార్టీతో గెలుపు



అమేథీ : ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ లోక్‌సభ స్థానంలో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీపై కాంగ్రెస్ అభ్యర్థి కిషోరి లాల్ శర్మ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఆయనకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్‌కు కంచుకోటైన అమేథీలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ఓటమి పాలైన విషయం తెలిసిందే. కానీ ఆయన కేరళలోని వయనాడ్‌లో గెలిచారు. తమ కంచుకోటైన అమేథీని తిరిగి తమ ఖాతాలో వేసుకోవడం కోసం ప్రియాంక తీవ్రంగా శ్రమించారు. దాంతో ఆమెనే అమేథీ నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం కోరింది. నిరాకరించడంతో పార్టీ హైకమాండ్ కిషోర్‌లాల్ శర్మను బరిలోకి దింపింది. అనుకున్నట్టుగానే ఈ ఎన్నికల్లో కేంద్రమంత్రి స్మృతి ఇరానీపై కిషోర్ లాల్ శర్మ పోటీచేసి ఘన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ప్రియాంకాగాంధీ కిషోర్‌లాల్ శర్మకు ఎక్స్ వేదికగా అడ్వాన్స్ శుభాకాంక్షలు తెలిపారు. 'కిషోరి భాయ్, మొదటి నుంచి నాకు మీ గెలుపుపై ఎలాంటి అనుమానాలు లేవు. మీరు నెగ్గుతారని చెబుతూ వచ్చా. మీకూ, అమేథీలోని నా సోదర సోదరీమణులకు అభినందనలు' అని ప్రియాంక తన పోస్టులో పేర్కొన్నారు.

హాసన్‌లో ప్రజ్వల్ రేవణ్ణ ఓటమి

న్యూఢిల్లీ: సెక్స్ స్కాండల్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, జేడీఎస్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తన సొంత నియోజకవర్గం హాసన్‌లో ఓటమి పాలయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయస్ ఎం పాటిల్ 44 వేల ఓట్ల తేడాతో ప్రజ్వల్‌పై రేవణ్ణపై గెలుపొందారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 1.4 లక్షల మెజారిటీతో హాసన్ నుంచి ప్రజ్వల్ గెలుపొందిన విషయం తెలిసిందే. ఈసారి కర్ణాటకలో బీజేపీతో పొత్తుతో జేడీ(ఎస్) కర్ణాటకలో పోటీ చేసింది. కాగా, ఇటీవల మహిళలపై లైంగిక దౌర్జన్యం, కిడ్నాప్ వంటి ఆరోపణలతో ప్రజ్వల్ రేవణ్ణ అరెస్టైన సంగతి తెలిసిందే. ప్రజ్వల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సిట్ అధికారులు సోమవారం అంబులెన్స్‌లో శివాజీనగర్‌లోని బౌరింగ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోర్టుకు సమర్పించేందుకు అవసరమైన మూడు, నాలుగు రకాల వైద్యపరీక్షలు చేయాలని వైద్యాధికారులను కోరారు. దీంతో మెడికల్ కాలేజీ డీన్, సూపరింటెం డెంట్ సమక్షంలోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజ్వల్ మూడు రోజులుగా కస్టడీలో ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థి చేతిలో ఒమర్ అబ్దుల్లా ఓటమి

'ఎక్స్'లో రషీద్‌కు కంగ్రాట్స్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, స్వతంత్ర్య అభ్యర్థి అబ్దుల్ రషీద్ షేక్ చేతిలో పరాజయం పాలయ్యారు. నార్త్ కశ్మీర్‌లో విక్టరీ కొట్టిన రషీద్‌కు ఒమర్ తన ఎక్స్ అకౌంట్‌లో ఓటమిని అంగీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ మనోగతాన్ని వెల్లడించారని, అదే కీలకమని ఆయన తెలిపారు. అయితే అబ్దుల్ రషీద్‌కు 350858 ఓట్లు పోలవ్వగా ,ఒమర్ అబ్దుల్లాకు 191124 ఓట్లు పడ్డాయి. దీంతో 1,59,734 ఓట్ల తేడాతో ఒమర్ ఓటమి పాలయ్యారు. స్వతంత్ర్య అభ్యర్థి రషీద్ అయిదేండ్ల పాటు తీహార్ జైలులో ఉన్నారు. ఆయనను యూఏపీఏ చట్టం కింద గతంలో అరెస్టు చేశారు. స్వతంత్ర్య అభ్యర్థిగా ఈ సారి పోటీ చేయగా ఆయన తరపున ఇద్దరు కుమారులు తీవ్ర ప్రచారం చేశారు.

ఏపీ సైకిల్‌దే..

(మొదటి పేజీ తరువాయి)

88 సీట్లు అవసరం కాగా, మూడు పార్టీలు కలిసి ఆ మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశాయి. టీడీపీకి సొంతంగా కూడా మెజారిటీ సమకూరింది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు కుప్పం, లోకేష్ మంగళగిరి నుంచి భారీ మెజారిటీతో గెలుపొందారు. చంద్రబాబు 47 వేలకుపైగా ఓట్లతో విజయం సాదించారు. బాలకృష్ణ హిందూపురం నుంచి హాట్రిక్ సాధించారు. గతంలో టీడీపీ గెలవని మంగళగిరి స్థానం నుంచి లోకేష్ పోటీచేసి గెలవడం చర్చనీయాంశమైంది. 39 ఏండ్ల తర్వాత అక్కడ పసుపు జెండా ఎగురవేశారు. 1985లో టీడీపీ నుంచి కోటేశ్వరరావు విజయం సాధించారు. ఇప్పటివరకు ఆ నియోజక వర్గంలో అత్యధిక మెజారిటీ 17,265 మాత్రమే. ఆ రికార్డును లోకేష్ తిరగ రాస్తూ వైసీపీ అభ్యర్థి ఎం.లావణ్యపై 91 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు.



టీడీపీ జోరు

తాజా ఎన్నికల్లో జనసేన, బీజేపీతో కలిసి బరిలోకి దిగిన తెలుగుదేశం సైతం సంచలన విజయాన్ని అందుకుంది. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఈ తరహా గెలుపును టీడీపీ చవిచూడలేదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. 2014 ఎన్నికల్లో 102 స్థానాల్లో గెలుపొందిన ఆ పార్టీ, గత ఎన్నికల్లో కేవలం 23 స్థానాలకే పరిమితమైంది. ఈసారి 144 నియోజకవర్గాల్లో బరిలోకి దిగి 135 స్థానాల్లో విజయం సాధించింది. 16 ఎంపీ సీట్లనూ గెలుచుకుంది. ఇక బీజేపీ 10 స్థానాల్లో పోటీచేయగా, ఎనిమిది చోట్ల విజయం సాధించింది. మూడు లోక్‌సభ స్థానాలను సాధించింది. అలాగే 'వై నాట్ 175' అంటూ అతి చేసిన వైసీపీ 11 సీట్లకే పరిమితమైంది. నాలుగు లోక్‌సభ స్థానాలనూ గెలవడం గమనార్హం. మంత్రులంతా ఓటమి పాలు కావడం తెలిసిందే. తాను తప్ప రాష్ట్రంలోని ఓడిపోతామనుకున్న ఇతర నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చినా జగన్‌కు విజయం దక్కలేదు. సిద్ధం పేరుతో చేపట్టిన ప్రచారం కార్యక్రమమూ బెడిసికొట్టింది.

జనసేన

జనసేన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలిచింది. దీంతో 100 శాతం స్ట్రైక్ రేట్‌ను నమోదుచేసినట్టయింది. జనసేనాని పవన్‌కళ్యాణ్ పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా మొదటి నుంచి జాగ్రత్తపడ్డారు. సీట్ల సర్దుబాటు విషయంలో మిత్రులతో కలివిడిగా ఉన్నారు. తొలుత 24 సీట్లకు అభ్యర్థులను ప్రక టించి, ఆనక 21 సీట్లలో పోటీకి దించి కూటమి ధర్మాన్ని పాటించారు. పవన్‌కళ్యాణ్ పదేండ్ల రాజ కీయ ప్రస్థానంలో సరికొత్త విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. 2019లో కేవలం ఒక్కటంటే ఒక్క స్థానం గెలుపొందిన ఆ పార్టీ, ఈసారీ ఏకంగా పోటీ చేసిన అన్ని చోట్లా విజయం సాధించడం గమనార్హం.

చంద్రబాబు, పవన్ భేటీ

ఎన్నికల ఫలితాల్లో స్పష్టమైన మెజారిటీ రావడంతో తెలుగుదేశం అధినేత చంద్ర బాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వచ్చిన చంద్రబాబును పవన్‌కళ్యాణ్ సాదరస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పరం అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసు కున్నారు. అనంతరం ప్రత్యేకంగా ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటు, సీఎం ప్రమాణ స్వీకారానికి సంబంధించిన సన్నాహాలపై చర్చించుకున్నట్టు తెలిసింది. బుధవారం ఢిల్లీలో జరిగే ఎన్డీయే కూటమి సమావేశానికి హాజరయ్యే అంశంపైనా ఇరువురూ సమాలోచనలు చేసినట్టు సమాచారం. ఆ భేటీకి చంద్రబాబుతోపాటు పవన్‌కళ్యాణ్ కూడా వెళతారా ? లేదా ? అనేది తేలలేదు.

ఒక్క సీటూ గెలవని వైసీపీ

శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో వైసీపీ ఒక్క సీటూను గెలుచుకోలేకపోయింది.

కూటమిదే పీఠం..నారా ఫ్యామిలీలో జోష్ !

ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారీ విజయం సాధించడంతో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కుటుంబ సభ్యులు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్, బాలకృష్ణ సతీమణి వసుంధర, ఇతర కుటుంబ సభ్యులంతా కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ తన తల్లి భువనేశ్వరిని ప్రేమగా ముద్దాడారు. చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు విక్టరీ సింబల్ చూపిస్తూ మీడియాకు ఫోజులిచ్చారు. కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్‌భవన్‌కు చంద్రబాబు చేరుకు న్నారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు భారీగా సంబరాలు చేసు కున్నారు. బాణా సంచా కాల్చారు. స్వీట్లు పంచారు. డ్యాన్సులు చేశారు. వందలాది మందితో కార్యాలయం కోలాహలంగా మారింది.

హ్యాట్రిక్ వీరులు వీరే

టీడీపీలో పలువురు అభ్యర్థులు వరుసగా 2014, 2019, 2024 ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో బెందాళం అశోక్, టెక్కలిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. హిందూపురంలో బాలకృష్ణ హాట్రిక్ సాధించారు. అలాగే వీరితోపాటు నిమ్మకాయల చినరాజప్ప(పెద్దాపురం), గొట్టిపాటి రవి(అద్దంకి), ఏలూరి సాంబశివరావు(పర్చూరు),గోరంట్ల బుచ్చయ్య చౌదరి(రాజమండ్రి రూరల్), నిమ్మల రామానాయుడు(పాలకొల్లు) హాట్రిక్ గెలుపు నమోదు చేశారు. ఇదిలావుండగా ఎంపీల్లో శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్ నాయుడు వరుసగా మూడోసారి విజయపతాకను ఎగురవేశారు.

సీఎం జగన్ రాజీనామా

ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చవిచూసిన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం రాజీనామా లేఖను గవర్నర్‌కు పంపారు. అంతకు ముందు జగన్ మీడియా తో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఫలితాలను తాను ఊహించలేదన్నారు. అక్క, చెల్లెమ్మల ఓట్లు, పింఛన్లు అందుకున్న అవ్వా తాతల ఓట్లు ఏమయ్యాయో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. మంచి చేసినా ఓడించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కాగా పులివెందుల నుంచి బరిలోకి దిగిన జగన్ విజయం సాధించారు. అయితే గతం కంటే మెజారిటీ తగ్గింది. టీడీపీ అభ్యర్థి బీటెక్ రవిపై జగన్ 61,176 ఓట్లతో విజయం సాధించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఆయన ఆధిక్యం ఈసారి 28 వేల ఓట్ల మేర తగ్గిపోయింది. వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కడమూ కష్టమేనని అంటున్నారు. కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.

విజేతలు వీరే

మహబూబాబాద్ (ఎస్టీ)

విజేత : బలరాం నాయక్ (612774)
మెజార్టీ ఓట్లు : (3,49,165)
సమీప ప్రత్యర్థి : కవిత మాలోతు (బీఆర్ఎస్)

వరంగల్ (ఎస్సీ)

విజేత : కడియం కావ్య (581294)
మెజార్టీ ఓట్లు : (2,20,339)
సమీప ప్రత్యర్థి : ఆరూరి రమేష్ (బీజేపీ)

నాగర్‌కర్నూల్ (ఎస్సీ)

విజేత : మల్లు రవి (465072)
మెజార్టీ ఓట్లు : (94,414)
సమీప ప్రత్యర్థి : పోతుగంటి భరత్ (బీజేపీ)

పెద్దపల్లి (ఎస్సీ)

విజేత : గడ్డం వంశీ (475587)
మెజార్టీ ఓట్లు : (1,31,364)
సమీప ప్రత్యర్థి : గోమాస శ్రీనివాస్ (బీజేపీ)

నల్లగొండ

విజేత : కె. రఘువీరారెడ్డి (784337)
మెజార్టీ ఓట్లు : (5,59,905)
సమీప ప్రత్యర్థి : సైదిరెడ్డి (బీజేపీ)

భువనగిరి

విజేత : చామల కిరణ్ (629143)
మెజార్టీ ఓట్లు : (2,22,170)
సమీప ప్రత్యర్థి : బూరనర్సయ్య (బీజేపీ)

ఖమ్మం

విజేత : ఆర్.రఘురామరెడ్డి (766929)
మెజార్టీ ఓట్లు : (4,67,847)
సమీప ప్రత్యర్థి : తాండ్ర వినోద్ రావు (బీజేపీ)

జహీరాబాద్

విజేత : సురేష్ షెట్కార్ (528418)
మెజార్టీ ఓట్లు : (46,188)
సమీప ప్రత్యర్థి : బీబీ పాటిల్ (బీజేపీ)

ఆదిలాబాద్ (ఎస్టీ)

విజేత : గోడం నగేష్ (568168)
మెజార్టీ ఓట్లు : (90,652)
సమీప ప్రత్యర్థి : అత్రం సుగుణ (కాంగ్రెస్)

కరీంనగర్

విజేత : బండి సంజయ్ (585116)
మెజార్టీ ఓట్లు : (2,25,209)
సమీప ప్రత్యర్థి : వి. రాజేందర్ రావు (కాంగ్రెస్)

మెదక్

విజేత : రఘునందన్ రావు (471217)
మెజార్టీ ఓట్లు : (39,129)
సమీప ప్రత్యర్థి : నీలం మధు (కాంగ్రెస్)

సికింద్రాబాద్

విజేత : జి. కిషన్ రెడ్డి (473012)
మెజార్టీ ఓట్లు : (49,944)
సమీప ప్రత్యర్థి : దానం నాగేందర్ (కాంగ్రెస్)

మల్కాజిగిరి

విజేత : ఈటల రాజేందర్ (991042)
మెజార్టీ ఓట్లు : (3,91,475)
సమీప ప్రత్యర్థి : సునిత మహేందర్ రెడ్డి (కాంగ్రెస్)

నిజామాబాద్

విజేత : ధర్మపురి అరవింద్ (592318)
మెజార్టీ ఓట్లు : (1,09,241)
సమీప ప్రత్యర్థి : జీవన్ రెడ్డి (కాంగ్రెస్)

మహబూబ్‌నగర్

విజేత : డి.కే. అరుణ (510747)
మెజార్టీ ఓట్లు : (4,500)
సమీప ప్రత్యర్థి : వంశీచంద్ రెడ్డి (కాంగ్రెస్)

చేవెళ్ల

విజేత : కొండవిశ్వేశ్వర్ రెడ్డి (809882)
మెజార్టీ ఓట్లు : (172897)
సమీప ప్రత్యర్థి : రంజిత్ రెడ్డి (కాంగ్రెస్)

హైదరాబాద్

విజేత : అసదుద్దీన్ ఓవైసీ (661981)
మెజార్టీ ఓట్లు : (3,38,087
సమీప ప్రత్యర్థి : మాధవి లత (బీజేపీ)

సంపాదకీయం

ఇస్ బార్ దోసా పార్!

'ఇస్ బార్ చార్ సౌ పార్' నినాదంతో బీజేపీ ఈ ఎన్నికల్లోకి దిగింది. తమ కూటమికి నాలుగొందల సీట్లివ్వండని దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి మొదట్లోనే బెడిసికొట్టింది. అది రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రని ప్రజలు అర్థం చేసుకున్నారు. మతాన్ని పచ్చిగా రాజకీయాల్లోకి లాగిన మోడీ, తన కార్పొరేట్ సేవకు హిందూ దేవుళ్లనూ, దేవతలను యధేచ్ఛగా వాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను భారతదేశ ప్రజలు

ప్రజల ఆదాయాలు పెరిగే మార్గం కాకుండా కేవలం సంక్షేమ పథకాలపై ఆధారపడే వారిగా చేస్తే ఎన్నికల్లో గట్టెక్కలేరని అటు వైసీపీ, ఇటు బీఆర్ఎస్‌లకు అర్థం కావాలి. ఉపాధి చూపకపోతే, ప్రజల కడుపు నిండే మార్గాలు కల్పించలేకపోతే మోడీని అయోధ్య రాముడూ కాపాడడు. (అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఓడిపోయింది) వైసీపీ, బీఆర్ఎస్‌లను సంక్షేమ పథకాలూ కాపాడవని భారత ఓటర్లు నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పారు.

సరిగానే అర్థం చేసుకున్నారు. ఇంకా తుది సంఖ్యలు వెలువడవలసి యున్నది. నిన్న రాత్రి ఎనిమిది గంటలకున్న సమాచారం మేరకు బుల్‌డోజర్లతో విర్రవీగిన కీలక రాష్ట్రంలో బీజేపీ వెన్ను విరిగింది. పేపర్ లీక్స్, నిరుద్యోగం యోగి సర్కార్‌ను మట్టి కరిపించాయి.

ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలులేని చోట్ల కూడా అక్కడ బీజేపీని ప్రజలు తమంత తాముగా ఓడించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఇటీవల కాలంలో చెలరేగిన అతి పెద్ద వర్గ యుద్ధం, రైతు ఉద్యమం దెబ్బకి పంజాబ్‌లో బీజేపీకి ఒక్క సీటూ దక్కలేదు. హర్యానాలో బీజేపీని పది నుంచి నాలుగుకి కుదించారు రైతులు. వర్గపోరాటాలే కమ్యూనిస్టులను ముందుకి నడిపిస్తాయనేందుకు రాజస్థాన్‌లోని సికార్‌లో సీపీఐ(ఎం) గెలుపే నిదర్శనం. ఆ రాష్ట్రంలో మొత్తం 25 సీట్లలో 24 నుంచి బీజేపీని 14కు కట్టడి చేయగలిగింది. ఇండియా కూటమి '0' నుంచి 11కు పెరిగింది.

మహారాష్ట్ర, యూపీ, హర్యానా, తమిళనాడు, పంజాబ్‌ల్లో ఇండియా కూటమి స్పష్టంగా తన హవా నిరూపించుకుంది. ప్రాంతీయ పార్టీలు తమ అవకాశవాద రాజకీయాల వల్ల బీజేపీకి కాళ్ళు తెస్తున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ గంపగుత్తగా తన ఓట్లు బీజేపీకి వేసింది.



ఫలితంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉనికే ప్రశ్నార్థకం అయ్యింది. ఏపీలో తెలుగుదేశం ఒకసారి బీజేపీతో కలిసి ఆ తర్వాత చెంపలేసుకుని, మళ్ళీ జీవితంలో కలవనని చెప్పి 2024లో మరోసారి కలవటం దాని అవకాశవాదానికి పరాకాష్ట. మొన్నటి ఎన్నికల్లో కూడా తాను ముస్లిం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నానని చెప్పిన చంద్రబాబు బీజేపీతో పొత్తులో ఏమి చేయగలుగుతాడు? రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ పెరుగుదలకు బీఆర్ఎస్, టీడీపీల పాత్ర కీలకం. బిజూ జనతాదళ్ పరిస్థితి నేడు చూసైనా బీఆర్ఎస్, టీడీపీలు అర్థం చేసుకుంటారా?

కాంగ్రెస్ అధిష్టానమైనా బీజేపీ ప్రమాదాన్ని ఎత్తుగడలను సరిగా అర్థం చేసుకుందాననే సందేహం వస్తోంది. జాతీయోద్యమ స్ఫూర్తి ఏనాడో ఆవిరైపోయింది. కార్పొరేట్ల సేవకి లొంగిపోయి, ప్రజల్ని ఐదేళ్ళకొకసారి ఓట్లేసే యంత్రాలుగా పరిగణించడం మొదలైన తర్వాత, స్థూలంగా విధానాలు అభివృద్ధి నిరోధక మార్గంలోకి మళ్ళిన తర్వాత బీజేపీ ఇచ్చే 'మనమూ', 'వాళ్ళు'కు ప్రజలు ఆకర్షితులుకాక మానరు కదా! ఇది ప్రపంచవ్యాపిత పరిణామం. తమ మధ్యనున్న 'పంచాయితీ'వల్ల కాంగ్రెస్ గెలిచిన నియోజకవర్గాల్లో బీజేపీకి మెజారిటీ రావడమే నిదర్శనం.

ఈ ఎన్నికల్లో మరో ఉపకథ ఉంది. బహుశా అదే మెయిన్ కథేమో! ఈ నెల ఒకటి సాయంత్రానికి ఎగ్జిట్ పోల్స్ వచ్చాయి. చివరికి ఏ ఒక్క ఎగ్జిట్ పోలూ సరైందిగా నిరూపితం కాలేదు. అన్నింటిలో ఎన్డీయేకి 350 నుంచి 377 వరకు సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. షేర్ మార్కెట్లు పరుగులు పెట్టాయి. కానీ ఈ రోజు ఫలితాలు ప్రకటించడం ప్రారంభించినప్పట్నించి 'బ్లడ్ బాత్'లో మునిగిశాయి. 4389 పాయింట్లు పడిపోయి మదుపుదారుల సొమ్ము 30 లక్షల కోట్ల రూపాయలు హరించుకుపోయాయి. ఇంత భారీ నష్టం ఈ మధ్య ఎన్నడూ జరిగింది లేదు. ఒక్క అదానీ షేర్లే లక్ష కోట్ల రూపాయల వరకు నష్టపోయాయి.

తమ పాలన ఎంత దౌర్భాగ్యంగా ఉన్నా, కేవలం మతావేశాలు రెచ్చగొడితే ప్రజలు ఓట్లేయరని దామోదర్ భాయ్ నరేంద్ర భాయ్ మోడీ ద్వారా ప్రపంచానికి తెలిపారు భారతీయ ఓటర్లు. వారణాసిలో మోడీ మెజారిటీ గతంలోకంటే తగ్గింది.

ప్రజల ఆదాయాలు పెరిగే మార్గం కాకుండా కేవలం సంక్షేమ పథకాలపై ఆధారపడే వారిగా చేస్తే ఎన్నికల్లో గట్టెక్కలేరని అటు వైసీపీ, ఇటు బీఆర్ఎస్‌లకు అర్థం కావాలి. ఉపాధి చూపకపోతే, ప్రజల కడుపు నిండే మార్గాలు కల్పించలేకపోతే మోడీని అయోధ్య రాముడూ కాపాడడు. (అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఓడిపోయింది) వైసీపీ, బీఆర్ఎస్‌లను సంక్షేమ పథకాలూ కాపాడవని భారత ఓటర్లు నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పారు.

వృక్షో రక్షతి రక్షిత:



మూడ్ శోభన్
9949725951

చెట్లను నువ్వు కాపాడితే ఆ చెట్లే నిన్ను కాపాడతాయన్న పైసామెత మనకు తెలిసిందే. వేడి తీవ్రంగానే ఉంది. కొన్ని చోట్ల ట్రాక్టర్ బానెట్‌పై రోటీలు కాల్చినట్లు, మరికొన్ని చోట్ల ఇసుకలో పాపడ్ కాల్చినట్లు సోషల్ మీడియాలో చూశాం. ఉష్ణోగ్రత దాదాపు 50 డిగ్రీలకు చేరుకుంది. మానవ శరీరం 37-38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతను తట్టుకోగలదు. కానీ చాలా చోట్ల వేడి 47 నుండి 49 డిగ్రీలకు చేరుకుంది. కొన్ని చోట్ల 50 డిగ్రీల సెల్సియస్‌ను కూడా తాకే అవకాశం ఉంది. మెడికల్ జర్నల్ లాన్సెట్ ప్రకారం బయట ఉష్ణోగ్రత 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంటే కండరాలు స్పందించడం ప్రారంభిస్తాయి. ప్రాణాపాయానికి సంబంధించిన కీలక అవయవాలు పనిచేయడం నుంచి గుండెపోటు వరకు సమస్యలు రావచ్చు. వేడి ప్రాణాంతకంగా మారింది.

ఇది అకస్మాత్తుగా జరగలేదు. 2024 అత్యంత వేడిగా మారబోతోందని ఈ ఏడాది ప్రారంభంలోనే హెచ్చరికలు వచ్చాయి. దీని వెనుక పసిఫిక్ సముద్రం ఎగువ ఉపరితలం ఉడికిస్తున్న ఎల్‌నినో ప్రభావం ఏ మేరకు ఉందో, సముద్రం కింద శీతల కెరటాలకు రక్షణగా నిలుస్తున్న లానినా వైఫల్యం ఏ మేరకు ఉందో వాతావరణ నిపుణులు సమీక్షిస్తున్నారు. వాతావరణ మార్పు - గ్లోబల్ వార్మింగ్ రాబోయే రోజుల్లో ఇది ఎంతటి విధ్వంసం సృష్టించబోతోందనే దానిపై చాలా నివేదికలు ఉన్నాయి. లాభాపేక్షతో మత్తులో ఉన్న పెట్టుబడి వాతావరణ మార్పులకు బాధ్యత వహించాలి. భూమిపై నివసించే జీవుల ఉనికికి ముప్పుగా మారింది. అమెరికాతో సహా సంపన్న దేశాల సమూహం చేసిన విధ్వంసం కీలకమైంది. ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరిన వెంటనే కనీసం ఒక్క చెట్టునైనా నాటాలని ప్రతి పౌరునికి సూచించడం మంచిదే. చెట్లు నాటడం చాలా మంచి విషయం. ఇది తప్పనిసరి చేయాలి. కానీ దానిని ఏకైక మార్గంగా పరిగణించడం అమాయకత్వం. ఇది జరుగుతున్న విధ్వంసక, వేగాన్ని కొన్ని వాస్తవాల నుండి అర్థం చేసుకోవచ్చు. ఫుడ్ అండ్ అగ్రి కల్చర్ ఆర్గనైజేషన్ ప్రకారం 2015-20 మధ్య భారతదేశంలో ప్రతి సంవ త్సరం 6 లక్షల 68 వేల హెక్టార్ల అడవులు నాశనమయ్యాయి. ఇది ప్రపంచంలో 2వ అతిపెద్ద అటవీ విధ్వంసం. 4 లక్షల 14 వేల హెక్టార్లలో సహజసిద్ధమైన అడవులు నేలకొరిగాయి. వీటిని మళ్లీ పెంచలేం. ఇవి కాకుండా గత రెండు దశాబ్దాల్లో 2 కోట్ల 33 లక్షల హెక్టార్ల చెట్లతో నిండిన ప్రాంతాలు నాశనమయ్యాయి. దేశంలోని చెట్లతో నిండిన భూమి 18శాతం. మరో నివేదిక ప్రకారం, గత ముప్పై ఏళ్లలో మైనింగ్, విద్యుత్, రక్షణ ప్రాజెక్టుల కోసం సుమారు 14వేల చదరపు కిలోమీటర్ల అడవులు తీసుకోబడ్డాయి.

పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి కాగితంపై కొన్ని షరతులు, బాధ్యతలు ఉండేవి. అయితే, వాటి అమలు స్థితిని అర్థం చేసుకోవడానికి కేవలం ఒక ఉదాహరణ సరిపోతుంది. మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీ జిల్లాలో గ్రేట్ పవర్ ప్రాజెక్ట్, బొగ్గు బ్లాకుల పేరుతో ఎస్సార్ (ప్రస్తుతం అదానీ), అంబానీలు ఏర్పాటు చేసిన ప్లాంట్లు తవ్వకాల్లోనే కోట్లాది వృక్షాలు నేలకూలాయి. ఇంటెన్సివ్ ట్రీ ప్లాంటేషన్ చేయడం ఈ కంపెనీల బాధ్యత. కానీ ప్రాజెక్టుల్లో నరికిన 20 లక్షల చెట్లకు నష్టపరిహారం ఇప్పిస్తామంటూ సదరు కంపెనీ అన్నది. కంపెనీపై చర్య తీసుకునేందుకు నివేదికను కోరినప్పుడు సింగ్రౌలీకి 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న సాగర్, దామోలో మొక్కలు నాటినట్లు చెప్పారు. సాగర్, దామోను చూడకుండా ప్రభుత్వాలు అతని వాదనను భక్తితో అంగీకరించాయి. 2017 జూలై 5న మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కేవలం 12 గంటల్లో 6 కోట్ల చెట్లను నాటినట్లు ప్రకటించింది. కానీ 2018 జులైలో ఆడిట్ చేసినప్పుడు ఒక్క శాతం కూడా సురక్షితంగా లేవని తేలింది.

అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు 'దేశం' అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నయని 2015 సంవత్సరంలో మోడీ ప్రభుత్వ మంత్రి ప్రకాష్ జవదేకర్ అన్నారు. తరువాత అటవీ చట్టాలలో మార్పులు తేచ్చారు. హైవేలు, సూపర్ ఎక్స్‌ప్రెస్ హైవే, ఎక్స్‌ట్రా సూపర్ ఎక్స్‌ప్రెస్ హైవేల పేరుతో జరిగిన అటవీ విధ్వంసాన్ని అభివృద్ధిగా చెప్పారు. నీరు, అటవీ, భూమికి సంబంధించిన అన్ని చట్టాలను పక్కన పెట్టి అటవీ భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేశారు. ఫలితంగా అడవులు ధ్వంసం కావడం, నదులు ఎండిపోవడం, భూమి తవ్వడం, గిరిజనులనే కాకుండా జంతువులు, పక్షులను అటవీ నుంచి వెళ్లగొట్టడంతో అటవీ ధ్వంసమైంది. విధ్వంసం ఎంత భయంకరంగా ఉందో చూడడానికి లాటిన్ అమెరికా లేదా నైజీరియా లేదా ఎక్కడికైనా వెళ్లాల్సిన అవసరం లేదు. సింగ్రౌలి పక్కనే ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో రేణుకూట్ అనే ప్రదేశం ఉంది. అక్కడ నుండి రోడ్డు మార్గంలో ప్రయాణం ప్రారంభించి సింగ్రౌలీ, సిధి, ఉమారియా, షాడోల్, అనుప్పూర్ మీదుగా ఛత్తీస్‌గఢ్ చేరుతుంది. కొరియా దాటి, సర్గుజా, కోర్బాకు వెళ్తుంది. లోపలికి వెళ్లకుండా రోడ్డుపై నడిచి, మీ కంటితో నిజాన్ని చూడండి. పాలకులకు ఎన్నికల్లో గెలవడానికి విలాసాలు, సాధ నాలు మాత్రమే అందించిన కార్పొరేట్ సంస్థలు వేల ఏండ్ల నాటి అడవులు, లక్షలు, కోట్ల ఏళ్ల నాటి కొండలతో సహా అన్నింటినీ నాశనం చేశారు.

చెట్టును నాటడం ద్వారా మంచి సంకల్పం నేరవేరదు. అడవులు, భూమిలోని మానవాళిని ఎలా కాపాడుకోవాలో నాగర్ కర్నూల్ జిల్లాలోని నల్లమల అడవుల్లో యురేని యంకు వ్యతిరేకంగా జరిగిన గిరిజనుల పోరాటాలు మంచి ఉదాహరణ. అడవిని రక్షించడానికి, చెట్లు నాటడం మంచిదే. కాని నిజమైన పరిష్కారం చెట్లు, అడవులు నాటడం ద్వారా రాదు. అడవుల విధ్వంసం అభివృద్ధి అని చెప్పుకునే ప్రభుత్వాలపై, వారి విధానాలపై పోరాడడం ద్వారానే అడవుల విధ్వంసాన్ని అపగలుగుతాం.

(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

అమెరికా తీరు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా!



ఎం కోటేశ్వరరావు
8331013288

తాము అందించిన ఆయుధాలతో రష్యా మీద పరిమిత దాడులు చేయవచ్చని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌కు అధికారమిచ్చాడు. దీని గురించి ఎలాంటి ఆర్భాటం లేకుండా అమెరికా చూసింది. ఎప్పటి నుంచో జెలెన్‌స్కీ ఈ మేరకు నాటో కూటమి దేశాలకు విన్నవించుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఉక్రెయిన్ భూభాగం మీద మిలిటరీ చర్యకు దిగిన రష్యా మిలిటరీని ఎదుర్కొనేందుకు మాత్రమే నాటో ఆయుధాలను వినియోగిస్తున్నారు. బైడెన్ నిర్ణయానికి ముందు ఫ్రెంచి నేత మక్రాన్, కెనడాతో సహా పన్నెండు దేశాలు కూడా అదే పద్ధతిలో అనుమతులు ఇచ్చినట్లు వార్తలు. దాని ప్రకారం రష్యా భూభాగాలపై ఉక్రెయిన్ దాడులు చేయటానికి వీలుకలుగుతుంది. నిజంగా అదే జరిగితే ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది. నాటో ఆయుధాలతో దాడులు జరిపితే ఆ కూటమి దేశాలు ప్రత్యక్షంగా దాడులకు దిగినట్లుగానే పరిగణిస్తామని గతంలోనే రష్యా అధినేత పుతిన్ ప్రకటించాడు. కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను దెబ్బతీసే క్షిపణులను ఇప్పటికే అందచేయటమే గాక వాటి ప్రయోగానికి అవసరమైన శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇప్పటికే క్రిమియా ప్రాంతంపై ప్రయోగించిన క్షిపణులను మధ్యలోనే అడ్డుకొని రష్యా కూల్చివేసింది. దీర్ఘ శ్రేణి క్షిపణులకు అనుమతి ఇవ్వలేదని అమెరికా చెబుతోంది. డ్రోన్లు, యుద్ధ విమానాలను కూడా ఉక్రెయిన్‌కు సరఫరా చేశారు. ఎఫ్16 విమానాలను ప్రయోగించాలంటే అవసరమైన రన్‌వేలు ఉక్రెయిన్‌లో లేవు. వాటిని నిర్మిస్తే రష్యా చూస్తూ ఊరుకొనే అవకాశాలు లేవు.

పశ్చిమ దేశాల నిర్ణయాలు, కదలికల గురించి రష్యా అప్రమత్తమవుతోంది. ఒక వేళ నాటో కూటమి దేశాలు గనుక తమపై దాడులకు తెగిస్తే అది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని పుతిన్ హెచ్చరికలు జారీ చేశాడు. అలాంటి పరిస్థితే వస్తే ఒక్క రోజులోనే బ్రిటన్, ఫ్రాన్స్ వద్ద ఉన్న అణ్వాయుధాల సామర్థ్యాన్ని దెబ్బతీయగలమని రష్యా మిలిటరీ నిపుణుడు యూరీ బరాన్‌చిక్ చెప్పినట్లు మిర్రర్ పత్రిక రాసింది. అణ్వాయుధాల సామర్థ్యం ఉన్న దేశాల సంఖ్య తొమ్మిది నుంచి ఏడుకు తగ్గుతుంది అని కూడా చెప్పాడు. ముందు జాగ్రత్తగా పెద్ద పట్టణాలలో సంచార అణు రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు నాటో దేశాల పత్రికలు రాస్తున్నాయి. నిజంగా మూడవ ప్రపంచ యుద్ధం వస్తుందా? రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన కొద్ది కాలానికే అనేక మంది పండితులు మూడవ ప్రపంచ యుద్ధం గురించి చెప్పటం మొదలు పెట్టారు. అనేక కుట్ర సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు వలసల ఆక్రమణలో మొదలైన పోటీ ఐరోపా యుద్ధాలకు దారితీసింది. ఫ్రెంచి సామ్రాజ్యవాది నెపోలియన్ బోనపార్టీ 1804 నుంచి ఓటమిపాలైన చివరి యుద్ధం 1815 వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు యుద్ధాలు చేశాడు. తరువాత వంద సంవత్సరాలకు మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది. పాత్రలోని నీరు మరిగి వంద డిగ్రీలకు చేరుకున్న తరువాత ఆవిరిగా రూపాంతరం చెందినట్లు ఏదైన ఒక ప్రధాన పరిణమానికి ముందు అంతర్గతంగా ఎన్నో జరుగుతాయి. అనూహ్య పరిణామాలు కూడా చోటు చేసుకుంటాయి.

1871లో పునరేకీకరణ తరువాత జర్మనీ చర్యల వలన అప్పటి వరకు ఉన్న బలాబలాల్లో నాటకీయ మార్పులు చోటు చేసుకున్నాయి. ఆస్ట్రియా-హంగరీ, ఇటలీతో జర్మనీ జట్టుకట్టింది. దాంతో జర్మనీని అడ్డుకొనేందుకు ఫ్రాన్స్- జారిస్టు రష్యా ఒక్కటయ్యాయి. అప్పటి వరకు ఈ రెండు దేశాల నుంచి తమకు ముప్పు ఉందని భావించిన బ్రిటన్ ఆకస్మికంగా జర్మనీ నుంచి వచ్చిన సవాలును ఊహించలేకపోయింది. ఉప్పు-నిప్పుగా ఉన్న బ్రిటన్- ఫ్రాన్స్ 1904లో సయోధ్య కుదుర్చుకున్నాయి.దేశాల ఆక్రమణలపై సహకరించుకున్నాయి. ఆఫ్రికాలోని మొరాకోను ఫ్రాన్స్ ఆక్రమించగా జర్మనీ వ్యతిరేకించింది, బ్రిటన్ మద్దతు ఇచ్చింది. రష్యా,బ్రిటన్, ఫ్రాన్సు కూటమి గట్టటం తమకు ప్రమాదమని జర్మనీ భావించింది. ఐరోపా రెండు శిబిరాలుగా తయారైంది. జర్మనీ ప్రోద్బలంతో సెర్బియాపై ఆస్ట్రియా-హంగరీ 1914లో యుద్ధం ప్రకటించగా రష్యా వ్యతిరేకించింది.ఫ్రాన్సు కూడా సెర్బియాకు మద్దతు ఇచ్చింది. తటస్థంగా ఉన్న బెల్జియం మీద జర్మనీ యుద్ధం ప్రకటించటంతో ఐరోపాలో దాని ఆధిపత్యం పెరిగిపోతుందనే భయంతో బ్రిటన్ కూడా యుద్ధంలోకి దిగింది. ఇదంతా మూడున్నర దశాబ్దాల మధనం తరువాత జరిగింది. వైరుధ్యాలు పెరగటంతో మొదటి యుద్ధం తరువాత రెండవ ప్రపంచ యుద్ధం రెండుదశాబ్దాల్లోనే వచ్చింది. అది ముగిసి ఎనిమిది దశాబ్దాలైంది. ప్రస్తుతం ప్రపంచం లో జరుగుతున్న పరిణామాలను చూసి కొందరు రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు 1930వ దశకంలో ఉన్న పరిస్థితి ఉందని అది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని చెబుతున్నారు.

అలాంటి వారి వాదనల ప్రకారం ఒక వైపు అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి, ఇతర కొన్ని దేశాలు సమీకృతం అవుతున్నాయి. మరోవైపు చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా జట్టుకడుతున్నాయి. ఐరోపాలో అమెరికా, నాటో కూటమి కారణంగా ఉక్రెయిన్ రూపంలో వైరుధ్యం నడుస్తున్నది.రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు 1936-39 స్పెయిన్లో అంతర్యుద్ధం జరిగింది. మిలిటరీ తిరుగుబాటును ఫాసిస్టు జర్మనీ, ఇటలీ సమర్ధించగా మిలిటరీని వ్యతిరేకించిన శక్తులకు సోవియట్ యూనియన్ మద్దతు ఇచ్చింది. అమెరికా కూడా బాసటగా నిలిచింది. ఇప్పుడు ఉక్రెయిన్‌లో జరుగుతున్న సైనిక చర్యను పశ్చిమదేశాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. చైనా తటస్థంగా ఉన్నప్పటికీ రష్యాకు అవసరమైన ఆర్థిక మద్దతిస్తున్నది. ఇరాన్, ఉత్తర కొరియా ఆయుధాలు అందచేస్తున్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌కు మద్దతుగా నాటో దేశాలు సైనికులను పంపితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ముందుకు వస్తున్నది. గాజాలో జరుగుతున్న మారణకాండపై పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తుండగా, మిగిలిన దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. తిరుగుబాటు రాష్ట్రమైన తైవాన్ చైనాలో అంతర్భాగమని అంగీకరిస్తూనే విలీనానికి తగిన తరుణం ఆసన్నం కాలేదని పశ్చిమ దేశాలు విలీనాన్ని వ్యతిరేకించే శక్తులకు ఆయుధాలు అందచేస్తున్నాయి. దక్షిణ చైనా సముద్రంలో కొన్ని దేశాలను రెచ్చగొట్టి చైనాతో కవ్వింపునకు పూనుకున్నాయి. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, ఫిలిప్పైన్స్ సంయుక్తంగా మిలిటరీ విన్యాసాల పేరుతో బల ప్రదర్శన చేశాయి.

గతంలో దేశాలను ఆక్రమించుకొనేందుకు పోరు జరగ్గా ఇప్పుడు అలాంటి అవకాశం లేకపోవటంతో మార్కెట్లను ఆక్రమించుకొనేందుకు చూస్తున్నారు.దానికి అనుగుణంగానే పెట్టుబడిదారీ దేశాలు ముందుకు తెచ్చిన ప్రపంచీకరణ. అది కూడా వాటికి ఆశించిన మాదిరి లాభాలు తేలేదు.దాన్ని పక్కన పెట్టి రక్షణాత్మక చర్యలకు తెరలేపారు. వాటిలో ఒకటే దిగుమతి పన్నుల వడ్డింపు, దీన్నే వాణిజ్య యుద్ధం అని కూడా అంటున్నారు. దీనికి అనుబంధంగానే సాంకేతిక పరిజ్ఞాన బదిలీని అడ్డుకొనేందుకు సాంకేతిక యుద్ధాన్ని కూడా ప్రారంభించారు. వాణిజ్య ఆంక్షల కారణంగా ఆర్థిక వ్యవస్థలు మరింత దగ్గర కావటానికి బదులు దూరం జరుగుతున్నాయి. కొత్త సమస్యలు, సవాళ్లను ముందుకు తెస్తున్నాయి. ఆంక్షల కారణంగా దీర్ఘకాలంలో ప్రపంచ ఆర్థిక ఉత్పత్తి ఏడు శాతం లేదా 7.4లక్షల కోట్ల డాలర్లమేరకు తగ్గుతుందని గతేడాది ఆగస్టులో ఒక అంచనా వెలువడింది.2019 తరువాత వాణిజ్య ఆంక్షలు మూడింతలు పెరిగి 2022 నాటికే మూడువేలకు పెరిగినట్లు ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జియేవా పేర్కొన్నారు.

డోనాల్డ్ ట్రంప్ చైనా మీద ప్రారంభించిన యుద్ధాన్ని జో బైడెన్ కూడా కొనసాగించాడు. ఉక్రెయిన్ వివాదంతో రష్యా మీద వాణిజ్య ఆంక్షలను అమలు జరుపుతున్న సంగతి తెలిసిందే. అణుకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నదనే సాకుతో ఇరాన్‌పై అంతకు ముందు నుంచే ఆంక్షలు ఉన్నాయి. పశ్చిమ దేశాలు చైనా మీద ఒక వైపు ఆధారపడుతూనే మరోవైపు దాన్ని దెబ్బతీసేందుకు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో తన ఉత్పత్తులకు చైనా కొత్త మార్కెట్లను వెతుకుతోంది.వర్ధమాన, పేద దేశాల మీద ఎక్కువగా కేంద్రీకరిస్తోంది. డాలరుకు బదులు ప్రత్యామ్నాయ నగదు లావాదేవీలను ముందుకు తెచ్చేందుకు అనేక దేశాలు చూస్తున్నాయి. పరిస్థితులు ఆందోళనకర స్థాయికి చేరినట్లు చెప్పలేము గానీ ఆందోళన కలిగిస్తున్నాయని, ప్రపంచదేశాలు అమెరికా, చైనా, అలీనదేశాల కూటములుగా చీలిపోతున్నాయని ఐఎంఎఫ్ అధికారిణి గీతా గోపినాథ్ చెప్పారు. తగ్గుతున్న తన పట్టు నిలుపుకొనేందుకు అమెరికా చూస్తుండగా, చైనా, రష్యా దాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా విజయం సాధిస్తే ఇతర దేశాల మీద కేంద్రీకరిస్తాడంటూ పుతిన్ గురించి పశ్చిమదేశాలు రెచ్చగొడుతున్నాయి.



గతంలో దేశాలను ఆక్రమించుకొనేందుకు పోరు జరగ్గా ఇప్పుడు అలాంటి అవకాశం లేకపోవటంతో మార్కెట్లను ఆక్రమించుకొనేందుకు చూస్తున్నారు.దానికి అనుగుణంగానే పెట్టుబడిదారీ దేశాలు ముందుకు తెచ్చిన ప్రపంచీకరణ. అది కూడా వాటికి ఆశించిన మాదిరి లాభాలు తేలేదు.దాన్ని పక్కన పెట్టి రక్షణాత్మక చర్యలకు తెరలేపారు. వాటిలో ఒకటే దిగుమతి పన్నుల వడ్డింపు. దీన్నే వాణిజ్య యుద్ధం అని కూడా అంటున్నారు. దీనికి అనుబంధంగానే సాంకేతిక పరిజ్ఞాన బదిలీని అడ్డుకొనేందుకు సాంకేతిక యుద్ధాన్ని కూడా ప్రారంభించారు. వాణిజ్య ఆంక్షల కారణంగా ఆర్థిక వ్యవస్థలు మరింత దగ్గర కావటానికి బదులు దూరం జరుగుతున్నాయి. కొత్త సమస్యలు, సవాళ్లను ముందుకు తెస్తున్నాయి.


పెట్టుబడిదారీ విధానం ముందుకు పోవటానికి, నూతన మార్కెట్ల వేటలో ప్రపంచీకరణను ముందుకు తెచ్చింది. అది కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. దాంతో పెట్టుబడిదారీ దేశాలు గతం మాదిరి రక్షణ చర్యలకు దిగాయి. గడచిన పదేండ్లలో అమెరికాలో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ ఉత్పాదకరంగంలో పెరుగుదల దాదాపు లేదు.అమెరికా వాణిజ్య లోటును తగ్గించటంలో కూడా ట్రంప్, బైడెన్ విఫలమయ్యారు.రక్షణాత్మక చర్యలు కూడా విఫలమయ్యాయి. సోషలిస్టు దేశాలు యుద్ధాన్ని కోరుకోవటం లేదు.అదిరించి బెదిరించి తమ ఉత్పత్తులను అమ్ముకొనేందుకు చూస్తున్నాయి తప్ప సామ్రాజ్యవాదులు యుద్ధం చేసే స్థితిలో లేరు. ఈ పూర్వరంగంలో కుట్ర సిద్ధాంతాలు చెబుతున్నట్లు ఇప్పటికైతే మూడవ ప్రపంచ యుద్ధం వచ్చే స్థితి లేదు. అయితే పెట్టుబడిదారీ విధానం సంక్షోభం, వైఫల్యాన్ని అధిగమించేందుకు ఎంతకైనా తెగిస్తుందనే అంశాన్ని సదా గమనంలో ఉంచుకోవాలి.

ప్రపంచంలో కొన్ని పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ అవి ప్రపంచ యుద్ధానికి దారితీసేవిగా లేవన్నది ఒక అభిప్రాయం. రెండు ప్రపంచ యుద్ధాలూ ప్రపంచ దేశాల ఆక్రమణల కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య వచ్చిన తగాదా కారణంగా జరిగాయి. గతంలో సోవియట్, తూర్పు ఐరోపా దేశాల మాదిరి ఒక సోషలిస్టు కూటమి వంటిది లేకపోయినప్పటికీ ప్రధాన వైరుధ్యం సోషలిజం-పెట్టుబడిదారీ విధానం మధ్యనే ఉంది. సామ్రాజ్యవాద దేశాలు జీ7 కూటమి పేరుతో ఒక్కటిగా ఉంటూ ప్రపంచ మార్కెట్లను ఆక్రమించుకొనేందుకు చూస్తున్నాయి తప్ప దెబ్బలాడుకోవటం లేదు. చైనా,వియత్నాం, క్యూబాలను దెబ్బతీసేందుకు విడివిడిగా, ఉమ్మడిగా ప్రయత్నిస్తున్నాయి. జీ7 దేశాలు రష్యాను కూడా తమతో కలుపుకొని జీ8గా మారి జూనియర్ భాగస్వామిగా చేసుకొనేందుకు చూడటంతో రష్యా అంగీకరించలేదు. అందుకే దాన్ని పక్కన పెట్టి కత్తిగట్టాయి. తరువాత ఏం జరుగుతుందో తెలియదుగాని ప్రస్తుతానికి అనివార్య స్థితిలో చైనాకు రష్యా దగ్గరకావాల్సి వచ్చింది. అమెరికాను ఎదుర్కొనేందుకు చైనాకూ రష్యా, ఇరాన్ వంటి దేశాల అవసరం ఉంది. రెండవ ప్రపంచ యుద్ధంలో కూడా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు నాజీ కూటమిని ఓడించేందుకు సోవియట్‌తో చేతులు కలపాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. పెట్టుబడిదారీ విధానం ముందుకు పోవటానికి, నూతన మార్కెట్ల వేటలో ప్రపంచీకరణను ముందుకు తెచ్చింది. అది కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. దాంతో పెట్టుబడిదారీ దేశాలు గతం మాదిరి రక్షణ చర్యలకు దిగాయి. గడచిన పదేండ్లలో అమెరికాలో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ ఉత్పాదకరంగంలో పెరుగుదల దాదాపు లేదు.అమెరికా వాణిజ్య లోటును తగ్గించటంలో కూడా ట్రంప్, బైడెన్ విఫలమయ్యారు.రక్షణాత్మక చర్యలు కూడా విఫలమయ్యాయి. సోషలిస్టు దేశాలు యుద్ధాన్ని కోరుకోవటం లేదు.అదిరించి బెదిరించి తమ ఉత్పత్తులను అమ్ముకొనేందుకు చూస్తున్నాయి తప్ప సామ్రాజ్యవాదులు యుద్ధం చేసే స్థితిలో లేరు. ఈ పూర్వరంగంలో కుట్ర సిద్ధాంతాలు చెబుతున్నట్లు ఇప్పటికైతే మూడవ ప్రపంచ యుద్ధం వచ్చే స్థితి లేదు. అయితే పెట్టుబడిదారీ విధానం సంక్షోభం, వైఫల్యాన్ని అధిగమించేందుకు ఎంతకైనా తెగిస్తుందనే అంశాన్ని సదా గమనంలో ఉంచుకోవాలి.

రాజ్యాంగబద్ధమా? దివ్యశక్తి ప్రేరితమా?

(మే 26 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

PEOPLE'S DEMOCRACY



లోక్‌సభ ఎన్నికల పోలింగ్ చివరి దశకు చేరుకున్న ఈ సమయంలో రాజ్యాంగ రక్షణే కీలకాంశంగా ఈ ఎన్నికలు నడిచాయనేది నిస్సందేహం. ఎన్నికల ప్రారంభ ఘట్టం నుంచి 'ఇండియా' వేదిక పార్టీలు ఎన్నికల రంగంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే ఒక ప్రధాన ఇతివృత్తమని చెబుతూనే వచ్చాయి. గత దశాబ్ది కాలంలోనూ దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రజానీకం వివిధ రకాలైన నియంతృత్వ కోణాలను చూశారు. ప్రతిపక్షాలు రాజ్యాంగ పరిరక్షణ అన్న ఈ పిలుపునిస్తున్న తరుణంలోనే మోడీ బీజేపీకి నాలుగు వందలకు పైగా స్థానాలు రావాలనే నినాదం ఎత్తుకున్నారు. బీజేపీ నాయకులు అనేక మంది రాజ్యాంగాన్ని మార్చాలంటే 400 స్థానాలు గానీ భారీ మెజారిటీ గానీ కావాలనే వాదన ఎత్తుకోవడంతో రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం వుందనేది మరింతగా ధఅవపడింది.

రాజ్యాంగాన్ని మార్చాలంటే లోక్‌సభలో భారీ అధిక్యత వుండాలి గనకనే బీజేపీ 400 స్థానాల సాధన లక్ష్యంగా పెట్టుకుందని ఆ పార్టీ ఎంపి అనంత కుమార్ బెంగళూరులో చెప్పారు. ఫైజాబాద్ బీజేపీ ఎం.పి లల్లూ సింగ్, నాగూర్ బీజేపీ అభ్యర్థి జ్యోతి మీర్ధా, మీరట్‌లో ఆ పార్టీ అభ్యర్థి అరుణ్ గోవిల్ కూడా ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార క్రమంలో బీజేపీ నాయకులు వ్యక్తం చేసిన ఈ అభిప్రా యాలతో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలనే ప్రతిపక్ష ఉద్యమానికి మరింత బలం చేకూరింది. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలనే ఈ పిలుపుకు ప్రజల నుంచి ఎంత గట్టి ప్రతిస్పందన వస్తున్నదో బీజేపీ నేతలకు మరీ ముఖ్యంగా నరేంద్ర మోడీ, అమిత్ షా లకు నివేదికలు అందాయి. డా బి.ఆర్. అంబేద్కర్‌ను రాజ్యాంగ నిర్మాతగా గౌరవించే దళిత వర్గాలలో ఈ ప్రచారం మరింతగా చొచ్చుకు పోయిందని కూడా వారికి నివేదికలు చేరాయి.

ఎదురు దాడితో జవాబు

దాంతో నరేంద్ర మోడీ ప్రతిపక్షాల ఈ ఆరోపణను గట్టిగా ఖండించే పని మొదలుపెట్టారు. తొలి దశ పోలింగ్ ముగింపులోగానే ఆయన రాజ్యాంగం తమ పార్టీకి పవిత్రమైందని ప్రకటించారు. గీత, రామాయణ్, బైబిల్, ఖురాన్‌ల లాగే ప్రభుత్వం దాన్ని పవిత్రంగా చూస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతేగాక అంబేద్కర్ వచ్చినా రాజ్యాంగాన్ని మార్చలేరని చెప్పేదాకా వెళ్లారు. కాంగ్రెస్ 'ఇండియా' వేదిక పార్టీలే రాజ్యాంగాన్ని మారుస్తాయంటూ బిగ్గరగా గొంతు పెంచి ఎదురు దాడికి దిగారు. 'ఇండియా' వేదిక ఆరోపణ చేరవలసిన వారికి చేరింది గనకే తప్పు చేసిన వాళ్ల తరహాలో ఈ ప్రతిస్పందనకు దిగారన్నమాట.

రాజ్యాంగానికి ప్రమాదం అనే దానిలో మరో అంశం కూడా మోడీని ఇబ్బంది పెట్టింది. రాజ్యాంగాన్ని మార్చితే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లు రద్దయిపోతాయనే ఆరోపణ కూడా ఆయనకు మింగుడు పడలేదు. కొంతమంది ఓటర్ల బఅందం మీడియాతో మాట్లాడేప్పుడు ఈ విధంగా ఆందోళన వెలిబుచ్చారు. దాంతో రాజ్యాంగ మార్పు అనే ఈ అంశాన్ని మతపరమైన మలుపు తిప్పి ఎదురుదాడి చేయడానికి మోడీ ప్రయత్నించారు. రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లను మత ప్రాతిపదికన ముస్లింలకు కట్టబెట్టేందుకు 'ఇండియా' వేదిక ప్రయత్నిస్తున్నదని ఆయన వరుసగా ఒక్కో సమావేశంలో ఆరోపణలు గుప్పించారు. కర్నాటకలోనూ తెలంగాణలోనూ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని మోడీ, అమిత్ షా అదే పనిగా ప్రస్తావిస్తూ వచ్చారు. కాంగ్రెస్ 'ఇండియా' వేదిక పార్టీలూ హిందువుల రిజర్వేషన్లనే గాక ఆస్తులను కూడా లాగేసుకుని ముస్లింలకు అప్పగిస్తారని వారు ప్రచారం చేశారు.

ముస్లిం రిజర్వేషన్ల నిజమేమిటి?

కాని వాస్తవం ఏమంటే వెనకబడిన తరగతులుగా ప్రకటించబడి, ఒబిసి ప్రతిపత్తితో ముస్లిం వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లను మత ప్రాతిపదికన ఇచ్చినట్టుగా చిత్రించడం మోసపూరితమైంది. ఒబిసి ల విషయంలో రాజ్యాంగ అధికరణాలు 15(4), 16(4) కింద వెనకబడిన తరగతుల లెక్కలో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ఈ అధికరణాలు మతంతో నిమిత్తం లేకుండా వెనకబడిన తనాన్ని ఎలా నిర్వచించాలో చెబుతున్నాయి. శాస్త్రీయ అధ్యయనం ప్రకారం సామాజికంగా విద్యాపరం గా వెనకబడిన వారిగా రాష్ట్రాల బిసి కమిషన్లచే గుర్తించబడిన ముస్లిం గ్రూపులను చాలా రాష్ట్రాలలో ఒబిసి వర్గాలలో చేర్చారు. నిజానికి మోడీ స్వయంగా కొన్నేళ్ల కిందట ఎ.ఎస్.ఐ కి ఇంటర్వ్యూ ఇస్తూ 70 ముస్లిం గ్రూపులకు ఒబిసి ప్రతిపత్తి కల్పించడానికి తానే కారణమని గొప్పలు చెప్పుకున్నారు.

వాస్తవానికి మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి ముప్పు తెచ్చిపెడుతున్నదనే అభిప్రాయం ఏర్పడటం వల్లనే ప్రజలలో పెద్దభాగం ఆయనకు వ్యతిరేకంగా ఓటేయాలనే గట్టి వైఖరికి వచ్చారు. ఆ కారణంగానే ఈ ఎన్నికల ఫలితం ఎలా వుంటుందనే దానిపైన, తదనంతర పరిణామాలపైన అలజడి నెలకొన్నది. పదేండ్ల మోడీ ప్రభుత్వం అన్ని రాజ్యాంగ సంస్థలకూ వ్యవస్థలకూ ముప్పుగా పరిణమించింది. ఈ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం వ్యవహరించిన అనేక సందేహాలకు దారితీసింది. అసలు ఈ సంఘం ఎన్నికలు న్యాయంగా, స్వేచ్ఛగా నిర్వహించగలదా అనే సందేహాలు తెచ్చిపెట్టింది. ప్రధాన మంత్రి మతతత్వ భాషణలతో రెచ్చగొట్టే విధంగా ఎన్నికల ప్రచారం నడుపుతుంటే అరి కట్ట డంలో దారుణంగా విఫలమైంది. పోలైన ఓట్ల శాతం కచ్చితంగా అందించడంలోనూ విముఖత ప్రదర్శితమైంది. దీనిపై సుప్రీం కోర్టు వరకూ వెళ్లిన తర్వాత మాత్రమే కదలిక వచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడంలోనూ అన్ని విధాల వైఫల్యం కానవచ్చింది. వీటన్నిటి కారణంగానే ఎన్నికల సంఘంపై భయాలు పెరిగాయి.

కొసమెరుపులు

చివరి దశ పోలింగ్‌కు కొద్ది రోజుల ముందే మే 31న పదవీ విరమణ చేయవలసిన సైనిక దళాల ప్రధానాధికారి మనోజ్ పాండే పదవీ కాలాన్ని ప్రభుత్వం నెల రోజులపాటు పొడిగించింది. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరగని చర్య ఇది (1975లో ఒకసారి తప్ప మరే ఇతర సైనికదళ ప్రధానాధికారికీ పొడగింపు ఇచ్చింది లేదు). ఉన్నవారి పదవీ విరమణ లోపు కొత్తవారి పేరు ప్రకటించకపోతే అప్పటి వరకూ ఒక తాత్కాలిక ప్రధానాధికారిని నియమించేవారు. ప్రస్తుత సందర్భంలోనైతే కొత్త ప్రధానాధికారిని రాబోయే ప్రభుత్వం నియమించవలసి వుంటుంది. ఇప్పుడు ఇలా ఎందుకు పొడగింపు ఇచ్చారనే ఎలాంటి వివరణ కానీ ఎన్నికల సంఘం ఇందుకు అనుమతి ఇచ్చిందా అనే స్పష్టత గానీ లేవు. దాంతో ఎన్నికల అనంతర పరిస్థితిపై అన్ని రకాల ఊహాగానాలకూ ఆస్కారం ఏర్పడింది.

ఇక చివరగా చూస్తే నరేంద్ర మోడీ తనకు తానే రాజ్యాంగం పట్ల తన విధేయతను ప్రశ్నార్థకం చేసుకున్నారు. దేశానికి ప్రజలకూ సేవ చేయడం కోసం ఆ పరమాత్ముడే తనను పంపించాడంటూ ఆఖరి దశ ప్రచార ఘట్టంలో ఆయన విచిత్రమైన ప్రకటన చేశారు. తాను ఆ విధంగా నమ్ముతున్నానన్నారు. అంటే తాను దేవుడికి తప్ప మరెవరికీ జవాబు దారీ కాదని స్పష్టంగా చెప్పారన్నమాట. ఇప్పుడు పోలింగ్ ఆఖరి దశలో చివరి 48 గంటలు ఆయన కన్యాకుమారిలో వివేకానంద శిలాఖండంపై కూర్చుని ధ్యానం చేయబోతున్నారు. కనుక ఇకపై ఆయన భవిష్యత్ చర్యలు రాజ్యాంగం ప్రకారం నడుస్తాయా లేక దివ్యశక్తి ప్రపూరితంగా నిర్దేశించబడతాయా అన్నది చూడవలసిందే.

వారసుల విజయం..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి నలుగురు రాజకీయ వారసులు బరిలో నిలిచారు. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, వరంగల్ నుంచి కడియం కావ్య, నల్గొండ నుంచి రఘువీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేయగా..ఈ ముగ్గురూ ఘన విజయం సాధించారు. నాగర్ కర్నూల్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ రాములు తనయుడు భరత్ కాంగ్రెస్ చేతిలో ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ తరపున నల్గొండ నుంచి పోటీ చేసిన రఘువీర్‌రెడ్డి మాజీ మంత్రి కె జానారెడ్డి తనయుడు. ఆయన సమీప బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిపై సుమారు 5.51లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రెండు తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదే అత్యధికం. 2011లో కడప లోక్‌సభ ఉప ఎన్నికల్లో 5.43 లక్షల మెజార్టీతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గెలవగా..అంతకు మించిన మెజార్టీతో రఘువీర్‌రెడ్డి ఇప్పుడు విజయం సాధించటం విశేషం. పెద్దపల్లి పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు, మాజీ కేంద్ర మంత్రి దివంగత నేత వెంకటస్వామి మనుమడు గడ్డం వంశీకృష్ణ తన ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌పై 1.31లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. వరంగల్ నుంచి బరిలోకి దిగిన మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య తన సమీప ప్రత్యర్థి ఆరూరి రమేశ్‌పై రెండు లక్షల ఓట్లతో విజయం సాధించారు.

చంద్రబాబు, పవన్‌కు అభినందనలు : కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లకు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వలస నేతల ఓటమి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పదవీ వ్యామోహం, అధికార దాహంతో కనీస విలువలకు తిలోదకాలిచ్చే నాయకుల సంఖ్య నేటి రాజకీయాల్లో ఎక్కువగా పెరిగిపోతోంది. అయితే ఆ రకంగా విలువలను వదిలేసి.. ఎన్నికల సమయంలో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి గోడదూకిన వారిలో మెజార్టీ అభ్యర్థులను ప్రజలు ఓడించి గుణపాఠం చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు కొద్ది నెలల ముందు బీజేపీలో చేరి బరిలోకి దిగిన వలస నేతలు బీబీ పాటిల్(జహీరాబాద్), పోతుగంటి భరత్(నాగర్ కర్నూల్), శానంపూడి సైదిరెడ్డి(నల్గొండ), గోమాస శ్రీనివాస్(పెద్దపల్లి),ఆరూరి రమేశ్(వరంగల్) సీతారాంనాయక్(మహబూబాబాద్) పరాజయం పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన గడ్డం రంజిత్‌రెడ్డి(చేవెళ్ల), దానం నాగేందర్(సికింద్రాబాద్), పట్నం సునీతారెడ్డి(మల్కాజిగిరి), నీలం మధు(మెదక్) ఓటమిపాలయ్యారు. బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాగర్ కర్నూల్‌లో మూడో స్థానానికి పడిపోవటం గమనార్హం.

ఆదిలాబాద్‌లో కమలందే విజయం

- పోరాడి ఓడిన కాంగ్రెస్
- సరైన నాయకత్వం లేకున్నా.. సీతక్క ఆధ్వర్యంలో ప్రచారం
- డిపాజిట్ కోల్పోయిన బీఆర్ఎస్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ మరోసారి విజయం సాధించింది. వరుసగా రెండోసారి ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణపై బీజేపీ నుంచి బరిలో దిగిన గోడం నగేష్ 90,932ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఆత్రం సక్కు మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఈ లోక్‌సభ స్థానంలో 12,21,563 ఓట్లు పోల్ కాగా, 12మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు 4,71,220ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ 5,58,103 ఓట్లు సాధించి విజయం సాధించారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఆత్రం సక్కు కేవలం 1,36,380 ఓట్లను సాధించి డిపాజిట్ కోల్పోయారు. వివిధ పార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు ఎలాంటి ప్రభావమూ చూపించలేకపోయారు. వీరు కేవలం 10వేల ఓట్లలోపే పరిమితం కాగా, నోటాకు మాత్రం 11,743ఓట్లు రావడం విశేషం. పోస్టల్ ఓట్లలోనూ బీజేపీ అభ్యర్థి ఆధిక్యం సాధించారు. బీజేపీకి 9232ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 5183ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థికి 837ఓట్లు వచ్చాయి. ఇందులో 841ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. బీజేపీ గెలుపునకు ప్రధాన కారణం.. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నాలుగు చోట్ల ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉండటం. రెండు చోట్ల బీఆర్ఎస్, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు. అయితే, ఈ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకత్వం లేదు. మంత్రి సీతక్క బాధ్యతలు తీసుకుని కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ప్రచారం చేశారు. స్థానిక నాయకత్వం గట్టిగా లేకపోవడం కూడా కాంగ్రెస్ ఓటమికి కారణమై ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. బీజేపీకి బీఆర్ఎస్ ఓట్లు క్రాస్ అయినట్టు ప్రచారం జరుగుతోంది.

ఆధిక్యంలో రఘువీర్ రికార్డు

- 5.5లక్షల భారీ మెజార్టీతో గెలుపు
- కేవలం 4,500 ఓట్లతో బయటపడ్డ డీకే అరుణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో నల్లగొండ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి రికార్డు సృష్టించారు. బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిపై ఏకంగా 5.59,905 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రఘువీర్‌కు 7,84,337 ఓట్లు రాగా సైదిరెడ్డికి 2,24,432 ఓట్లే పోలయ్యాయి, తెలంగాణ చరిత్రలో ఇదే అత్యధిక మెజార్టీ కావడం విశేషం. మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన డీకే అరుణ 4,500 పైచిలుకు ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన వంశీచంద్ రెడ్డిపై గెలుపొందారు. అరుణకు 5,10,747 ఓట్లు రాగా వంశీకి 5,06,247 ఓట్లు పోలయ్యాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తెలంగాణలో అత్యధిక, అత్యల్ప మెజార్టీ నమోదైన నియోజక వర్గాలుగా నల్లగొండ, మహబూబాబాద్‌లు నిలిచాయి.



అటు విజయం..ఇటు పరాజయం

సొంత జిల్లాలో రేవంత్‌కు మిశ్రమ ఫలితాలు

సీఎం పరువు కాపాడిన భువనగిరి, నాగర్‌కర్నూల్

మల్కాజిగిరి, చేవెళ్లలో భారీ ఓటమి మూటగట్టుకున్న హస్తం

నవతెలంగాణబ్యూరో్-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చిన రేవంత్‌కు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కొంత ఇబ్బందికరంగా పరిణమించాయి. ఆయన ప్రతిష్టాత్మకంగా భావించిన మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో ఫలితాలు భిన్నంగా వచ్చాయి. ఆ నాలుగింటిలో కాంగ్రెస్ అభ్యర్థులు రెండింటిలో ఓడిపోయి, మరో రెండు చోట్ల విజయసాధించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఓటున్న మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో హస్తం పార్టీ ఓటమి పాలైంది. అదే విధంగా ఆయన సొంతూరున్న నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మాత్రం ఘనవిజయం సాధించింది. మొన్నటిదాకా ఆయన మల్కాజిగిరి ఎంపీగా ప్రాతినిధ్యం వచ్చారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి ముఖ్యమంత్రి అయ్యాక... ఆ ఎంపీ స్థానానికి రాజీనామా చేశారు. అయితే రేవంత్ ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్నది. ఆ ఓటమికి కారణాలేమైనా...పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని కాంగ్రెస్ ఎంపిక చేయడాన్ని మొదట్లోనే చాలా మంది వ్యతిరేకించారు. ఆమెకు సొంత నియోజకవర్గమైన చేవెళ్లను కేటాయించకుండా పక్క నియోజకవర్గమైన మల్కాజిగిరి లోక్‌సభ స్థానాన్ని కేటాయించడం పట్ల అనేక విమర్శలొచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ధీటైన నేతను బరిలో దింపకుండా రేవంత్‌రెడ్డి తొందరపాటు నిర్ణయం తీసుకున్నారనే విమర్శలున్నాయి. ఆయన ప్రాతినిధ్యం వహించిన ఆ నియోజకవర్గాన్ని దక్కించుకోలేకపోయారనే చర్చ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. దీంతోపాటు రేవంత్ ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పరిధిలో ఉంది. అక్కడ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి 50వేల మెజార్టీ ఇవ్వాలంటూ రేవంత్‌రెడ్డి అనేక సభల్లో అభ్యర్థించారు. ఎక్కువసార్లు ఆయన అక్కడ ప్రచారాన్ని నిర్వహించారు. ఆ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ కూడా బలంగా ఉన్నది. అయినప్పటికీ కాంగ్రెస్ ఎందుకు ఓడిపోయిందో అర్థం కావడం లేదని నేతలు వాపోతున్నారు. ఇక్కడ పార్టీ ఓడిపోవడం రేవంత్‌రెడ్డికి తలనొప్పిగా మారిందని వారు చెబుతున్నారు. సొంతూరున్న నాగర్‌కర్నూల్ నియోజవర్గం, ప్రతిష్టాత్మంగా తీసుకుని తన స్నేహితుడికి టిక్కెట్ ఇప్పించుకున్న భువనగిరిలో హస్తం పార్టీ హవా కొనసాగడం రేవంత్‌కు ఊరటనిచ్చింది. దీంతోపాటు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డిని పార్టీలో చేర్చుకుని చేవెళ్ల టిక్కెట్ ఇప్పించగా ,అ ది బెడిసికొట్టడం సీఎంకు మింగుడు పడటం లేదు. వీటినిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సిందే...

కొడంగల్‌లో కాంగ్రెస్‌కు మెజార్టీ

- తన బలం నిరూపించుకున్న సీఎం
- మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం మాత్రం బీజేపీదే..
- రేవంత్ నియోజకవర్గంలో ఆధిక్యత కనబరచని డీకే

నవతెలంగాణ-కొడంగల్

మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య హెూరాహెూరీ పోరు సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డీకే అరుణ 3,410 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. ఇందులోనే సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్ అసెంబ్లీ స్థానం ఉంది. ఇక్కడ కాంగ్రెస్ అధిక్యం ప్రదర్శించింది. ఈ నియోజక వర్గంలో కాంగ్రెస్‌కు సుమారు 22వేల పైచిలుకు మెజార్టీ లభించింది. మహబూబ్‌నగర్‌లో బీజేపీ గెలిచినప్పటికీ సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి తన బలాన్ని నిరూపించుకున్నారు.

మహబూబ్‌నగర్ సీఎం సొంత నియోజకవర్గం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మహబూబ్‌గర్ నుంచి చల్లా వంశీ చందర్ రెడ్డిని తొలి అభ్యర్థిగా ప్రకటించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచి రేవంత్ రెడ్డి అత్యధిక సార్లు ఆ నియోజకవర్గంలో పర్యటించారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీ కి క్రాస్ ఓటింగ్ జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారసభల్లో చెప్పుకుంటూ వచ్చారు. బహిరంగ సభలు నిర్వహించి వంశీచందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఆయా నియోజకవర్గాల్లో తగు జాగ్రత్తలు తీసుకోలేకపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి 30వేలకు పైగా మెజార్టీ సాధించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అంతకంటే ఎక్కువ మెజార్టీ ఇవ్వాలని ప్రజలను కోరారు. అయితే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 22వేల మెజార్టీ వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 8 వేల మెజార్టీ తగ్గినా బీజేపీ అభ్యర్థి డీకే అరుణ మాత్రం కొడంగల్‌లో తన ప్రభావం చూపించలేకపోయారు.

అప్పుడలా.. ఇప్పుడిలా...

(మొదటిపేజీ తరువాయి)

ఫలితాల్లో గాలికి కొట్టుకుపోయాయి. ఆయన ఛరిష్మాతోపాటు తీవ్ర అనారోగ్యంతోనూ కేసీఆర్ చేసిన బస్సు యాత్ర కూడా ఈ ఎన్నికల్లో గులాబీ పార్టీని ఎంతమాత్రం పోటీలో నిలబెట్టలేకపోయింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు... కాలికి బలపం కట్టుకుని తిరిగినా, తెలంగాణలో ఒక్కటంటే ఒక్క ఎంపీ సీటును గెలిపించుకోలేకపోవటం విస్మయకరం. ఇది నిజంగా ఆ పార్టీ స్వయంకృతాపరాధమా..? లేక 'ఎవర్నో గెలిపించేందుకు...' తమ పునాదుల్ని పెకిలించివేసుకున్న ఫలితసరిగ్గా ఆర్నెల్ల ముందు బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ చెప్పిందే శాసనం. అటు ప్రభుత్వంలోనైనా, ఇటు పార్టీలోనైనా ఆయన చెప్పిందే వేదవాక్కు. ఇదే ధోరణితో అసెంబ్లీ ఎన్నికలకు మూణ్నెల్ల ముందే ఒకేసారి 105 మంది అభ్యర్థులను ప్రకటించటం ద్వారా ఆయన అందర్నీ అవాక్కయ్యేలా చేశారు. కానీ కారు సారు అంచనాలను తలకిందులు చేస్తూ ఆ వ్యూహం బెడిసికొట్టింది. 88 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలతో రాష్ట్రాన్ని శాసించిన బీఆర్ఎస్... పదేండ్ల తర్వాత ప్రతిపక్ష హోదాలో కూర్చోవాల్సి వచ్చింది. ఊహించని ఈ పరిణామం నుంచి ఆ పార్టీ శ్రేణులు కోలుకోకముందే లోక్‌సభ ఎన్నికల రూపంలో పెద్ద సవాలే ఎదురైంది. టీఆర్ఎస్ (టీఆర్ఎస్) ఏర్పడిన 2001 నుంచి ఇప్పటి వరకూ ఎన్నడూ తగలనంత ఎదురుదెబ్బ గులాబీ దళానికి తగిలింది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అడ్రస్ మొత్తానికే గల్లంతైంది. ఒక్కరంటే ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థి కూడా గెలవకపోవటం నిజంగా ఆ పార్టీ నేతలకు మింగుడు పడని అంశమే. 'లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పని ఖతం...' అంటూ కాంగ్రెస్, బీజేపీ నేతలు వ్యాఖ్యానించిన నేపథ్యంలో... ఇప్పుడు ఆ పార్టీ తిరిగి ఎలా పుంజుకుంటుందనేది నిజంగా ప్రశ్నార్థకమే.

అదే కారణమా...?

బీఆర్ఎస్ (టీఆర్ఎస్)కు మొదటి నుంచి బలం, బలగం తెలంగాణ వాదమే. సున్నితమైన ఈ విషయంలో ఆ పార్టీ అధినేత తీసుకున్న ఒక నిర్ణయమే ఇప్పుడా పార్టీ ఓటమికి ఒక ప్రధానంగా కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే కోరికతో కేసీఆర్... తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)గా ఉన్న పార్టీ పేరును 2022లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చారు. మొదటి నుంచి ఆ పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్లు, క్రియాశీలక నేతలు, ముఖ్యంగా ఉద్యమకారులు దీన్ని జీర్ణించుకోలేకపోయారనే వాదనలు అప్పట్లోనే వినిపించాయి. ఈ కారణం వల్లే ఆర్నెల్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని క్యాడర్ 'సొంతం' చేసుకోలేదనే అభిప్రాయాలూ వెలువడ్డాయి. ఆ ఒరవడి ఇప్పుడు కూడా కొనసాగిందంటూ పలువురు నేతలు వాపోతుండటం గమనార్హం.

ప్రక్షాళనేది..?

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నిర్వహించిన వివిధ అంతర్గత సమావేశాల్లో పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేస్తామంటూ కేసీఆర్ ప్రకటించారు. 60 లక్షల సభ్యత్వమున్న బీఆర్ఎస్ నిర్మాణాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పటిష్టం చేస్తామంటూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలుమార్లు చెప్పుకొచ్చారు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. గతంలో వివిధ పార్టీల నుంచి వలసలను ప్రోత్సహించటం, అలా వచ్చిన నేతలకు ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ కీలక పదవులను అప్పగించటం ద్వారా అసలు సిసలైన నాయకులను పార్టీ అధినేత దూరం చేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపింది. కానీ ఆ తర్వాత కూడా ఈ ఒరవడికి బ్రేకులు పడకపోవటం గమనార్హం. దీంతో తీవ్ర అసంతృప్తికి, అంతకుమించిన నైరాశ్యానికి గురైన సీనియర్లు, అనుభవజ్ఞులు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పారు. వీరిలో అత్యధిక మంది అధికార పార్టీ కాంగ్రెస్ పంచన చేరగా, అక్కడ చోటు దక్కని వారు బీజేపీ గూటికి చేరిపోయారు. వీటికితోడు నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవటం, కష్టపడి పని చేసే వారికి గుర్తింపునివ్వకపోవటం కూడా కారు పార్టీకి తలనొప్పులు తెచ్చిపెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో 30 మంది అభ్యర్థులను మారిస్తే.. గెలిచేవాళ్లమని పశ్చాత్తాపడిన బీఆర్ఎస్...లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని స్థానాల్లో సీనియర్లు, సౌమ్యులు, వివాదరహితులు, అవినీతి మరకల్లేని వారిని నిలబెట్టినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఫలితాలు నిరాశపర్చాయి

- ఫినిక్స్ మాదిరి పుంజుకుంటాం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



లోక్‌సభ ఎన్నికలఫలితాలు తమ పార్టీనీ తీవ్రంగా నిరాశపరిచాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. మళ్లీ త్వరలోనే బీఆర్ఎస్ పుంజుకుంటుదని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీని స్థాపించిన 24 ఏండ్ల సుదీర్ఘప్రస్థానంలో ఎన్నో రకాల ఎత్తుపల్లాలను చూశామని గుర్తు చేశారు. అద్భుతమైన విజయాలతో పాటు అనేక ఎదురు దెబ్బలు ఎదుర్కొన్న అనుభవం తమ పార్టీకి ఉందన్నారు. బీఆర్ఎస్‌గా తమకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించటానికి మించిన గౌరవం, విజయం మరేది లేదని తెలిపారు. గతంలోనూ ఇలాంటి ఎదురుదెబ్బలు తిన్నప్పటికీ ప్రజాదరణతో బీఆర్ఎస్ పుంజుకున్న సందర్భాలెన్నో ఉన్నాయని వివరించారు. తెలంగాణను సాధించటంతో పాటు ఒక ప్రాంతీయ పార్టీగా రెండుసార్లు అద్భుతమైన మెజార్టీతో 2014లో 63 సీట్లు, 2018 లో 88 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుత శాసనసభలోనూ మూడో వంతు సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ కొనసాగుతోందని గుర్తు చేశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతోనే ఓటమి పాలయ్యామని వాపోయారు. ఫలితాలు నిరాశ కలిగించినప్పటికీ లోక్ సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారనీ, వారందరికీ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లో కుంగిపోయేది లేదనీ, ఎప్పటి లాగే ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పై తెలంగాణ ప్రయోజనాల కోసం అటు కేంద్రంపైనా పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని తెలిపారు.



తెలంగాణ టీడీపీలో సంబరం

- ఏపీ ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్
- ప్రమాణ స్వీకారానికి వెళ్లనున్న తమ్ముళ్లు
- ఇకనైనా అధ్యక్షుడిని నియమించేనా !?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి మోగించిన నేపథ్యంలో తెలంగాణలోనూ ఆ ప్రభావం కనిపిస్తున్నది. ఆ పార్టీ నాయకత్వం, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. మంగళవారం మొదటి రౌండ్ ఫలితాలు రాగానే తెలంగాణలోనూ ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు వందలాదిగా చేరుకున్నారు. బాణా సంచా కాల్చారు. స్వీట్లు పంచారు. గులాల్ చల్లుకున్నారు. జై చంద్రబాబు, జై జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. యువత, మహిళలు సంతోషంతో డ్యాన్సులు చేశారు. గత కొన్ని నెలలుగా బోసిపోయిన ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌కు ఏపీ ఫలితాలతో ఒక్కసారిగా వెలుగొచ్చినట్టయింది. దాదాపు ఆరు నెలలుగా తెలంగాణ టీడీపీకి అధ్యక్షుడే లేరు. అధినేత పట్టించుకోకపోవడంతో నియామకం జరగలేదు. పాత కార్యవర్గంతోనే అంతర్గత కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మరో రెండు నెలల్లో తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటిదాకా ఏపీ ఎన్నికల మూలంగా తీరికలేకుండా గడిపిన చంద్రబాబు, ఇక తెలంగాణ టీడీపీ గురించి ఆలోచించే పరిస్థితులు ఉన్నాయని ఆ పార్టీ తెలంగాణ నేతలు చెబుతున్నారు. శ్రేణుల్లో విశ్వాసం నింపి పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు పడతాయని ఆశిస్తున్నట్టు పొలిట్‌బ్యూరో నాయకులు నర్సింహులు, అరవిందకుమార్ గౌడ్ చెప్పారు. ఏపీ విజయోత్సవాల్లో పాల్గొనేందుకు తెలంగాణ టీడీపీ నేతలు ఇప్పటికే తరలివెళ్లారు. చంద్రబాబును కలిసి అభినందనలు, శుభాకాంక్షలు చెప్పడంతోపాటు ఈనెల తొమ్మిదిన జరిగే ప్రమాణ స్వీకారానికి తెలంగాణ నుంచి కూడా జనసమీకరణ చేసే అవకాశాలు లేకపోలేదని సమాచారం.

చంద్రబాబుకు గాలం ?

ఐదేండ్ల తర్వాత ఏపీలో అధికారంలోకి రావడం, దేశంలో కీలకపాత్ర పోషించే అవకాశం దక్కిన నేపథ్యంలో తెలుగుదేశంలో ఎనలేని ఉత్సాహం కనిపిస్తున్నది. గత ఏడాది డిసెంబరులో తెలంగాణలో పోటీచేయకుండా కాంగ్రెస్‌కు పరోక్షంగా టీడీపీ మద్దతిచ్చిన సంగతి తెలిసిందే. తద్వారా చంద్రబాబు తన శిష్యుడు రేవంత్ సీఎం కావడానికి సహకరించారనే ప్రచారం జరిగింది. అలాగే తాజాగా ఏపీలో జనసేన, బీజేపీతో కలిసి ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు మరోసారి జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించనున్నారు. ఎన్డీయే కన్వీనర్ పోస్టు ఇస్తారనే ప్రచారం ఊపందుకుంది. అయితే చంద్రబాబును 'ఇండియా' కూటమిలోకి వచ్చేలా కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని టీడీపీ నేతలు చెప్పడం గమనార్హం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా చంద్రబాబును ఇండియా బ్లాక్‌లోకి తెచ్చి బీజేపీని కేంద్రంలో అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలనే వ్యూహరచన సాగుతున్నట్టు తెలిసింది. ఈ చర్యలు ఏ మేరకు ఫలవంతమవుతాయనే సంగతి పక్కనబెడితే, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడానికి కాస్త దూకుడుగా వ్యవహరించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్టుగా సమాచారం. రేవంత్ ద్వారా రాయభారం నడిపితే చంద్రబాబు సానుకూలంగా స్పందించే అవకాశాలు ఉన్నట్టు కాంగ్రెస్ అధిష్టానం నమ్ముతున్నదని తెలిసింది. అలాగే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం ఈ విషయంలో రేవంత్‌కు సహకరిస్తారని సమాచారం. ఈ ముగ్గురు సోనియా ఆదేశాల మేరకు ఇప్పటికే అంతర్గత సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం హైదరాబాద్ గాంధీభవన్ వర్గాల్లోనూ సాగుతున్నది. మ్యాజిక్ ఫిగర్‌కు దాదాపు నలభై సీట్లు తక్కువ పడే అవకాశం ఉండటంతో ఏఐసీసీ అధిష్టానం చురుగ్గా చర్యలు చేపట్టింది. బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోవడం, ఎన్డీయే పక్షాల్లో తేడాలు వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో ఎన్నికల్లో గెలిచి ఈ ఇతర పక్షాలు, ఇండిపెండెంట్లను కలుపుకోవాలనే భావనలో ఏఐసీసీ ఉన్నట్టు తెలిసింది. చంద్రబాబుతో పాటు బిహార్ నితిష్‌కుమార్‌ను సైతం ఇండియా బ్లాక్‌లోకి లాగాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం.

కాంగ్రెస్‌దే ఉమ్మడి నల్లగొండ..

- రెండు చోట్లా హస్తందే గెలుపు
- నల్లగొండలో భారీ మెజార్టీ
- మూడో స్థానంలో బీఆర్ఎస్
- సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ నైతిక విజయం

నవతెలంగాణ- విలేకరులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటర్లు పట్టం కట్టారు. నల్లగొండ, భువనగిరి పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ముఖ్యంగా నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీరారెడ్డి అత్యధిక మెజార్టీ సాధించి దక్షిణ భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. 23 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించగా అన్ని రౌండ్లలోనూ మెజార్టీ సాధించి ముందు వరుసలో నిలిచారు. పోస్టల్ బ్యాలెట్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థికే ఎక్కువ ఓట్లు వచ్చాయి. 5,59,906 ఓట్ల మెజార్టీతో రికార్డు విజయం సాధించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండో స్థానం కోసం తీవ్రంగా పోటీ పడ్డాయి. మొదట ఐదు రౌండ్లలో బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలవగా, ఆరో రౌండ్ నుంచి 24వ రౌండ్ వరకు బీజేపీ రెండో స్థానం కొనసాగింది. ఈ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో చతికిల పడిన బీజేపీ పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం అధిక ఓట్లు సాధించి తమ పట్టును పెంచుకుంది. ప్రధానంగా బీఆర్ఎస్ ఓడిపోతుందని ప్రజల్లో విస్తృత ప్రచారం జరగడంతో బీజేపీకి క్రాస్ ఓటింగ్ జరిగినట్టు తెలుస్తోంది. బీఎస్పీ నుంచి పోటీ చేసిన అంజయ్య కంటే దళిత సమాజ్ పార్టీ నుంచి పోటీ చేసిన నందిపాటి జానయ్యకు 10 వేలకుపైగా ఓట్లు వచ్చాయి.

భువనగిరి పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి 2,22,213 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అన్ని రౌండ్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యత సాధించారు. కాంగ్రెస్‌కు బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ప్రధాన పోటీ ఇస్తారని అందరూ భావించినా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గులాబీ పార్టీకి ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో కొంతమేర పట్టు ఉన్నప్పటికీ కేవలం 2,50,000 ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితమైంది. పేద ప్రజల ఆదరణ, అభిమానంతో బరిలో నిలిచిన సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌కు 28,396 ఓట్లు వచ్చాయి. డబ్బులు ఖర్చు పెట్టకుండా పేద ప్రజల ఆదరాభిమానాలతో అన్ని ఓట్లు సాధించడం వెనుక జహంగీర్ నైతికంగా విజయం సాధించారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





నల్లగొండలో కాంగ్రెస్ రికార్డు విజయం పార్టీల వారీగా వచ్చిన ఓట్లు	
కాంగ్రెస్	7,84,337
బీజేపీ	2,24,431
బీఆర్ఎస్	2,18,417
బీఎస్పీ	7075
మెజారిటీ	5,59,906

భువనగిరి పార్లమెంటు పరిధిలో.. పార్టీల వారీగా వచ్చిన ఓట్లు ..	
కాంగ్రెస్	6,23,393
బీజేపీ	4,01,380
బీఆర్ఎస్	2,54,655
సీపీఐ(ఎం)	28,396
మెజార్టీ	2,22,013

నల్లగొండ ఖ్యాతిని మరోసారి చాటి చెప్పారు

- ఓటర్ మహాశయులకు ధన్యవాదాలు : మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి
- అభివృద్ధే లక్ష్యంగా ముందుకు.. : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్



దేశంలో నల్లగొండ జిల్లా ఖ్యాతిని ప్రజలు మరోసారి చాటిచెప్పారు.. ఓటర్ మహాశయులకు ధన్యవాదాలు అని మాజీ మంత్రి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ ఎంపీగా కుందూరు రఘువీరారెడ్డి ఘన విజయం సాధించిన నేపథ్యంలో కౌంటింగ్ సెంటర్ వద్ద మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రఘువీర్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించారన్నారు. మెజార్టీలో దేశంలోనే టాప్ 10లో రఘువీర్ రెడ్డి ఒకరిగా నిలిచారని అన్నారు. గతంలోఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్లగొండ జిల్లా నుంచి రావి నారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందారని గుర్తు చేశారు. నేడు చరిత్రను తిరగరాసి రఘువీర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం గొప్ప విషయం అన్నారు. కాంగ్రెస్‌తో కలిసి వచ్చిన సీపీఐ(ఎం), సీపీఐ, జన సమితి.. ఇతరులకు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రఘువీర్‌ని 5.50 లక్షల ఓట్ల పైచిలుకు మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భువనగిరిలో 2లక్షల పై చిలుకు మెజార్టీతో చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలిచారన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తామని చెప్పారు. మంత్రి ఉత్తమ్, తాను జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 9 నుంచి 12 ఎంపీ స్థానాలు వస్తాయనుకున్నామన్నారు. రఘువీర్‌కి ఇంత భారీ మెజార్టీ రావడంలో కాంగ్రెస్ కార్యకర్తల కష్టం వెలకట్టలేనిదని అన్నారు. ఎంపీగా గెలిచిన రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే తనకు భారీ మెజారిటీ ఇచ్చిన నల్లగొండ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిండి, బ్రాహ్మణ వెల్లంల పెండింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం పని చేస్తానని, ప్రజలు తనపై పెట్టిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అందరితో కలిసి పనిచేస్తానని చెప్పారు.

చేవెళ్లలో భారీ క్రాస్ ఓటింగ్

- కమలానికి గులాబీ ఓట్లు షిఫ్టు
- కనీస ప్రభావం చూపని బీఆర్ఎస్
- సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానాల్లోనూ వెనుకంజ

రంజిత్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా గులాబీ పంతం

- రెండింతలు పెరిగిన బీజేపీ ఓటింగ్ శాతం

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

చేవెళ్ల పార్లమెంట్‌లో బీజేపీ అనూహ్య ఫలితాలు సాధించింది. బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. అయితే కొండ విజయానికి.. ఆయన వ్యక్తిగత ఇమేజ్‌తో పాటు భారీగా క్రాస్ ఓటింగ్ జరగడం కారణమని చెప్పవచ్చు. బీఆర్ఎస్ ఓట్లు మొత్తం బీజేపీకి షిఫ్టు అయ్యాయని స్పష్టం అవుతుంది. బీఆర్ఎస్ కనీస ప్రభావం చూపలేకపోయింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా బీఆర్ఎస్ వెనుకంజలో ఉండటం గమనార్హం. అయితే ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన గడ్డం రంజిత్‌రెడ్డిని ఓడించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ను బీజేపీకి మళ్లించినట్టు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు ఈ వాదనకు ఊతమిస్తున్నాయి. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మొత్తం మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో మహేశ్వరం, రాజేందర్‌నగర్, శేరిలింగంపల్లి, చేవెళ్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాండూరు, వికారాబాద్, పరిగిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. మొత్తం 29,38,370 ఓట్లు ఉండగా ఎన్నికల్లో 16,57,107 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డికి 8,09,882 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి 6,30,985 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కి 1,78,968 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిపై 1,78,897 ఓట్లు మెజార్టీతో బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు.

తగ్గిన బీఆర్ఎస్ ఓటింగ్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల అసెంబ్లీ స్థానాల్లో గతంలో కంటే బీఆర్ఎస్ తక్కువ ఓట్లు సాధించగా.. ఆ ఓట్లు మొత్తం బీజేపీకి పడినట్టు తెలుస్తోంది. భారీగా క్రాస్ ఓటింగ్ జరిగి బీజేపీ అభ్యర్థి గెలుపునకు దోహదం చేసాయనేది విశ్లేషకుల అభిప్రాయం. మహేశ్వరం నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 1,25,578 ఓట్లు పోలవ్వగా, పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 46,653 ఓట్లు మాత్రమే వచ్చాయి. బీజేపీకి అసెంబ్లీలో 99,391 ఓట్లు రాగా పార్లమెంట్ ఎన్నికల్లో 1,50,327 ఓట్లు రావడం విశేషం. కాంగ్రెస్‌కు అసెంబ్లీలో 70,657 రాగా.. పార్లమెంట్‌లో 95,575 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్ తన ఓటింగ్ శాతం పెంచుకుంది. కానీ బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ మాత్రం భారీగా తగ్గింది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 1,21,734 ఓట్లు రాగా, పార్లమెంట్ ఎన్నికల్లో 28,529 ఓట్లతో సరిపెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ ఓట్లు కూడా ఈ సారి సాధించలేదు. ఈ ఓట్లు మొత్తం బీజేపీకి షిఫ్టు అయ్యాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో 1,57,332 ఓట్లు రాగా ప్రస్తుతం కేవలం 42,648 ఓట్లు మాత్రమే వచ్చాయి. గతంలో సాధించిన మెజార్టీ కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికల్లో 80,148 ఓట్లు రాగా, ప్రస్తుతం 1,78,256 ఓట్లు సాధించింది.

గులాబీ అధినేత ఎజెండాలో భాగమేనా..!

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడే బీఆర్ఎస్ అధినాయకత్వం ఎలాగైనా ఆయన్ను ఓడించాలని కంకణం కట్టుకుంది. తాము గెలువకపోయినా రంజిత్‌రెడ్డిని ఓడించాలని బీఆర్ఎస్ అధినాయకత్వం క్యాడర్‌కు దిశానిర్దేశం చేసింది. ప్రస్తుత ఫలితాలు చూస్తే ఇదే విషయం స్పష్టమవుతోంది. బీజేపీ అభ్యర్థి కొండ గెలుపునకు బీఆర్ఎస్ సహకరించినట్టు తేటతెల్లం అవుతోంది. గడ్డం రంజిత్‌రెడ్డిని ఓడించి.. బీఆర్ఎస్ తన పంతం నెగ్గించుకుందనే వాదనలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి.

ఎర్రగడ్డ కార్పొరేటర్ మృతి

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షాహీన్ బేగం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

హైదరాబాద్ ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన ఏఐఎంఐఎం కార్పొరేటర్ షాహీన్ బేగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. షాహీన్ బేగం 2020లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. కొన్ని రోజుల కిందట ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతిచెందారు. ఆమె కుటుంబానికి ఏఐఎంఐఎం పార్టీ సీనియర్ నేతలు సంతాపం తెలిపారు. మృతురాలి భర్త, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ షరీఫ్ ఖురేషి కూడా 2023 అక్టోబర్‌లో అనారోగ్య కారణాలతో చనిపోయారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ప్రస్తుత కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ ఇద్దరూ ఏడు నెలల వ్యవధిలోనే చనిపోవడం ఎంఐఎంకు తీరని లోటని నాయకులు, కార్యకర్తలు విచారం వ్యక్తం చేశారు.

కేసీఆర్, హరీశ్ ఇలాకాలో..కాంగ్రెస్, బీజేపీ

- రెండు చోట్లా బీఆర్ఎస్ మూడో స్థానం
- కారు కొంప ముంచిన క్రాస్ ఓటింగ్
- మెదక్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా ఓట్లు పడని వైనం
- గులాబీ ఎమ్మెల్యేలున్న చోటా అదే పరిస్థితి



మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇలాకాలోని మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ చెరోటి గెలిచాయి. బీఆర్ఎస్ రెండు సిట్టింగ్ స్థానాల్లోనూ ఘోరంగా ఓటమిపాలైంది. బీఆర్ఎస్ ఓటర్లు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం వల్లనే కారు కొంప మునిగిందని విశ్లేషకులు అంటున్నారు. పార్టీ అభ్యర్థికి కాదని బీజేపీకి ఓట్లేసిన పరిస్థితి పోలైన ఓట్లతో స్పష్టమైంది. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే ఉన్నా ఆ పార్టీ ఎంపీ అభ్యర్థికి మాత్రం బీజేపీ కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్న చోట కూడా ఆ పార్టీ ఎంపీ అభ్యర్థులకు కనీస ఓట్లు రాలేదు. పైగా రెండు చోట్లా గులాబీ పార్టీ మూడో స్థానానికే పరిమితమైంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి మాదవనేని రఘునందన్‌రావు విజయం సాధించారు. నువ్వానేనా అన్నట్టు మెదక్‌లో త్రిముఖ పోటీ జరిగినప్పటికీ చివరికి బీజేపీనే విజయం వరించింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 4,71,217 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 4,32,078 ఓట్లు వచ్చాయి. దాంతో కాంగ్రెస్‌పై బీజేపీ అభ్యర్థి 39,139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి 3,96,790 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. పోస్టల్ బ్యాలెట్లలోనూ బీజేపీకి 7440 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 4179, బీఆర్ఎస్‌కు 1540 ఓట్లు వచ్చాయి. మొదటి ఐదారు రౌండ్ల వరకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటా పోటీ ఓట్లు వచ్చాయి. ఆ రౌండ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి ఆధిక్యంలో కొనసాగారు. దాంతో రాష్ట్రమంతటా మెదక్ ఓట్ల లెక్కింపుపైనే దృష్టి మళ్లింది. ఆ తర్వాత జరిగిన రౌండ్లల్లో బీజేపీ అభ్యర్థి అనూహ్యంగా మెజార్టీలోకి వచ్చారు. అలా ప్రతి రౌండ్‌లోనూ రఘునందన్‌రావు మెజార్టీ పెరుగుతూ వచ్చింది. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి మొదట్లో లీడ్‌లో ఉండి ఆ తర్వాత ఆయన మూడో స్థానంలో ఉండిపోయింది. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మొదట్లో వెనకబడి మూడో స్థానంలో ఉండగా క్రమ క్రమంగా బీఆర్ఎస్ కంటే ముందుకు వచ్చారు. ఐదు వేల నుంచి మొదలైన బీజేపీ లీడ్ క్రమక్రమంగా పెరుగుతూ 39,139 ఓట్ల మెజార్టీతో రఘునందన్‌రావు విజయం సాధించారు. రఘునందన్‌రావు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చేతిలో ఓటమి పాలైన విషయం తెలిసిందే. వెనువెంటనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో వ్యక్తిగత సానుభూతి కూడా ఆయన గెలుపునకు పనిచేసింది. పటాన్‌చెరు, మెదక్, సిద్దిపేట లాంటి బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న చోట కూడా బీజేపీ అత్యధికంగా ఓట్లు పొందగలిగింది.

రెండు సిట్టింగ్ స్థానాల్ని కోల్పోయిన బీఆర్ఎస్

మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైనా ఓటమి పాలైంది. మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ పాతికేండ్లుగా గెలుస్తూ వచ్చింది. ఈ సారి కూడా గెలుస్తామని ఆశపెట్టుకుని గట్టిగా పనిచేసింది. ఇక్కడా అక్కడా రెండు చోట్ల కూడా ఘోరంగా ఓటమిపాలవ్వడంతో గులాబీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. కేసీఆర్, హరీశ్‌రావు ఇలాకలో బీజేపీ గెలుపొందడాన్ని ఆ పార్టీ నాయకత్వం జీర్ణించుకోలేకపోతుంది. నియోజకవర్గంలోని ఉత్తర భారతదేశం ఓటర్లు మోడీ ప్రభావంతో బీజేపీ వైపు మొగ్గుచూపినట్టు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అత్యధిక భాగం బీజేపీకే ఓట్లు పడ్డాయని విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్ఎస్‌కు అధికారం లేకపోవడం కూడా బీజేపీ వైపు మొగ్గ చేపారనే వాదనలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 14 అసెంబ్లీ స్థానాలకు గాను బీఆర్ఎస్ 8 స్థానాల్లో భారీ మెజార్టీతో గెలిచింది. ఆరు నెలల వ్యవధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం రెండు చోట్ల ఓటమిని చవిచూడటం మాత్రమేనని విశ్లేషకులు అంటున్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీకి క్రాస్ ఓటింగ్

బీఆర్ఎస్ స్వయంకృతాపరాధం వల్లనే మెదక్‌లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు దారి తీసింది. జహీరాబాద్‌లో గట్టి పోటీ ఇచ్చేలా ఓట్ల శాతాన్ని పెంచగలిగింది. మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆ పార్టీకి ఆశించిన ఓట్లు రాలేదు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఎంపీ ఎన్నికల్ని పట్టించుకోలేదని ఆ పార్టీలోనే చర్చ నడుస్తోంది. దాంతో ఆ పార్టీ నాయకత్వం బీజేపీకి పనిచేసినట్టు సమాచారం. నార్త్ ఇండియన్స్ అధికంగా ఉన్న పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే స్వయంగా సహకరించడంతో బీజేపీకి కలిసొచ్చిందనే చర్చ ఉంది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డిలోనూ బీజేపీకి ఓట్లు పెరిగాయి. బీఆర్ఎస్‌కు ఓట్లు తగ్గాయి. జహీరాబాద్ ఎంపీ పరిధిలోనూ ఇద్దరు ఎమ్మెల్యేలు, ఐదుగురు మాజీ ఎమ్మెల్యేలున్నప్పటికీ పెద్దగా పట్టించుకోకపోవడం, స్థానికేతరుడైన గాలి అనిల్‌కుమార్‌ను పోటీ చేయించడంతో గులాబీ శ్రేణులు బీజేపీ, కాంగ్రెస్‌కు క్రాస్ ఓటింగ్ చేశారు.

జహీరాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు

జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యులుగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సురేష్ షేట్కర్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌పై ఘన విజయం సాధించారు. నియోజకవర్గంలో 16,41,410 ఓట్లు ఉండగా 12,25,049 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షేట్కర్‌కు 5,23,919 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 4,76,023 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు 1,71,412 ఓట్లు మాత్రమే వచ్చాయి. దాంతో కాంగ్రెస్ అభ్యర్థి బీజేపీపై 47,896 ఓట్ల మెజార్టీ సాధించారు. 2009లో కూడా సురేష్ షేట్కర్ జహీరాబాద్ ఎంపీగా గెలిచారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చూపిన పర్ఫార్‌మెన్స్ ఎంపీ ఎన్నికల్లోనూ కనిపించింది. దాంతో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఏ ఒక్క రౌండ్‌లోనూ మెజార్టీ చూపలేకపోయారు. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నా అక్కడ ఆ పార్టీకి ఆశించిన మేర ఓట్లు రాలేదు.

4 నుంచి 8కి..

- రాష్ట్రంలో బీజేపీకి పెరిగిన ఎంపీ సీట్లు
- సిట్టింగ్ స్థానాలన్నింటిలోనూ గెలుపు
- కొత్తగా నాలుగు స్థానాల్లో పాగా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బీజేపీ ఎంపీల సంఖ్య 4 నుంచి 8కి చేరింది. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు ఇతర ముఖ్యనేతలు ప్రతి నియోజకవర్గాన్ని టచ్‌చేస్తూ డబుల్ డిజిట్ అంటూ ప్రచారం చేశారు. ప్రధాని మోడీ దాదాపు అన్ని నియోజకవర్గాలను కవర్ చేసేలా ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఉత్తరాదిన సీట్లు తగ్గుతాయనే ముందస్తు అంచనాతో తెలంగాణ, కర్నాటక, ఏపీ రాష్ట్రాలపై బీజేపీ జాతీయ నాయకత్వం ఫోకస్ పెట్టింది. పార్లమెంట్‌లో అవసరమున్న అన్ని సందర్భాల్లో ఆదుకున్న మిత్రుడు జగన్ ఓవైపు ఉన్నా.. బీజేపీ చంద్రబాబుతో పొత్తు పెట్టుకోవడానికి అదే కారణమనే చర్చ సాగిన విషయం విదితమే. తెలంగాణలో ఆ పార్టీ కీలక నేతల మధ్య ఎన్ని విభేదాలున్నప్పటికీ జాతీయ నాయకత్వం ఫోకస్‌తో కేంద్రీకరించి పనిచేశారు. అదే సమయంలో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపడం, పెద్దఎత్తున బీఆర్ఎస్ క్రాస్‌ఓటింగ్‌తో పాటు అధికారంలో ఉన్నాం ఎవరిని నిలబెట్టినా గెలుస్తామనే కాంగ్రెస్ పార్టీ ఉదాసీనత బీజేపీకి సానుకులాంశాలుగా మారాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తున్నది. దీంతో ఆశించిన మేరకు కాకపోయినా గతం కంటే ఆ పార్టీ మెరుగైన ఫలితాలను సాధించింది. నాలుగు సిట్టింగ్ స్థానాలతో పాటు అదనంగా మరో నాలుగు సీట్లలో పాగా వేసింది.

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి ఈటల రాజేందర్ 3,87,375 ఓట్ల భారీ తేడాతో ఘనవిజయం సాధించారు. బీజేపీ అభ్యర్థుల్లో ఇదే అత్యధిక మెజార్టీ. కరీంనగర్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కూడా 2,25,209 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికలతో పోలిస్తే ఆయన మెజార్టీ రెట్టింపు అయ్యింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో చివరి రౌండ్ వరకూ విజయం దోబూచులాడినప్పటికీ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ 4,500 ఓట్ల బొటాబొటి మెజార్టీతో అతికష్టం మీద గెలిచి ఊపిరి పీల్చుకున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే మెజార్టీ తగ్గినప్పటికీ కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌లో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై ఆయన 49,944 ఓట్లతో గెలుపొందారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌కుమార్ 1,09,241 ఓట్ల తేడాతో గెలిచి మరోమారు పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్నారు. గతం కంటే ఆయన మెజార్టీ పెరిగింది. గత ఎన్నికల్లో చేవెళ్ల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి చేతిలో అతి స్వల్ప తేడాతో ఓడిపోయిన కొండా విశ్వేశ్వర్‌రెడి ఈ సారి గెలుపుబాట పట్టారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అదే రంజిత్‌రెడ్డిపై 1,66,037 ఓట్ల భారీ తేడాతో ఘనవిజయం సాధించారు. ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపీ బాపూరావుపై వ్యతిరేకత నెలకొన్న నేపథ్యంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి బీఆర్ఎస్ నుంచి మాజీ ఎంపీ నగేశ్‌ను పార్టీలో చేర్చుకుని బీజేపీ సక్సెస్ అయ్యింది. మంత్రి సీతక్క అక్కడే తిష్టవేసి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

అక్కడ అంతిమంగా బీజేపీ అభ్యర్థి నగేశ్ 90,652 ఓట్లతో గెలిచి మరోమారు లోక్‌సభలో అడుగు పెట్టబోతున్నారు. వకీల్‌సాబ్ రఘునందన్‌రావు తొలిసారి లోక్‌సభలో అడుగు పెట్టబోతున్నాడు. ఆయన మెదక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై 39,139 ఓట్లతో గెలుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావు ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నలుగురూ ఇప్పుడు గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు.

మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌కు నిరాశ

- సీఎం సొంత జిల్లాలో ఓటమి.. బీజేపీ అభ్యర్థి డికె.అరుణ విజయం
- నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి గెలుపు

నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పార్లమెంట్ నియోజకవర్గాల ఫలితాల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కో స్థానం గెలుపొందాయి. బీఆర్ఎస్ ఖాతా తెరవలేదు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓడిపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు నిరాశతో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే కాంగ్రెస్ ఓడిపోవడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. అభ్యర్థి ప్రకటన నుంచి అనేక ప్రచార సభల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుపై జరుగుతున్న కుట్రను సీఎం రేవంత్‌రెడ్డి తెలియజేసినా ఆ పార్టీ నేతలు సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో బీజేపీ అభ్యర్థి డికె.అరుణ విజయం సాధించారు. బొటాబోటీ మెజార్టీతో గెలిచినా.. మెజార్టీ ఎమ్మెల్యేలు ఉన్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోవడం గమనార్హం. మహబూబ్‌రగర్ పార్లమెంటులో మొత్తం ఓటర్లు 16లక్షల 82 వేల 470 మంది ఉన్నారు. 12 లక్షల 82వేల 470 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు 5,06,747 ఓట్లు, కాంగ్రెస్ నుంచి వంశీచంద్‌రెడ్డికి 5,03,111 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నెశ్రీనివాస్‌రెడ్డికి 1,54,792 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డీకే అరుణ 3636 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి క్రాస్ అయినట్టు ఆ పార్టీ అభ్యర్థికి వచ్చిన ఓట్లను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకున్న బీఆర్ఎస్ ఓటింగ్‌ను తమవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ ఫెయిలైంది.నాగర్‌కర్నూల్ పార్లమెంటులో మొత్తం ఓటర్లు 17లక్షల 38 వేల 254 మంది ఉన్నారు. అందులో 12 లక్షల 67వేల 471 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి 4లక్షల 65వేల 072 ఓట్లు వచ్చాయి.

కరీంనగర్‌లో మళ్లీ 'బండి'

- రెండుసార్లూ కలిసొచ్చిన రెండు ప్రధాన పార్టీల క్రాస్ ఓటింగ్
- 2019లో కాంగ్రెస్, ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి

కరీంనగర్ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ మరోమారు విజయం అందుకున్నారు. వరుసగా రెండు సార్లు విజయాన్ని అందుకున్న ఆయనకు గతం కంటే ఈసారి మెజార్టీ పెరగడం గమనార్హం. ఇక్కడి ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నెలకొన్న వైరం.. రెండుసార్లు ఆయనకు విజయాన్ని కట్టబెట్టింది. ఎన్నికల ప్రారంభం నుంచి మూడు ప్రధానపార్టీలు హోరాహోరీగా ప్రచారాన్ని నిర్వహించినా.. చివరి క్షణాల్లో పోలింగ్ నాటికి పరిణామాలు తారుమారవడం గమనార్హం. 2019లో బీఆర్ఎస్‌ను ఓడించాలని కాంగ్రెస్, 2024లో కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ శ్రేణులు చేసిన క్రాస్ ఓటింగ్ ఫలితమే సంజయ్ గెలుపు నల్లేరు మీద నడకలా సాగిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.కరీంనగర్ ఓటర్లు ఎప్పుడూ విభిన్న తీర్పునే ఇచ్చారు. ఇక్కడి ఎంపీలను రెండోమారు ఎన్నుకున్న దాఖలాలు లేవు. అయితే 2019 ఎన్నికల నుంచి మాత్రం ఇక్కడి రాజకీయ పరిస్థితులు, రెండు ప్రధాన పార్టీల మధ్య వైరం బీజేపీ అభ్యర్థి సంజయ్‌ని రెండుసార్లు గెలిపించాయి. 2019 ఎన్నికల నాటి పరిస్థితులను ఓసారి పరిశీలిస్తే.. అంతకంటే ఆర్నెళ్ల కిందట ముందస్తు ఎన్నికలకు పోయి రాష్ట్రంలో భారీ మెజార్టీ సీట్లు సాధించి బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చింది. 2014, 2018 రెండు ఎన్నికల్లోనూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలనూ క్లీన్ స్వీప్ చేస్తూ వచ్చింది. దాంతో అసెంబ్లీ ఎన్నికల తరువాత ఆర్నెళ్లకే వచ్చిన 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎలాగైనా ఓడించాలని కాంగ్రెస్ కంకణం కట్టుకుంది. ఆ సమయంలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్‌కు 4,08,768 ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 1,79,258 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దాదాపు 60శాతం కాంగ్రెస్ ఓటింగ్ అంతా క్రాస్ ఓటింగ్ రూపంలో బీజేపీకి మళ్లింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నడూ కనీసం ఖాతా తెరవని బీజేపీ.. ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కి ఏకంగా 4,98,276ఓట్లు పోలై 89, 508 ఓట్ల మెజార్టీతో గెలిచింది. ఇప్పుడు 2019 సీన్ మళ్లీ రిపీట్ అయిందనే చెప్పొచ్చు. అయితే, గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి క్రాస్ ఓటింగ్ సంజయ్‌కి కలిసొస్తే.. ఈసారి బీఆర్ఎస్ నుంచి వచ్చిన క్రాస్ ఓటింగ్ విజయాన్ని కట్టబెట్టింది. అందుకు మొన్నటి అసెంబ్లీలో ఆయా పార్టీలు సాధిం చిన మొత్తం ఓట్లు.. ఇప్పుడు పార్లమెంట్‌లో పోలైన ఓట్ల తేడానే అద్దం పడుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి కాంగ్రెస్‌కు 5,12,352ఓట్లు రాగా నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ పార్టీకి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి 5,17,601ఓట్లు రాగా.. మూడు స్థానాల్లో గెలిచింది. బీజేపీ ఏ ఒక్క స్థానం లోనూ ఖాతా తెరవకపోగా.. ఏడు సెగ్మెంట్లలో కలిపి 2,50,400ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే, సరిగ్గా ఆర్నెళ్ల తరువాత జరిగిన పార్లమెంట్ పోలింగ్‌లో ఆయా ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల తేడాను చూస్తే ఈసారి బీఆర్ఎస్ నుంచి బీజేపీకి క్రాస్ ఓటింగ్ జరిగినట్టు స్పష్టమవుతోంది. ఈ ఎన్నికల్లో ఏకంగా 5,85,116ఓట్లు సాధించి.. 2,25,209ఓట్ల మెజార్టీతో సంజయ్ మరోమారు విజయం సాధించారు. అయితే నలుగురు ఎమ్మెల్యేలు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం వంటి పరిస్థితుల్లో అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో పని చేసినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లూ సాధించకపోగా 3,59,907ఓట్లు మాత్రమే సాధించింది. ఇదే సమయంలో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని భావించిన బీఆర్ఎస్ చివరి నిమిషంలో పోలింగ్ సమయానికి చేతులెత్తేసిందిజ ఈ పార్టీ అసెంబ్లీ పోరులో సాధించిన 5,17,601ఓట్లలో 2,82,163 ఓట్లు మాత్రమే సాధించి మూడోస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను పార్లమెంట్‌లో ఓడించాలని భావించిన క్షేత్రస్థాయి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున బీజేపీకి క్రాస్‌ఓటింగ్ చేయించారన్న విమర్శలకు ఈ ఎన్నికల ఫలితాలు అద్దం పడుతుండటం గమనార్హం.

దలాల్ స్ట్రీట్ అల్లకల్లోలం



ముంబయి : దలాల్ స్ట్రీట్‌లో అల్లకల్లోలం చోటు చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను చేరకపోవడం మార్కెట్లను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ నేపథ్యంలోనే బేర్ పంజాతో మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ 4300 పాయింట్ల పైగా పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే ఎన్నికల ఫలితాల వేళ అత్యంత భారీ నష్టాలతో ముగియడం ఇదే తొలిసారి. ఉదయం ప్రారంభం నుంచే మార్కెట్లు నేల చూపులు చూశాయి. ఎన్నికల ఫలితాలు కొనసాగుతున్న క్రమంలో మార్కెట్లు మరింత ఎరుపెక్క సాగాయి. అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఏ సమయంలోనూ సూచీల పతనం ఆగలేదు. ఓ దశలో సెన్సెక్స్ ఆరు శాతం పైగా క్షీణించడంతో ఇన్వెస్టర్లు రూ.45లక్షల కోట్ల విలువ కోల్పోయారు. సెన్సెక్స్ ఉదయం 2,000 పాయింట్లకు పైగా నష్టంతో 76,286 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రికార్డు స్థాయిలో 6,200 పాయింట్ల పైగా క్షీణించి 70,234 వద్ద కనిష్టానికి దిగజారింది. తుదకు 4,390 పాయింట్లు లేదా 5.74 శాతం పతనంతో 72,079కు పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 1,379 పాయింట్లు లేదా 5.93 శాతం నష్టంతో 21,884 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో దాదాపు 1,900 పాయింట్ల మేర పతనమై 21,281 కనిష్టానికి పడిపోయింది. ఫలితం చూస్తుండగానే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ 29.9 లక్షల కోట్లు హరించుకుపోయి.. రూ.39.6 లక్షల కోట్లకు పరిమితమయ్యింది.

3,340 స్టాక్స్ 25 శాతం క్షీణత

సెన్సెక్స్-30 సూచీలో ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, పవర్‌గ్రిడ్, ఎల్అండ్‌టీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ సూచీలు 6 శాతం నుంచి 15 శాతం వరకు పతనమయ్యాయి. హెచ్‌యూఎల్, నెస్లే ఇండియా, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా షేర్లు మాత్రమే లాభాల్లో స్థిరపడ్డాయి. బీఎస్ఈలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు సైతం ఇంట్రాడే ట్రేడింగ్‌లో 12 శాతం వరకు నష్టపోగా.. తుదకు 8 శాతం పతనంతో ముగిశాయి. బీఎస్ఇలో 3,340 స్టాక్స్ ఏకంగా 25 శాతం మేర క్షీణించాయి. కేవలం 498 స్టాక్స్ మాత్రమే స్వల్ప లాభాలను నమోదు చేశాయి. 694 స్టాక్స్ లోహర సర్క్యూట్‌ను తాకాగా.. 292 స్టాక్స్ 52 వారాల కనిష్టానికి దిగజారగా.. మరో 100 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి. అన్ని రంగాలు నష్టాలు చవి చూశాయి. నిఫ్టీలో బ్యాంకింగ్ సూచీ 8 శాతం, రియాల్టీ 9.6 శాతం, బ్యాంకింగ్ 15 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 11.8 శాతం, లోహ సూచీ 10.6 శాతం చొప్పున క్షీణించాయి.

బీజేపీ అనుకూల మీడియా సంస్థలు, ఏజెన్సీల ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వాస్తవ ఫలితాలకు, ప్రజాభిప్రాయానికి భిన్నంగా ఉండటం మార్కెట్లలో ఆందోళనలు రేపాయని బ్రోకర్లు పేర్కొన్నారు. ఎన్డీఏకు 350 మేర స్థానాలు రావొచ్చనే అంచనాలు వాస్తవ రూపంలో 300 కూడా దాటకపోయే సారికి అమ్మకాల ఒత్తిడితో సూచీలు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయని విశ్లేషించారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు మించి ఇండియా కూటమి మెరుగైన ఫలితాలను సాధించడం విశేషం.

కుప్పకూలిన అదానీ, అంబానీ స్టాక్స్

మార్కెట్ల కల్లోలంలో అదానీ, అంబానీ స్టాక్స్ కుప్పకూలాయి. అదానీ గ్రూపులోని కీలక కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ 19.62 శాతం పతనమై రూ.2,930కి పడిపోగా.. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ స్టాక్ 21 శాతం నష్టపోయి రూ.1,251 వద్ద పరిమితమయ్యింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ 7.5 శాతం పతనమయ్యింది. రిలయన్స్ సూచీల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్ల సంపద రూ.1.27 లక్షలు తుడుచుకు పెట్టుకుపోయింది. జూన్ 3న బీఎస్ఈలో రిల్ షేర్ రూ.3,029కు చేరి.. 20.44 లక్షల కోట్ల మార్కెట్ విలువ నమోదు చేసింది. తాజాగా ఇది రూ.18.99 లక్షల కోట్లకు పడిపోయింది.

కంపెనీ	పతనం (శాతాల్లో)
అదానీ పోర్ట్స్ అండ్ సెజ్	21.40
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	20
అదానీ ఎంటర్‌ప్రైజెస్	19.07
అదానీ పవర్	17.55
అంబుజా సిమెంట్స్	16.10
అదానీ టోటల్ గ్యాస్	18.53
అదానీ గ్రీన్ ఎనర్జీ	19.43
ఎన్‌డీటీవీ	19.25
ఏసీసీ	15.01
అదానీ విల్మర్	9.99

ఏటీఎం నుంచి రూ. 24,92,600 అపహరణ

ఏటీఎం డోర్ కత్తిరించి చోరీ

నవతెలంగాణ-బాల్కొండ

ఏటీఎంను కత్తిరించి అందులోని రూ.24,92,600 నగదును దోచేసిన ఘటన బాల్కొండలో జరిగింది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారిపై ఉన్న ఎస్బీఐ ఏటీఎం వద్ద సోమవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన చోటుచేసుకుంది. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి ఒక తెల్లని కారులో వచ్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. ఏసీపీ బస్వారెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి దాటాక 2.30 గంటల మధ్య ఒక కారు ఏటీఎం కేంద్రం వద్దకు వచ్చి ఆగింది. అందులో నుంచి ఒక వ్యక్తి దిగి ఏటీఎం దగ్గరకు వచ్చి సీసీ కెమెరాకు బ్లాక్ పెయింట్స్ స్ప్రే చేశాడు. మరో వ్యక్తితో కలిసి ఏటీఎంలోకి గ్యాస్ కట్టర్ తీసుకెళ్లి ఏటీఎం డోర్ కత్తిరించారు. అనంతరం ఏటీఎం బాక్స్‌లోని నగదును దొంగిలించారు. ఇదంతా కేవలం 9 నిమిషాల్లోనే జరిగినట్టు ఏటీఎం వద్ద ఉన్న మరో సీసీ కెమెరా ద్వారా పోలీసులు గుర్తించారు. ఏటీఎం ఛానల్ మేనేజర్ అవధూత నితిన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు బాల్కొండ ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

చిరస్మరణీయుడు రావి నారాయణరెడ్డి

- 118వ జయంతి సభలో సీపీఐ నేతలు
- తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-బంజారాహిల్స్

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని విశ్వమే విస్తుపోయేలా నడిపిన విప్లవవీరుడు, నేటికీ తెలంగాణ ప్రజల మనసులో చిరస్మరణీయుడు రావి నారాయణరెడ్డి అని సీపీఐ నేతలు అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ భవన్, ఆర్.ఎన్.ఆర్ ఆడిటోరియంలో మంగళవారం సీపీఐ నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సాయుధ పోరాట యోధులు మఖ్దూమ్ మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి తదితరులతో కలసి రావి నారాయణరెడ్డి నిజాం వెన్నులో వణుకు పుట్టించారని గుర్తు చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకోకపోవడం, రాష్ట్ర గేయంలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఒక జ్ఞాపిక లేకపోవడం బాధాకరమన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణలోనే కాకుండా రావి నారాయణరెడ్డి పేరు దేశమంతా మార్మోగిందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో రావి నారాయణరెడ్డి వంటి వీరుల చరిత్ర ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో సాయుధ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. రావి నారాయణరెడ్డి ఒక వ్యక్తి కాదు.. ఒక శక్తి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రావి నారాయణరెడ్డి త్యాగాలు రానున్న తరాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈటి. నరసింహ, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చెన్నకేశవులు, బి.స్టాలిన్, ట్రస్ట్ సభ్యులు దితరులు పాల్గొన్నారు.

సొంతంగా 8 సీట్లు సాధించడం గొప్పపరిణామం

- ఆదరించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో సొంతంగా 8 సీట్లు గెలవడం గొప్ప పరిణామమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గెలిచిన చోటా, మిగతా స్థానాల్లోనూ తమ పార్టీకి గణనీయమైన స్థాయిలో ఓటింగ్ శాతం పెరిగిందని చెప్పారు. ప్రధాని మోడీపైనా, బీజేపీపైనా ప్రజలు విశ్వాసం ఉంచటం వల్లనే ఈ విజయం సాధ్యమైందన్నారు. బీజేపీ అభ్యర్థులను ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల్లో నిరాశ నిస్పృహ మొదలైందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని హామీనిచ్చారు. బీఆర్ఎస్ కంచుకోట అయిన మెదక్ కోటను బద్దలు కొట్టి దక్కించుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో 50 శాతం సీట్లు కూడా రాలేదనీ, దాన్ని ఏవిధంగా రెఫరెండంగా తీసుకుంటారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఫేక్ వీడియోలు చేసి ప్రజలను రెచ్చగొడుతున్నదని ఆరోపించారు. తాము అనుకున్నదాని కంటే తక్కువ సీట్లు వచ్చాయనీ, దీనిపై సమీక్షించుకుంటామని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రజల్లోకి మరింత వెళ్లడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. మండుటెండలను లెక్కచేయకుండా నిర్విరామంగా కష్టపడి పనిచేసిన బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. అభివృద్ధి విషయంలో నిర్మాణాత్మకంగా ముందుకెళ్తామని చెప్పారు.

అక్కడలా.. ఇక్కడిలా...

- ఉత్తర తెలంగాణలో బీజేపీ..

దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ హవా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలో ఒక చిత్రమైన రాజకీయ వాతావరణానికి తెరతీశాయి. ఈ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో ఒక రకమైన ఫలితాలొస్తే, దక్షిణ తెలంగాణలో మరో రకమైన రిజల్ట్స్ వచ్చాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, చేవెళ్లతోపాటు సికింద్రాబాద్, మల్కాజ్‌గిరిలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందగా, అదే ఉత్తర తెలంగాణగా పరిగణించే పెద్దపల్లి నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ జయకేతనం ఎగరేశారు. ఇక దక్షిణ తెలంగాణలో చూస్తే మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, నాగర్‌కర్నూల్‌తోపాటు జహీరాబాద్‌లో కాంగ్రెస్ గెలిస్తే, మహబూబ్‌నగర్‌లో మాత్రం బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపొందటం గమనార్హం.

అయ్యో మాధవిలతా..ఎంత పనాయే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మాధవిలత. హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి. ఆమె బీజేపీలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లోనూ హాట్ టాఫిక్. ఎవరైనా ఒక పార్టీలో చేరిన తర్వాత టికెట్టు పొందుతారు. ఆమె మాత్రం పార్టీలో చేరకముందే బీజేపీ టికెట్టు దక్కించుకున్నారు. ఆ తర్వాతనే కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ జాతీయ నాయకత్వం అయితే పాతబస్తీలో ఎంఐఎంపై ఎక్కుపెట్టిన బాణం అన్నట్టుగా ఆమె పేరును ప్రచారంలో పెట్టింది. ప్రచార సమయంలోనూ ఎంఐఎంపైకి బాణం ఎక్కుపెడుతున్నట్టు ఫోజులిచ్చిన మాధవీలత మీడియాలో చర్చనీయాంశంగా మారారు. పొలిటికల్ జోకర్‌గా ప్రాచుర్యం పొందారు. తన ప్రసంగాల్లోనూ ఎంఐఎంపై విమర్శనాస్త్రాలు తీవ్రస్థాయిలో ఎక్కుపెట్టారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార పర్వంలో ఓవరాక్షన్‌తో అందర్నీ విస్మయపరిచారు. ఆమె ఆర్భాటాలు, ప్రచార హడావిడి సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. యూట్యూబ్‌ఛానళ్ల ఆమె వెంట పరుగులు పెడుతూ తెగ హడావిడి చేస్తూ హైదరాబాద్‌లో గెలువబోతున్నట్టు పబ్లిసిటీ ఇచ్చేయి. ఆ దెబ్బకు జరగరాని నష్టం ఏమైనా జరిగితే ఇబ్బంది అని ఎంఐఎం పార్టీ కూడా అప్రమత్తమైంది. పోలింగ్ శాతం పెరిగేలా జాగ్రత్తపడింది. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో ముస్లిం మహిళలు ధరించే హిజాబ్‌ను మాధవిలత తొలగించి చూడటం వివాదాస్పదమైన విషయం విదితమే. ఎన్నికలు అయిపోయాయి. ఆ తర్వాత ఆమె సైలెంట్ అయిపోయారు. మంగళవారం ఫలితాలు వెలువడ్డాయి. మళ్లీ హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీనే ఘన విజయం సాధించారు. ద్వితీయ స్థానంలో నిలిచారనే పేరేగానీ కనీసం ఓవైసీకి ఆమె పోటీకూడా ఇవ్వలేకపోయారు. ఓవైసీకి 2014లో 2,02,454, 2019లో 2,82,187 ఓట్ల మెజార్టీ వస్తే తాజా ఫలితాల్లో అది కాస్తా 3,38,087 ఓట్లకు పెరగడం గమనార్హం.

సీటు నిలబెట్టుకున్న కిషన్ రెడ్డి

- గట్టి పోటీనిచ్చిన దానం నాగేందర్
- ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్ వారే.. మూడో స్థానంలో ఆ పార్టీ అభ్యర్థి!



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం, పోలింగ్, కౌంటింగ్ వరకు అందరిలోనూ సికింద్రాబాద్ నియోజవర్గంపై ఎంతో ఆసక్తి నెలకొంది. ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ ప్రధాన పార్టీల్లో చర్చ జరిగింది. ఎవరికి వారు తామే విజయం సాధించబోతున్నట్టు ప్రకటించారు. చివరికి సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని కిషన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. బీజేపీ నుంచి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ నుంచి సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ పోటీలో నిలిచారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య హోరాహోరీ పోటీ నడిచింది. అయితే, కిషన్ రెడ్డికి మొత్తంగా 4,73,012 ఓట్లు పోలవగా.. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 4,23,068 ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు 1,29,586 ఓట్లు పోలయ్యాయి. చివరి వరకు కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గట్టి పోటీనిచ్చారు. చివరికి 49 వేల మెజార్టీతో రెండోసారి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధించారు. దానం నాగేందర్ ప్రచారాన్ని అందరికంటే ఆలస్యంగా ప్రారంభించారు. ఆయన పోటీ చేయబోరని, వేరే వారు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరగడంతో కాంగ్రెస్ పార్టీలో కొంత గందరగోళానికి దారితీసింది. ప్రచారంలో ముందంజలో ఉంటే మరోరకంగా ఉండేదేమోనని విశ్లేషకులు అంటున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో ముషీరాబాద్, అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, నాంపల్లి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాలున్నాయి.

2019లో కిషన్‌రెడ్డి బీజేపీ ఎంపీగా గెలిచి.. కేంద్రంలో నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో మంత్రి పదవి దక్కించుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగానూ బాధ్యతలు చేపట్టారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లోనూ మరోసారి కిషన్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ప్రస్తుతం సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా.. దానం నాగేందర్ ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న విషయం తెలిసిందే. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యూహాత్మకంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలను బరిలోకి దింపాయి. మూడు పార్టీల అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. నాంపల్లి స్థానంలో మాత్రం ఎంఐఎం అభ్యర్థి గెలుపొందారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ 46.49 శాతం పోలింగ్ నమోదు కాగా.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 50.55 శాతం పోలింగ్ నమోదైంది. మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానంలో 49.04 శాతం ఓటింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే సికింద్రాబాద్‌లో ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. మొత్తంగా రాష్ట్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్.. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌ల్లో ఎమ్మెల్యేలు ఉండి బీఆర్ఎస్ సికింద్రాబాద్‌లో గెలవకపోవడంపై చర్చనీయాంశంగా మారింది.

అక్కడ చెల్లని రూపాయి...ఇక్కడ చెల్లింది

- ఎమ్మెల్యేలుగా ఓడి... ఎంపీలుగా గెలిచిన నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అక్కడ చెల్లని రూపాయి... ఇక్కడ చెల్లుతుందా? అని ఎవరైనా అడిగితే...అవును చెల్లుతుంది అనే చెప్పాలేమో! ఎమ్మెల్యేలుగా పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులు, ఇప్పుడు ఏకంగా ఎంపీలుగా ఎన్నికై చరిత్ర సృష్టిస్తున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కూడా గతంలో కొడంగల్ ఎమ్మెల్యేగా పోటీచేసి, ఓడిపోయి, మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే సీన్ మల్కాజ్‌గిరి ఎంపీ స్థానంలో మళ్లీ రిపీట్ అయ్యింది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల నుంచి పోటీచేసి, రెండుచోట్లా ఓడిపోయిన ఈటల రాజేందర్...తాజాగా మల్కాజ్‌గిరి ఎంపీగా 2.8 లక్షల మెజారిటీతో ఘన విజయం సాధించారు. అలాగే కరీంనగర్ ఎంపీగా ఉండి, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసిన బండి సంజయ్, బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో ఓడిపోయారు. కానీ తాజా ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా మరోసారి 2.12 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక నిజామాబాద్ ఎంపీగా ఉన్న ధర్మపురి అర్వింద్ కూడా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి, బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ చేతిలో 10,300 ఓట్ల తేడాతో ఓడిపోయారు. కానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అదే నిజామాబాద్ ఎంపీ స్థానాన్ని 1.13 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆయనకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధర్మపురి అర్వింద్ చేతిలో ఓడిపోయారు. ఇక దుబ్బాక ఉప ఎన్నికలో విజయం సాధించి, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా అదే నియోజకవర్గం నుంచి ఓటమిపాలైన రఘునందన్‌రావు, ఇప్పటి ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఈ స్థానం నుంచి ఎంపీగా పోటీచేసి మూడోస్థానంలో నిలిచారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావు సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఆయన ఇక్కడి పోటీలో మూడోస్థానంలో నిలిచారు. ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీజేపీ అభ్యర్థి జీ కిషన్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. దానం నాగేందర్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇలా సిట్టింగ్ స్థానాల్లో ఉంటూ, ఓటమిపాలైన నేతలు కొందరైతే, ఓడి గెలిచిన నేతలు మరికొందరు. అందుకే చిల్లు కాసులు కూడా ఎక్కడోచోట చెల్లుబాటవుతాయంటే ఇదేనేమో!.

అటొకరు...ఇటొకరు

- ఎంపీలుగా ఇద్దరు మహిళలు ఎన్నిక



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంనుంచి ఇద్దరు మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యారు. వారిలో ఒకరు రాష్ట్రంలో అధికారపార్టీ కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, మరొకరు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి చెందిన వారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి అతి కష్టం మీద, తక్కువ మెజారిటీతో బీజేపీ అభ్యర్థిగా సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి డీకే అరుణ విజయం సాధించారు. ఆమెకు కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గట్టిపోటీ ఇచ్చారు. మరో మహిళా ఎంపీ వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన కడియం కావ్య. పూర్తిగా రాజకీయాలకు కొత్త. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు కడియం శ్రీహరి కుమార్తె. ఆమెకు అదే నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా టిక్కెట్ ఇచ్చినా, దాన్ని తిరస్కరించి, కాంగ్రెస్ అభ్యర్థిగా అక్కడి నుంచే పోటీలోకి దిగారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌పై ఆమె 2 లక్షలకు పైగా మెజారిటీతో విజయం సాధించారు.

ఓడిన మహిళలు...

హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన విరించి ఇంటర్నేషనల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యజమానురాలు మాధవీలత ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతిలో 3.25 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. పక్కా హిందుత్వ అజెండాతో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తూ ఆమె పాతబస్తీలో ప్రచారం చేసిన విషయం తెలిసిందే. ఒక సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేసిన మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పట్నం సునీత మహేందర్‌రెడ్డి ఏ దశలోనూ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. ఆమె దాదాపు 3.8 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన మాలోతు కవిత కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ చేతిలో 3.44 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ బీజేపీ అభ్యర్థి నగేష్ చేతిలో దాదాపు 84 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

ప్రజలకు, ప్రజాస్వామ్యానికి జేజేలు



చావు తప్పి కన్ను లొట్టబోయిన బీజేపీ

- ఎన్డీయే కూటమి నుంచి చంద్రబాబు బయటకు రావాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని ప్రజలు, ప్రజాస్వామ్యానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు జేజేలు పలికారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయం చావు తప్పి కన్ను లొట్టబోయినట్టుగా ఉందని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి మరింత బలపడితే దుష్టపాలన నుంచి భారత్‌కు విముక్తి లభించేదని అన్నారు. ఎన్డీయే కన్వీనర్‌గా చంద్రబాబు ఉండాలంటూ ప్రచారం జరుగుతున్నదని చెప్పారు. దేశం కోసం, ప్రజల కోసం ఆలోచించి ఆయన మంచి నిర్ణయం తీసుకోవాలనీ, ఎన్డీయూ కూటమి నుంచి బయటకు రావాలని సూచించారు. అనివార్య పరిస్థితుల్లోనే ఎన్డీయేలో టీడీపీ కలిసిందని గుర్తు చేశారు. బీజేపీకి పూర్తి మెజార్టీ రానందున ఎన్డీయే ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉంటుందని చెప్పలేమన్నారు. నితీశ్ ఎన్డీయేలోనే కొనసాగుతారని అనుకోలేమని అన్నారు. తెలంగాణలో బీజేపీకి ఎనిమిది, కాంగ్రెస్‌కు ఎనిమిది సీట్లు వచ్చాయన్నారు. ఇది బీజేపీ బలం కాదనీ, వ్యక్తులను చూసి గెలిపించారని చెప్పారు. బీజేపీకి 35.08 శాతం, కాంగ్రెస్‌కు 40.10 శాతం, బీఆర్ఎస్‌కు 16.68 శాతం ఓట్లు వచ్చాయని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్లు, పార్లమెంటు ఎన్నికల్లో ఎటుపోయాయని ప్రశ్నించారు.

కమ్యూనిస్టులు బలంగా ఉన్నచోట్ల కాంగ్రెస్ గెలవడం సంతోషకరమని అన్నారు. సంకీర్ణ రాజకీయాల్లో మిత్రపక్షాలతో కాంగ్రెస్ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కేసీఆర్ ఓటమికి గల కారణాలే జగన్ ఓటమికి కూడా దారితీశాయని చెప్పారు. ఏపీ ఫలితాల్లో రియల్ హీరో పవన్ కళ్యాణ్ అని అన్నారు. అహంకారం, అహంభావం అనేవి ప్రజాస్వామ్యంలో నడవబోవన్నారు. మోడీ, కేసీఆర్, జగన్‌ది అదే భావజాలమని విమర్శించారు. అభివృద్ధి లేని సంక్షేమ పథకాల పేరుతో ఎక్కువకాలం పాలన సాగించలేరని చెప్పారు. డబ్బులు ఎంత పంచినా, ఎన్ని ప్రలోభాలకు గురిచేసి ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని అన్నారు. ఏపీలో జగన్ రౌడీరాజ్యం సాగించారనీ, రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోవాలని సూచించారు.

ఎగ్జిట్‌పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు : చాడ

ఎగ్జిట్‌పోల్స్‌కు భిన్నంగా పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వచ్చాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి చెప్పారు. ప్రజలు వాటిని తారుమారు చేశారని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు మోడీ చేయని జిమ్మిక్కు లేదన్నారు. నియంతృత్వ పోకడలు, అహంకారాన్ని ప్రజలు తిరస్కరిస్తారని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆయన పాలన సాగించారని అన్నారు. ప్రతిపక్షాల్లేని పాలనను మోడీ కోరుకున్నారని విమర్శించారు. కేసీఆర్ కూడా అదే కోరుకున్నారనీ, చివరికి ఆయనే లేకుండా పోయారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం పనిచేయాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు.

ఏపీలో జగన్ స్వయంకృతాపరాధం వల్లే ఓడిపోయారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చంద్రబాబు సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, ఎన్ బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషానికి, బుల్డోజర్ రాజకీయాలకు చెక్

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో మత విద్వేషానికి, బుల్డోజర్ రాజకీయాలకు ప్రజలు చెక్ పెట్టారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగం, అవినీతి, కార్పొరేట్ అనుకూల విధానాలు, అంతకుమించి నిరంకుశ ఫాసిస్టు విధానాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల నేతలను జైళ్లలో నిర్బంధించారని విమర్శించారు. ఇండియా కూటమి మరింత బాధ్యతగా ఐక్యంగా నిలబడితే ప్రజలకు తగిన ప్రత్యామ్నాయంగా నిలబడుతుందని తెలిపారు. టీడీపీ, జేడీయూలు లౌకిక కూటమివైపు రావాలని సూచించారు. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తగిన పాఠం నేర్చుకోవాలని కోరారు. ఏపీలో ఫలితాలు నిరంకుశంపై వ్యతిరేకత అని వివరించారు.

నేటినుంచి ఐసెట్ రాతపరీక్షలు

- 86.184 మంది దరఖాస్తు
- 116 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ రాతపరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఐసెట్ కన్వీనర్ ఎస్ నర్సింహాచారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం రెండు విడతల్లో, గురువారం ఒక విడతలో రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అబ్బాయిలు 41,203 మంది, అమ్మాయిలు 44,980 మంది కలిపి 86,184 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. తెలంగాణలో 111, ఏపీలో ఐదు కలిపి మొత్తం 116 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రాతపరీక్షలుంటాయని తెలిపారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు.

నీట్‌లో శ్రీచైతన్య సరికొత్త రికార్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 720కి 720 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో తొమ్మిది ర్యాంకులు తమ విద్యాసంస్థవేనని తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో వి కళ్యాణ్, పి పవన్‌కుమార్‌రెడ్డి, ముఖేష్‌చౌదరి, జి భానుతేజసాయి, ఇరాన్ ఖ్వాజీ, దర్శ్ పగ్దార్, ఇషా కొఠారి, ఆదర్శ్ సింగ్ మోయల్, అమీనా ఆరీఫ్ కడివాలా నీట్ ప్రథమ ర్యాంకులను సాధించారని వివరించారు. 720 మార్కులతో తొమ్మిది మంది, 715 మార్కులు ఆపైన 28 మంది, 710 మార్కులు ఆపైన 55 మంది, 700 మార్కులు ఆపైన 124 మంది శ్రీచైతన్య విద్యార్థులు తమ చాటారని వివరించారు. నాణ్యమైన శిక్షణను అందిస్తూ అనితర సాధ్యమైన ప్రోగ్రామ్‌లు, మైక్రో షెడ్యూళ్లు, ఇంటర్నల్ పరీక్షలతో ఉత్తమ ర్యాంకులను సాధిస్తున్నామని తెలిపారు. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని ఆమె అభినందించారు.

బీజేపీ @ 8

- ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య ఒకటే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తాజా లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుచుకుంది. గత డిసెంబరులో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలను దక్కించుకుంఇ. కాగా 2019లో నాలుగు ఎంపీ సీట్లను గెలిచిన బీజేపీ, తాజాగా ఆ సంఖ్యను రెట్టింపు చేసుకోవడం గమనార్హం. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలిచింది. అలాగే సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, ఆర్మూర్, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్, గోషామహల్ తదితర అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధించిన సంగతి తెలిసిందే.

రాజకీయాల్లో గెలుపోటములు సహజం

- మాజీ మంత్రి టి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయాల్లో గెలుపోటములు సహజమనీ, 24ఏండ్ల చరిత్రలో బీఆర్ఎస్ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నదని మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత టి హరీశ్‌రావు మంగళవారం ఎక్స్ వేదికగాపేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల ఫలితాలతో నిరాశ చెందాల్సిన పని లేదని కార్యకర్తలకు సూచించారు. లక్షలాది మంది కార్యకర్తల ఆశీస్సులు, అభిమానంతో తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలయ్యేలా నిలదీస్తామని పేర్కొన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తూ, తమని తాము సంస్కరించుకుంటూ.. భవిష్యత్తుపై సరికొత్త ఆశలతో, ఆశయాలతో ముందుకు కదులుదామని పిలుపునిచ్చారు.

నీట్‌లో 56.41 శాతం ఉత్తీర్ణత

- మహారాష్ట్రకు చెందిన వేద్ సునీల్‌కుమార్ షిండే అబ్బాయిల్లో ప్రథమం
- రాజస్థాన్‌కు చెందిన ప్రచిత అమ్మాయిల్లో టాపర్
- నీట్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నేషనల్ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)-2024 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మంగళవారం విడుదల చేసింది. 24,06,079 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, గతనెల ఐదో తేదీన నిర్వహించిన నీట్ రాతపరీక్షకు 23,33,297 మంది హాజరయ్యారు. వారిలో 13,16,268 (56.41 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అబ్బాయిలు 10,29,198 మంది దరఖాస్తు చేయగా, 9,98,298 మంది పరీక్ష రాశారు. వారిలో 5,47,036 (54.80 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 13,76,863 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 13,34,982 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 7,69,222 (57.62 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 18 మంది ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేస్తే, 17 మంది పరీక్ష రాశారు. వారిలో పది (58.82 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. తెలంగాణ నుంచి 79,813 మంది దరఖాస్తు చేయగా, 77,849 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 47,371 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 66,522 మంది దరఖాస్తు చేస్తే, 64,931 మంది పరీక్ష రాశారు. వారిలో 43,858 మంది ఉత్తీర్ణత సాధించారు. మహారాష్ట్రకు చెందిన వేద్ సునీల్‌కుమార్ షిండే 99.9971285 పర్సెంటైల్ స్కోర్‌తో అబ్బాయిల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. రాజస్థాన్‌కు చెందిన ప్రచిత 99.9971285 పర్సెంటైల్ స్కోర్‌తో అమ్మాయిల్లో టాపర్‌గా ఉన్నారు.

నీట్ ఫలితాల వివరాలు

జెండర్	దరఖాస్తు	హాజరు	ఉత్తీర్ణత
అబ్బాయిలు	10,29,198	9,98,298	5,47,036
అమ్మాయిలు	13,76,863	13,34,982	7,69,222
ట్రాన్స్‌జెండర్లు	18	17	10
మొత్తం	24,06,079	23,33,297	13,16,268

ఈ ఎన్నికలతో మోడీ వేవ్ క్లోజ్

వారణాసిలో భారీగా తగ్గిన మెజార్టీ | అయోధ్యలో ఎస్పీ ఘన విజయం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు దశాబ్దానికిపైగా దేశంలో ఎన్నికల రాజకీయాలను శాసించిన 'మోడీ వేవ్' ముగింపును సూచిస్తున్నాయి. 2014, 2019 ఎన్నికల్లో మాదిరిగానే ప్రధాని నరేంద్ర మోడీని ముందుండి ఎన్డీఏ ఎన్నికలను ఎదుర్కొంది. 'ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్' (మరోసారి మోడీ సర్కార్) అనేది బీజేపీ ప్రధాన నినాదం. వారి మ్యానిఫెస్టో ముఖచిత్రంపై 'మోడీ గ్యారెంటీ 2024' అనే నినాదం ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా 200కు పైగా ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించారు. తనకు మద్దతిచ్చే ఎంపిక చేసిన మీడియా సంస్థలకు దాదాపు 80 ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఇది మోడీకి ప్రత్యర్థి ఎవరూ లేరని, ఆయన ఓటమి ఎరుగరన్న అభిప్రాయాన్ని కూడా క్రియేట్ చేసింది.

అయితే, దశాబ్దానికిపైగా మోడీ పాలనలో పరిణామాలను చవిచూసిన ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, పంజాబ్, మణిపూర్ రాష్ట్రాల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మోడీకి ఓటేయాలనే పేరుతో బీజేపీ అభ్యర్థులు ఈ రాష్ట్రాల్లో ఓట్లు అడిగారు. అందుకే ఈ రాష్ట్రాల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలినట్లే, మోడీ ముఖానికి ఎదురుదెబ్బ తగిలింది. వారణాసిలో మెజార్టీ భారీగా పడిపోయింది. దీంతో మోడీ మళ్లీ ప్రధాని కావడానికి ప్రయత్నిస్తున్నారనే వాదన నైతికంగా అవమానకరంగా మారింది. 2019 ఎన్నికల్లో మోడీకి 4,79,505 ఓట్ల మెజార్టీ వస్తే, ఈ ఎన్నికల్లో 1,52,513 మెజార్టీ వచ్చింది. అంటే 3,26,992 ఓట్లు తగ్గాయి.

ఇన్ని రోజులు అయోధ్య రామాలయం పేరుతో రాజకీయం చేసిన ప్రధాని మోడీ, బీజేపీకి ఈ ఫలితాలు చెంపపెట్టే. అయోధ్య రామాలయం ఉన్న ప్రాంతం ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఈ స్థానంలో బీజేపీ ఓటమి పాలు కాగా సమాజ్‌వాదీ పార్టీ ఘన విజయం సాధించింది.

'మోడీ బ్రాండ్' 2014లో ప్రణాళికాబద్ధంగా, ఇంటెన్సివ్ ప్రచారంలో భాగంగా రూపొందించబడింది. గుజరాత్ మారణహోమం కారణంగా దేశం లోపలా, బయటా ఎప్పుడూ విపరీతమైన మతోన్మాద వైఖరిని నిలబెట్టుకున్న రాజకీయ నేతను' అభివృద్ధి వీరుడుగా' గా చిత్రీకరించారు. 2014లో యూపీఏ-2 ప్రభుత్వ వైఫల్యాలతో విసిగిపోయిన ప్రజల ఆగ్రహాన్ని సద్వినియోగం చేసుకుని అధికారంలోకి వచ్చిన మోడీ, కాంగ్రెస్ సంస్థాగత బలహీనతలను సద్వినియోగం చేసుకుని 2019లో అధికారంలోకి వచ్చారు.

అయితే 2024 నాటికి ఆ రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. మోడీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి విసిగిపోయిన ప్రతిపక్ష పార్టీలు ఇండియా ఫోరం రూపంలో ఏకమై తీవ్ర ప్రతిఘటనకు దిగాయి. బీజేపీ, మోడీలు చెబుతున్నట్లుగా 400 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య నికి ప్రమాదమని ప్రజలు గ్రహించారు.

సార్వత్రిక ఎన్నికల మొదటి దశ తరువాత, బీజేపీ ఎదుర్కోబోయే ఘోర పరాజయానికి బలమైన సూచనలను అందుకున్న మోడీ, తీవ్ర మతపరమైన వ్యాఖ్యలతో రెచ్చగొట్టారు. అయితే, తీవ్రవాదంతో జనాదరణ పొందిన సమస్యలను దాచడానికి చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. మోడీ వేవ్ తగ్గుముఖం పట్టడం, ఉగ్రవాదం పెరుగుతుండడంతో భవిష్యత్ ఎన్నికల కోసం బీజేపీ కొత్త రాజకీయ అస్త్రాలను తయారు చేసుకోవాల్సి ఉంటుంది.


రైతుల ఆందోళనలతో కదలిన బీజేపీ పునాదులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తర భారతదేశంలో బీజేపీ పునాదిని కదిలించడంలో రైతుల ఆందోళన కీలకమైంది. 2014, 2019లో బీజేపీ గెలుపొందడంలో రైతుల ఓట్లు కీలక పాత్ర పోషించాయి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన కనీస మద్దతు ధరకు హామీ ఇచ్చి 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను ప్రకటించింది. 2020లో వాగ్దానాలను వెనక్కి నెట్టి, కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను అమలు చేయడానికి ప్రయత్నించిన మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళన ఒక సంవత్సరం పాటు కొనసాగింది. కార్మిక సంఘాలు, ఇతర ఉద్యమాలు సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపాయి. అణచివేత విఫలమైన తరువాత, కేంద్రం చట్టాలను ఉపసంహరించు కోవలసి వచ్చింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రైతు వ్యతిరేక విధానాన్ని అనుసరించిన బీజేపీ ప్రభుత్వానికి దెబ్బ కొట్టాయి. ఇవన్నీ నిరంతర రైతు డిమాండ్‌తో దెబ్బతిన్న రాష్ట్రాలు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో రైతులను, జర్నలిస్టును, కారులో దూకి హత్య చేసిన కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా తేని ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ కేసులో ఆయన కుమారుడు ఆశిష్ మిశ్రా నిందితుడు.

యూపీలో కదిలిన బీజేపీ పునాదులు

మోడీ హామీలు, యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ పాలనపై తగ్గిన విశ్వాసం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'ఉత్తరప్రదేశ్‌ను గెలిపించినవారే ఇండియాను శాసిస్తారు' అనే సామెతను ప్రామాణికంగా తీసుకుంటే ఇండియాను పాలించే హక్కు ఎన్‌డీఏ, నరేంద్ర మోడీలకు లేదని యూపీ ఆదేశం జారీ చేసింది. హిందీ హార్ట్‌ల్యాండ్‌లో సమాజ్‌వాదీ పార్టీ 'సైకిల్' 'బుల్‌డోజర్'గా మారి బీజేపీ అధికారాన్ని కూల్చివేసింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 39 సీట్లతో దూసుకెళ్తుండగా, ఎస్పీ నేతృత్వంలోని ఇండియా ఫోరం 41 సీట్లతో పుంజుకుంది. యూపీలో బీజేపీ 2014లో 71 సీట్లు, 2019లో 62 సీట్లు గెలుచుకుంది. ఈసారి 80కి 80 స్థానాలు కైవసం చేసుకుంటామని బీజేపీ నేతలు ప్రకటించారు.

అయోధ్యలో రామ మందిరాన్ని సాకారం చేసేందుకు ఒక్క అడుగు వేస్తే యూపీ మొత్తం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నేతలు ప్రగల్భాలు పలికారు. అయితే అయోధ్యతో కూడిన ఫైజాబాద్ నియోజకవర్గంలో కూడా బీజేపీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. మోడీ హామీలపై, యోగి ఆదిత్యనాథ్ బుల్‌డోజర్ పాలనపై తమకు విశ్వాసం లేదని యూపీ ప్రజలు బహిరంగంగా ప్రకటించడం బీజేపీ కోట పునాదులను కదిలించింది.

మోడీ ప్రభుత్వంలో అధికార ప్రతిరూపంగా ఉన్న కేంద్రమంత్రులు స్మృతి ఇరానీ, అజయ్ మిశ్రా, సంజీవ్ బల్యాన్‌లు కూడా ఓటమి రుచి చూశారు. ఇండియా ఫోరంలో కాకుండా ఒంటరిగా పోటీ చేసిన బీఎస్పీకి ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం యూపీలోని ముస్లిం, దళిత, వెనుకబడిన ప్రజల రాజకీయ జ్ఞానోదయాన్ని తెలియ జేస్తోంది. ఓట్లను విభజించడంతో బీజేపీకి సహాయం చేయాలనేది బీఎస్పీ ప్లాన్ అని ఓటర్లు మొదటి నుంచీ గ్రహించారు. 2019లో ఎస్పీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన బీఎస్పీ మొత్తం 10 స్థానాలను గెలిచింది. ఈ ఎన్నికలతో యూపీ రాజకీయాల్లో బీఎస్పీ, మాయావతి పూర్తిగా అప్రస్తుతం అయిపోయాయి.

ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల కష్టాలతో సహా జీవన సమస్యలను గ్రహించిన యూపీ ఓటర్లు, తీవ్ర మతతత్వ రాజకీయాల ప్రతినిధులను వదులుకుంటున్నారనే రాజకీయ సందేశాన్ని ఇచ్చారు.

లోక్‌సభ ఎన్నికల్లో సినీ ప్రముఖుల విజయం

దేశవ్యాప్తంగా లోక్‌సభతోపాటు ఏపీ అసెంబ్లీ స్థానాల ఎన్నికల్లో ఈసారీ సినీ ప్రముఖులు విజయం సాధించారు. అయితే రాష్ట్రాలు, స్థానాల వారీగా వారి వివరాలు ఇలా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్.. నుంచి సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ప్రత్యర్థి వంగా గీతపై 70,354 ఓట్ల భారీ మెజారిటీతో విజయ ఢంకా మోగించారు.

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ సాధించారు. ఇప్పటికే రెండు సార్లు గెలుపొందిన ఆయన మూడోసారి 31,602 ఓట్ల మెజారిటీతో గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బాలీవుడ్ నటి కంగనా రనౌత్ విక్టరీ విజయాన్ని కైవసం చేసుకున్నారు. బీజేపీ తరపున బరిలోకి దిగిన ఆమె కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాధిత్య సింగ్‌పై 71 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.

కేరళలో.. త్రిస్సూర్ స్థానం నుంచి మలయాళ నటుడు సురేశ్ గోపీ 75,079 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ప్రత్యర్థి వీఎస్ సునీల్ కుమార్ రెండో స్థానానికి పరిమితమయ్యారు.

ఉత్తరప్రదేశ్‌లోని మధుర లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న హేమమాలిని 2,41,500 ఓట్ల ఆధిక్యం (బీజేపీ)లో కొనసాగుతూ.. విక్టరీ విజయాన్ని సొంతం చేసుకున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ లోక్ సభ నియోజవర్గం నుంచి పాపులర్ నటుడు రవికిషన్ 74,536 ఓట్ల ఆధిక్యంతో (బీజేపీ) గెలుపుబాట పట్టారు.

రాజస్థాన్, హర్యానా ఫలితాలతో బీజేపీకి భంగపాటు




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తే బీజేపీని ఎలా ఓడించొచ్చో చెప్పడానికి రాజస్థాన్, హర్యానా ఎన్నికల ఫలితాలే ఉదాహరణ. రాజస్థాన్‌లో కాంగ్రెస్, సీపీఐ(ఎం), రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, భారత్ ఆదివాసీ పార్టీలు ఇండియా ఫోరంగా బీజేపీని వ్యతిరేకించాయి. హర్యానాలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు ఇండియా కోసం చేతులు కలిపాయి. 25 లోక్‌సభ స్థానాలున్న రాజస్థాన్‌లో 2014, 2019లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. వరుసగా మూడో సారి ఎన్నికల్లో మొత్తం సీట్లను కైవసం చేసుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్‌లో అధికారాన్ని చేజిక్కించుకోవడంతో బీజేపీ విశ్వాసం పెరిగింది. ఓటమితో కాంగ్రెస్ కండ్లు తెరిపించింది. బీజేపీని ఒంటరిగా ఎదుర్కోలేమనే నిర్ణయానికి మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ సహా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం వచ్చింది. సీపీఐ(ఎం), ఆర్‌ఎల్‌టిపి, భారత్ ఆదివాసీ పార్టీలతో సీట్ల ఒప్పందం కుదిరింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మూడు పార్టీలకు ఆరు శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓట్ల తేడా కేవలం రెండు శాతం మాత్రమే.

నిరుద్యోగం, ధరల పెరుగుదల, అగ్నిపథ్ పథకం, వ్యవసాయ సమస్యల వంటి ప్రముఖ సమస్యలపై ఇండియా ఫోరం ఎన్నికల్లో చర్చకు ప్రజల ముందుంచింది. ఏప్రిల్ 19న తొలి దశలో పోలింగ్ జరిగిన 12 స్థానాల్లో సీపీఐ(ఎం) గెలిచిన సికార్‌తో సహా మొత్తం 9 సీట్లు గెలుచుకున్నాయి. మొదటి దశ తరువాత, ఏప్రిల్ 21న, రాజస్థాన్‌లోని బాన్సువాడలో మోడీ తన తీవ్రమైన మత ప్రచారాన్ని ప్రారంభించారు. కానీ రెండో దశలో బాన్స్‌వాడ్‌తో సహా మరో రెండు స్థానాలను ఇండియా ఫోరం గెలుచుకుంది. బాన్సువాడలో బీఏపీ అభ్యర్థి రాజ్‌కుమార్ రౌత్ బీజేపీపై రెండున్నర లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.హర్యానాలో కూడా గత ఎన్నికల్లో బీజేపీ 10 సీట్లు గెలుచుకుంది. అయితే అక్కడ కూడా ఆప్, కాంగ్రెస్ ఫోరంగా ఏర్పాటుతో బీజేపీ తడబడింది. రైతుల ఆందోళనకు కేంద్ర బిందువుగా ఉన్న హర్యానాలో గ్రామాల్లో బీజేపీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. వామపక్ష పార్టీలతో సహా ఇండియా ఫోరంలోని రైతు సంఘాలు, ఇతర పార్టీల మద్దతు కాంగ్రెస్, ఆప్ కూటమికి సహాయపడింది. బీజేపీ ఇక్కడ కూడా ఐదు స్థానాలను కైవసం చేసుకుని, సగానికి సగం పడిపోయింది. దీంతో బీజేపీకి హర్యానాలో షాక్ తగిలింది.

బీజేపీ మతోన్మాద ఎజెండాకు ప్రజల తిరస్కరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల రెండో దశ నుంచి ప్రధాని నరేంద్ర మోడీ, సంఘ్ పరివార్ విపరీతమైన మతతత్వం కూడా బీజేపీకి మెజార్టీ ఇవ్వలేకపోయింది. అయోధ్యలో రామమందిరం ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో ఓడిపోవడం బీజేపీకి షాక్ ఇచ్చింది. రామ మందిర నిర్మాణం యూపీలో పెద్ద పురోగతికి దారితీస్తుందని బీజేపీ భావించింది. కానీ అది విఫలమైంది. హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పిలువబడే యూపీ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మతతత్వ ఎజెండాను తిరస్కరించింది. మునుపెన్నడూ లేనివిధంగా సంఘ్ పరివార్ ఎన్నికల ప్రచారాన్ని తక్కువ స్థాయి మత ప్రచారానికి వేదికగా మార్చుకుంది. ప్రవర్తనా నియమావళిని స్పష్టంగా ఉల్లంఘించినప్పటికీ, బీజేపీకి కీలుబొమ్మగా కేంద్ర ఎన్నికల సంఘం ఉంది. మోడీ, ఇతరుల మత ప్రచారాన్ని చూడనట్లు ఈసీ నటించింది.'అబ్ కీ బార్ 400 పర్' నినాదంతో మోడీ, బీజేపీ లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగాయి. మోడీ అనుకూల మీడియా తదితరుల ఒపీనియన్ పోల్స్ కూడా ఇందుకు అనుకూల పరిస్థితిని సృష్టించాయి. అయితే తొలి దశ ఓటింగ్‌తో పరిస్థితులు మారిపోయాయి. రాజస్థాన్‌తో సహా మొదటి దశలో బూత్‌లకు వెళ్లిన రాష్ట్రాల్లో నిరుద్యోగం, వ్యవసాయ సమస్యలు, అగ్నిపథ్ ప్రాజెక్ట్, ధరల పెంపు వంటి ప్రముఖ అంశాలు చర్చనీయాంశంగా మారాయని బీజేపీ నాయకత్వం గ్రహించింది. ఇక పోలింగ్ శాతం తగ్గడం కూడా సంఘ్ పరివార్‌ను ఆందోళనకు గురి చేసింది.

దీంతో మోడీ, బీజేపీలు పచ్చి మతతత్వం వైపు పయనించారు. ఏప్రిల్ 21న రాజస్థాన్‌లోని బాన్సువాడలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోడీ మాట్లాడుతూ.. ప్రతిపక్షాల కూటమి అధికారంలోకి వస్తే హిందూ మహిళల తాళిబొట్టులను పాతిపెట్టి ముస్లింలకు ఇస్తామని చెప్పారు. భారతీయ సమాజానికి జిహాదీల మద్దతు ఉందని, వెనుకబడిన రిజర్వేషన్లను కట్ చేసి ముస్లింలకు ఇస్తామని తప్పుడు ప్రచారం చేశారు. ఆ తరువాత జరిగిన అన్ని ఎన్నికల ర్యాలీల్లోనూ మోడీ బాన్సువాడ ప్రసంగాన్ని పునరావృతం చేశారు. అయోధ్యలో రామ మందిరం పేరుతో ఓటు వేయాలని కోరారు. ర్యాలీల్లో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ప్రాణ ప్రతిష్టను బహిష్కరించి రాముడిని పూజించలేదన్నారు. మోడీతో పాటు యోగి ఆదిత్యనాథ్, అమిత్ షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ వంటి బీజేపీ నేతలు సైతం తీవ్ర స్థాయిలో మత ప్రచారం చేశారు. కానీ యూపీతో సహా రాష్ట్రాల్లో, ఓటర్లు బీజేపీ మతపరమైన ప్రచారాన్ని తిరస్కరించారు.

ఎగ్జిట్ పోల్స్ అట్టర్ ఫ్లాప్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్డీఏ, రేంద్ర మోడీలకు భారీ మెజారిటీ వస్తుందని అంచనా వేసిన వివిధ ఎగ్జిట్ పోల్స్ అసలు ఫలితాలు వెలువడే సరికి బూడిదలో పోసిన పన్నీరే అయింది. బీజేపీ అనుకూల కార్పొరేట్ మీడియా 400 సీట్ల వరకు వస్తుందని అంచనా వేసింది. కానీ వాస్తవానికి ఎన్‌డిఎ సంపూర్ణ మెజారిటీ కోసం పోరాడవలసి వచ్చింది. ఎన్నికల వ్యూహకర్తలుగా చెప్పుకునే ప్రశాంత్ కిషోర్, ప్రదీప్ గుప్తాల వాదనలు కూడా ఆవిరయ్యాయి. ప్రదీప్ గుప్తా నేతృత్వంలోని యాక్సిస్ మై ఇండియా ఎన్డీఏకు 301-400 సీట్లు వస్తుందని అంచనా వేసింది. అయితే అలా రాకపోవడంతో ఛానెల్ చర్చలో గుప్తా కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసిన దానికంటే సగటున 75 సీట్లు తక్కువగా ఎన్డీఏ గెలుచుకుంది. ఎగ్జిట్ పోల్స్‌ను మోడీ మీడియా



పోల్‌గా పేర్కొన్నారన్న ప్రతిపక్షాల వైఖరి ఫలితంతో చెల్లుబాటైంది.

ఆరు ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్డీఏకు 355 నుంచి 380 సీట్లు వస్తాయని అంచనా వేసాయి. ఇండియా ఫోరానికి 125 నుంచి 165 సీట్లు మాత్రమే వస్తాయని ఇచ్చాయి. ఉత్తరప్రదేశ్‌ను బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని చానెళ్లు చెప్పాయి. కానీ యూపీలో ఇండియా ఫోరం అడుగు ముందుకేసింది. బీజేపీ 70 సీట్ల వరకు గెలుస్తుందని ఛానళ్లు ప్రకటించగా, ఫలితాలు వెలువడే సరికి ఎస్పీ కూటమి దాదాపు 40 సీట్లతో దూసుకెళ్లింది. ఎగ్జిట్ పోల్స్ తరువాత ఊపందుకున్న స్టాక్ మార్కెట్, తొలి ఫలితాలు వెలువడిన వెంటనే కుప్పకూలినట్లు సంకేతాలు వెలువడ్డాయి. కాసేపటికే అది పేకమేడలా కూలిపోయింది. ట్రేడింగ్ ముగియడంతో ఇన్వెస్టర్లు రూ.14 లక్షల కోట్లు నష్టపోయారు.

విఫలమైన ప్రధాన అంచనాలు

రిపబ్లిక్ టీవీ- పిఎంఆర్‌క్యూ ఎన్‌డిఏకి 359 సీట్లు, జన్ కీ బాత్ 362-392 సీట్లు, న్యూస్ నేషన్ 342-378 సీట్లు, భారత్ మ్యాట్రిక్స్ 353-368 సీట్లు, ఇండియా న్యూస్- డి డైనమిక్స్ 371 సీట్లు, ఎన్‌డిటివి 358 సీట్లు వస్తాయని ఇచ్చాయి.

హైపవర్ కమిటీ నివేదికపై సమయం కోరిన ప్రభుత్వం

జీవో 111 అమలు రద్దు వ్యవహారంపై హైకోర్టు విచారణ

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ లోని జంటజలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ పరీవాహక ప్రాంత పరిరక్షణకు ఉద్దేశించిన జీవో 111 ఎత్తివేతకు సంబంధించి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ నివేదికపై వివరణ ఇచ్చేందుకు మరింత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును కోరింది. హైపవర్ కమిటీ నివేదిక సమర్పించిందా ? లేదా ? ప్రస్తుత పరిస్థితి ఏంటో తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవో 111ను రద్దు చేసి సదరు నిషేధిత ప్రాంతంలో పర్యావరణహితంగా అభివద్ధి చేస్తామని పేర్కొంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన జీవో 69ను జారీచేసింది. ఆ ప్రాంతంలో తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో హైపవర్ కమిటీ ఏర్పాటు చేసింది. జీవో 111 రద్దును వ్యతిరేకిస్తూ హైకోర్టులో అప్పటికే పెండింగ్లో ఉన్న పిటిషన్లలో పిటిషనర్లతోపాటు కొత్త పిటిషన్లు దాఖలు కావడంతో హైపవర్ కమిటీ నివేదిక వచ్చే వరకు జీవో 111 రద్దుకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోబోమనీ, నిర్మాణాలకు సంబంధించి గతంలో ఉన్న ఆంక్షలు, నిషేధాలను సడలించబోమని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. తాజాగా సోమవారం జీవో 111కు సంబంధించిన దాదాపు 12 పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపిస్తూ కమిటీ నివేదిక వచ్చే వరకు జీవో రద్దుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గతంలో ఇదే ధర్మాసనం ఆదేశించిందనీ, సదరు అదేశాల ప్రకారం ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. జీవో 111 యథాతథంగా కొనసాగుతోందని నివేదించారు. అసలు కమిటీ నివేదిక ఇచ్చిందా? ప్రస్తుత పరిస్థితి. ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. నివేదికకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు నాలుగువారాల సమయం ఇవ్వాలని ఏఏజీ కోరడంతో తదుపరి విచారణను హైకోర్టు నాలుగువారాలకు వాయిదా వేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ -హైదరాబాద్

గతంలోని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పలువురు నాయకులతోపాటు న్యాయమూర్తుల ఫోన్లను టాప్ చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు డీజీపీ ఇంటిలిజెన్స్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే నెల మూడో తేదీకి వాయిదా వేసింది. న్యాయమూర్తుల ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయంటూ వచ్చిన వార్తలను హైకోర్టు పిటిషన్‌గా పరిగణించి మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచి విచారించింది. ఎస్‌బీఐ అదనపు ఎస్పీ (సస్పెండెడ్) భుజంగరావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రాజకీయ ప్రత్యర్థులు, ప్రైవేటు వ్యక్తులతోపాటు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి.

కట్టమైసమ్మ చెరువు రక్షణకు తీసుకున్న చర్యలేంటో చెప్పండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం కట్టమైసమ్మ చెరువు పరిరక్షణకు తీసుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఏర్పాట్లపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలంది. కట్టమైసమ్మ చెరువు ఎఫ్టిఎల్, బఫర్ జోన్స్‌లో ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలంది. ఈ మేరకు హైకోర్టు సోమవారం జీహెచ్ఎంసీని ఆదేశించింది. ఏవమైనా సంస్థల సహకారం తీసుకుని వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చెరువు చుట్టూ రక్షణకు ఏర్పాట్లకు ప్రయత్నాలు చేయాలనీ, తదుపరి విచారణ నాటికి పూర్తి వివరాలతో స్థాయీ నివేదికను సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కుత్బుల్లాపూర్ మండలం సూరారం గ్రామంలోని కట్టమైసమ్మ రక్షణకు చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ఎస్ మల్లేశ్వరరావు నాలుగేండ్ల క్రితం ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ జై అనిల్ కుమార్తెలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. చెరువు రక్షణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై జీహెచ్ఎంసీ నివేదిక సమర్పించింది. చెరువు ఎఫ్ .టి. ఎల్.ప్రాంతాన్ని గుర్తించామని, 1697 ఎకరాలు ఉందని, 212 ఎకరాలు బఫర్ జోన్ ఉందని తెలిపింది చెరువులో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని పేర్కొంది .చెరువు చుట్టూ లింక్ లింక్ చైన్ మెస్లో కంచె ఏర్పాటు చేసినట్టు తెలిపింది కార్పొరేట్ కంపెనీల బాధ్యత కింద్ర వాకింగ్ ట్రాక్కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది వీటన్నింటినీ జీహెచ్ఎంసీ పం స్తోందని తెలిపింది. ఈ దికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం చెరువు రక్షణకు ఆదేశాలు జారీ చేస్తూ పిటిషనర్ల విచారణను మూసివే సింది చెరువు అభివృద్ధిపై తీసుకున్న చర్యలపై స్థాయీ నివేదికను మూడు నెలల్లో హైకోర్టు రిజిస్ట్రీకి సమర్పించాలని ఆదేశించింది.


గ్రూపు-1 పరీక్షలను వాయిదాకు హైకోర్టు నిరాకరణ

నవతెలంగాణ-హైదరాబాద్

ఈనెల 9న జరగనున్న గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. కేంద్ర ప్రభుత్వం అసిస్టెంట్ సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-1, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష ఉన్నందున గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలంటే దాఖలైన పిటీషన్లపై ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిన కారణంగా వాటిని వాయిదా వేయడానికి ఉత్తర్వులు ఇవ్వలేమని జస్టిస్ కార్తీక్ స్పష్టం చేశారు పిటీషన్ పై విచారణ ముగిస్తున్నట్టు ప్రకటించారు. కేంద్రం నిర్వహించే పరీక్షకు హాజరయ్యేది 700 మంది మాత్రమేననీ, ప్రిలిమ్స్ కు హాజరయ్యే అభ్యర్థులు సుమారు నాలుగు లక్షల వరకు ఉన్నారని, పరీక్షలు వాయిదా వేయడానికి వీల్లేదని సర్వీస్ కమిషన్ న్యాయవాది చేసిన వాదనను ఆమోదించారు.

ఇండియా ఫోరంతో బీజేపీకి దెబ్బ

మోడీ, షా ద్వయంపై పోరు



న్యూఢిల్లీ : నాలుగు వందల సీట్లతో కేంద్రంలో మళ్లీ అధికారంలోకి దూకిన బీజేపీ, సంఘ్ పరివార్‌లకు 'భారత్' పేరుతో జాతీయ స్థాయిలో ఏర్పడిన ప్రతిపక్షాల ఫోరంతో ఎదురుదెబ్బ తగిలింది. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించి, మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని నిర్ణయించే పౌరసత్వ సవరణ చట్టాన్ని విధించి మోడీ ప్రభుత్వం నిరంకుశ ధోరణిలో ముందుకు సాగినప్పుడు చెల్లాచెదురైన ప్రతిపక్షాలు తమ విభేదాలను మరచి చేతులు కలిపాయి.

ప్రతిపక్ష పార్టీలు, నేతలపై వేటు వేసేందుకు మోడీ, అమిత్ షా ద్వయం కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించుకోవడంతో బీజేపీపై సమష్టి పోరుకు రంగం సిద్ధమైంది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతు సంఘాలు చేపట్టిన చారిత్రాత్మక పోరాటానికి మోడీ ప్రభుత్వం మోకరిల్లిందని ప్రతిపక్షాలు మేల్కొన్నాయి. ఆగస్ట్ 2022లో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఎన్డీఏ నుంచి వైదొలిగి ప్రతిపక్ష కూటమిలో చేరినప్పుడు, సమైక్య ఉద్యమం బలపడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎన్సిపి అధ్యక్షుడు శరత్ పవార్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వంటి నేతలు బీజేపీపై ఐక్య పోరాటానికి దిగారు.ప్రతిపక్ష పార్టీ నేతల మొదటి సమావేశం జూన్ 2023లో పాట్నాలో జరిగింది. 16 పార్టీలు పాల్గొన్నాయి. ఆ తరువాత జూలై 17-18 తేదీల్లో బెంగళూరులో రెండో సమావేశం జరిగింది. కూటమిలోని పార్టీల సంఖ్య 26కి చేరింది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు ముంబాయిలో జరిగిన మూడో సమావేశంలో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. అలాగే సామరస్యపూర్వకంగా పోరాడాలని తీర్మానం చేశారు. డిసెంబరు 19న ఢిల్లీలో జరిగిన సభ తగిన ర్యాలీలు తదితరాలకు రూపు ఇచ్చింది. కానీ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మళ్లీ భారత్ జోడో యాత్రకు వెళ్లడంతో ఉమ్మడి ఆందోళనలు సాధ్యం కాలేదు. నితీష్ కుమార్ మళ్లీ ఇండియా ఫోరాన్ని విడిచిపెట్టి బీజేపీ శిబిరానికి వెళ్లారు.

దీంతో ఇండియా ఫోరం మెరుపు తగ్గినప్పటికీ పాట్నాలో ఉమ్మడి ర్యాలీ, తదితర కార్యక్రమాలు నిర్వహించి తన సత్తాను చాటుకుంది. ఇది కాకుండా, తమిళనాడు, మహారాష్ట్ర, యూపీ, బీహార్, జార్ఖండ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాల్లో ఇండియా ఫోరం విజయవంతంగా సీట్లు గెలుచుకుంది. ఎన్నికల ఘట్టంలోనూ ఐక్యంగా ముందుకు సాగడంతో బీజేపీకి షాకిచ్చి ముఖ్యమైన రాష్ట్రాల్లో అద్భుత విజయం సాధించారు. ఇదే ఐక్యత కొనసాగితే కేంద్రంలో ఎన్‌డీఏ ఫ్రంట్ కొనసాగుతున్న పాలనకు విఘాతం కలుగుతుంది.

బిజినెస్

16 నెలల కనిష్టానికి రూపాయి



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ వెలవెల పోయింది. స్టాక్ మార్కెట్ల భారీ పతనం, ఎఫ్ఐఐలు తరలిపోవడంతో మంగళవారం రూపాయి మారకం విలువ 16 నెలల కనిష్టానికి పడిపోయింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 45 పైసలు పతనమై 83.59కి పరిమితమయ్యింది. ఒక్క రోజులో ఇంత పతనం కావడం ఇదే తొలిసారి. రూపాయి విలువ క్షీణించడం ద్వారా అనేక దిగుమతుల ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. మరోవైపు వాణిజ్య లోటు పెరుగుతుంది. అంతర్జాతీయ అప్పులు, వడ్డీల చెల్లింపుల భారం అధికం కానున్నాయి.

సలసార్ టెక్నోకు రూ.17 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : సలసార్ టెక్నో ఇంజనీరింగ్ లిమిటెడ్ (ఎస్‌టిఇఎల్) 2024 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.16.97 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.14.73 కోట్ల లాభాలు ఆర్జించింది. అదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.296.32 కోట్లుగా ఉండగా.. గడిచిన త్రైమాసికంలో రూ.369.53 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఇదే సమయంలో కంపెనీ వ్యయం రూ.276.46 కోట్ల నుంచి రూ.369.53 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం నికర లాభాలు రూ.52.93 కోట్లకు పెరిగాయి. 2022-23లో రూ.40.25 కోట్ల లాభాలు నమోదయ్యాయి.

ఎంజి ఇండియా నుంచి న్యూగ్లోస్టర్ విడుదల



న్యూఢిల్లీ : స్నార్మ్ సీరిస్‌లో న్యూ గ్లోస్టర్‌ను విడుదల చేసినట్లు ఎంజి మోటార్ ఇండియా తెలిపింది. దీన్ని 30 భద్రత ఫీచర్లలతో ఆవిష్కరించినట్లు ఆ కంపెనీ పేర్కొంది. ఎస్‌యువి ఔత్సాహికుల కోసం విశాలమైన, బోల్డ్, ప్రీమియం అనుభవంతో ఎంజీ గ్లోస్టర్ రేంజ్ ధరను రూ.38.80 లక్షలుగా నిర్ణయించినట్లు వెల్లడించింది. తాము కొత్త గ్లోస్టర్ డిజర్ట్ స్టార్మ్ స్నోస్టార్మ్ విడుదలతో మరొక మైలురాయిని చేరుకున్నామని ఆ కంపెనీ ప్రతినిధి సతీందర్ సింగ్ బజ్వా పేర్కొన్నారు. గతేడాది సంస్థ ఆవిష్కరించిన గ్లోస్టర్‌కు మరిన్ని ఫీచర్లను జోడించామన్నారు.

చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు అభినందనలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లకు నా అభినందనలు. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగిస్తూ...సమస్యలను పరిష్కరించుకుంటూ...అభివృద్ధి పథం వైపు సాగుదాం. అద్భుతమైన విజయాన్ని అందించిన ఓటర్లకు ధన్యవాదాలు' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈమేరకు మంగళశారం ట్వీట్ చేశారు.

కాంగ్రెస్ క్యాడర్‌కు అభినందనలు
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

రికార్డు స్థాయి మెజార్టీ సాధించేందుకు కృషి చేసిన క్యాడర్‌కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభినందనలు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటే కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఏఐసీసీ, టీపీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు స్పందించి ఇండియా కూటమి అభ్యర్థులను అద్భుతంగా గెలిపించిన అందినందుకు దేశ, రాష్ట్ర ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా తీర్పును కాంగ్రెస్ గౌరవిస్తుంది
రాష్ట్ర, దేశ ప్రజలకు కృతజ్ఞతలు
మహేష్ కుమార్ గౌడ్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ప్రజాతీర్పును గౌరవిస్తామని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. తెలంగాణ, దేశ ఓటరులందరికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ అనిల్ యాదవ్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ప్రభుత్వ ప్రతినిధి హర్కర వేణుగోపాల్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ వైస్ చైర్మెన్ ఫహీం ఖురేషి, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, మెట్టు సాయి, సంగిశెట్టి జగదీష్ తదితరులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదు హామీలను అమలు చేశామని పేర్కొన్నారు. కంటోన్మెంట్‌లో శ్రీగణేష్‌ను గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గాంధీభవన్‌లో సంబురాలు
టపాకాయలు పేల్చి ఆనందం పంచుకున్నారు

గతం కంటే ఐదు స్థానాలు అదనంగా గెలిచినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం గాంధీభవన్‌లో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, డ్యాన్స్‌లు చేస్తూ...తమ ఆనందం పంచుకున్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం సాధించడం, ఎంపీ స్థానాల్లో భారీ మెజార్టీ వచ్చినందుకు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.

కేంద్ర మంత్రి అజయ్ తేనీకి షాక్

- యూపీలోని లఖింపూర్ ఖేరీలో ఓటమి
- 33వేలకు పైగా ఓట్ల మెజారిటీతో : ఎస్పీ అభ్యర్థి విజయం

లక్నో : యూపీలోని లఖింపూర్ ఖేరీలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడ ఆయన ఓటమి పాలయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి చెందిన ఉత్కర్ష్ వర్మ 'మధుర్' 34329 ఓట్ల తేడాతో కేంద్ర మంత్రిని ఓడించారు. అజయ్ కుమార్ తేనీ ఇక్కడ నుంచి ఇప్పటికే రెండు సార్లు గెలిచారు. ప్రస్తుతం వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిద్దామనుకున్న ఆయన ఆశలపై ఖేరీ ప్రజలు నీళ్లు చల్లారు. దీంతో ప్రస్తుతం ఓటమి పాలయ్యారు.

2021లో లఖింపూర్ ఖేరీలో రైతులపై జరిగిన ఒక ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేంద్ర మంత్రికే చెందిన ఒక వాహనాన్ని రైతుల పైకి ఎక్కించిన ఘటన ఇక్కడ చోటు చేసుకున్నది. ఈ ఘటనలో మొత్తం ముగ్గురు వరకు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో కేంద్ర మంత్రి కుమారుడు ఆశిశ్ మిశ్రా ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం ఈయన బెయిల్‌పై బయటకు వచ్చారు. కాగా, లఖింపూర్ ఖేరీ ఘటనతో నియోజకవర్గ ప్రజల్లో కేంద్ర మంత్రిపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అంతేకాకుండా, ఈ నియోజకవర్గంలో సిక్కులు కూడా అధికంగా ఉన్నారు. వీరికి కూడా బీజేపీ అభ్యర్థి పట్ల వ్యతిరేకత ఉన్నది. దీంతో ప్రజలకు కేంద్ర మంత్రిని ఓడించారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఇది మోడీ విజయం : ఏలేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ ఘనవిజయం సాధించిందనీ, ఇది మోడీ విజయమని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ల అంశంతో ఫేక్ వీడియోలతో కాంగ్రెస్ చేసిన కుట్రలను ప్రజలు తిప్పికొట్టారన్నారు. ఆరునెలల్లోనే రేవంత్ సర్కార్‌పై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. 2014లో ఒక సీటును, 2019లో నాలుగు, ఇప్పుడు ఎనిమిది సీట్లను సాధించామనీ, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో క్లీన్‌స్వీప్ చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. 16 సీట్లలో కాంగ్రెస్ దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వరకు ఖర్చుపెట్టిందని విమర్శించారు. అయినా, 8 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను ప్రజలు ఆదరించారన్నారు. 35శాతం ఓటు శాతాన్ని అందించిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

'మల్కాజిగిరి' కొంపముంచింది..!

- కాంగ్రెస్‌లో సమన్వయ లోపం
- బీఆర్ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్
- మినీ ఇండియాలో బీజేపీ ఘన విజయం
- ఇదీ 'ఈటల' విజయ రహస్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల కొంప ముంచింది. కాంగ్రెస్‌లో సమన్వయ లోపం, బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు బీజేపీకి కలిసొచ్చాయి. ఈ సెగ్మెంట్‌ను బీఆర్ఎస్ అధిష్టానం పెద్దగా పట్టించుకోకపోగా.. కాంగ్రెస్ నేతలు గెలుస్తామనే ధీమాతో ఉండి పెద్దగా దృష్టి సారించకపోవడం ఈటల రాజేందర్ విజయానికి మార్గం సులువైంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో మూడో స్థానానికే పరిమితమైన బీజేపీ.. ఈసారి ఘన విజయం సాధించడమంటే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పిదాలే కారణం అనే చర్చ నడుస్తోంది. సిట్టింగ్ ఎంపీ, సీఎం రేవంత్‌రెడ్డి చరిష్మాతో మల్కాజిగిరిలో బయటపడతామని కాంగ్రెస్ పార్టీ నేతలు భావించినా.. సీన్ రివర్స్ అయ్యింది. నియోజకవర్గాల ఇన్‌చార్జీల సమన్వయ లోపం, ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి ప్రచార శైలి పెరగకపోవడంతో నష్టం జరిగింది. పార్టీలో చేరిన కొద్ది సమయంలోనే టికెట్ రావడంతో స్థానికంగా కాంగ్రెస్ నాయకత్వం సీరియస్‌గా పట్టించుకోలేదనీ తెలుస్తోంది. ఇదే తరుణంలో అభ్యర్థి సైతం ఓటర్లతో సకాలంలో మమేకం కావడంలో విఫలమయ్యారు. దీనికితోడు పార్లమెంట్ ఇన్‌చార్జీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఎక్కువ సమయం కేటాయించలేదన్న అభిప్రాయం ఆ పార్టీలో వ్యక్తమవుతోంది. మైనంపల్లి మల్కాజిగిరికి ఇన్‌చార్జీయే అయినా.. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌పైనే ఎక్కువ ఫోకస్ పెట్టారని అంటున్నారు. వారంలో నాలుగు రోజులు మెదక్‌లో.. మూడ్రోజులు మల్కాజిగిరిలో ప్రచారం చేయడంతో కాంగ్రెస్ రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఒల్కాజిగిరిలో మైనంపల్లి, సీఎం పాచికలు పారకపోగా.. సుపరిచితుడైన పట్నం మహేందర్‌రెడ్డిపై సైతం నమ్మకం లేకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారు.



కొంప ముంచిన కేటీఆర్ వ్యాఖ్యలు

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే.. కష్టపడితే పనిచేస్తే 'ఎంపీ' గెలుపు పెద్ద కష్టమేమీ కాదు.. గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలదే అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పదే పదే చెప్పినా.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆ దిశగా పని చేయలేదనేది పార్లమెంట్ ఫలితాలను బట్టి చూస్తే స్పష్టంగా తెలిసిపోతుంది. 'మల్కాజిగిరిలో పట్నం సునిత, సికింద్రాబాద్‌లో దానం నాగేందర్, చేవెళ్లలో రంజిత్‌రెడ్డికి మాత్రం ఓట్లు వేయొద్దు' అని బీఆర్ఎస్ నాయకత్వం చెప్పడం.. ఎవరికి ఓటు వేసి గెలిపించాలనే సరైన దిశానిర్దేశం చేయకపోవడం కూడా బీజేపీకి అనుకూలంగా పని చేసింది. ఈ వ్యాఖ్యలను ఆదర్శంగా తీసుకున్న పార్టీ క్యాడర్ బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక గెలిచినా తమ పార్టీ అధికారంలో లేకపోవడంతో నిరాశకు గురైన ఎమ్మెల్యేలు, ఆ దిశగా కృషి చేయనట్టుగా చర్చ నడుస్తోంది. దీనికి తోడు 'రాష్ట్రం, కేంద్రంలో ఎలాగూ అధికారంలో లేము.. ఈ ఎంపీ గెలిచి ఏం చేస్తాం' అనే ఆలోచనలు పార్టీ క్యాడర్‌కు రావడంతో గంపగుత్తగా బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేసినట్టు చర్చ నడుస్తోంది.

ఈటలకు కలిసొచ్చిందిలా..

మల్కాజిగిరి సెగ్మెంట్‌కు ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరగ్గా.. గడిచిన రెండుసార్లు బీజేపీ మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కానీ మూడోసారి విజయం సాధించింది. ఈటల రాజేందర్ బీఆర్ఎస్ నుంచి బయటికి రావడం, హుజురాబాద్, గజ్వేల్ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి ఓటమిపాలు కావడం లాంటి సింపతి ఆయన గెలుపునకు కారణంగా తెలుస్తోంది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను త్వరగా ప్రకటించకపోవడం, బలమైన నాయకులను బరిలో దించకపోవడం, కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు, సమన్వయ లోపం బీజేపీకి కలిసి వచ్చిన మరో అంశంగా చెప్పొచ్చు. దీనికి తోడు ఎంపీ అభ్యర్థి తరపు వారు సైతం నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, రెండో స్థాయి లీడర్లను సమన్వయ పర్చడంలో విఫలమయ్యారు. టికెట్ ఆశించి భంగపడిన కాంగ్రెస్ నేతలు సైతం ప్రచారంలో పెద్దగా కనిపించకపోగా.. కొన్ని ఏరియాలకే పరిమితం కావడం బీజేపీకి కలిసి వచ్చింది. చాలాకాలం ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌లో కొనసాగినందున ఆ పార్టీ క్యాడర్ కొంత బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేసినట్టుగా సమాచారం. ఉప్పల్, మేడ్చల్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువగా క్రాస్ ఓటింగ్ జరిగినట్టు చర్చ నడుస్తోంది.


ఎన్నికల ఫలితాలు సీట్లు 543

పార్టీ	సీట్లు
భారతీయ జనతా పార్టీ	240
కాంగ్రెస్ పార్టీ	99
సమాజ్‌వాది పార్టీ	37
ఆల్ ఇండియా తృణమూల్ పార్టీ	29
ద్రావిడ మున్నేట్ర కజగం	22
తెలుగు దేశం	16
జనతా దల్ (యునైటెడ్)	12
శివసేన (ఉద్ధవ్ బాలసాహెబ్ థాక్రే)	9
ఎన్‌సీపీ (శరత్‌చంద్ర పవార్)	8
రాష్ట్రీయ జనతాదల్	4
లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్)	5
కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు)	4
శివ సేన	7
వైఎస్ఆర్‌సీపీ	4
కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా	2
ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్	3
ఆమ్‌ఆద్మీ పార్టీ	3
జనసేన పార్టీ	2
సీపీఐ (ఎంఎల్)(ఎల్)	2
జనతాదల్ (సెక్యూలర్)	2
బిజ్జు జనతాదల్	0
విడుతలై చిరుతైగల్ కచ్చి	2
రాష్ట్రీయ లోక్‌దల్	2
జార్ఖండ్ ముక్తి మోర్చా	3
జేకేఎన్	2
యునైటెడ్ పీపుల్స్ పార్టీ, లిబరల్	1
అసోం గాణ పరిషద్	1
హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యూలర్)	1
కేరళ కాంగ్రెస్	1
రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ	1
ఎన్‌సీపీ	1
వాయిస్ ఆఫ్ ద పీపుల్స్ పార్టీ	1
జోరమ్ పీపుల్స్ మూమెంట్స్	1
శిరోమణి అకాలి దల్	1
రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ	1
భారత్ ఆదివాసీ పార్టీ	1
సిక్కిం క్రాంతికారి మోర్చా	1
పట్టాలి మక్కల్ కట్చి	0
ఎండిఎంకే	1
అప్నాదల్	1
ఏఎస్‌పీకేఆర్	1
ఏజేఎస్‌యూపీ	1
ఏఐఎంఐఎం	1
ఇండిపెండెంట్	7

ఒడిశాలో బీజేపీ ఆధిక్యం

రాష్ట్రంలో నవీన్ పట్నాయక్ 24 ఏండ్ల పాలనకు తెర

- 147 స్థానాలకు గానూ 77 సీట్లతో ముందంజ
- 52 స్థానాలతో ఓటమి దిశగా అధికార బీజేడీ
- రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాల్లో 19 కమలానికే
- బీజేడీ, కాంగ్రెస్‌లకు చెరొక సీటు





భువనేశ్వర్ : ఒడిశాను దాదాపు రెండున్నర దశాబ్దాలుగా పాలించిన నవీన్ పట్నాయక్ పాలనకు తెరపడనున్నది. ఇన్నాళ్లూ తిరుగులేని శక్తిగా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపిన ఆయన.. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారానికి కావాల్సినన్ని సీట్లు సాధించక విఫలమవటంతో సీఎం పీఠాన్ని కోల్పోవాల్సి వస్తున్నది. రాష్ట్ర అసెంబ్లీతో పాటు లోక్‌సభ స్థానాలకు ఒకేసారి జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ బిజూ జనతా దళ్(బీజేడీ) చతికిలపడిపోయింది. ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడిస్తున్న ఫలితాల్లో ఆశించిన స్థాయిలో రాణించలేక పోయింది. ఒడిశా అసెంబ్లీలో మొత్తం 147 స్థానాలుండగా, రాష్ట్రంలో 21 లోక్‌సభ సీట్లు ఉన్నాయి.

ఈసీ ఫలితాల ప్రకారం.. రాష్ట్రంలోని అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆధిక్యం కనిపించింది. అసెంబ్లీ సీట్లలో మ్యాజిక్ ఫిగర్(74)ను దాటి మరీ 78 స్థానాల్లో ఆ పార్టీ ముందంజలో ఉన్నది. దీంతో 24 ఏండ్లు ఒడిశాను పరిపాలించిన నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ ప్రభుత్వం అధికారానికి దూరం కానున్నది. సుదీర్ఘ కాలం తర్వాత రాష్ట్రంలో తొలిసారి బీజేడీయేతర ప్రభుత్వం ఏర్పాటు కానున్నది. అధికార బీజేడీ 51 స్థానాల్లో లీడింగ్‌లో ఉన్నది. కాంగ్రెస్ 14 అసెంబ్లీ స్థానాల్లో ముందంజలో ఉన్నది. సీపీఐ(ఎం) చేతిలో ఒక స్థానం ఉన్నది. స్వతంత్రులు మూడు స్థానాల్లో ఆధిక్యం కనబర్చారు. ఒడిశాలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ కమలం పార్టీ సత్తా చాటింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం 21 స్థానాల్లో 19 సీట్లను ఆ పార్టీ దక్కించుకున్నది. బీజేడీ, కాంగ్రెస్‌లు మాత్రం చెరొక స్థానంతో సరిపెట్టుకున్నాయి.

రికార్డు జస్ట్ మిస్..!

భారత్‌లో సుదీర్ఘకాలం సీఎంగా పని చేసినవారి జాబితాలో కొన్ని రోజుల తేడాతో నవీన్ పట్నాయక్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్నారు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఉంటే నవీన్ పట్నాయక్ అత్యధిక కాలం సీఎంగా కొనసాగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచేవారు. అయితే, ప్రస్తుతం ఎన్నికల ఫలితాల్లో ఆయన మ్యాజిక్ ఫిగర్‌ను కూడా దాటకపోవటంతో రెండో స్థానానికే ఆయన పరిమితం కానున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. భారత్‌లో అత్యధిక కాలం సీఎంగా పని చేసిన రికార్డు పవన్ కుమార్ చామ్లింగ్ (24 ఏండ్లు, 165 రోజులు) పేరు మీద ఉన్నది. మూడో స్థానంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 23 ఏండ్లు పాలించిన జ్యోతి బసు ఉన్నారు.

అమరావతికి మళ్లీ కళ

- ఐదేండ్లుగా ముళ్ల తుప్పలతో నిండిన నగరం
- ఆందోళన విరమణపై జేఏసీ నిర్ణయం



అమరావతి : ఐదేండ్లు గా ముళ్ల తుప్పలతో నిండిన ఏపీ రాజధాని అమరావతికి మళ్లీ కళ వచ్చింది. ఈ ప్రాంతాన్ని గత ఐదేండ్లు గా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మూడు రాజధానుల పేరుతో అభివృద్ధిని పక్కనపెట్టింది. మాస్టర్ ప్లానులో మార్పులు చేర్పులు చేసింది. దీనిపై రైతులు ఐదేళ్లుగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మరలా అమరావతి వ్యవహారాన్ని ముందుకు తీసుకురానున్నారు. 9న అమరావతిలోనే ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రచారంతో నడుస్తోంది. దీంతో తుళ్లూరు, మందడం, వెంకటపాలెం, వెలగపూడితోపాటు అన్ని శిబిరాల్లోనూ రైతులు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఇప్పటి వరకూ నిర్వహించిన శిబిరాల విరమణ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే తేదీ ప్రకటిస్తామని ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తెలిపారు. ఈ ఐదేళ్లలో రైతులపైనా పోలీసులు పెద్దయెత్తున కేసులు నమోదు చేశారు. అరెస్టులు చేశారు. కనీస ప్రదర్శనలకు అనుమతినివ్వకుండా వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై రైతులు కోర్టులను కూడా ఆశ్రయించారు. అలాగే సీఆర్‌డీఏ చేస్తున్న మాస్టర్‌ప్లాను మార్పులపైనా, మూడు రాజధానుల ప్రకటనపైనా రైతులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టు మూడు రాజధానుల అంశానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. అంతకముందు ఇదే అంశంపై అసెంబ్లీలో బిల్లు పెట్టిన ప్రభుత్వం దాన్ని వెనక్కు తీసుకుంటూ ప్రకటన చేసింది. విశాఖలో రాజధాని అంటూ అక్కడ రిషికొండను ధ్వంసం చేసి భారీ ఎత్తున భవనాలు నిర్మించారు. వందల కోట్లు ఖర్చు చేశారు. అమరావతి నిర్మాణం కోసం తీసుకొచ్చిన వస్తువులను దొంగలు ఎత్తుకుపోతున్నా ప్రభుత్వం మిన్నకుండి పోయింది. చివరకు రైతులే వాటిని అడ్డుకోవాల్సి వచ్చింది. అలాగే చట్ట ప్రకారం రైతులకు చెల్లించాల్సిన వార్షిక కౌలు కూడా నిరంతరం పెండింగ్ పెడుతుండటంతో దానికోసమూ రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాల్సి వచ్చింది. ఇలా ప్రభుత్వం చట్టపరంగా చేయాల్సిన పనులను పక్కనపెట్టేయడం, పట్టించుకు నేవారు లేకపోవడంతో ప్రతిదీ కోర్టు ద్వారానే పరిష్క రించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రికీ వేయనన్ని మొట్టికాయలు హైకోర్టు సీఎంకు, వైసీపీ ప్రభుత్వానికి వేసింది. ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో అమరావతికి మంచి రోజులు వచ్చాయని రైతు ప్రతినిధులు రామారావు, నరసింహారావు పేర్కొన్నారు.


మోడీతో పాటు అదానీ ఓడిపోయారు



(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మోడీ, అమిత్ షా వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడేందు పోరాటం చేశామని, ఇందుకు ఇండియా బ్లాక్ ఐక్యంగా పని చేసిందని రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై మోడీ ప్రచారాన్ని ఎవరూ నమ్మలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. ఇండియా బ్లాక్‌కు ప్రజలు అండగా నిలబడ్డారని అన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రతో కాంగ్రెస్ పుంజుకుందని తెలిపారు. మోడీ పాలనలో విపక్షాలను ఈడీ, సీబీఐతో బెదిరించారని తెలిపారు. ఇండియా బ్లాక్ నేతలు ఏకతాటిపై నిలిచారని అన్నారు. ఐకమత్యంతో మంచి ఫలితాలు సాధించామని, దేశంలో ప్రజాస్వామ్యం గెలిచిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదని.. ఇది మోడీకి ఘోర పరాజయమని విమర్శించారు.

బీజేపీ, ఎన్డీయేపై ప్రజల్లో విశ్వాసం



(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లో విశ్వాసం ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో మంగళవారం ఆయన బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ప్రసంగిస్తూ.. మహిళలతోపాటు ఓటర్లందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తన నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవచ్చని ఆయన సూచించారు.

మట్టికరిపించారు

కేఎల్ శర్మ నుంచి యూసుఫ్ పఠాన్ వరకూ..
కేంద్ర మంత్రులు.. మాజీ మంత్రులను ఓడించారు

న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలంగా దేశ రాజకీయాల్లో ఆధిపత్యం ప్రదర్శించిన బీజేపీ.. 2024-లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నది. బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమి తిరిగి అధికారం చేపట్టే అవకాశాలు ఉన్నా.. తక్కువగా అంచనా వేసిన కాంగ్రెస్ పార్టీ సారధ్యంలోని ఇండియా బ్లాక్ అనూహ్య ఫలితాలు సాధించింది. సుదీర్ఘంగా సాగిన ఈ ఎన్నికల్లో ప్రముఖులు పలువురిని మట్టికరిచారు.

సుల్తాన్‌పూర్‌లో మేనకాగాంధీ ఔట్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సుల్తాన్ పూర్ నుంచి సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి మేనకాగాంధీ ఓటమి పాలయ్యారు. ఆమెపై ఎస్పీ అభ్యర్థి రాంభువాల్ నిషాద్ ఆధిపత్యం ప్రదర్శించారు. 2019లో బీఎస్పీ అభ్యర్థి చంద్రభద్ర సింగ్‌పై 15 వేల మెజారిటీతో గెలుపొందారు.

అమేథీ జెయింట్ కిల్లర్ కిశోర్‌లాల్ శర్మ

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి గత ఎన్నికల్లో తొలిసారి ప్రాతినిధ్యం వహించిన కేంద్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ ఓటమి పాలయ్యారు. గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న కిశోర్ లాల్ శర్మ విజయ బాట పట్టారు. 25 ఏండ్ల తర్వాత తొలిసారి అమేథీ నుంచి గాంధీయేతర నేత పోటీ చేసి గెలుపొందడం గమనార్హం.

బారాముల్లాలో ఫరూఖ్ అబ్దులాకు ఓటమి

జమ్మూకశ్మీర్ రాజకీయాల్లో తొలి నుంచి కీలక పాత్ర పోషించిన నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ఓటమిని అంగీకరించారు. బారాముల్లా నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజీనీర్ రషీద్ గెలుపొందారు. ఇంజీనీర్ రషీద్‌ను 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా అభినందించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఆయన ప్రాతినిధ్యం వహించారు.

మెహబూబాపై ఆధ్యాత్మిక నేత మియాన్ అల్తాఫ్ అహ్మద్ గెలుపు

బకేర్వాల్, గుజ్జర్ సామాజిక వర్గాల నుంచి ఆధ్యాత్మిక నేతగా పేరొందిన మియాన్ అల్తాఫ్ అహ్మద్.. అనంత నాగ్ స్థానం నుంచి విజయం సాధించారు. పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షురాలు, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ పై ఆయన గెలుపొందారు.

బహరాంపూర్ నుంచి అధీర్‌కు యూసుఫ్ పఠాన్ చెక్

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బహరాంపూర్ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా ఐదుసార్లు గెలుపొందుతూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరికి తణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి.. రాజకీయ అరంగ్రేటం చేసిన యూసుఫ్ పఠాన్ చెక్ పెట్టారు. అధీర్ రంజన్ చౌదరిపై యూసుఫ్ పఠాన్ విజయం.. మమతా బెనర్జీ కీలక గెలుపు.

భూపేష్ భాఘేల్‌ను మట్టి కరిపించిన సంతోష్ పాండే

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజ్‌నందన్‌గావ్ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించిన బీజేపీ అభ్యర్థి సంతోష్ పాండే.. మాజీ సీఎం భూపేష్ బాఘేల్ మీద విజయం సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా బీజేపీకి గట్టి పట్టు ఉన్న స్థానంగా రాజ్‌నందన్‌గావ్ నుంచి భూపేష్ బాఘేల్ ఓటమి పాలవ్వడం కాంగ్రెస్ పార్టీకి నిరాశనే మిగిల్చింది.



బంజారాహిల్స్‌లోని సీఎం నివాసం దగ్గరలో తాగు నీరు లీకై ఇలా రోడ్డు పై పారుతోంది. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | జూన్ 05, 2024 | www.navatelangana.com



ఓయూలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపును మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. అందుకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంలో దృశ్యం.

ఉత్కంఠకు తెర

సికింద్రాబాద్‌లో బీజేపీ... హైదరాబాద్‌లో మజ్లిస్

పాత అభ్యర్థులదే విజయం

తమ స్థానాలు నిలబెట్టుకున్న అసదుద్దీన్ ఓవైసీ, కిషన్‌రెడ్డి





నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ ఎంపీ ఎన్నికల్లో ఉత్కంఠకు తెరపడింది. గ్రేటర్‌లో ఎంపీ ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర చర్చ జరిగి. ఎగ్జిట్ పోల్స్ వచ్చిన తర్వాత ఈ ఉత్కంఠ మరింత పెరిగింది. గ్రేటర్‌లో ముఖ్యంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకర్గంపై చర్చ జరిగింది. మారిన రాజకీయ సమీకరణాలతో గెలుపు తమ దేంటే తమదే అంటూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలో లెక్కలేసుకున్నాయి. హైదారాబాద్ లోక్‌సభ ఎన్నికను ప్రతిష్టాత్మంగా తీసుకున్న బీజేపీ గతంకంటే కూడా అధిక ప్రభావం చూపుతుందని బీజేపీ శ్రేణులు భావించారు. కానీ అందరూ ఊహించినట్టుగానే హైదరాబాద్ పార్లమెంట్‌లో అసదుద్దీన్ ఓవైసీ గెలుపొందగా, సికింద్రాబాద్‌లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి తిరిగి రెండో సారీ విజయం సాధించారు.

పోటీలో 75 మంది అభ్యర్థులు

పార్లమెంట్ ఎన్నికలకు ఏప్రిల్ 18 నోటిఫికేషన్ విడుదల కాగా, మే 13 పోలింగ్ జరిగింది. జూన్ 4న కౌంటింగ్ పూర్తయింది. హైదారాబాద్ పార్లమెంట్‌లో 30 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, సికింద్రాబాద్ పార్ల మెంట్ నియోజక వర్గంలో 45 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రెండు నియోజకవర్గాలల్లో మొత్తం 76 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. హైదరాబాద్‌లో ఎంపీ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లను ఏడు లెక్కింపు కేంద్రాల్లో, సికింద్రాబాద్ ఎంపీ స్థానంలోని ఏడు అసెంబ్లీల ఓట్లను ఆరు కేంద్రాల్లో లెక్కించారు.

రౌండ్ రౌండ్‌కు పుంజుకున్న కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 10,47,939 ఓట్లకుగాను 280 ఓట్లు చెల్లలేదు. 5166 ఓట్లు నోటాకు వేశారు. సికింద్రాబాద్‌లో మొదటి రౌండ్ నుంచే కిషన్‌రెడ్డి ఆధిక్యాన్ని ప్రదర్శించారు. మొదటి రౌండ్ పూర్తయ్యే సరికి బీజేపీ అభ్యర్థి 32,193 ఓట్లతో మొదటి స్థానంలో నిలువగా, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ 20516 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి టీ.పద్మారావుకు 8162 ఓట్లు వచ్చి మూడో స్థానం లో ఉన్నారు. ఇక 20వ రౌండ్‌లో జీ.కిషన్‌రెడ్డికి 468311 ఓట్లురాగా, దానం నాగేందర్ 420220 ఓట్లు సాధించారు. పద్మారావు 128680 ఓట్లుతో మూడో స్థానంలో కొనసాగారు. చివరి రౌండ్ వచ్చేసరికి కిషన్‌రెడ్డికి 4,73,012 ఓట్లురాగా, దానం నాగేందర్‌కు 4,23,068 ఓట్లు వచ్చాయి. పద్మారావు 1,29,586ఓట్లు సాధించారు. కిషన్‌రెడ్డి 49,944 మెజార్టీ సాధించారు. హైదరాబాద్ పార్ల మెంట్ నియోజకవర్గంలో అసదుద్దీన్ ఓవైసీకి 661981 ఓట్లు వచ్చాయి. 3,38,087 మెజార్టీ సాధించారు. మాధ వీలతకు 3,23,894 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ వలివుల్లా సమీర్‌కు 62,962ఓట్లు వచ్చాయి.



జనావాసాల మధ్య వ్యర్థాలు వేయకండి

- శానిటైజేషన్ అధికారులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ ప్రాంతంలో వ్యర్థాలు వేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని, జనావాసాల మధ్య ఏ ఒక్కరూ వ్యర్థాలు వేయవద్దని శానిటైజేషన్ అధికారులు అన్నారు. ఫిలింనగర్ ప్రాంతంలో కొందరు వ్యర్థాలు వేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో శానిటైజేషన్ అధికారులు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి క్లీన్ చేయించారు. అనంతరం ప్రత్యేక ముగ్గులు వేసి ఆ ప్రాంతంలో చెత్త వేయొద్దని సూచించారు. వారు మాట్లాడుతూ రహదారులపై వేయడం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. వచ్చే వర్షాకాల సీజన్ దృష్టిలో ఉంచుకొని ప్రజలందరూ అనారోగ్యాల బారిన పడకుండా శానిటైజేషన్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

ఇండియా కూటమిదే నైతిక విజయం

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి చెనగని దయాకర్

నవతెలంగాణ-ఓయూ



ఇండియా కూటమి దే నైతిక విజయం అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి చెనగని దయాకర్ అన్నారు.ఇండియా కూటమి ఇంత గొప్ప విజయం ప్రజల విజయం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ పై భాగస్వామ్య పక్షాల మద్దతు సన్నగిల్లిందని, బీజేపీ నియంత పాలన త్వరలో కూలిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలోని బీజేపీకి కొంత ప్రభావం చూపినా.. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు తోనే 8 సీట్లు గెలించిందని అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 70 వేల ఓట్లు రాలేదని ఇప్పుడు 3 లక్షల, 92 వేల ఓట్లు ఎలా వచ్చాయంటే బీఆర్ఎస్ బీజేపీ ప్రతి చోటా కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడిన్నట్టు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ కూడా బీజేపీ గెలవదన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో నితీష్ కుమార్, చంద్రబాబు ఆలోచిస్తారాన్నారు. ఇండియా కూటమి గద్దె నెక్కడం ఖాయమన్నారు. ఇండియా కూటమితోనే ప్రజా స్వామ్య రక్షణ అన్నారు. మోడీ గ్రాఫ్ పడిపోయిందని అన్నారు. రాహుల్ గాంధీ లాంటి నేత దేశానికి అవసరం అన్నారు.



బీజేపీ సంబరాలు

నవతెలంగాణ-ఓయూ

మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజారిటీతో గెలవడంతో పార్టీ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కక్కిరేణి హరీష్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి టపాకాయలు కాలుస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ శాసనసభ్యులు భేతి సుభాష్ రెడ్డి హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ , డివిజన్ నాయకులు కార్యకర్తలు భూత్ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బంజారాహిల్స్



గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భిక్షాటన చేస్తూ రహదారులపై నివసించే సుమారు 50 నుండి 55 సంవత్సరాల వ్యక్తి శ్రీనగర్ కాలనీ రత్నదీప్ సూపర్ మార్కెట్ సమీపంలో కదలకుండా కొన్ని గంటలుగా అలాగే పడుకుని ఉన్నాడు. స్థానికులు అది చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గమనించగా అతను మృతి చెందనట్టు గుర్తించారు. స్థానికులందరినీ అడిగి.. తెలిసిన వారు ఎవరైనా ఉంటే సమాచారం ఇవ్వాలని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వివరాలు తెలియజేయాలని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ఇండియా కూటమిదే అసలైన గెలుపు

- జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ - ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థులు సాధించిన విజయమే నిజమైన గెలుపు అని జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి తెలంగాణ కార్మిక సంఘం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇటు తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ, ప్రజల అభిమానాన్ని చూరగొన్నదని తెలిపారు. ఓటు బ్యాంక్ ను సైతం కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో పెంచుకోవడం ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అభిమానానికి నిదర్శనం అన్నారు. దేవుడు పేరు చెప్పి ఓట్లు దండుకోవాలని చూసిన బీజేపీకి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సైతం తగిన బుద్ధి చెప్పి ఓడించారన్నారు. రాహుల్ గాంధీ యువ నాయకత్వం కావాలనే అత్యధిక యువత తమ ఓటుతో మెజారిటీ సీట్లు గెలిపించారని తెలిపారు. తెలంగాణ లో 8 లోక్ సభ సీట్లు సాధించి, గెలుపు కోసం శ్రమించిన సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో కేంద్రంలో సైతం కాంగ్రెస్ అధికారం చేపట్టే శుభ పరిణామాలు రావాలని ఆకాంక్షించారు.

8 సీట్లు ఇచ్చి నూతన అధ్యాయానికి తెర లేపారు

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లోకి..
- సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

బీజేపీకి తెలంగాణ ప్రజలు 8 సీట్లు ఇచ్చి నూతన అధ్యాయానికి తెర లేపారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌లో ఆయన గెలుపొందారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో ఉన్న డీఆర్‌సీ కేంద్రంలో ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారుల నుంచి వారు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ చరిత్రలో తెలంగాణలో స్వతంత్రంగా పోటీ చేసి 8 పార్లమెంటు సీట్లు సాధించి నూతన రాజకీయ అధ్యయ నానికి తెరలేపామని అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఎనిమిది పార్లమెంట్ స్థానాల్లో ప్రజలు బీజేపీని గెలిపించడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ప్రధానమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయ, సహకారాలతో తెలంగాణ అభివృద్ధికి కషి చేస్తానని చెప్పారు. తన విజయానికి కృషి చేసిన పార్లమెంట్ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుకు

కేంద్రంలో చక్రం తిప్పే సమయం వచ్చింది



- సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ , స్కూల్ ఆఫ్ సీబీఎన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు
- టీడీపీ గెలుపుతో ఓయూలో సంబరాలు

నవతెలంగాణ-ఓయూ

మళ్ళీ చంద్రబాబు నాయుడకు కేంద్రంలో చక్రం తిప్పే సమయం వచ్చిందని సీబీఎస్ ఫ్యాన్స్ అసోసియేషన్ , స్కూల్ ఆఫ్ సీబీఎన్ వ్యవస్థావ అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు అన్నారు. కీలకమైన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు గొప్ప నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపొందడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట మంగళవారం ఉదయం చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ సీబీఎన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు చిత్రపటానికి బుడిద గుమ్మడికాయతో దిష్టి తీసి స్వీట్స్ పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం నృత్యాలు చేశారు. మళ్ళీ బాబుకు కేంద్రంలో చక్రం తిప్పే సమయం వచ్చిందన్నారు..ఆయనను ప్రధానిగా చేస్తే దేశం అన్ని రంగాల్లో పురోభివద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ యాదవ్ , నాయుడు , వేమూరు సతీష్ , శ్రీనివాస్, మురళీ కష్ణ , రాజ్ , రాము, జనసేన విద్యార్థి విభాగం, ఓయూ అధ్యక్షుడు వినోద్ నాయక్, విద్యార్థి విభాగం సభ్యులు సతీష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్'లో కాంగ్రెస్ జోరు



- కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం కంచుకోట అని నిరూపించిన ఓటర్లు
- కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు జూబ్లీహిల్స్‌లో భారీగా ఓట్లు
- ఓట్ల లెక్కింపు ప్రశాంతం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని నాయకులు, ఓటర్లు రుజువు చేశారు. మంగళవారం జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌లో నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో కాంగ్రెస్ ప్రతి రౌండ్‌లో మెజార్టీతో దూసుకుపోయింది. మొదటి రౌండ్ నుంచి పదో రౌండ్ వరకు బీజేపీ కంటే కాంగ్రెస్‌కు ఎక్కువగా ఓట్లు వచ్చాయి. అయితే 11, 12, 13 రౌండ్లలో మాత్రమే బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయి. 17 రౌండ్ల లెక్కింపు పూర్తయిన అనంతరం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు 1,76,466లో కాంగ్రెస్‌కు 89,705 ఓట్లు రాగా , బీజేపీకి 64,673 ఓట్లు మాత్రమే వచ్చాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 25,032 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇక బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావుకు కేవలం 18,405 ఓట్లు మాత్రమే వచ్చాయి. అదేవిధంగా నోటాకు 820 ఓట్లు రాగా.. ఇండిపెండెంట్ అభ్యర్థులకు మూడు అంకెలు, రెండు అంకెల ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

ఓట్ల లెక్కింపు ప్రశాంతం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఖైరతాబాద్ నియోజకవర్గం, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మంగళవారం ప్రశాంతంగా ముగిసింది.ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా సాయంత్రం 4 గంటలకల్లా ముగిసింది. పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	బీజేపీ ఓట్లు	కాంగ్రెస్ ఓట్లు	బీఆర్ఎస్ ఓట్లు
ముషీరాబాద్	77116	49435	21444
అంబర్‌పేట్	83048	41393	17183
ఖైరతాబాద్	73664	57124	16662
జూబ్లీహిల్స్	64673	89705	18405
సనత్‌నగర్	66849	34503	21285
నాంపల్లి	40423	103155	5554
సికింద్రాబాద్	62538	44905	28147
పోస్టల్	4701	2848	906
మొత్తం	4,73,012	4,23,068	1,29,586

కాంగ్రెస్, బీఆర్ఎస్ డిపాజిట్లు గల్లంతు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు డిపాజిట్లు కోల్పోయాయి. కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ వలివుల్లా సమీర్‌కు 5.83 శాతం ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు 1.73 శాతం ఓట్లు వచ్చాయి. దాంతో డిపాజిట్లు కోల్పోయారు. ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ 61.28 శాతం ఓట్లతో గెలుపొందగా బీజేపీ అభ్యర్థి మాధవీలతకు 29.98 శాతం ఓట్లు వచ్చి రెండో స్థానంలో నిలిచారు.

ఏపీలో టీడీపీ గెలుపుతో సంబరాలు



నవతెలంగాణ-ఓయూ

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఘనవిజయం సాధించినందుకు టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ కుమార్ అధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో , మానికేశ్వరీనగర్, తార్నాక స్ట్రీట్ నెంబర్ 1,లో మిఠాయిలు , పండ్లు పంచి , పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షులు గరిగే ప్రవీణ్ కుమార్,అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు కాతా విజయ్ కుమార్ , మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు తడక వినోద్ కుమార్ , జగదీష్ గౌడ్, జీఎం.రమేష్ , హరిబాబు, బొట్టు సురేష్ , గండికోట గిరిబాబు ,విక్రమ్, పొట్టి శ్రీను , రాజు , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో టీడీపీ సంబరాలు..

బంజారాహిల్స్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో నగరంలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలో టీడీపీ నాయకులు విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ కేక్ కటింగ్‌లు చేసి సంబరాలు జరుపుకున్నారు. బంజారాహిల్స్ వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలో బాలాజీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించగా నరసింహులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
బుధవారం | జూన్ 05, 2024 | www.navatelangana.com

యాదవ ఐక్య వేదిక హర్షం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో యాదవ ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, (మైదుకూరు) కొలుసు పార్థ సారథి యాదవ్ (నూజివీడు), చావలి దివ్య యాదవ్ (తుని), ఎంఎం.కొండయ్య యాదవ్ (చీరాల), పల్లా శ్రీనివాస్ యాదవ్ (గాజువాక), వంశీకృష్ణ యాదవ్ (విశాఖ), సత్య కుమార్ యాదవ్ (ధర్మవరం పార్లమెంటు), పుట్టా మహేష్ యాదవ్ (ఏలూరు) విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ యాదవ ఐక్య వేదిక కన్వీనర్ యల్లావుల చక్రధర్ యాదవ్, మేకల రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ మహిళా అధ్యక్షురాలు ఎంబి.దుర్గ మాధవి యాదవ్, నాగెల్లి అంజన్ యాదవ్, నంద కిషోర్ యాదవ్, బొట్ల మధు యాదవ్, నంద్యాల ప్రభాకర్ యాదవ్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-నాగోల్

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన మంగళవారం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మదిపల్లి గ్రామానికి చెందిన వరి కూరి సత్తయ్య (45) మంగళవారం భవన నిర్మాణ పనులలో కూలికి వెళ్లాడు. నిర్మాణం జరుగుతున్న ఇంటి మొదటి అంతస్తుపై ఎక్కి కింది నుంచి ఇనుప కడ్డీలను పైకి లాగుతుండగా ప్రమాదవశాత్తు వాటికి మేడపై ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. దాంతో అతను విద్యుద్ఘాతానికి గురై గాయపడ్డాడు. సత్తయ్యను వెంటనే లక్ష్మీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుని కుమారుడు వరి కూరి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు నాగోల్ పోలీసులు తెలిపారు.

ఓట్ల లెక్కింపు ప్రశాంతం



- సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- ఆర్వో, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లోక్‌సభ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రజా ప్రతినిధులు అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు, ప్రజలకు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా పూర్తయిందని పేర్కొన్నారు. మంగళవారం ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా సాగిందని ఆయన వివరించారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియలో భాగస్వాములైన అధికారులకు సిబ్బందికి అందరికి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంతో కష్టపడి పని చేశారని ఆయన గుర్తుచేశారు. ఎన్నికల నిర్వహణ కోసం ముందు జాగ్రత్తగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 22,06,654 మంది ఓటర్లు ఉండగా.. 46.08 శాతం పోలింగ్ నమోదైందన్నారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో అసదుద్దీన్ ఓవైసీకి 6,61,987, మాధవీలత కొంపెల్లకు 3,23,894 ఓట్లు, మొహమ్మద్ వలీవుల్లా సమీర్‌కు 62,962 ఓట్లు, కేఏస్ కృష్ణకు 769 ఓట్లు, గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు 18,641 ఓట్లు వచ్చాయని.. ఇందులో అసదుద్దీన్ ఓవైసీ 3,38,087 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్టు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

ఈటలకు వీరతిలకం దిద్దిన కార్పొరేటర్ సతీమణి



నవతెలంగాణ-హాయత్ నగర్

పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నుండి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌కు కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి సతీమణి వీరతిలకం దిద్దారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు అనంతరం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం ఎన్నికల కౌంటింగ్ నుండి నేరుగా మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి ఇంటికి ఈటల చేరుకున్నారు. 3 లక్షల 50వేల మెజారిటీతో గెలిచినందున కార్పొరేటర్ సతీమణి లతా నర్సింహారెడ్డి వీరతిలకం దిద్ది ఇంట్లోకి ఆహ్వానించారు. ఆయన ఇంటికి భారీగా బీజేపీ కార్యకర్తలు తరలివచ్చారు.

త్యాగరాయ గానసభ కళామయం



నవతెలంగాణ-కల్చరల్

పలు రంగాలలో ప్రముఖులు చిత్ర పటాలు ఆడిటోరియం లో ఏర్పాటు తో పాటు నాలుగు వేదికల్లో కళా ప్రదర్శనలు తో నిత్యం కళామయం రూపొందిందని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ ప్రశంసించారు. ఎందరో మహానుభావులు పేరిట గత కాలపు ప్రఖ్యాతులు స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అపురూపం అని అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ వ్యవస్థాపక దినోత్సవ రెండో రోజు కార్యక్రమం గాన సభ ప్రధాన వేదిక పై జరిగింది. గాన సభ నాట్య గురువు తులసి శిష్య బృందం చే కూచి పూడి నాట్య ప్రదర్శన సంగీత గురువు సుష్మ బృందం గాన గోష్ఠి ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ గా విస్తరించినా రవీంద్ర భారతి గాన సభ మాత్రమే ప్రముఖ వేడుకలు అన్నారు. ఐదున్నర దశాబ్దాల పైగా గాన సభ ప్రస్థానం లో కళా సుబ్బారావు కళా దీక్షితులు అనంతరం జనార్ధన మూర్తి అధ్యక్షులుగా కృషి చేశారని అభినందించారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ గుండవరపు హనుమంత రావు సహకారం తో గాన సభ నిర్మాణం జరిగిందని తెలిపారు ఎందరో వివిధ రంగాలకు చెందిన కళా కారులు తొలి ప్రదర్శన గాన సభ లో ఇచ్చి దేశ విదేశాల్లో ప్రదర్శనకు వెళ్ళేవారని అన్నారు. డాక్టర్ రమణ ప్రభుత్వ అధికారిగా వున్న సమయంలో గాన సభకు ఎంతగానో అండ దండలు అందించారని ధన్య వాదాలు చెప్పారు వేదిక పై బండి శ్రీనివాస్ ఉష తదితరులు పాల్గొన్నారు



బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ భారీ మెజారిటీతో విజయం సాధించటం పట్ల బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో బీజేపీ జల్ పల్లి మున్సిపల్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కపిల్ గౌడ్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.భారీగా ఓట్లు వేసి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి సహకరించిన ప్రజలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-బడంగ్ పేట్

దీన స్థితిలో మలిదశ ఉద్యమకారుడు



- బొగ్గు హమాలి రోజువారి కూలీ వదిలి ఉద్యమంలోకి ఇందారపు ఎల్లయ్య
- తెలంగాణ జేఏసీలో ప్రచార కార్యదర్శిగా కీలక పాత్ర
- స్వరాష్ట్ర సాధన దిశగా విస్తృత సేవలు
- ప్రస్తుతం రోడ్ల వెంట ఛాయ్ బిస్కెట్లు అమ్ముకుంటూ దీన స్థితిలో..





నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన ఉద్యమకారుడు ఇందారపు ఎల్లయ్య ప్రస్తుతం దీన పరిస్థితిలో ఉన్నారు. ఉండేందుకు నిలువ నీడ లేక కిరాయి అద్దెలతో అనారోగ్యంతో పాటు, బతుకుతెరువు కోసం ఉద్యమకారుడు గండి మైసమ్మ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద లారీల అడ్డాలలో చాయ్ బిస్కెట్స్ అమ్ముతూ అర కొర 50 ,100 రూపాయలతో బతుకు బండి లాగిస్తున్నాడు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పార్టీ ప్రతినిధులతో పాటు కౌన్సిలర్లను, నాయకులను కలిసి మానవత్వంతో తన కుటుంబ పరిస్థితిని చూసి పొట్ట గడవడం కోసం సహకరించి ఉపాధి అవకాశం కల్పించగలరని ప్రాధేయపడిన ఏ ఒక్కరు కనికరించలేదని ఆయన వాపోతున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో ప్రస్తుతం ఇలాగే ఉన్నారు. ఉద్యమకారుడు ఇందారపు ఎల్లయ్యపై ప్రత్యేక కథనం

ఉద్యమకారుడు ఇందారపు ఎల్లయ్య మనోగతం....

'తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేండ్లయినా ప్రజల బతుకు మాత్రం మారలేదు. ఇలా ఎందరో తెలంగాణ రాష్ట్రం కోసం వందలు, వేల సంఖ్యలో వారి కుటుంబాలు పేదరికంలో మనోవేదనతో కొట్టుమిట్టాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఎంతో ఆశలు పెట్టుకున్న అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రజా పాలనలో ఒరగబెట్టిందేమీ లేదు. ప్రజలకు ఉద్యమం పేరు చెప్పి నమ్మించి మోసం చేయడమే కాకుండా వారే కోట్లాధిపతులు అయ్యారు. స్వరాష్ట్ర సాధనలో ప్రజలకు నీళ్ల,నిధులు, ఉద్యోగాలు కల్పిస్తామని రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పారు. మలా దశ ఉద్యమంలో బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్వరాష్ట్ర సాధన కోసం పుట్టుకు వచ్చిన అనేక పార్టీలను అధినాయకులను తన పార్టీలో విలీనం చేసుకొని హేమా హేమి నాయకులను మోసం చేశారు. పార్టీని ఉద్యమాన్ని నమ్ముకుని వచ్చి సంవత్సరాలుగా పార్టీకి సేవలు చేసిన వారితో పాటు ఉద్యమమే ప్రధానమని మలీ దశ ఉద్యమాన్ని నమ్ముకున్న వేలసంఖ్యల ఉద్యమ కారుల కుటుంబాలను విస్మరించారు.

మలిదశ ఉద్యమకారుడు ఇందారపు ఎల్లయ్య నేపథ్యం


ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుత భూపాల్ పల్లి జయశంకర్ జిల్లా తాడిచెర్ల మలహర్రావ్ మండల్ గ్రామానికి చెందిన ఇందారపు ఎల్లయ్య ఉపాధి కోసం 2001లో హైదరాబాదుకు వచ్చాడు. కుత్బుల్లాపూర్ గండి మైసమ్మ చౌరస్తా సమీపంలో అద్దెనివాసంలో ఉంటూ బొగ్గు లారీ లోడింగ్ కూలి పని చేస్తూ భార్య పిల్లలతో నివసించసాగాడు. స్వతహాగానే వ్యక్తిగతంగా సామాజిక కార్యకర్త కావడంతో 2014లో మలిదశ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జేఏసీలు ఉదతంగా పనిచేస్తుండడంతో సర్దారి ఎల్లారెడ్డి నేతృత్వంలో గండి మైసమ్మ జాయంట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రచార కార్యదర్శిగా ప్రత్యేక రాష్ట్రం కోసం చురుకైన పాత్ర పోషించి తన బీద కుటుంబ స్థితిని సైతం పక్కన పెట్టి ఉద్యమం ఊపిరిగా ముందుకు నడిచారు. ఆ సమయంలో ఉద్యమకారులకు సంఘీభావం తెలపడం కోసం పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఇక్కడ ముందు వరుసలో నిలిచి నడిపించిన సంగతి తెలిసిందే. అలాగే రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, కోదండరాం అద్దంకి దయాకర్, రసమయి బాలకిషన్, దీక్ష శిబిరాలకు వచ్చిన సంగతి అందరికీ తెలిసిన విషయమే. సబ్బండ వర్గాల ప్రజలు తెలంగాణ ఆకాంక్ష ఉద్యమంలో ఎంతోమంది ఉద్యమకారులు ఆర్థికంగా కుటుంబం గడవని పరిస్థితులలో జేఏసీని ముందుకు నడిపించారు. తన వృత్తి బొగ్గు హమాలి అడ్డాలో అప్పుడప్పుడే చిన్న చిన్నగా బొగ్గు కొనుగోలు వ్యాపారం చేసుకొని చుట్టుపక్కల కమీషన్ బేసిస్‌తో అమ్ముకునే వ్యాపారంలో ఆర్థికంగా వెనుకబడి ఉండి కూడా జేఏసీలు కుటుంబాన్ని సైతం మరిచి ఉద్యమం కోసం పనిచేస్తూ అరెస్టులు సైతం అయ్యాడు. ఎందరో నాయకులు కార్యకర్తలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు పిల్లల భవిష్యత్తుకు నాటి బీఆర్ఎస్ నాయకుల మాటలకు నమ్మి పని చేశారు. గండి మైసమ్మ కేంద్రంగానే తనలాంటి నాయకులు పోతారం మల్లేష్ ముదిరాజ్, డిపోచంపల్లి సర్పంచ్ మాధవరెడ్డి (చనిపోయిన) సాక్షిగా పాలకుర్తి సత్యనారాయణ, సారెగూడెం శ్రీశైలం, దార వీర స్వామి, చిన్నంగి లక్ష్మీనారాయణ , తెలుగుదేశం ప్రభుత్వంలో జెడ్పీటీసీ వైస్ ప్రెసిడెంట్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, లతో కలిసి పోరాటం చేసినట్టు ఇందారపు ఎల్లయ్య చెబుతున్నారు.

పోరాట సమయంలో దురదృష్టవశాత్తు తన భార్య అస్వస్థకు గురై క్యాన్సర్ వ్యాధి బారిన పడటంతో అప్పటికే నెలల తరబడి ఉద్యమం వైపు తిరిగిన తనకు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు భార్య ఆరోగ్యరీత్యా ప్రయివేటు ఆస్పత్రిలో రూ.18 లక్షలు ఖర్చు అయిందన్నారు. తన బీద కుటుంబానికి ఆర్థిక భారంతో ఊరిలోని వ్యవసాయ భూమి అమ్ముకొని ఆస్పత్రికి చెల్లించినా భార్య ప్రాణాలు మాత్రం దక్క లేదు. అంతటితో ఆగలేదు తన దురదృష్టం వెంటాడుతూ కొన్ని నెలలకే తనకు గుండెపోటు రావడంతో ఉష ముళ్ళపూడి ఆస్పత్రిలో చికిత్సతో బయట వచ్చినట్టు ఆయన చెప్పారు. కుటుంబ ఆర్థిక భారం డిగ్రీ వరకు చదివిన తన కూతురు బాధ్యతలు నెత్తిన వేసుకొని ప్రయివేటు స్కూల్లో పీఈటీ టీచరుగా విధులు నిర్వహిస్తూ మొత్తం కుటుంబాన్ని పోషించిందని తెలిపారు. అయితే ఇది ఒకవైపు అయితే తన తల్లి మరణించడం తండ్రికి గుండెపోటుతో భవిష్యత్తు ఆలోచించి మనోవేదనతో మనస్థాపంతో కూతురు ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. జరిగిన రెండు సంఘటనలతో ఉద్యమకారుడి కుటుంబ పరిస్థితి మరింత దిగజారి కనీసం ఇంటిఅద్దె కట్టే స్తోమత లేకపోయింది.

గతంలోనే చదువు ఆపేసిన తన పిల్లలిద్దరూ ఇంకా ఆర్థిక భారం మరింత తోడు కావడంతో గతంలోని బొగ్గు వృత్తిని నమ్ముకున్న ఎల్లయ్య అదే వత్తి చేసుకునేందుకు చుట్టుపక్కల కెమికల్ కంపెనీలలో బీఆర్ఎస్ నాయకులకు సంబంధాలు ఉన్న వారితో సంప్రదించినట్టు చెప్పారు. అందులో బొగ్గు సప్లైకు ఉపాధి కోసం ప్రజా ప్రతినిధులతో పాటు నాయకులను, కౌన్సిలర్లను, అడిగినట్టు చెప్పారు. అయితే చేస్తాం అన్న వారు ఏ ఒక్కరు సహాయం చేయలేదని, కాంగ్రెస్ నాయకులను సైతం అడిగినా ఎవరూ సహాయ పడలేదని ఎల్లయ్య తెలిపారు. తనకు ఏ డబుల్ బెడ్ రూమ్ లేదని, ఇంటి అద్దె తోపాటు కుటుంబం గడవడం కోసం దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు లారీల అడ్డా వద్ద, ప్రధాన రోడ్డులలో తిరుగుతూ ఉదయం, సాయంత్రం బిస్కెట్లు, టీ, అమ్ముకుంటూ ప్రస్తుతం జీవిస్తున్నట్టు చెప్పారు. రోజూ అన్ని ఖర్చులు తీసివేయగా రోజువారీగా 100 రూపాయలు రావడం జరుగుతుందని దానితో జీవనం కొనసాగిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ఉద్యమం నమ్ముకున్న వారి కుటుంబాలు ఇలా ఉంటే.. ఉద్యమంలో ఏనాడు ఏ ఒక్క పని చేయని వారూ లక్షాధికారులు , కోటీశ్వరులుగా ఎదిగాంన్నారు. పేదవాడికి కనీసం సాటి మనిషిగా గుర్తింపు లేదని, తనలాగా ఎందరో ఉద్యమకారులు నష్టపోయిన వారిలో ఉన్నారన్నారు. ఉద్యమ పార్టీ 10 సంవత్సరాల పాలనలో ముఖ్యంగా ఉద్యమ కారులకు, సామాన్య ప్రజలకు మేలు చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ వారైనా ఉద్యమంతో నష్టపోయిన వారికి చేయూతనిచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నట్టు ఎల్లయ్య తెలిపారు.







IN THE COURT OF THE HON'BLE ADDITIONAL-JUDICIAL FIRST CLASS MAGISTRATE:BHONGIR
O.S. NO. 423 OF 2021

BETWEEN:
Nalla Latha ... Plaintiff
AND
Pinniniti Ajay Reddy and others ... Defendants

To
9. Chinthala Snehalatha, W/o. Krishna Reddy, Age 41 years, Occ: House Hold,
10. Chinthala Krishna Reddy, S/o. Ram Reddy, Age 45 years, Occ: Agriculture,
Both are R/o. Alakapuri Colony, Road No.15, L.B. Nagar, Hyderabad.
...Respondents

NOTICE

That the above case is filed by the plaintiffs against the defendants for partition and separate possession of the suit schedule property and said matter is posted on 19-06-2024 for your appearance. If you fail to appear on 19-06-2024 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
G.NAVEEN KUMAR
ADVOCATE,
BHONGIR.

BEFORE THE HONOURABLE DISTRICT CONSUMER COMMISSION, HYDERABAD-I At: CHANDRA VIHAR, HYDERABAD
C.C.NO. 165 OF 2024

Between:
Mrs.ANUMANDLA LAKSHMI, D/o A.JANARDHAN REDDY, aged 42 years,Occupation: Advocate, R/o H.No.1-9-295/32, Poornima Mansion, Vidyanagar, Musheerabad, Hyderabad -500 044 ...COMPLAINANT
AND
Branch Manager-cum-Foreman, M/s.AKSHARA CHIT FUNDS PRIVATE LIMITED., & 2 Others ..OPPOSITE PARTIES 1 to 3

To,
1. Branch Manager-cum-Foreman, M/s.AKSHARA CHIT FUNDS PRIVATE LIMITED.,#5-5-1166, 2nd Floor, Plot No.2, ACE Krishna Arcade, Near Panama Signals, Opp:Swarishi Garden, Upstairs Ramraj Cotton, Vanasthalipuram, L.B.NAGAR, Hyd - T.S. 500070.
2. Asst.General Manager,M/s. AKSHARA CHIT FUNDS PRIVATE LIMITED.,Office Sy.No.9/1/F,Flat No.53, 3d Floor, Road No.13, Near Sai Baba Temple, Opp: Alkapuri Park,Hyd-500035. Tg Pin:500035.
(OPPOSITE PARTIES 1 & 2)

WHEREAS the Complainant above named filed the above Complaint against you and another. The same is coming up for your appearance to 19-06-2024 at 10.30 A.M. You are hereby summoned to appear either in person or through your pleader with your counter if any on the above date and time, failing which the matter will be heard and determined, exparte.

(BY ORDER OF THE HONOURABLE COMMISSION)
(K.VIJAYENDER REDDY)
ADVOCATE
15A, 3-4-757/22, IInd Floor, APHB Buildings, Barktpura, HYDERABAD-500 027
COUNSEL FOR COMPLAINANT

IN THE COURT OF THE HONB'LE JUNIOR CIVIL JUDGE: AT CHOUTUPPAL
O.S.NO. 294 OF 2022

Between:
Guntoju Kalamma. ... Plaintiff
AND
1. Kammari @ Kasoju Yadagiri and others

To
3. Mukroju Saritha, W/o. Satyanarayana Chary, D/o. Yadagiri, Age 34 years, Occ: House Wife, R/o. Munuganooru Village, Hayathnagar Mandal, Ranga Reddy District.
4. K. Hemalatha, W/o. Rajesh, D/o. Yadagiri, Age 32 years, Occ: House Wife, R/o. Hayathnagar Village and Mandal, Ranga Reddy
11. Kammari @ Kasoju Brahma Chary, S/o. Late Mallesh, Age 43 years, Occ: Carpenter, R/o. Munugunooru, Hayathnagar Village and Mandal, Ranga Reddy District.
16. Yerramshetti Kistaiah, S/o. Rangaiah, Age 50 years, Occ: Business, R/o. Vanasthalipuram, Hayathnagar Mandal, Ranga Reddy District.
17. Yerramshetti Padma, W/o. Kistaiah, Age 45 years, Occ: House Hold, R/o. Vanasthalipuram, Hayathnagar Mandal, Ranga Reddy District.
20. Simaik Asiya Mehboob, W/o.Mohd Zabiulla Ansari, Age 36 years, Occ: House Hold, R/o. H.No.16-11-1/5/B, Mahboob Gunj, Saleem Nagar, Amberpet, Malakpet Colony, Hyderabad – 500 0036.
...Defendants

NOTICE

That the above case is filed by the plaintiff against the defendants for partition and separate possession of the suit schedule property and said matter is posted on 06-06-2024 for your appearance. If you fail to appear on 06-06-2024 at 10.30AM before the above said Hon'ble Court either in person through your advocate, the matter will be decided exparte as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
P.MAHIPAL REDDY
ADVOCATE,
Choutuppal.

మహారాజశ్రీ ఫ్యామిలీ కోర్టు (కుటుంబ న్యాయస్థానం) ఇక్క వారి కోర్టు, ఖమ్మం.
FCOP 290/2023

బిట్వీన్:
పైడి మర్రి రమ్య @ దాసరి రమ్య ..... పిటీషనర్
మరియు
పైడి మర్రి వంకిశ్వర్ ..... రెస్పాండెంట్
టు,
పైడిమర్రి వంకిశ్వర్, తండ్రి. లేట్. సుబ్రహ్మణ్య శర్మ, వయస్సు 33, వృత్తి మెకానికల్ ఇంజనీర్, వెంజమూరి వెంకట సుబ్బారావు ఫ్లాట్ నెం 201, దరిత్రి సాయిధనం రెసిడెన్సీ కంట్రీ ఎస్టేట్ కాలని, సాకేత్ రోడ్, కాప్రా, సికింద్రాబాదు.

నోటీసు

పైన తెలిపిన కోర్టు నందు పిటీషనర్ భర్త అయిన మీరు అనగా పైడిమర్రి వంకిశ్వర్, మీపై మీ భార్య విడాకుల కొరకు దావా వేసినారు. మీ హాజరు నిమిత్తం తేది 11-6-2024న పైన తెలిపిన కోర్టు నందు ఉ.గం. 10:30 నిలుకు వాయిదా కలదు. కావున స్వయంగా గాని మీ న్యాయవాది ద్వారా గాని హాజరుకాగలరు. లేని యెడల మీ పై ఏకపక్షముగా పరిశీలించి నిర్ణయం తీసుకోగలరు.
//కోర్టు వారి అనుమతితో//
ఖమ్మం చింతనిపు వెంకట్
తేది.4-6-2024 ముప్పాళ్ళ సాయి రాజేష్
న్యాయవాదులు, ఖమ్మం

IN THE COURT OF THE HON-BLE XI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
I.A. No. 18 of 2024
In
L.G.O.P. 171 OF 2017
(LGC No. 86 OF 2013 OLD)

Between:
The State of A.P. Rep., by its Tahsildar, Shaikpet (M),Hyd. ...Petitioner
And
Dharama Charan Gallada ...Respondent

To,
Dharama Charan Gallada, R/o Plot no. 427, Road No. 22, Jubilee Hills, Hyderabad. .. respondent

NOTICE

Please take notice that as per the orders of the Hon'ble XI Addl. Chief Judge, City Civil Court, Hyderabad in I.A. No. 18 of 2024 in LGOP No. 171 of 2017 (LGC No. 86 of 2013 Old) which is posted for your appearance on 13.06.2024 and you are summoned to appear before the court on 13.06.2024 at 10.30 A.M. before the Hon'ble XI Addl. Chief Judge, City Civil Court, At Hyderabad, in person or by an advocate duly instructed. If you fail to appear on the above said date and time, the matter will be heard and determined in accordance with law.

(BY ORDER OF THE COURT)
M.S. TIRUMAL RAO,
Spl. G.P.,
City Civil Court HYD
16-1-24/299/2RT/TF2,
Saidabad Colony, Hyd-59.
Mobile No. 9966084834.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT NOTICE TO RESPONDENT ASIFABAD
I.A.No. 390 /2023
in Un Reg
A.S.NO: /2023.

BETWEEN:
Gomasa Lingaiah. ..Petitioner Appellant/Defendant
//AND//
Gadaveni Sudhakar ....Respondent/Plaintiff

To
Gadaveni Sudhakar, S/o. late Komuraiah, Age: 48 years, Occ: Business, R/o. Asifabad, Mandal Asifabad, District KB Asifabad, Presently Residing in H. No.1-1-1, Plot No.12,Srinivasa colony, Mohan Nagar, Kothapet, Hyderabad

Whereas Please take notice that the above named petitioners filed a petition against the respondent for appeal against the Petition Filed U/Sec. 5 Of Limitation Act, 1963 you are hereby required to appear before the Hon'ble Pril. District Judge, Asifabad on or before 14-06-2024 at 10-30 AM in person or by pleader duly instructed able to answer all material questions relating to the above proceedings. You are hereby directed to appear before the said Court in person or by an Advocate, duly instructed. Failing which the petition will be heard and decided in your absence.

By Order of the Court.
Place:Asifabad
Dated: 03-6-2024.
T. Suresh
Advocate,Asifabad
KumuramBheem (Asifabad) District
sureshtatipelli@gmail.com
cel.9440086511

IN THE COURT OF THE HON' BLE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT: AT : HYDERABAD
O.S. No. 2846 of 2023

Between
G SATHISH BABU ....Plaintiff
AND
Shaik Raheem and Another ....Defendants

To.
Defendant No-2 G.Yellamaiah,S/o. Narayana, A/a:52 years, Occ: Carpenter, R/o.H.no.52 years, Occ:Carpenter, R/o.H.No.16-11-23/103, Sanjeevaiah Nagar, Moosarambagh, Malakpet, Hyderabad.

Kindly take notice that My Client G Sathish Babu filed OS No.2846 of 2023 on the file of HON'BLE XIXJUNIOR CIVIL JUDGE, City Civil Court, at Hyderabad for Perpetual Injunction and the same is posted on 20/06/2024 for your appearance before the above referred Court. Hence, you are required to be present on 20/06/2024 at 10:30 am in the above referred matter either in person or through an advocate failing which, the case will be heard shall be decided on merits in your absence

By order of Court
Sd/-
M/s.K.KISHAN, Advocate
H.No.11-14-312, Siri Nagar Colony, L.B.Nagar, Hyderabad.

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE, R.R.DISTRICT, AT: L.B.NAGAR
O.S.NO.1301 OF 2022

Between:
Mamidi Ashok ...Plaintiff
AND
Jeevan Singh and others ....Defendants

To,
D-2. K.Vishnu S/o. Late K.Papaiah, Aged about 48 years, Occ: Business, R/o. Flat No.1, 1st floor, H.No. 14-2-332/A/4/1/1, Gyan Bagh Colony, Hyderabad.
D-7. Kondegari Swarupa W/o. Late K.Vittalaiah, Aged about 44 years, Occ: Household, R/o. Chilkur Village, Moinabad Mandal, R.R.District.
D-10. Kondegari Madhav D/o. Late K.Vittalaiah, Aged about 20 years, Occ: Household, R/o. Chilkur Village, Moinabad Mandal, R.R.District.

Take notice that my client Mamidi Ashok S/o. Late Mamidi Mallaiah filed O.S.No.1301 of 2022 now pending before the Hon'ble IX Addl. District Judge, R.R. District, at L.B. Nagar, seeking the reliefs of perpetual injunction and to declare the registered document No.7290/2016, dated 01- 10-2016 registered at Sub-Registrar, Chevella, R.R. District, as null and void in respect of land in Sy.Nos.484/part (Ac.1-10 Gts., out of Ac.1-16 Gts.,) and 521/part (Ac.0-30 Gts.,), total admeasuring Ac.2-00 Gts., situated at Chilkur Village, Moinabad Mandal, Ranga Reddy District.

Further take notice that in the above case in O.S.No. 1301 of 2022 you are the Defendant Nos.2, 7, and 10 and the said case is posted for your appearance on 26.06.2024, at 10:30 a.m., before the Hon'ble IX Addl. District Judge, Ranga Reddy District, at L.B. Nagar. In spite of this notice if you do not appear in the above said case on the above said day and time either in person or through your advocate, the said case will be decided in your absence. Hence, this notice in your absence.

//BY ORDER OF THE COURT//
B.BAL REDDY
Advocate
#Flat No.302, Devi Midtown, 3rd Floor, Dwaraka Honda Showroom Building, Beside Ganesh Temple Suncity, Gandipet Mandal, Ranga Reddy District, TS-91

IN THE COURT OF THE HON-ORABLE XIV JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR
O.S. NO 456 OF 2022

BETWEEN.
Sunchu Bhaskar ...Plaintiff
AND
Smt.Kusumamba & others ... Defendants

To,
....Defendant No.2
Tanniru Uma Devi W/o. Late Ramamurthy Aged About: 46 years, Occ: House wife,R/o,Flat No.3, Road No.1, Gandhinagar, Vanasathilipuram, RR District.
.....Defendant No.4
Tanniru Bhaskar S/o. Late Ramamurthy Aged about:30years, Occ:Employee R/o.Flat No.3, Road No.1, Gandhinagar, Vanasathilipuram, RR District.
.....Defendant No.5
Tanniru Teja Ram S/o. Late Rama murthy Aged about:30years, Occ: Employee, R/o.Flat No.3, Road No.1,Gandhinagar, Vanasathilipuram, RR District

Please take summons that , Sri. Sunchu Bhaskar has filed O.S. NO 456 OF 2022 For Specific Performance and also to declare the sale deed No.2102/2005 and consequential document No. 4518/2022 registered in the office of Hyderabad East and SRO Vanasthalipuram respectively as null and void and the matter is posted to 28-6-2024. Therefore you are hereby summoned to attend before the Honorable XIV Junior civil judge at: Hayath Nagar on 28-6-2024 at 10-30 A.M either personally or through advocate, failing which the matter may be decided in your absence.

SCHEDULE OF THE PROPERTY

All that piece and parcel of house bearing Plot No.53/A, in sy.no. 31,32 and 33 admeasuring 110 Sq. yards, Situated at Sharadanagar Housing colony, Sahebnagar Kalan village, Hayathnagar Mandal , RR Dist., Telangana State and bounded by :
North : Plot No. 53 Part
South : 25 feet wide Road
East : Plot no. 53 part
West : Plot No. 53 part

\\By the order of the Hon'ble court \\
E. Vishwa Prasad (T.S. 1806/1992)
Advocate
Office No. 448&449, 4th floor, LPTMarket, LB Nagar, Hyd -74.
Cell: 98480 74478.

డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్



నవతెలంగాణ-బాలానగర్

ఇంజినీరింగ్ చదివిన ఓ వ్యక్తి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న అత్యాశతో డ్రగ్స్ అమ్ముతూ ఎక్సైజ్ పోలీసులకు దొరికిపోయాడు. వివరాల్లోకెళ్తే.. ఫరూక్ అనే యువకుడు చెన్నైలో బీటెక్ పూర్తి చేశాడు. అయితే చదువు కోసం అప్పులు చేయాల్సి రావడంతో వాటిని తీర్చేందుకు తప్పుడు మార్గం ఎంచుకున్నాడు. ఈ మేరకు డ్రగ్స్ విక్రయిస్తుండగా ఎస్టీ ఎఫ్, బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా కూకట్ పల్లి వడ్డేపల్లి ఎన్ క్లేవ్ వద్ద ఫరూక్‌ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 4.1కిలోల డ్రగ్స్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి గ్రాము రూ.12వేలకు విక్రయిస్తున్నాడని పోలీసులు వివరించారు. అతనిపై కేసు నమోదు చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ దాడుల్లో ఎస్ఎఫ్ సీఐ టి. శ్రీధర్, బాలానగర్ సీఐ డి. వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో బీజేపీ సంబరాలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ భారీ మెజారిటీ సాధించడం గర్వకారణమని మల్కాజిగిరి కోటపై బీజేపీ జెండా ఎగరడంతో పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం పెరిగిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ జెకె. శేఖర్ యాదవ్ అన్నారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఈటెల రాజేందర్ విజయాన్ని పురస్కరించుకొని జగద్గిరిగుట్ట బస్ స్టాప్ చౌరస్తాలో సాయంత్రం ఆ పార్టీ రాష్ట్ర మేడ్చల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, అర్బన్ కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి, గాజులరామారం కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి తోపాటు ఆ పార్టీ శ్రేణులు బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జగద్గిరిగుట్ట పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు నరేంద్ర మోడీని మూడోసారి ప్రధానిగా చూసుకోవాలనే లక్ష్యంతో గొప్ప ఫలితాలు అందించారన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

'మల్కాజిగిరి'లో బీజేపీ బోణీ

- 3,91,475 ఓట్ల భారీ మెజార్టీతో ఈటల రాజేందర్ గెలుపు
- కాంగ్రెస్ రెండు, బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం
- పెద్దగా ప్రభావం చూపని అధికార, ప్రతిపక్ష పార్టీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

'మల్కాజిగిరి' పార్లమెంట్‌లో బీజేపీ బోణీ కొట్టింది. ఈటల రాజేందర్ 3,91,475 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కోల్పోవాల్సి వచ్చింది. పార్టీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి 5,99,567 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి 3,91,475 ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బీజేపీ మొదటి రౌండ్ నుంచి ఆధిక్యం కొనసాగిస్తూ వచ్చింది. ఈటల రాజేందర్‌కు మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజవర్గాల నుంచి అధిక మెజార్టీ వచ్చింది. ఇక కాంగ్రెస్‌కు మేడ్చల్, కుత్బుల్లాపూర్ మినహా మిగతా నియోజకవర్గాల్లో ఆశించినంతగా ఓట్లు రాలేదు. బీఆర్ఎస్‌కు ఏడు నియోజకవర్గాల్లోనూ ఆశించినంతగా ఓట్లు రాలేదు. ఇక పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీ ఆధిక్యం కనబర్చింది. దాదాపు ఈటల రాజేందర్ 10 వేలకు పైగా ఓట్లు సాధించారు. ఆ తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ నిలబడగా.. కేవలం 1700 ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఆశించినంతగా ప్రభావం చూపలేకపోయారు.

లక్షకుపైగా ఓట్లు..

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు సికింద్రాబాద్ కంటోన్మెంట్ మినహా మిగతా ఆరు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఒక్కో నియోజకవర్గంలో లక్షకుపైగా ఓట్లు వచ్చాయి. రూరల్ ప్రాంతమైన మేడ్చల్ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 1,88,370 ఓట్లు సాధించారు. ఇక కాంగ్రెస్‌కు మేడ్చల్, కుత్బుల్లాపూర్ మినహా మిగతా నియోజకవర్గాల్లో లక్ష ఓట్లు దాటలేదు. కంటోన్మెంట్‌లో అతి తక్కువ ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ ఒక్క నియోజకవర్గంలో కూడా లక్ష ఓట్లు సాధించలేకపోయింది. మేడ్చల్, కుత్బుల్లాపూర్ మినహా మిగతా నియోజకవర్గాల్లో 50వేల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.

ఆదరించిన మేడ్చల్, కుత్బుల్లాపూర్

ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలు ఆదరించాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో బీజేపీకి మొదటి స్థానం, కాంగ్రెస్ రెండో స్థానంలో ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ఈ రెండు పార్టీల అభ్యర్థులకు లక్షకు పైగా ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి ఈ రెండు నియోజకవర్గాల్లో 50వేలకు పైగా ఓట్లు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మీ విశ్వాసానికి తగ్గట్టు పని చేస్తా : ఈటల రాజేందర్



ఓటర్ల విశ్వాసానికి తగ్గట్టు తన పని విధానం ఉంటుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తనకు రెండు కర్తవ్యాలు ఉన్నాయనీ, ఒకటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల కోసం కొట్లాడటం, రెండోది మోడీ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురావడం అని తెలిపారు. రాష్ట్ర అభివద్ధిలో భాగ స్వామ్యం అవుతానని ప్రకటించారు. ప్రజల ఆశీర్వాదం తో రాష్ట్రంలో 17 సీట్లలో 8 సీట్లు గెలిచి ఆధిపత్యం కొరసాగిస్తున్నామని తెలిపారు. స్వేచ్ఛ, స్వతంతం, ప్రగతి, ఆత్మగౌరవం కోసం బీజేపీకి ఓటేశారని చెప్పారు. మోడీ గడిచిన పదేండ్లలో పేదవారికి డబ్బున్న వారికి ఉన్న అంతరాలను తగ్గించారనీ, యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పించారనీ, మౌలిక వసతులు ఏర్పాటు చేశారనీ, భారత్ ఆత్మగౌరవాన్ని పెంచారని చెప్పుకొచ్చారు. తాను మల్కాజగిరి స్థానికున్ని అనీ, తన మీద విశ్వాసం ఉంచి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కంటోన్మెంట్ రోడ్లు, చెరువుల పునరుద్ధరణ, యువతకు ఉపాధి, పేదలకు ఇండ్లు, ఇండస్ట్రియల్ కారిడార్ లాంటి పనులను పూర్తి చేస్తానని తెలిపారు. ప్రజలకు నోట్లో నాలుకలా ఉంటూ.. నిత్యం అందు బాటులో ఉంటానని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉండి తనకు ఓటేసి వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరి వాడిలా, పొత్తుల సద్దిలా ఉంటానని హామీనిచ్చారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్న : పట్నం సునిత



మల్కాజిగిరి లోక్ సభ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తున్నట్టు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో వెలువడిన తన ఓటమిని మన స్ఫూర్తిగా అంగీకరిస్తున్నట్టు వెల్లడించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమనీ, ఓటమికి కంగిపోకుండా ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని తెలిపారు. తనకు ఓటేసి మల్కాజిగిరి ఓటర్లందరికీ కతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు హదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన శ్రీగణేష్, మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్లు ఇలా..

నియోజకవర్గం	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్
మేడ్చల్	1,88,370	1,19,125	67,246
మల్కాజిగిరి	1,39,479	77,929	40,488
కుత్బుల్లాపూర్	1,77,122	1,20,957	58,039
కూకట్‌పల్లి	1,09,820	84,700	32,778
ఉప్పల్	1,30,105	76,870	48,958
ఎల్బీనగర్	1,71,683	68,095	33,839
కంటోన్మెంట్	64,133	45,661	17,339
పోస్టల్ బ్యాలెట్	10,330	6,230	1,789
మొత్తం	9,91,042	5,99,567	3,00,486

టీడీపీ ఘనవిజయం నాయకులు, కార్యకర్తల సంబరాలు



నవతెలంగాణ-ఘట్కేసర్

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ జాతీయ నాయకులు ఆంధ్రప్రదేశ్‌కు 4వసారి కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో టీడీపీ అఖండ విజయంతో విజయఢంకా మోగించారు. మేడ్చల్ నియోజకవర్గంలో టీటీడీపీ ఘట్కేసర్ మండల మున్సిపాలిటీ సీనియర్ నాయకుడు మహేష్ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల సంజీవ గౌడ్ పాల్గొని ఘట్కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి బాణాసంచ కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీపీ మండల అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్, సామల జగన్మోహన్ రెడ్డి, కొత్త బిక్షపతి గుప్తా, టి. తిరుపాల్, పాటి సురేందర్ రెడ్డి, బొట్టు సూరి, ఉడుతల మధుబాబు, జి. చంద్రయ్య మడ్డి రాము, బత్తుల మహేష్,యారుకల అశోక్ గౌడ్ పాటి జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో టీటీడీపీ విజయోత్సవాలు



నవతెలంగాణ-కాప్రా

తెలుగు దేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలిచిన సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో డా ఏఎస్‌రావు నగర్ డివిజన్ జమ్మి గడ్డ పరిధిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీకే మూర్తి, రాములు యాదవ్, సతీష్ కుమార్, నవీన్, (టీంకు), ఎస్‌వి రావు, అప్పారావు, శ్రీనివాస్, రమేష్, వెంకటేష్, బాలరాజు ముఖ్య కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ- మేడ్చల్

మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విదేశీ యాత్ర పూర్తి చేసుకుని మంగళవారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనను మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ యువ నాయకుడు అత్వెలి సందీప్ గౌడ్, కౌన్సిలర్ తుడుం గణేష్ పుష్ప గుచ్చం అందజేసి ఘనస్వాగతం పలికారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్ సియాటెల్‌లో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మెగా కన్వెన్షన్ వేడుకల్లో పాల్గొని తిరిగి స్వదేశానికి చేరుకున్నారు.

ఉప్పల్ చిలుకనగర్‌లో టీడీపీ సంబరాలు



నవతెలంగాణ- ఉప్పల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో గుడపాటి ఫౌండేషన్ చైర్మెన్ గూడపాటి శరత్ ఆధ్వర్యంలో ఉప్పల్, చిల్కనగర్ లో బాణాసంచా కాల్చి స్వీట్స్ పంపిణీ, సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపాటి శరత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధితో పాటు ప్రజల శ్రేయస్సు చూసే నాయకుడు కావాలని స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు టీడీపీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయంతో తెలంగాణలోను స్థానిక సంస్థల ఎన్నికలల్లో సత్తాచాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో గూడపాటి ఫౌండేషన్ చైర్మెన్ గుడపాటి శరత్, తెలుగు యువత అధ్యక్షులు సాయి నాగర్జున, నాయకులు హేమంత్ గౌడు, మౌలాలి, శేఖర్ రెడ్డి, ఆశోక్, ఖాసీం, ఇమాంసాబ్, అవినాష్, ప్రకాష్, గాంధీ, కరుణ్, బబ్లు, అలీ శాస్రి, ఇంతియాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ గెలుపు హర్షనీయం



నవతెలంగాణ-మేడ్చల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన రసవత్తర మైన ఎన్నికల్లో జనసేన అధినేత, హీరో పవన్ కళ్యాణ్ పీఠాపురం ఎమ్మెల్యేగా గెలుపొందడం హర్షిణీయమని కుండా భానుచందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజ లకు ఏదో మంచి చేయాలన్న తపనతో తనకున్న స్టార్ డాంను వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ మంచి మెజార్టీతో ఘనవిజయం సాధించడం గొప్ప విషయమన్నారు. పీఠాపురం ప్రజలందరి కలలను సహకారం చేసి ఆంధ్రప్రదేశ్‌లోనే మంచి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారన్నారు. పవన్ కళ్యాణ్ ఇంత మంచి మెజార్టీ ఇచ్చినటువంటి పిఠాపురం ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



ఈటల రాజేందర్ 3,91,475 భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆనందోత్సవాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకొని బాణా సంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సి.మణిక్య రెడ్డి, అజయ్ రెడ్డి, మాచర్ల శ్రీనివాస్, మహేష్, రాజ్ మల్లికార్జున్ గౌడ, వినయ్, శంకర్, ఉదయ్, ప్రకాష్, బందరి, శ్రీనివాస్ కార్యకర్తలు

నవతెలంగాణ-అల్వాల్

పార్లమెంట్ ఎన్నికల్లో 'కూకట్‌పల్లి'లో మెరుగుపడిన ఓటింగ్ శాతం

- కాంగ్రెస్ ఇన్‌చార్జీ బండి రమేష్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటింగ్ శాతాన్ని గణనీయంగా మెరుగుపరుచుకుందని, గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన బండి రమేష్ 56శాతం 67 వేల ఓట్లు పోలయ్యాయని, కేవలం ఆరు నెలల వ్యవధిలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజ్గిరి నుంచి పోటీ చేసిన సునీత మహేందర్ రెడ్డి 48.4శాతం ఓట్లు పోలయ్యాయని 86,000 ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వచ్చాయని, కాగా సుమారు 20వేల ఓట్లు అధికంగా కాంగ్రెస్ పార్టీ తెచ్చుకుందని, గత 15 సంవత్సరాలుగా కూకట్‌పల్లిలో కాంగ్రెస్‌కు సరైన నేతలేని పరిస్థితిలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేవలం 15 రోజుల వ్యవధిలో బండి రమేష్‌కు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సీటు కేటాయించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు రమేశ్ తన అస్త్ర శస్త్రాలను సమకూర్చుకుని ఎన్నికల రంగాల్లోకి దిగి 67 వేల ఓట్లు సాధించారు. అయితే రమేష్ ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీని అంటిపెట్టుకుని తన సేవలు కొనసాగించారు. ప్రతిరోజు బాలానగర్‌లోని పార్టీ కార్యాలయం రావడం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడం, కార్యకర్తలు ఏ కార్యక్రమం చేపట్టిన అభ్యంతరం తెలపకుండా వెళ్లడం పరిచయాలను పెంచుకోవడం ద్వారా పార్టీని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో భాగంగా ప్రకటించిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వాటిని అమలు చేయడంలో రమేష్ విజయం సాధించగలిగారు. దీంతో ప్రజల్లో అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూల ధోరణి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గత నెల 13 జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కూకట్ పల్లి నియోజకవర్గం నుంచి పార్టీ 86వేల ఓట్లను పొందగలిగిందన్నారు. ఈ నేపథ్యంలో బండి రమేష్ స్పందిస్తూ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ గణనీయంగా పుంజుందడానికి, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. దీనికి కారణం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చెరువుగా తీసుకెళ్లి పూర్తి స్థాయిలో బలోపేతం చేస్తామని, పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తల ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని, తన అసెంబ్లీ ఎన్నికల్లో కంటే పార్లమెంటు ఎన్నికల్లో 35శాతం ఓట్లు అధికంగా పార్టీకి వచ్చేలా కృషి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

ఈటల గెలుపుతో నాగారంలో సంబరాలు..



నవతెలంగాణ-కీసర

మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో నాగారం మున్సిపాలిటీలో నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బాణా సంచా కాల్చి సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో మూడవసారి బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం గొప్ప విషయమన్నారు. మల్కాజ్గిరి పార్లమెంటు పరిధిలో ఈటెల రాజేందర్ 3,91,475 ఓట్ల మెజారిటీ సాధించడం చాలా సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నేతలు కౌకుట్ల రాహుల్ రెడ్డి, జూపల్లి నరేష్, రాకేష్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ కృతజ్ఞతలు

- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

లోక్‌సభ ఎన్నిక ఫలితాల్లో మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్‌లో మొట్టమొదటి సారి భారతీయ జనతా పార్టీ గెలుపొందడం జరిగిందన్నారు. ఈటల రాజేందర్ తెలంగాణ ఏర్పాటైన తర్వాత జరిగిన మల్కాజిగిరి మూడో లోక్‌సభ ఎన్నికల్లో 3 లక్షల 87 వేల 375 పైచిలుకు మెజారిటీతో గెలిచారన్నారు. ఈటల రాజేందర్ గెలుపులో భాగమైన ప్రతి ఒక్క, పైస్థాయి నాయకులకు, మహిళా నాయకురాళ్లకు, కార్యకర్తలకు, అభిమానులకు, బీజేపీ కుటుంబసభ్యులకు, కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి విజయాలు మరిన్ని అందుకునేందుకు మరింత కష్టపడి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సారథ్యంలో, కూకట్ పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుచుకుందామని పేర్కొన్నారు.

'కొండా విజయానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు'



నవతెలంగాణ-కూకట్‌పల్లి

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించినందుకు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, విజయానికి తోడ్పడిన వారందరికీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో విజయం సాధించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించేందుకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు, వివిధ మోర్చాలతో పాటు గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేసుకుంటూ, విజయ పరంపర కొనసాగిద్దామని పేర్కొన్నారు.

హ్యాట్రిక్ ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం

- బీజేపీ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు పట్నం నర్సింహా రెడ్డి



నవతెలంగాణ-శామీర్ పేట:

దేశంలో సుస్థిరమయిన ప్రభుత్వం బీజేపీతోనే సాధ్యమని కేంద్రంలో ప్రజలు మూడోసారి బీజేపీ కు పట్టం కట్టారని తుంకుంట మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పట్నం నర్సింహా రెడ్డి అన్నారు. మంగళ వారం వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో బీజేపీకి అనుకూలంగా వచ్చినందున ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన కోసం మోడీ నాయక త్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నా రు. మోడీ నాయకత్వంలో సుపరిపాలన సాధ్యమని నమ్మి ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు బీజేపీకు అనుకూలంగా వచ్చాయని ఆయన తెలిపారు. దేశానికి బీజేపీయే మంచి పరిపాలన అం దించగలరనే విశ్వాసం ప్రజల్లో ఉందని నర్సింహారెడ్డి అన్నారు. హ్యాట్రిక్ ప్రధాని గా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని, బీజేపీకి అనుకూల మైన మెజారిటీని ప్రజలు ఇవ్వడం పట్ల నర్సింహా రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ విజయోత్సవ ర్యాలీ..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికలలో ఈటెల రాజేందర్ భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం చౌరస్తా, షాపూర్ నగర్ చౌరస్తా, జగద్గిరిగుట్ట చౌరస్తాలలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కన్వీనర్ శేఖర్ యాదవ్, కార్పొరేటర్ భరత్ సింహారెడ్డి లతో కలిసి విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు కార్పొరేటర్ శ్రీ రావుల శేషగిరి. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బూత్ కమిటీ అధ్యక్షులు కోఆర్డినేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు

మేడ్చల్‌లో బీఆర్ఎస్‌కు మూడో స్థానం

- గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే భారీగా తగ్గిన ఓట్ల శాతం

నవతెలంగాణ-బోడుప్పల్

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘన విజయం సాధించారు. ఈటల రాజేందర్ తమ సమీప ప్రత్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిపై సుమారు 3,87,375 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరిగిన ఓట్ల కౌంటింగ్‌లో 21 రౌండ్లలో 20 రౌండ్లలో బీజేపీ స్పష్టమైన మెజారిటీ కనబరిచింది. 21వ రౌండ్‌లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 282 ఓట్లు లీడ్ వచ్చింది.

బీఆర్ఎస్ ఓట్లన్ని బీజేపీ కే ?

గత నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలలో మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డికి 1,85,189 ఓట్లు రాగ ప్రస్తుతం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి కేవలం 65,805 ఓట్లు మాత్రమే వచ్చాయి దీనిని బట్టి చూస్తే గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు పడిన ఓట్లన్ని ప్రస్తుత ఎంపీ ఎన్నికలలో బీజేపీ గంపగుత్తగా పడ్డాయనే భావించాలి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి కేవలం 50,535 ఓట్లు మాత్రమే రాగ ప్రస్తుతం ఎంపీ అభ్యర్థికి 1,75,973 ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రెష్ యాదవ్‌కు 1,52,598 ఓట్లు రాగా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డికి 1,16,300 ఓట్లు వచ్చాయి.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఓ మహిళ తన చిన్న కుమారుడితో కలిసి అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం చండీపూర్ మండలం అజింపూర్ గ్రామానికి చెందిన ఉత్తం సింగ్ తన భార్య పూజా పహరితో కలిసి జీవనోపాధి కోసం తుక్కుగూడకు గత రెండు నెలల కిందట వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న ఉదయం తన చిన్న కుమారుడు గోరతో కలిసి ఇంటి నుండి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో వారి ఆచూకీ కోసం బంధువులను, స్నేహితులను సంప్రదించినా ఫలితం లేకపోయింది. వెంటనే ఆమె భర్త ఉత్తం సింగ్ పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులకు ఉప్పల శ్రీనివాస్ గుప్త శుభాకాంక్షలు



నవతెలంగాణ - నాగోల్

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మీద నమ్మకంతో 8 స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



ఘనంగా రావి నారాయణరెడ్డి జయంతి

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

తొలి దశ ఉద్యమకారుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. మంగళవారం రావి నారాయణరెడ్డి 117వ జయంతి వేడుకలను కుంట్లూరులోని రావి నారాయణరెడ్డి కాలనీలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీ భావజాలాన్ని పటిష్టంగా బలపరిచి ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప వామపక్ష నాయకుడని, సుమారుగా 700 ఎకరాల తన సొంత భూమిని పేదలకు పంచి ఇచ్చిన భూదాన కర్త అని కొనియాడారు.ఆయన స్ఫూర్తితో యువత ముందుకు నడిచి ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజల ప్రశ్నన నిలబడాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయ సాధనలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. రావి నారాయణరెడ్డి ఉద్యమ పోరాటాల స్ఫూర్తితో ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ఇండ్లు లేని పేదలకు ఇంటి స్థలాలు సాధించుకోవడంలో సీపీఐ పార్టీ ఎనలేని కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్ పేట మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్, మాజీ కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, సీపీఐ నాయకులు దాసరి ప్రసాద్, నారాయణ, యాదగిరి, వెంకటేష్ నిరంజన్, సైదులు, మహేందర్, అరుణ, దేవమ్మ, చందన, సుజాత మాధవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో కూతురి అత్తను చంపిన తండ్రి..



నవతెలంగాణ - మీర్ పేట్

క్షణికావేశంలో కూతురి అత్తను తండ్రి చంపిన ఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కేసి తండాకు చెందిన జాటవత్ ప్రభు. వృత్తిరీత్యా డ్రైవర్. బడంగ్‌పేట్, వినాయక హిల్స్‌లో నివాసం ఉంటున్న కొర్ర జయరాంకు రెండు ఏండ్ల కిందట జాటవత్ ప్రభు కూతురితో వివాహం జరిగింది. కొంత కాలం నుంచి భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం కూతురును చూడటానికి తండ్రి ప్రభు వినాయక హిల్స్‌కు వచ్చాడు. అదే సమయంలో కూతురు, అత్త(కొర్ర లలిత) గొడవపడుతున్నారు. అది గమనించిన ప్రభు నా కూతురుతో గొడవపడతావ అని క్షణికావేశంలో కూతురు అత్త(కొర్ర లలిత)ను ఇనుప సుత్తెతో తలపై కొట్టడంతో రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న సుద్దమోని కుంటలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు స్థానిక కాలనీ వాసులు సుద్దమోని కుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుని వయస్సు 45 నుండి 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. శరీరంపై వైట్ కలర్ షర్ట్, గ్రే కలర్ ప్యాంట్, మృతుడు చామన్ చాయ కలర్ ఉన్నట్లు తెలిపారు. మృతునికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎల్బీనగర్‌లో బీజేపీకి లక్షకుపైగా మెజార్టీ

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు భంగపాటు

నవతెలంగాణ - ఎల్బీనగర్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీకి భారీ సంఖ్యలో ఓట్లు రావడంతో మల్కాజిగిరి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలైంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగర వేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేశారు. కానీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయాన్ని కాంగ్రెస్ అడ్డుకోలేక పోయింది. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ 1 లక్ష 3 వేల 482 ఓట్ల మెజార్టీ సాధించింది. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను బీజేపీ చావు దెబ్బ కొట్టింది. ఎవరూ ఊహించని విధంగా గతంలో ఏ పార్టీకి రానంత భారీ మెజార్టీ బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గంలో సాధించి రికార్డ్ నెలకొల్పింది.

ఏది ఏమైనా కాంగ్రెస్ మల్కాజిగిరి నియోజకవర్గంలో విజయం సాధించడానికి ప్రయత్నాలు చేసింది కానీ.. గత అసెంబ్లీ ఎన్నికల కంటే దాదాపు 30 వేల ఓట్లు, పార్లమెంటు ఎన్నికల్లో తక్కువగా సాధించటం కాంగ్రెస్ అభాష్పాలు అయింది. అదేవిధంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష ఇరవై వేల ఓట్లు సాధించి ఎల్బీనగర్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ గులాబీ జెండా ఎగురవేసింది.

మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ 33, 839 ఓట్లు సాధించి, మూడో స్థానానికి పరిమితమైంది. బీఆర్ఎస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను కూడా రాబట్టుకోలేకపోయింది. బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి షిఫ్ట్ అయినట్లు కాంగ్రెస్ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఏ డివిజన్లో కూడా బీజేపీ మెజార్టీని నివారించలేకపోయింది.

గత పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి పోటీ చేసినప్పుడు ఎల్బీనగర్ నియోజకవర్గంలో 30 వేల ఓట్ల మెజార్టీ కాంగ్రెస్ సాధించింది. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో తనకు వచ్చిన 30 వేల ఓట్ల మెజార్టీ దాటాలని నాయకులకు చెప్పినా కనీస ఓట్లు రాబట్టలేక పోయింది. బీజేపీకి కాంగ్రెస్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో ఉన్న బీజేపీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష మెజార్టీ సాధించడంతో బీజేపీ శ్రేణుల్లో ఆనంద ఉత్సవాలు నెలకొన్నాయి.



కేంద్రంలో బీజేపీ నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి తరపున ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా మీర్‌పేట్ బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో మంగళవారం మీర్‌పేట్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. తర్వాత బాణాసంచా కల్చి, స్వీట్లు పంచుకున్నారు.

నవతెలంగాణ - మీర్ పేట్

'స్వయం ఉపాధితో యువత రాణించాలి'



నవతెలంగాణ - సంతోష్ నగర్

స్వయం ఉపాధితో యువత రాణించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ ఆవరణలో డీ మార్ట్ పరిధిలోని ప్రధాన రహదారి పై నూతనంగా ఏర్పాటు చేసిన wrestlers రెస్లర్స్ డెన్ థి మండి ఫుడ్ జోన్‌ను శ్రీనివాస్, దినేష్, నిఖిల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన అన్ని రకాల భోజన బండరాలు, ప్రత్యేకత ఉండాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉమెన్స్ రైట్స్ నాయకులు ప్రశాంత్, వినయ్, ముకుందం రెడ్డి, నాగరాజ్, కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, సీఐ మహేందర్ రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

"క్రీడా' కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి'



నవతెలంగాణ - సంతోష్‌నగర్

క్రీడా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని క్రీడా ఎంప్లాయిస్ యూనియన్ మీసాల శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం సంతోష్ నగర్ హైదరాబాద్ కార్యాలయం గేటు ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమం మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా కార్మికుల సమస్యల మీద గత రెండు సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. కానీ ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని మండిపడ్డారు. కార్మికులతోని వెట్టిచాకిరి చేయించుకుంటూ శ్రమదోపిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల రక్తాన్ని పీడిస్తూ..వేధింపులకు గురిచేస్తున్న క్రీడా డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతోటి చర్యలు జరిపి..సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన, పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్రీడా కార్మికులు, సీఐటీయూ నాయకులు ఎస్.కిషన్, రాంకుమార్, క్రిష్ణ నాయక్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



నవతెలంగాణ-తుర్కయంజాల్

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుతో మంగళవారం తుర్కయంజాల్ మున్సిపల్ చౌరస్తాలో ఆ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసిక ఐలయ్య, కౌన్సిలర్లు బొక్క రవీందర్ రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, నాయకులు కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, పాలిశెట్టి ప్రేమ్ కుమార్, గుడ్ల అర్జున్, దుగ్యాని శ్యామల, హన్మంత్, రాము గౌడ్ పాల్గొన్నారు.

మధురానగర్ అధ్యక్షుడిగా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ - సంతోష్‌నగర్

కర్మన్‌ఘాట్ డివిజన్ మధురా నగర్ కాలనీ అధ్యక్షుడిగా ఎమిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కాలనీ మాజీ అధ్యక్షులు లిక్కీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీగా ఆదిత్య శర్మకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మధురానగర్ కాలనీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గార్ల పాటి మల్లారెడ్డి, తిరుపతయ్య, రామారావు, గిరి ప్రసాద్ రావు, పురుషోత్తం రెడ్డి, వెంకట్ రెడ్డి, దీపక్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సత్తయ్య, విజయేందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాహుల్ శర్మ, దత్తు శర్మ, రాజేంద్ర రావు, బిచ్చు నాయక్, శ్రీశైలం గౌడ్, లక్ష్మీకాంతరావు, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పలు చోట్ల బీజేపీ నాయకుల సంబరాలు



నవతెలంగాణ - బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ మంగళవారం ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. తర్వాత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కంటే బీజేపీకి 51,000 మెజార్టీ ఇచ్చిన నియోజకవర్గ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు శ్రీరాములు యాదవ్ అన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి విజయం సాధించడంతో మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మంగళవారం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

బడంగ్‌పేట కార్పొరేషన్ నాదర్‌గుల్ కార్పొరేటర్, మాజీ అధ్యక్షులు నిమ్మల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ తీసి బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ



సభ్యులు కడారి జంగయ్య యాదవ్, కన్వీనర్ ఎల్మేటి దేవేందర్ రెడ్డి, అధికార ప్రతినిధి రాజశేఖర రెడ్డి, అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, కార్పొరేటర్లు నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్, రాజమోనిరాజు, పున్న భిక్షపతి, మంత్రి మహేష్ ముదిరాజ్, తోట ప్రతాప్ రెడ్డి, అరవింద్ రెడ్డి, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్



మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్, బీజేపీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్‌తో పాటు పలువురు శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కార్పొరేటర్ ఆధ్వర్యంలో నాగోలులోని గాంధీ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి బాణాసంచాలను కాల్చారు. ఈ కార్యక్రమంలో నాగోలు డివిజన్ బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఉమామహేశ్వరం దేవాలయంలో పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజయం కోసం ఆ పార్టీ నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎంఐఎం కార్యకర్తల సంబరాలు





నవతెలంగాణ - మలక్‌పేట్

హైదరాబాద్ పార్లమెంట్ ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఈ మేరకు మలక్‌పేట్ ఎమ్మెల్యే బలాల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బాణా సంచాలు కాల్చి.. స్వీట్లు పంచుకున్నారు.

నవతెలంగాణ - సంతోష్ నగర్

హైదరాబాద్ ఎంపీగా మరోసారి అసదుద్దీన్ ఒవైసీ ఘన విజయం సాధించడంతో ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. యాకుత్పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజును ఎంఐఎం కార్పొరేటర్లు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు.

'మోడీ చరిష్మాతోనే మల్కాజిగిరిలో గెలిచిన బీజేపీ'



నవతెలంగాణ - హయత్‌నగర్

మోడీ చరిష్మాతోనే మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడుగా ఈటల రాజేందర్ 3లక్షలా 50వేల మెజార్టీతో గెలుపొందారని మన్సూరాబాద్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి మునగాల హరీశ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్టింగ్ స్థానంలో బీజేపీ పాగా వేయడమే కాకుండా తెలంగాణలో 8మంది బీజేపీ ఎంపీ అభ్యర్థులు గెలవడం మోడీ గ్యారంటీలపై ప్రజలకు ఉన్న నమ్మకమే అని హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌కు తగిన గుణపాఠం

● భారత లోక్ దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మితిమీరిన అహంకారం, అబద్దాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి, మత విద్వేషాలను రెచ్చగొట్టి రాక్షస పాలన అందించిన ఏపీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ కు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని భారత లోక్ దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకట రాజేశ్వరరావు విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉచితాలతో ప్రజలు తనకు ఓట్లు వేస్తారని వీర్రవీగి భ్రమల్లో పడిన వైయస్.జగన్ కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని ఆయన ఎద్దేవ చేశారు. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అఖండ మెజార్టీ సాధించడం, తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ స్థానాలు గెలుపొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత ఎన్. చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ప్రజల కోరికలకు అనుగుణంగా పాలన కొనసాగించి, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడి ప్రజల మన్ననలను పొందాలని ఆయన వారికి విజ్ఞప్తి చేశారు.

గాంధీ భవన్ వద్ద సంబరాలు...



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఎంపీ సీట్లు సాధించడంతో గాంధీభవన్ వద్ద సంబరాలు జరుపుతున్న పీసీసీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్, కృష్ణ కుమార్, బాల పోచయ్య, సంజయ్ తదితరులు..

టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి భారీ మెజార్టీతో గెలవడంతో టీడీపీ పార్టీ రాష్ట్ర వాణిజ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కేడి దినేష్ ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకొని పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కేడి దినేష్ మాట్లాడుతూ.. సీఎంగా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో విజయ్ కుమార్ ముదిరాజ్, రాజేష్ గుకికర్, నరేష్ జైన్, పి నందకిషోర్, జైరాజ్ యాదవ్, సోమశేఖర్ కురుమ, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికే పట్టం కట్టిన ప్రజలు

● ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు మరొకసారి అభివృద్ధికి పట్టం కట్టారని ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేపీ నేత కేశ బోయిన శ్రీధర్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి ఎంపీగా గెలవడంతో మంగళవారం హిమాయత్ నగర్ డివిజన్‌లో స్వీట్లను పంచారు. ఈ సందర్భంగా కేశబోయిన శ్రీధర్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాల లో జి.కిషన్ రెడ్డి సికింద్రాబాద్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మరొకసారి విజయం సాధించిన కిషన్ రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రంజిత్, శ్రీశైలం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయం హర్షణీయం

● తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోన బాలరాజ్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ఘనవిజయం సాధించడం పట్ల తెలంగాణ గౌడ కల్లగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి విజయంపై పత్రికా ప్రకటన ద్వారా స్పందించారు. బడుగు, బలహీనవర్గాల పక్షపాతి గౌడ జాతి అభ్యున్నతికి కృషి చేస్తారని సామాజిక న్యాయ సాధనలో ముందుంటారని ఆశిస్తూ ఈ ఐదు సంవత్సరాల కాలంలో కల్లుగీత వృత్తి రక్షణకు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తా రని ఆశిస్తూ కూటమి పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

కిషన్ రెడ్డి గెలుపుతో ముషీరాబాద్ వ్యాప్తంగా సంబరాలు



నవతెలంగాణ-ముషీరాబాద్

సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీజేపీ నాయకులు వినయ్ కుమార్, పూసరాజు, నవీన్, బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు.

కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సూర్యనారాయణ శర్మ



నవతెలంగాణ-ముషీరాబాద్

సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడంతో ఆ పార్టీ ముషీరాబాద్ యువ నాయకుడు సూర్య నారాయణ శర్మ ప్రతేక శుభాకాంక్షలు తెలియజేసి, బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

హైదరాబాద్‌లో మళ్లీ పతంగే..

● 3.38లక్షల మెజార్టీతో మజ్లిస్ అభ్యర్థి ఘన విజయం
● రెండో స్థానంలో బీజేపీ, మూడో, నాలుగు స్థానంలో కాంగ్రెస్, బీఆర్ఎస్
● డిపాజిట్లు కోల్పోయిన ఇండిపెండెంట్లు





నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మజ్లిస్ పార్టీ మరోసారి నిలబెట్టుకుంది. వరుసగా నాలుగు సార్లు విజయం సాధించిన అసదుద్దీన్ ఒవైసీ అయిదోసారి బరిలోకి దిగి బీజేపీ అభ్యర్థిపై 3,38,087 లక్షల ఓట్ల మెజార్టీతో సునాయసంగా గెలుపొందారు. హైదరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు మంగళవారం జంటనగరాల్లోని ఏడు ప్రాంతాల్లో జరిగింది. నిజాం కాలేజ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ మాసబ్‌ట్యాంక్, కమలానెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలల, మహిళా వర్సిటీ కోఠి, వనితా విద్యాలయ ఎగ్జిబిషన్ గౌండ్స్, ఆరోరా లీగల్ సర్వీసెస్ అకాడమీ, అంబర్‌పేట్ జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో ఓట్ల లెక్కింపు జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్, అనంతరం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలి రౌండ్లలో బీజేపీ అభ్యర్థి మాధవీలత అధిక్యం ప్రదర్శించారు. ఆ తర్వాత ప్రతి రౌండ్‌లోనూ మజ్లిస్ పార్టీ అభ్యర్థి దూసుకెళ్లారు. మొత్తంగా 24 రౌండ్లు ఓట్ల లెక్కింపు జరగగా ప్రతి రౌండ్‌లోనూ మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ముందంజలో దూసుకెళ్లారు. రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి మాధవీలత నిలిచారు. మూడో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సమీర్ వలీవుల్లా, నాలుగో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ నిలిచారు. మజ్లిస్ పార్టీ అభ్యర్థి అస దుద్దీన్ ఒవైసీకి 6,61, 981లక్షల ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి మాధవీ లతకు 3,23,894 ఓట్లు.. రాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సమీర్‌కు 62,962 ఓట్లు వచ్చాయి.

బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీని వాస్ యాదవ్ కు 18,641 ఓట్లు రాగా.. 23 మంది గుర్తింపు పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పో యారు. హైదరాబాద్ పార్లమెంట్ సెగ్మెం ట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల తో కలిపి.. మొత్తం 10,77,418 ఓట్లు పోలవ్వగా 2,906 ఓట్లు నోటాకు పడ్డాయి. 1,554 ఓట్లు చెల్లుబాటు కాలేదు. నియోజకవ ర్గాల వారీగా మజ్లిస్ పార్టీకి పడిన ఓట్లు ఈ విధంగా ఉన్నాయి. మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో 76,318, కార్వాన్‌లో 1,08,389, గోషా మహల్‌లో 98,649, చార్మినార్‌లో 70,799, చాంద్రాయణ గుట్టలో 1,28,103, యాకుత్‌పురలో 1,06,122, బహదూర్‌పుర నియోజక వర్గంలో 1,32,416 ఓట్లు లభించాయి.

'డెలివరీ చేయమని ఆస్పత్రికి వస్తే శిశువు ప్రాణాలు తీశారు...'

● శిశువు మృతికి కారణమైన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి ముందు బంధువుల నిరసన..



నవతెలంగాణ-ధూల్‌పేట్ / సంతోష్‌నగర్

ఆసుపత్రిలో శిశువు మృతికి కారణమైన వైద్య సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని రవీందర్ నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ ఏ.కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. గర్భవతిని డెలివరీ చేయమని ఆస్పత్రికి వస్తే శిశువు ప్రాణాలు వైద్యులు నిర్లక్ష్యంతో తీశారని జంగంమెట్ యుసీహెచ్సీ ఆస్పత్రి ముందు కుటుంబీకులతో కాలనీ వాసులు నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలైన గిరిజనులు ప్రభుత్వం ఆస్పత్రికి వస్తే వైద్యులు నిర్లక్ష్యానికి కారణంగా శిశువు ప్రాణాలు కూలిపోయిందన్నారు. రవీందర్ నాయక్ నగర కాలనీకి చెందిన చిట్టి బాయి కూతురు పింకీ నిండు గర్భిణీ 9నెలలు పూర్తి కావడంతో జంగంమెట్ యుసీహెచ్సీ ఆసుపత్రిలో గత దినం 3వ తేదీన ఉదయం అడ్మిట్ అయ్యారన్నారు. సాయంత్రం ఎనిమిది గంటలకు ఆపరేషన్ థియేటర్‌లో తీసుకువెళ్లగా శిశువు జన్మించిన గంట వరకు బాధితుల కుటుంబానికి తెలియజేయకుండా నీలాఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని రాసి ఇచ్చారన్నారు. నీలాఫర్ హాస్పిటల్‌కి వెళ్లగా చనిపోయి చాలాసేపు అయిందని వైద్య అధికారులు తెలియపరిచారన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితులు ఆస్పత్రి ముందు నిరసన చేపట్టారన్నారు. ప్రభుత్వం ఆస్పత్రిలో ఇలాంటి సంఘటనలు జరగకుండా పేద ప్రజలకు జీవితలతో ఆటలు ఆడకుండా నాణ్యతమైన వైద్యం అందించాలన్నారు. శిశువును కోల్పోయిన చిట్టి కూతురు పింకీకి, బాధితు కుటుంబాలకు హైదరాబాద్ కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదుకోవాలని పింకీ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి వైద్యులపై, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసులకు ఫిర్యాదు..

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మరణించిందని బాధితులు పలకనుమ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పర్యవేక్షించారు. వైద్య సిబ్బందిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నిరసనలో రవీందర్ నగర్ కాలనీ నాయకులు రాంకుమార్, కిషన్, గిరిధర్, శంకర్, జంపాల్, రాజు శ్రీను రాజేష్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతం



● జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతం వాతావరణంలో పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం జిల్లాలో పార్లమెంట్ ఓట్ల లెక్కింపు, 13 లోకేషన్స్‌లో 16 కౌంటింగ్ కేంద్రాలలో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్‌తోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల లెక్కింపు కొనసాగింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా కమిషనర్ కార్వన్, నాంపల్లి, యాకుత్ పూర, చార్మినార్ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. జిల్లాలో ఓట్ల, లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించిన అధికారులకు, సిబ్బందితోపాటు సహకరించిన నగర వాసులకు ప్రత్యేక అభినందలు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమించిన కౌంటింగ్ అబ్జర్వర్స్ సహకారం మరువలేనిదని ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి కూడా జిల్లా ఎన్నికల అధికారి అభినందనలు తెలిపారు.

అంబర్‌పేటలో కిషన్‌రెడ్డి హవా

● ప్రతి రౌండ్‌లో ఆధిక్యత
● రెండోసారి కిషన్ రెడ్డికే మొగ్గు చూపిన అంబర్‌పేట ఓటర్లు
● ఏకంగా 41,655 ఓట్ల మెజార్టీ



నవతెలంగాణ-అంబర్‌పేట

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో అంబర్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి హవా కొనసాగింది. బర్కత్‌పురలోని రెడ్డి మహిళా కళాశాలలో జరిగిన అంబర్ పేట అసెంబ్లీ ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కిషన్ రెడ్డికు ఆధిక్యత కనబరిచారు. మొత్తం 17 రౌండ్ ఉండగా 14 రౌండ్లలో కిషన్ రెడ్డి ఆధిక్యం కనబర్చగా కేవలం 3 రౌండ్లలో మాత్రమే కాంగ్రెస్ ఆధిక్యత కనబర్చింది. ఈ నియోజకవర్గం నుంచి కిషన్ రెడ్డికు 41,655 ఓట్ల మెజార్టీని కూడగట్టుకున్నారు. ప్రతి రౌండ్‌లో కూడా ఆయనే ఆధిక్యాన్ని కనబరిచారు. మొత్తం మీద అంబర్ పేట ఓటర్లు రెండోసారి కూడా కిషన్ రెడ్డి వైపే మొగ్గు చూపారు.

కొద్దిపాటి వర్షానికే జలమయమైన బస్తీలు





నవతెలంగాణ-ముషీరాబాద్

పాతబస్తీలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లు బస్తీలు జలయమయ్యాయి. ఛత్రినాక, ఉప్పుగూడ, గౌలిపుర, శివగంగా నగర్, తానాజీ నగర్, ఉప్పుగూడ గౌరీపుర పలు ప్రాంతాలలో ఒక్కసారి నీరు నిలిచిపోయాయి. వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. పాతబస్తీలోని ఈ ప్రాంతాలలో ప్రతి సంవత్సరం ఈ తీరని సమస్యగా మారింది. వర్షాకాలం ముందు ఉన్న తరుణంలో ముందు జాగ్రత్త చర్యగా మున్సిపల్ అధికారులు డ్రయినేజీ వ్యవస్థను సరైన మార్గంలో ఉంచకపోవడంతో ముఖ్యంగా జై ప్రకాష్ నగర్ నాలా పనులు, శివగంగా నగర నాలా పనులు నాలుగైదు నెలల నుంచి అసంపూర్తిగా ఉండటం వల్ల బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా చిన్నపాటి వర్షానికి ఇండ్లలోకే నీరు రావడంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోతున్నాయని బస్తీవాసులు వాపోతున్నారు.







హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. దాంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించిన కాంగ్రెస్ యువ నాయకుడు

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బై ఎలక్షన్స్ ఇన్‌చార్జీ రఘునాథ్ యాదవ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ హైదరాబాద్ పరిధిలో ఒక్క అసెంబ్లీ స్థానం కూడా కైవసం చేసుకోలేకపోయినా కాంగ్రెస్ పార్టీ అని విశ్లేషకులు అన్నారు. అలాంటి ఉత్కంఠ బరమైన సమయంలో సాయన్న కూతురు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత హఠాత్తుగా కాలం చేయడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మరొక్కసారి ఉప ఎన్నికల నగర మోగింది. కంటోన్మెంట్ నాయకుడు గణేష్ కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగం సిద్ధం చేసుకున్నాడు. దీనితో బై ఎలక్షన్స్‌కు నాంది పలికినట్లు అయ్యింది. అటువైపు బీఆర్ఎస్ నుండి లాస్య నందిత సోదరి నివేదిత సాయన్న, బీజేపీ నుంచి వంశ తిలక్ అభ్యర్థులుగా పార్టీలు ప్రకటించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కూడా జీహెచ్ఎంసీ పరిధి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు ఎవరు నాయకత్వం వహించి కంటోన్మెంట్ అభ్యర్థి గణేష్‌ని గెలిపించటానికి ముందుకు రాలేదు. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఒక యువ నాయకుడిని రంగంలోకి దింపింది. ఓవైపు ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో ఆమె సోదరికి విపరీతమైన సానుభూతి కంటోన్మెంట్ కలిగింది. ఎన్నికలకు 15 రోజుల ముందు కంటోన్మెంట్ ఇన్‌చార్జీగా వచ్చిన యువ నాయకుడు రఘునాథ్ యాదవ్, మొదటి రోజు నుంచే కంటోన్మెంట్‌లోని కిందిస్థాయి కార్యకర్తల నుండి రాష్ట్ర నాయకుల వరకు అందరిని కలుపుకుపోతూ కాంగ్రెస్ పార్టీ బలాన్ని పెంచాడు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు నుంచి ఎన్ని అడ్డంకులు వచ్చి నా, ఎన్ని అవమానాలు ఎదురైనా అన్నిటిని ఎదుర్కొని ధైర్యంగా కంటోన్మెంట్ ప్రజలతో కులాలకి, మతాలకి, వర్గాలకి అతీతంగా దగ్గరయ్యాడు రఘునాథ్ యాదవ్. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వారి సలహాలు, సూచనలు తీసుకొని దాదాపు 15 రోజులు రఘునాథ్ యాద వ్ వారి అనుచరులతో తీవ్రంగా కష్టపడి, కార్యకర్తలకు అవసరమున్నప్పుడల్లా పక్కనే ఉంటూ, వారికి ధైర్యాన్ని నింపాడు. ఎన్నికలకు వారం రోజుల ముందు నుంచే ప్రణాళికలు, గెలుపునకు కావలసిన వ్యూహాలు సిద్ధం చేసుకుని కంటోన్మెంట్ రాజకీయ చరిత్రనే చక్రం తిప్పాడు యువ నాయకుడు రఘునాథ్ యాదవ్ ప్రకటించిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ గెలుపులో ముమ్మాటికి తెర ముందు రఘునాథ్ యాదవ్ ఉంటే తెర వెనుకాల నుండి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషి, పట్టుదల పూర్తి స్థాయిలో ఎంతో ఉందని చెప్పవచ్చు. చిన్న పెద్ద తేడా లేకుండా పట్టుదలతో కష్టపడితే రాజకీయాలలో చక్రం తిప్పవచ్చని నిరూపించిన రఘునాథ్ యాదవ్.

పర్యావరణ పరిరక్షణలో అమ్మలు



మన భూమి ప్రమాదంలో ఉందని మనందరికీ తెలుసు. కాలుష్యం, వాతావరణ మార్పులు, అటవీ నిర్మూలన, సహజ వనరుల క్షీణత వంటివి భూగోళాన్ని రక్షించడానికి మనకు పెద్ద సవాళ్లుగా మారాయి. అయితే చాలా మంది శాస్త్రవేత్తలు, నిపుణులు, కార్యకర్తలు పర్యావరణాన్ని మరింత క్షీణత నుండి రక్షించడానికి, ఈ ప్రపంచాన్ని రాబోయే తరాలు జీవించగలిగేలా ఉంచడానికి గణనీయమైన కృషి చేస్తున్నారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. వారిలో ఈ ఐదుగురు మహిళా పర్యావరణవేత్తలు, కార్యకర్తలు వివిధ పర్యావరణ సంబంధిత రంగాలలో చేసిన కృషి అమూల్యమైనది. ఈ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వారి గురించి తెలుసుకుందాం...

వందన శివ




వందనా శివ రీసెర్చ్ ఫౌండేషన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ నేచురల్ రిసోర్స్ పాలసీకి డైరెక్టర్. డెహ్రాడూన్‌లో ఉన్న ఈ సంస్థ అడవుల రక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సంబంధిత విషయాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి పని చేస్తోంది. వందన 'ఎకో-ఫెమినిస్ట్' అంటే పర్యావరణ స్త్రీవాది. వ్యవసాయంలో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆమె బలమైన వాదన. మహిళలు, ప్రకృతి రెండూ పురుషులచే దోపిడీ చేయబడతాయని, దీని కారణంగా పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత అనే అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని ఆమె నమ్ముతారు. 1987లో వందన 'నవధాన్య' అనే ఎన్‌జీఓని స్థాపించారు. ఇది సేంద్రీయ వ్యవసాయం, జీవ వైవిధ్య పరిరక్షణ, రైతుల హక్కులపై పనిచేస్తుంది. నవధాన్య ఇప్పటివరకు సుమారు 2000 రకాల వరిని సంరక్షించగలిగింది. అలాగే భారతదేశంలోని 22 రాష్ట్రాల్లో 122 'విత్తన బ్యాంకులను' స్థాపించింది. ఇక్కడ వివిధ రకాల విత్తనాలను సంరక్షించడం, అధ్యయనం చేయడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఆమె చేస్తున్న కృషికిగాను 1993లో 'రైట్ లైవ్లీహుడ్' అవార్డు, 2010లో సిడ్నీ పీస్ ప్రైజ్, 2012లో ఫుకుయోకా ఆసియన్ కల్చర్ ప్రైజ్, 2016లో మిరోదీ పురస్కారం అందుకున్నారు.

అనుమితా రాయ్ చౌదరి



CSE పరిశోధన, న్యాయవాద విభాగంలో పని చేస్తున్న ఈమె సుస్థిర అభివృద్ధి, పట్టణీకరణపై దృష్టి సారించారు. 1996లో ఢిల్లీలోని గాలిని పరిశుభ్రంగా మార్చే లక్ష్యంతో క్లీన్ ఎయిర్ క్యాంపెయిన్‌కు నాయకత్వం వహించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ఫలితంగా నేడు ఢిల్లీలోని చాలా పబ్లిక్ వాహనాలు డీజిల్‌కు బదులుగా కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (CNG)తో నడుస్తాయి. ఇది వాహన ఉద్గార ప్రమాణాలను మెరుగుపరచడంలో విజయవంతమైంది. పర్యావరణ అనుకూల రవాణాపై విధానాలను రూపొందించడంలో కూడా సహాయపడింది. అనుమిత వాయు కాలుష్య రహితంగా చేయడానికి అనేక ప్రభుత్వ పథకాలలో పాలుపంచుకున్నారు. పర్యావరణ సమస్యలపై అనేక వార్తాపత్రికలలో రచించారు. వాతావరణ భద్రతపై జాతీయ, అంతర్జాతీయ సమావేశాలకు సభ్యురాలు, సలహాదారుగా ఆమె సహకారం విలువైనది. 2017లో యూఎస్‌ఏలోని కాలిఫోర్నియా ప్రభుత్వంచే హేగెన్ స్మిత్ క్లీన్ ఎయిర్ అవార్డును ఆమెకు అందించారు.

సునీతా నారాయణ్



సునీత 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' (సిఎస్ఇ) డైరెక్టర్‌తో పాటు 'డౌన్ టు ఎర్త్' మాసపత్రికకు ఎడిటర్‌గా కూడా ఉన్నారు. ఆమె పని మొత్తం పర్యావరణం, మానవాభివృద్ధి మధ్య సంబంధంపై దృష్టి కేంద్రీకరించి ఉంటుంది. అలాగే 1989లో ఆమె CSE వ్యవస్థాపకుడు అనిల్ అగర్వాల్‌తో కలిసి 'గ్రీన్ విలేజెస్' అనే పేరుతో ఒక పేపర్ రచించారు. ఇది గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను హైలైట్ చేస్తుంది. 2012లో ఆమె భారతదేశపు ఏడవ పర్యావరణ నివేదిక, ఎక్స్‌క్రెటా మ్యాటర్స్‌ను కూడా రచించారు. ఇది మన నగరాల్లో నీటి సరఫరా, కాలుష్యంపై వివరణాత్మక విశ్లేషణను అందిస్తుంది. 'పట్టణీకరణ అంటే పెద్ద పెద్ద భవనాలు నిర్మించడమే కాదు. పర్యావరణంపై అవగాహన లేకుండా అభివృద్ధి అసంపూర్తి. అందుకే నగరాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అంటారు సునీత. 2005లో ఆమె పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. 2016లో టైమ్ మ్యాగజైన్ ఆమెను అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తుల జాబితాలో చేర్చింది.

సుమైరా అబ్దుల్ అలీ



శబ్ద కాలుష్యం సమస్యపై పనిచేసే 'ఆవాజ్ ఫౌండేషన్' వ్యవస్థాపకురాలు సుమైరా. ఈ రంగంలో చేస్తున్న అలుపెరగని కృషి ఫలితంగా ఆమెకు 'సౌండ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా' అనే పేరు వచ్చింది. 2003లో ముంబైలో 'సైలెన్స్ జోన్' నిర్మాణం కోసం ఆమె బాంబే హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఏడేండ్ల తర్వాత 2009లో ఆసుపత్రులు, మతపరమైన స్థలాలు, విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 2237 ప్రాంతాలను 'సైలెన్స్ జోన్'లుగా ప్రకటించాలని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)ని కోర్టు ఆదేశించింది. 2007లో ఆమె తన సంస్థ తరపున ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల హారన్లు, నిర్మాణ పనులు, బాణాసంచా శబ్దాల నియంత్రణ కోసం మరో పిటిషన్‌ను సమర్పించారు. శబ్ద కాలుష్య నిబంధనలను అమలు చేయాలని, ముంబై నగరానికి 'సౌండ్ మ్యాప్' రూపొందించాలని ఈ పిటిషన్‌లో ఆమె డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని 2016లో కోర్టు ఆదేశించింది. అలాగే ముంబై మినహా మహారాష్ట్రలోని అన్ని నగరాల్లో సౌండ్ స్టడీ, మ్యాపింగ్‌ను వచ్చే 25 ఏండ్ల పాటు ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలో చేర్చాలని ఆదేశించారు. సుమైరా అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా కూడా చురుగ్గా పని చేస్తున్నారు. దీని కారణంగా ఆమెకు ఇసుక మాఫియా నుండి బెదిరింపులు కూడా వచ్చాయి. ఉద్యమకారులపై బెదిరింపులకు వ్యతిరేకంగా మరో ఉద్యమం ప్రారంభించారు. దీనికి ఆమె సమన్వయకర్త. సుమైరా తన పనికి మదర్ థెరిసా అవార్డును అందుకున్నారు.

డాక్టర్ కృతి కారంత్



డా. కృతి యూఎస్‌ఏలోని డ్యూక్ యూనివర్శిటీ నుండి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ పాలసీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. 20 ఏండ్లుగా భారతదేశంలో వన్యప్రాణుల సంరక్షణపై పరిశోధనలు చేస్తున్నారు. బెంగుళూరులోని సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమె డ్యూక్ యూనివర్సిటీ, నేషనల్ సెంటర్ ఫర్ బయాలజీలో కూడా బోధించారు. కృతి విలుప్తత, మానవ-అటవీ సంబంధాలు, అటవీ పర్యాటక ప్రభావంపై అనేక పరిశోధనలు చేశారు. ఆమె దాదాపు 90 వ్యాసాలు రచించడంతో పాటు వన్యప్రాణులపై పిల్లల పుస్తకాన్ని కూడా ముద్రించారు.

ఇలా చేద్దాం..

శరీరాన్ని, ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో.. వంటపాత్రలకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తాం. సాధారణంగా వంట పాత్రలకు నూనె జిడ్డు, మరకలు, మంట కారణంగా చేరిన మసి అంటుకుంటాయి. వంట చేయడం ఒక ఎత్తయితే.. పాత్రలను మురికి లేకుండా శుభ్రంగా కడగడం మరో ఎత్తు.



ప్రస్తుత కాలంలో దాదాపు అందరి ఇండ్లలోనూ స్టీల్ పాత్రలలోనే వంటలు చేస్తున్నారు. వీటిని శుభ్రం చేయడం సులభమే. కానీ, రోటీ, దోశ, చపాతి చేసే ఐరన్ పాత్రల జిడ్డు వదిలించడం కష్టమైన పని. ఐరన్ పాత్ర త్వరగా నల్లగా మారుతాయి. నూనె పొరలు పేరుకుపోతాయి. నల్లగా మారిన ఐరన్ పాత్రలో వండిన ఆహారం కూడా నల్లగా కనిపిస్తుంది. ఇలాంటి పాత్రలను శుభ్రం చేయడం కూడా కష్టం. అయితే, చిన్న చిట్కాలతో వంటపాత్రలను తళతళలాడేలా చేసుకోవచ్చు.

బేకింగ్ సోడా, ఉప్పుతో : ఒక లీటరు నీటిలో నాలుగు చెంచాల బేకింగ్ సోడా, ఉప్పు వేసి మరిగించాలి. ఆ వేడి నీటిని నల్లగా మారిన ఐరన్ పాత్రలో పోసి అరగంట సేపు ఉంచాలి. తర్వాత స్క్రబ్బర్‌తో కడిగేస్తే సరిపోతుంది.

నిమ్మకాయతో : చాలా వస్తువులను శుభ్రం చేయడానికి నిమ్మకాయ బాగా ఉపయోగపడుతుంది. నల్లగా మారిన గిన్నెలో రెండు గ్లాసుల నీళ్లు, నాలుగు చెంచాల నిమ్మరసం, డిటర్జెంట్ పౌడర్, నూనె వేసి పది నిమిషాలు మరిగించాలి. ఆ నీరు పూర్తిగా చల్లారిన తర్వాత శుభ్రం చేసుకోవాలి.

వెనిగర్ : పాత్రలకు పట్టిన మరకలను తొలగించడంలో వెనిగర్ బాగా పనిచేస్తుంది. మరకలు పడిన గిన్నెలో నీరు, వైట్ వెనిగర్ సమాన పరిమాణంలో వేసి నానబెట్టాలి. నానబెట్టిన అనంతరం బ్రష్‌తో స్క్రబ్ చేసి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. వెనిగర్‌లో ఉండే యాసిడ్ లక్షణాలు మరకలను వదిలించడానికి సహాయపడతాయి. ■

నాలుగు ఎంపీ స్థానాల్లో సీపీఐ(ఎం) విజయం

(మొదటిపేజీ తరువాయి)

అమ్రారామ్ 72,896 ఓట్లతో బీజేపీ అభ్యర్థి సుమేధనంద్ సరస్వతి (5,86,404)పై ఘన విజయం సాధించారు. సీపీఐ(ఎం) అభ్యర్థి అమ్రారామ్ 6,59,300 ఓట్లతో విజయం సాధించారు. కేరళలో అలత్తూరు నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి కే. రాధాకృష్ణన్ 2,011 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి రమ్య హరిదాస్ (3,83,336)పై గెలిచారు. రాధాకృష్ణన్ 4,03,447 ఓట్లతో విజయం సాధించారు.

ఒడిశాలో బోనై అసెంబ్లీ స్థానం సీపీఐ(ఎం) కైవసం

ఒడిశాలోని బోనై అసెంబ్లీ స్థానాన్ని సీపీఐ(ఎం) కైవసం చేసుకుంది. వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టింది. సీపీఐ(ఎం) అభ్యర్థి లక్ష్మణ్ ముండా 23,439 ఓట్ల భారీ మెజార్టీతో బీజేడీ అభ్యర్థి భీమ్‌సేన్ చౌదరి (57,569)పై ఘన విజయం సాధించారు. లక్ష్మణ్ ముండా 81,008 ఓట్లతో గెలుపొందారు. ఈ అసెంబ్లీ స్థానంలో ఇప్పటి వరకు 2004, 2014, 2019 మూడు సార్లు గెలవగా, ఇప్పుడూ గెలిచి హ్యాట్రిక్ నమోదు చేసుకుంది.

ఖమ్మంలో 'హస్తం'

4,67,847 ఓట్ల మెజార్టీతో ఆర్‌ఆర్‌ఆర్ భారీ విజయం

- అసెంబ్లీ ఎన్నికలకు మించి మెజార్టీ రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- ఇది ప్రజా విజయం: మంత్రి పొంగులేటి, ఖమ్మం అభ్యర్థి రఘురాంరెడ్డి
- విజేతకు.. సీపీఐ(ఎం), సీపీఐ నేతల శుభాకాంక్షలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఖమ్మం పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ కనీవినీ ఎరుగని రీతిలో మెజార్టీ నమోదు చేస్తూ భారీ విజయాన్ని అందుకుంది. రెండు చోట్లా నియోజకవర్గ చరిత్రను తిరగరాస్తూ మెజార్టీ నమోదయింది. ఖమ్మంలో రామసహాయం రఘురాంరెడ్డి 4,67,847 ఓట్లతో తన సమీప ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావుపై విజయం సాధించారు. ప్రారంభం నుంచి కొన్ని రౌండ్ల వరకు ఇరువురు అభ్యర్థులు ఆధిపత్యం ప్రదర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు మించి మెజార్టీ రావడం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. ఇది ప్రజా విజయమని, రఘురాంరెడ్డి ఆల్‌టైం రికార్డు నమోదు చేశారని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఖమ్మం నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ ఆర్‌ఆర్‌ఆర్ ఆధిక్యత కనబరిచారు. సీపీఐ(ఎం), సీపీఐ మద్దతుతో ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన రఘురాంరెడ్డికి 7,66,929 ఓట్లు లభించగా నామకు 2,99,082 ఓట్లు వచ్చాయి. 4,67,847 ఓట్ల మెజార్టీతో రామసహాయం విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీ పడగా 12,51,733 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 21 రౌండ్లలోనూ ఏ ఒక్క రౌండ్‌లోనూ బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ఆధిపత్యం సాధించలేదు. మొత్తమ్మీద గత ఎన్నికల్లో 24వేల ఓట్లు సాధించిన బీజేపీ ఈసారి 1.18 లక్షల ఓట్ల వరకు వెళ్లినా డిపాజిట్ దక్కించుకోలేకపోయింది.

ఇండియా కూటమి అభ్యర్థులకు వామపక్షాల శుభాకాంక్షలు

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో విజయం సాధించిన ఇండియా కూటమి అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి సీపీఐ(ఎం), సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, బాగం హేమంతరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ బంపర్ విజయాన్ని ప్రజా విజయంగా పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు.

ఖేదం...మోదం

(మొదటిపేజీ తరువాయి)

కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిందే. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సీట్లే గెలిచిన బీజేపీ, 2023 శాసనసభ ఎన్నికల్లో 8 చోట్ల విజయం సాధించింది. అలాగే గత లోక్‌సభ ఎన్నికల్లో 4 ఎంపీ స్థానాలు గెలిచి, ఇప్పుడు ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు మాత్రమే స్వల్పమెజార్టీ లభించింది. మిగిలిన 7 స్థానాల్లోనూ ఆపార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీలే సాధించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రాభవం పెరుగుతుందనడానికి ఈ గణాంకాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో 10 నుంచి 12 సీట్లు గెలుస్తామని బీజేపీ అధినాయకత్వం ధీమా వ్యక్తం చేసింది. ప్రధాని మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా రాష్ట్రంలోని పలు బహిరంగ సభల్లో ఇదే విషయాన్ని చెప్పారు. కానీ 8 సీట్లకే పరిమితం అయ్యారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి కూడా 14 చోట్ల విజయం సాధిస్తామన్నారు. తన ఐదు నెలల పాలనకు ఈ ఫలితాలు రిఫరెండమేనని చెప్పారు. కానీ ఓటర్లు 8 చోట్ల మాత్రమే విజయాన్ని అందించి 'పాస్' మార్కులకే పరిమితం చేశారు. 16 సీట్లు గెలుస్తామన్న బీఆర్‌ఎస్ ఎక్కడా ఖాతానే తెరవలేదు. ఈ ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే బీజేపీకి పట్టం కట్టడమే కొంత ఆందోళన కలిగించే అంశం. ఆపార్టీ మతోన్మాద అజెండా ప్రమాదాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతను గుర్తుచేస్తుంది. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన మేనల్లుడు, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే టీ హరీశ్‌రావుల సొంత జిల్లా మెదక్‌లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థి రఘునందనరావు విజయం సాధించారు.

ఈ మార్పు మారుతున్న రాజకీయ సమీకరణాలను వెల్లడి చేస్తుంది. ఆరునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు, ఇప్పటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు పొంతన లేకుండా ఉంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల బదలాయింపు ఆ పార్టీలకు జరగలేదని అర్థమవుతుంది. దీనివల్లే బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జీ కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించినా, ఆయనకు రెండో అతి తక్కువ మెజారిటీ మాత్రమే లభించింది. మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు దాదాపు 4,500 ఓట్ల మెజారిటీ వస్తే, కిషన్‌రెడ్డికి 50వేల ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది. ఆపార్టీకి చెందిన మిగిలిన అభ్యర్థులందరూ లక్షకు పైగా మెజార్టీతో గెలుపొందారు. నల్గొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మాజీ మంత్రి కే జానారెడ్డి కుమారుడు, కుందూరు రఘువీర్‌రెడ్డి 5.59 లక్షలకు పైగా భారీ మెజార్టీతో గెలుపొంది ఈ ఎన్నికల్లో రికార్డు సృష్టించారు.

బీజేపీకి భారీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

చుట్టూ నిర్మించిన అజేయత ప్రతిష్టకు ఇది పెద్ద ఎదురు దెబ్బ అని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

ప్రతిపక్షాలపై దాడులు, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం, ధన బలాన్ని విచ్చలవిడిగా ఉపయోగించడం నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ నిరంకుశ దాడులకు దీటుగా ఎదురొడ్డి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పరిరక్షణకు నిలబడిన ప్రజలకు పొలిట్‌బ్యూరో అభినందనలు తెలియచేసింది.

నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ దుస్థితి, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడులు వంటి అంశాలను చేపడుతూ ఇండియా బ్లాక్ విశ్వసనీయమైన రీతిలో ప్రచారం నిర్వహించింది. మోడీ, బీజేపీలు సాగిస్తున్న మతోన్మాద విషపూరిత ప్రచారాన్ని గణనీయంగా అడ్డుకోగలిగింది.

అందరికీ సమాన అవకాశాలు వుండేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకున్నట్లైతే ఈ ఫలితాలు బీజేపీకి, ఎన్డీఏకి మరింత ప్రతికూలంగా వుండేవని పొలిట్‌బ్యూరో పేర్కొంది. నరేంద్ర మోడీ రెచ్చగొట్టే రీతిలో సాగించిన మతోన్మాద, విద్వేష ప్రచారాన్ని అడ్డుకోవడంలో, ఎన్నికల నిబంధనావళిని కచ్చితంగా అమలు చేయడంలో ఘోరంగా విఫలమవడం ఎన్నికల కమిషన్ ప్రతిష్టకు మాయని మచ్చ వంటిదని సీపీఐ(ఎం) పేర్కొంది.

సీపీఐ(ఎం), వామపక్షాలు ఈ ఎన్నికల్లో తమ సీట్ల సంఖ్యను మెరుగుపరుచుకున్నాయి. పూర్తి స్థాయిలో ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మరింత వివరణతో కూడిన విశ్లేషణ వుంటుందని తెలిపింది.

ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రజల జీవనోపాధులపై జరిగే దాడులన్నింటినీ ప్రజలు తిప్పికొడుతున్నారని ఈ తీర్పు సంకేతాలిస్తోంది.

చెల్లని మోడీ మ్యాజిక్

(మొదటిపేజీ తరువాయి)

వివరించడంలో ప్రతిపక్షాలు విజయం సాధించాయి. కులగణన అంశం కూడా ఇండియా బ్లాక్‌కు కలిసొచ్చింది. రాయబరేలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాలుగు లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. కేరళలోని వయనాడ్ నుంచి కూడా ఆయన గెలుపొందారు. నెహ్రూ-గాంధీ కుటుంబానికి కంచుకోట అయిన అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పరాజయం పాలయ్యారు. 2019 ఎన్నికల్లో యూపీలో సమాజ్‌వాదీ, బీఎస్పీ, ఆర్‌ఎల్‌డీ పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేసినప్పటికీ బీజేపీ 62 స్థానాలు గెలుచుకుంది. 2014లో అప్నాదళ్‌తో కలిసి పోటీ చేసి 73 స్థానాలు కైవసం చేసుకుంది. అయితే ఈసారి మాత్రం బాగా నష్టపోయింది. 2022 శాసనసభ ఎన్నికల్లో ప్రారంభమైన పతనం ఇప్పుడూ కొనసాగింది. ముస్లింలు, బీసీలు..ముఖ్యంగా యాదవులు ఇండియా బ్లాక్‌కే ఓటేశారు. బీఎస్పీకి ఓటేసే దళితులు కూడా ఈసారి ఇండియా బ్లాక్ పక్షాన నిలిచారు. 2014, 2019 ఎన్నికలతో పోలిస్తే వారణాసిలో ప్రధాని మోడీ మెజారిటీ సైతం తగ్గిపోయింది.

తమిళనాడులో ఇండియా బ్లాక్ ఘన విజయాలు నమోదు చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పరాజయాన్ని చవిచూశారు. అన్నా డీఎంకే అడ్రస్ గల్లంతైంది. మహారాష్ట్రలోనూ బీజేపీ ఎత్తుగడలు పారలేదు. శివసేన, ఎన్సీపీ వంటి ప్రధాన పార్టీలను చీల్చి రాజకీయ లబ్ది పొందుదామని ఆశించిన ఆ పార్టీకి నిరాశ తప్పలేదు. ఏక్‌నాథ్ షిండే రూపంలో శివసేనను, అజిత్ పవార్ రూపంలో ఎన్సీపీని చీల్చి రాజకీయంగా లబ్ది పొందుదామని ఆశించినా ఫలితం లేకపోయింది. ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలతో ఏర్పడిన మహా వికాస్ అఘాడీ మంచి ఫలితాలు సాధించింది. పశ్చిమ బెంగాల్‌లోనూ ప్రతిపక్షాలదే పైచేయి అయింది. రాష్ట్రంలో పాగా వేయాలని బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 2019లో ఆ పార్టీకి 18 స్థానాలు లభించగా ఈసారి సగానికి సగం తగ్గిపోయాయి. మరోవైపు అధికార తృణమూల్ కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకుంది.

రాజస్థాన్‌లో కూడా కాషాయ పార్టీకి ఎదురు దెబ్బలు తగిలాయి. గతంలో ఉన్న స్థానాలను సైతం ఆ పార్టీ నిలుపుకోలేకపోయింది. అన్నదాతల ఆగ్రహం కారణంగా హర్యానా, పంజాబ్‌లోనూ పరాజయాలను మూటకట్టుకోవాల్సి వచ్చింది.

ఒడిశాలో మాత్రం బీజేపీకి మంచి ఫలితాలు వచ్చాయి. ఆరు పర్యాయాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ ఘోర పరాజయాన్ని మూటకట్టుకుంది. ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలనూ బీజేపీయే గెలుచుకుంది. జార్ఖండ్‌లో బీజేపీ మంచి ఫలితాలే సాధించినప్పటికీ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి అర్జున్ ముండా పరాజయం పాలయ్యారు. జేఎంఎం నేత, మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేయడంతో ఆగ్రహించిన గిరిజన ఓటర్లు ఇండియా బ్లాక్‌కు ఓటేశారు.

గుజరాత్ నుండి దశాబ్ద కాలం తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి లోక్‌సభలో అడుగు పెట్టారు.

కాంగ్రెస్‌దే కంటోన్మెంట్

నవతెలంగాణ-కంటోన్మెంట్

గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఒక్క సీటూ గెలవని కాంగ్రెస్‌కు ఉప ఎన్నికల్లో ఊరట లభించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ 13,633 ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. మొత్తం 17 రౌండ్ల కౌంటింగ్ జరగ్గా.. ఆయన మొదటి రౌండ్ నుంచి ఆధిక్యత కనబర్చారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి లాస్య నందిత గెలుపొందారు. అయితే ఆమె ఈ ఏడాది ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. దాంతో ఈ స్థానానికి మే 13న ఉప ఎన్నిక జరిగింది. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరగ్గా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ 53,651 ఓట్లు సాధించారు. 40,445 ఓట్లు సాధించి బీజేపీ అభ్యర్థి వంశీతిలక్ రెండో స్థానంలో నిలిచారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదిత 34,462 ఓట్లు సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. నివేదిత మొదటి 9 రౌండ్లు రెండో స్థానంలో ఉండగా.. చివరగా పదో రౌండ్ నుంచి మూడో స్థానానికి పడిపోయారు. మొత్తం ఈ ఉప ఎన్నికలో 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక శ్రీ గణేశ్ 2018, 2023లో బీజేపీ నుంచి పోటీ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఉప ఎన్నిక టిక్కెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 65కి చేరింది. బీఆర్‌ఎస్ బలం 38కి పడిపోయింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ విలేకరులతో మాట్లాడుతూ.. కంటోన్మెంట్ అభివృద్ధి తన ధ్యేయమన్నారు. ఎంతో నమ్మకంతో తనను ప్రజలు గెలిపించినందుకు వారికి రుణపడి ఉంటానని తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కృషి చేస్తానని, అవసరమైతే ఢిల్లీ స్థాయిలో ధర్నాలు కూడా చేస్తానన్నారు.

కాంగ్రెస్ అంచనాలు మిస్‌ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు భారీ మెజార్టీని కట్టబెట్టారు. మిగతా చోట్ల కూడా మెజార్టీ వస్తుందనే భరోసాతో కాంగ్రెస్ ఉన్నది. తుదకు ఎన్నికల ఫలితాలు ఆ పార్టీ అంచనాలను తలకిందులు చేశాయి. మొత్తంగా ఎనిమిది సీట్లకు ఆ పార్టీ పరిమితం కావాల్సి వచ్చింది. గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి-మల్కాజిగిరి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి-నల్లగొండ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి-భువనగిరి స్థానాల నుంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గతానికి కంటే ఐదు సీట్లు ఎక్కువగా గెలుచుకున్నప్పటికీ అధికార పార్టీ హోదాలో కేవలం 8 సీట్లకు పరిమితమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆ పార్టీ అంచానాలు తప్పినా గతం కంటే ఎక్కువ సీట్లు గెలుచుకోవడం పట్ల ఆ పార్టీ నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ బీజేపీతో జతకట్టి కాంగ్రెస్‌ను దెబ్బతీసిందని వారు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల అమలు తదితరాంశాలు ఎన్నికల్లో పని చేసినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.

విజయం చేకూర్చిన ప్రజలకు ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ 100 రోజుల పాలనను ఆశీర్వదిస్తూ... ఎనిమిది లోక్‌సభ స్థానాలతో పాటు, కంటోన్మెంట్ శాసనసభ ఉపఎన్నికలో విజయం చేకూర్చిన రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. 'మీరు అందించిన ఈ ఆశీర్వాదాలు మా ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. మరింత సమర్థవంతమైన పాలన అందివ్వడానికి ఉత్సాహాన్నిచ్చాయి. ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉన్నదన్న విషయాన్ని ఈ ఎన్నికల ఫలితాలు మరోసారి రుజువు చేశాయి' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ విజయం కోసం పని చేసిన కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇది కార్యకర్తల విజయమని పేర్కొన్నారు. వారి శ్రమ, కష్టం పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. రేపటితో ఎన్నికల కోడ్ ముగుస్తుందనీ, మళ్లీ ప్రజా ప్రభుత్వ పాలన మొదలవుతుందని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అద్భుతమైన పాలన అందిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే విధంగా ప్రజా పాలన ఉంటుందని పేర్కొన్నారు.

ఉమ్మడి వరంగల్‌లో హస్తం హవా




వరంగల్‌లో డాక్టర్ కావ్య, కడియంపై పనిచేయని బీఆర్ఎస్ విమర్శలు

మహబూబాబాద్‌లో బలరాంయక్.. విజయకేతనం

వరంగల్ తూర్పు అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్‌కు తగ్గిన ఓటింగ్

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) పార్లమెంటు నియోజకవర్గాల్లో హస్తం హవా వీచింది. ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సీపీఐ(ఎం), సీపీఐ మద్దతు ప్రకటించి ప్రచారం నిర్వహించాయి. తెలంగాణ జన సమితి, ఇతర ప్రజా సంఘాలు సైతం బీజేపీని ఓడించడంలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించాయి. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు మహబూబాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ హైస్కూల్ ఆవరణలో జరిగింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, తన సమీప బీజేపీ ప్రత్యర్థి అరూరి రమేష్‌పై 2,19,691 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తన సమీప బీఆర్ఎస్ ప్రత్యర్థి మాలోత్ కవితపై 3 లక్షల భారీ మెజార్టీతో గెలిచారు.

2019 ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాలను భారీ మెజార్టీతో గెలుచుకున్న బీఆర్ఎస్ ఈ ధపా ఎన్నికల్లో వరంగల్‌లో మూడోస్థానానికి పరిమితం అయింది. మహబూబాబాద్‌లో రెండోస్థానంలో ఉన్నా గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ స్థానాల్లో ఆరు కాంగ్రెస్ గెలిచిన విషయం తెలిసిందే. స్టేషన్‌ఘన్‌పూర్ స్థానంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరి తన కూతురు డాక్టర్ కడియం కావ్యకు పార్టీ టికెట్ ఇప్పించుకొని గెలిపించుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ 'కడియం' కేంద్రంగానే విమర్శలు గుప్పించారు. అయినా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య 2.19 లక్షల భారీ మెజార్టీతో విజయం సాధించడం విశేషం. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం భద్రాచలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలుపొందినా, ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ మరింత బలహీనపడింది.

వరంగల్ 'తూర్పు'లో హస్తం పరాభవం

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్‌పై బీజేపీకి 7,954 ఓట్ల మెజార్టీ లభించడం గమనార్హం. ఇక్కడ నుంచి మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో మంత్రి కొండా సురేఖ మెదక్ పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించడం, మరోవైపు 'తూర్పు'లో ముందు నుంచి ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, క్యాడర్‌లోనూ తీవ్ర అసంతృప్తి ఉండటంతో బీజేపీ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని మెజార్టీ సాధించి ఉండొచ్చనేది విశ్లేషకుల అభిప్రాయం. బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్ కూడా ఈ నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడానికి కారణమైంది. అటు మెదక్‌లోనూ కాంగ్రెస్ ఓడిపోవడం, ఇక్కడ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీపై బీజేపీ మెజార్టీ సాధించడం 'కొండా'కు ఇబ్బందికరమేనని విశ్లేషకులు అంటున్నారు.

మూడోస్థానానికి పరిమితమైన బీఆర్ఎస్

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మూడోస్థానానికి పరిమితమైంది. 2014, 2015 ఉప ఎన్నిక, 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో ఈ స్థానాన్ని నిలబెట్టుకుంది. అలాంటి చోట తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య తన సమీప బీజేపీ ప్రత్యర్థి అరూరి రమేష్‌పై 2,19,691 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురిగా డాక్టర్ కడియం కావ్య ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగారు. వామపక్షాల మద్దతు తోడై భారీ మెజార్టీతో గెలిచారు. బీఆర్ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో రెండోస్థానంలో ఉండగా, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, భూపాలపల్లి, పరకాల నియోజకవర్గాల్లో మూడోస్థానానికి పరిమితమైంది.

మహబూబాబాద్‌లో కాంగ్రెస్ విజయం

మహబూబాబాద్ (ఎస్టీ) పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తన సమీప బీఆర్ఎస్ ప్రత్యర్థి మాలోత్ కవితపై 3,46,089 ఓట్ల భారీ మెజార్టీ సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌కు 6,12,774 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 2,63,609 ఓట్లు, బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌కు 1,08,775 ఓట్లు వచ్చాయి. ఈ పార్లమెంటు నియోజకవర్గంలోని మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిక్యాన్ని చాటుకుంది.

హైదరాబాద్ మజ్లిస్‌దే..

బెడిసికొట్టిన బీజేపీ వ్యూహం

మైనార్టీ ఓట్లు, ఎంబీటీ, ఇతర సంఘాల మద్దతుతో భారీ మెజార్టీ సాధించిన ఓవైసీ




నవతెలంగాణ-సిటీబ్యూరో

మజ్లిస్ పార్టీకి కంచుకోటగా ఉన్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి తమ జెండా పాతేందుకు బీజేపీ పక్కా వ్యూహంతోనే ముందుకెళ్లింది. ఇందులో భాగంగానే హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా విరించి ఆస్పత్రి చైర్‌పర్సన్ కొంపెల్ల మాధవీలతను బరిలోకి దింపింది. అలా ఎంఐఎం అడ్డాలో మహిళ, హిందూత్వ సెంటిమెంట్‌ను ప్రయోగించి గెలవలన్నా బీజేపీ వ్యూహం బెడిసి కొట్టింది. ఈ సెగ్మెంట్ నుంచి ఐదోసారి ఎంపీగా బరిలో నిలిచిన అసదుద్దీన్‌ను ఓడించేందుకు బీజేపీ శతవిధాలా ప్రయత్నించినప్పటికీ.. ఫలితాలకు వచ్చేసరికి రెండు మూడు రౌండ్ల వరకే బీజేపీ ఆధిక్యం ప్రదర్శించింది. ఆ తర్వాత రౌండ్లలో రెండో స్థానానికే పరిమితమైంది.

మాధవీలతను గెలిపించేందుకు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు ఎన్నికల ప్రచారం చేశారు. ప్రధాని మోడీ సైతం ఎల్బీస్టేడియంలో నిర్వహించిన సభలో పాల్గొని.. ఎంఐఎంపై నేరుగా విమర్శలు చేశారు. మరోవైపు అభ్యర్థి మాధవీలత పాతబస్తీ అభివృద్ధిపై, ఎన్నికల్లో ఎంఐఎం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని విస్తృత ప్రచారం చేశారు. ప్రజలను, మీడియాను ఆకర్షించే విధంగా మాట్లాడి.. ప్రచారంలో హైప్ తీసుకొచ్చారు. హిందూత్వ ఎజెండాతో ఆమె ప్రచారం సాగింది. అయితే, గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2.86లక్షల ఓట్లు ఉంటే.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రాజాసింగ్‌కు 80,182 ఓట్లు వచ్చాయి. పార్లమెంట్‌కు వచ్చేసరికి ఇక్కడ మాధవీలతకు వచ్చిన ఓట్లు 37,131 మాత్రమే. మిగతా సెగ్మెంట్లలోనూ ఇదే పరిస్థితి.

ఇదిలావుంటే, ఓవైసీ సోదరులపై ప్రజల్లో అంతర్గతంగా అసంతృప్తి నెలకొన్నప్పటికీ.. ఆయన గెలుపును మిగతా పార్టీలు అడ్డుకోలేకపోయాయి. బీజేపీ మత ఎజెండాతో పోవడంతో స్థానిక పార్టీలైన ఎంబీటీ, ఇతర ముస్లిం మైనార్టీ సంఘాలు ఈ ఎన్నికల్లో మజ్లిస్‌కు మద్దతుగా నిలిచాయి. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీలో ఉన్నారా? లేరా? అనే పరిస్థితి కనిపించింది. ముఖ్యంగా స్నేహపూర్వక పోటీలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి సమీర్ వలీవుల్లా బరిలో ఉన్నప్పటికీ.. పెద్దగా ప్రచారం చేయలేదు. హైదరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 22.06లక్షల ఓటర్లు ఉండగా.. 46.08శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో ఓవైసీకి 6,61,987 ఓట్లు రాగా.. మాధవీలతకు 3,23,894 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సమీర్ వలీవుల్లాకు 62962 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు 18,641 ఓట్లు రాగా.. అసదుద్దీన్ ఓవైసీ 3,38,087 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

పెద్దపల్లిలో కాంగ్రెస్ విజయం

వంశీ గెలుపును భుజాన వేసుకున్న దుద్దిళ్ల

ధర్మపురి మినహా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్‌కు మెజార్టీ

శ్రీధర్‌బాబు ఇలాకాలోనే అత్యధికంగా 52957 ఓట్ల మెజార్టీ..

ఫలించని బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్..



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం.. దీని పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండటం.. అసెంబ్లీలో అన్ని సీట్లలో 30వేలకు తగ్గకుండా మెజార్టీ సాధించడం వంటి పరిణామాలతో పార్లమెంట్ ఎన్నికల్లో తొలుత కాంగ్రెస్ విజయం సునాయాసమే అన్న వాతావరణం ఉంది. అయితే, ఆ పార్టీ అభ్యర్థిగా ఒకే కుటుంబానికి చెందిన మూడోతరం వ్యక్తి గడ్డం వంశీకృష్ణకు టిక్కెట్ ఇవ్వడం మొదలు ఏర్పడిన ప్రతికూల పరిస్థితులు నామినేషన్ సమయం వరకూ కొనసాగాయి. అప్పటికే రెండుసార్లు అక్కడ గెలిచిన బీఆర్ఎస్.. క్షేత్రస్థాయి ప్రచారం చేపట్టడం వంటి పరిణామాల మధ్య కాంగ్రెస్ అధిష్టానం ఆ స్థానం గెలుపు బాధ్యతను మంథని ఎమ్మెల్యే మంత్రి శ్రీధర్‌బాబుకు అప్పగించింది. పార్టీలో ప్రతికూల పరిస్థితులను చక్కదిద్దుతూ తనదైన మార్క్‌తో ప్రచార బాధ్యతలు పరిశీలించిన ఆయన.. బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్‌కు సైతం చిక్కకుండా భారీ మెజార్టీతో వంశీ గెలుపును సునాయాసం చేయడంలో సఫలీకృతులయ్యారు.

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి గడ్డం వంశీ కృష్ణ 4,73,734 ఓట్లు సాధించి.. 1,30,863 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఒక్క ధర్మపురి మినహా అన్ని సెగ్మెంట్లలో కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ ఓట్లు సాధించారు. ధర్మపురిలో కాంగ్రెస్‌కు 56,938ఓట్లు రాగా, బీజేపీకి 65018 ఓట్లు రావడంతో.. అక్కడ బీజేపీకి మెజార్టీ వచ్చింది. అత్యల్పంగా పెద్దపల్లిలో 5325 ఓట్ల మెజార్టీ రాగా.. మంచిర్యాలలో 19457, బెల్లంపల్లిలో 24580, చెన్నూర్‌లో 24715, రామగుండంలో 10131 ఓట్లు వచ్చాయి. మంథని ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు ఇలాకాలో ఏకంగా 87079ఓట్లు రాగా.. 52957ఓట్ల మెజార్టీ రావడం గమనార్హం.

ఫలించని క్రాస్ ఓటింగ్..

పెద్దపల్లి సిట్టింగ్ సీటును బీఆర్ఎస్ కోల్పోయి మూడో స్థానానికి పరిమితమైంది. అయితే, 2014లో ఇదే పార్టీ నుంచి బాల్కసుమన్ ఎంపీగా గెలవగా.. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా వెంకటేష్ నేత విజయం సాధించారు. వరుసగా రెండుసార్లు గెలిచిన బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఉన్న కొప్పుల ఈశ్వర్‌ను బరిలో దింపింది. ఎన్నికల ప్రారంభ సమయంలో కాంగ్రెస్‌లో ప్రతికూల పరిస్థితులు.. కొప్పుల ఈశ్వర్‌కు మంచి పట్టు ఉందన్న సర్వే అంచనాలు.. గెలుపు అవకాశాలు మళ్లీ బీఆర్ఎస్‌కే అన్న సంకేతాలు కనిపించాయి. తీరా పోలింగ్ సమయానికి చేతులెత్తేసిన బీఆర్ఎస్ ఇక్కడ కాంగ్రెస్‌ను ఎలాగైనా ఓడించాలని క్షేత్రస్థాయిలో బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేయించిందన్న విమర్శను మూటగట్టుకుంది. అందుకు అద్దం పట్టేలా 1,93,266ఓట్లు మాత్రమే పొందిన బీఆర్ఎస్ ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఏమాత్రమూ పట్టుగానీ, పార్టీ కేడర్‌గానీ లేని బీజేపీకి ఓట్లు బదలాయించి ఏకంగా కమలం అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు 3,42,871ఓట్లు వచ్చేలా చేసింది. అయినప్పటికీ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌ను అప్రమత్తం చేస్తూ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఎమ్మెల్యేలందరూ దృష్టిసారించి తమ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించుకోలిగారు.

నవచిత్రం

16 పాటలతో ప్రయోగం



హేషమ్ అబ్దుల్ వహాబ్

హీరో శర్వానంద్ నటిస్తున్న తన 35వ మూవీ 'మనమే'. ఈ చిత్రంలో కృతిశెట్టి హీరోయిన్‌గా నటించింది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్‌లో నిర్మాత టీజి విశ్వప్రసాద్ గ్రాండ్‌గా నిర్మించారు. ఈనెల 7న థియేటర్లలో గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కానుంది.

ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇది చాలా డిఫరెంట్ ఎమోషన్స్ ఉన్న కథ. కథ గురించి ఇప్పుడే ఎక్కువ రివీల్ చేయకూడదు. ఇంత డిఫరెంట్ ఫిల్మ్‌ని చేయడం ఇదే మొదటిసారి. ఇందులో 16 పాటలు ఉన్నాయి. స్కోరింగ్ మొదలు పెట్టినప్పుడు ఇన్ని పాటలు వస్తాయని మేము ఊహించలేదు. డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య చాలా స్మార్ట్. ఆయన సినిమాని అద్భుతంగా మలిచి మంచి మ్యూజిక్ చేసే అవకాశాన్ని ఇచ్చారు. ఫస్ట్ హాఫ్ కంపోజ్ చేసినప్పుడే దాదాపు పది పాటలు వరకూ వచ్చాయి. సెకండ్ హాఫ్‌కి మరో ఆరు పాటలు అవసరం అవుతాయని భావించాం. సినిమా కోసం16 పాటలు చేయడం నాకు ఇదే తొలిసారి. 11 ప్రాపర్ సాంగ్ ట్రాక్స్. మరో ఐదు డిప్, బిట్ సాంగ్స్‌గా వస్తాయి. ఇలాంటి మంచి ప్రాజెక్ట్ రావడం గాడ్ బ్లెస్సింగ్స్‌గా భావిస్తాను. 'ఖుషి, హాయ్ నాన్న' మ్యూజిక్‌ని ఆడియన్స్ చాలా గొప్పగా రిసీవ్ చేసుకున్నారు. ఇందులో నా కంప్లీట్ మ్యూజిక్ నాలెడ్జ్‌ని ఎక్స్‌ప్రెస్ చేయడానికి అవకాశం దక్కింది. ఇదొక మ్యూజికల్ ఫిల్మ్. ఇన్ని పాటలు చేయడం నాకూ ఒక ప్రయోగంలా అనిపించింది. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది. కథకు అనుగుణంగానే పాటలు వస్తాయి. సాంగ్స్ నెరేటివ్‌ని ఇంకా వండర్‌ఫుల్‌గా ముందుకు తీసుకెళ్తాయి. శర్వానంద్, కృతిశెట్టి పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంటుంది' అని తెలిపారు.



బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి

వాస్తవ ఘటన స్ఫూర్తితో సత్యభామ

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'సత్యభామ'. నవీన్ చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ, స్క్రీన్ ప్లే అందించారు. దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు. ఈ నెల 7న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది.

ఈ నేపథ్యంలో నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి మంళవారం మీడియాతో మాట్లాడుతూ, 'గూఢచారి, మేజర్ సినిమాల దర్శకుడు శశికిరణ్ తిక్కకి బాబీ తిక్క బ్రదర్. ఆయన ఇండస్ట్రీలో ఉన్నారనే మేం ప్రొడక్షన్‌లోకి వచ్చాం. అవురమ్ ఆర్ట్స్ బ్యానర్‌లో తొలి ప్రయత్నంగా ఈ సినిమాను నిర్మించాం. మా దర్శకుడు సుమన్‌కు ఇది మొదటి సినిమా. మ్యూజిక్ బ్యాండ్స్‌లో పాడే సింగర్స్‌ను ఐడెంటిఫై చేసి వారికి రెండు పాటలు పాడే అవకాశం ఇచ్చాం. మేం ఫస్ట్ టైమ్ ఈ కథ విన్నప్పుడు మాలో ఎలాంటి ఎగ్జైట్‌మెంట్ కలిగిందో కాజల్ కూడా అలాగే ఫీలయ్యారు. నవీన్ చంద్ర ఒక మంచి ఇంపార్టెంట్ రోల్ చేశారు. ఒక ఇరవై ఏళ్ల క్రితం యూకేలో జరిగిన ఓ రియల్ ఇన్సిడెంట్ బేస్‌గా చేసుకుని ఈ సినిమా లైన్ రెడీ చేశాం. మైత్రీ మూవీ మేకర్స్ నైజాం ఏరియాలో మా సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఏపీలో ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ రిలీజ్ చేస్తోంది. సెన్సార్ బృందంలో మహిళలు మా మూవీని బాగా అభినందించారు. షీ సేఫ్ యాప్ కేవలం 5 వేల మంది మాత్రమే డౌన్ లోడ్ చేసుకున్నారు. ఇంకా దీని మీద అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. మా సినిమాలో ఈ యాప్ ప్రస్తావన ఉంటుంది. షీ సేఫ్ యాప్‌కు పనిచేసే మహిళల్ని వారి ఫ్యామిలీతో సహా మా మూవీ స్పెషల్ షోకు ఆహ్వానిస్తున్నాం' అని చెప్పారు.

పక్కా పైసా వసూల్ సినిమా



విశ్వంత్ దుద్దంపూడి, అనురూప్ కటారి హీరోలుగా, విస్మయ హీరోయిన్‌గా శ్రీ నేత్ర క్రియేషన్స్, ఆర్ట్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద ఏ.ప్రశాంత్ నిర్మించిన చిత్రం 'నమో'. ఈ చిత్రంతో ఆదిత్య రెడ్డి కుందూరు దర్శకులుగా పరిచయం కాబోతున్నారు. ఈ మూవీ ఈనెల 7న విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు భీమనేని శ్రీనివాసరావు, బెక్కం వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. దర్శకుడు ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ, 'ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ప్రశాంత్ సినిమాను నిర్మించారు. మంచి కథకి, సబ్జెక్ట్‌కి విశ్వంత్ లాంటి మంచి హీరో దొరకడంతోనే 'నమో' సినిమాగా మారింది. అనురూప్ సింగిల్ టేక్ ఆర్టిస్ట్. విస్మయ మంచి నటి. రాహుల్ శ్రీ వాస్తవ మంచి విజువల్స్ ఇచ్చారు. ట్రైబల్ సెట్‌ను కిరణ్ కుమార్ అద్భుతంగా వేశారు. క్రాంతి ఆచార్య చక్కని సంగీతం ఇచ్చారు. ఈనెల 7న మా చిత్రం రాబోతోంది. అందరూ వీక్షించి విజయవంతం చేయండి' అని అన్నారు. 'నాకు కేవలం ఇది ఓ సినిమా కాదు. నాకు ఇదొక ఎమోషన్. ఆదిత్య రాసిన పాత్రలు అద్భుతంగా వచ్చాయి. లాజిక్స్ పక్కన పెట్టి మ్యాజిక్ చూడండి. సినిమా అందరికీ నచ్చుతుంది. కచ్చితంగా పైసా వసూల్ చిత్రం అవుతుంది' అని హీరో విశ్వంత్ దుద్దంపూడి చెప్పారు. నిర్మాత ప్రశాంత్ మాట్లాడుతూ, 'మా సినిమా ఆద్యంతం నవ్విస్తూనే ఉంటుంది' అని చెప్పారు. మరో హీరో అనురూప్ మాట్లాడుతూ, 'మోహన్ అనే పాత్ర మా దర్శకుడు ఆదిత్యదే అనిపిస్తుంది. అంత మంచి క్యారెక్టర్‌ను ఇచ్చినందుకు థ్యాంక్స్' అని అన్నారు.

ఆటలు



ఐసీసీ టీ20 ప్రపంచకప్ తొలి చాంపియన్ టీమ్ ఇండియా.. 2024 ప్రపంచకప్ టైటిల్ వేటను నేడు మొదలెట్టనుంది. గ్రూప్-ఏలో పసికూన ఐర్లాండ్‌తో భారత్ నేడు తలపడనుంది. న్యూయార్క్ నయా స్టేడియంలో మెత్తని మైదానం, వాతావరణ పరిస్థితులే రోహిత్ సేనకు సవాల్‌గా నిలువనున్నాయి!. పసికూనతో మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. భారత బ్యాటింగ్ లైనప్ కూర్పుపై ఆసక్తి నెలకొంది. భారత్, ఐర్లాండ్ పోరు నేడు.

పసికూనతో పోరు

- నేడు భారత్, ఐర్లాండ్ మ్యాచ్
- బ్యాటింగ్ లైనప్ కూర్పుపై ఆసక్తి

రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-న్యూయార్క్




న్యూయార్క్ కొత్త స్టేడియం పిచ్, అవుట్‌ఫీల్డ్‌పై విమర్శలు రేగుతున్న వేళ టీమ్ ఇండియా టీ20 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌కు రంగం సిద్ధం చేసుకుంది. మెత్తని పిచ్‌తో క్రికెటర్లు కండరాల గాయానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందని టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సైతం ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ క్రికెటర్లు సైతం న్యూయార్క్ మైదానం నాణ్యతపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ స్టేడియంలోనే గ్రూప్ దశలో ఏకంగా మూడు మ్యాచులు ఆడనున్న టీమ్ ఇండియాకు ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడటం అసలు సవాల్‌గా నిలువనుంది. బంగ్లాదేశ్‌తో వార్మప్ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో చూపించిన భారత్.. నేడు ఐర్లాండ్‌పై ఏకపక్ష విజయంపై కన్నేసింది.

యశస్వికి చోటు దక్కేనా?

భారత బ్యాటింగ్ లైనప్ కూర్పుపై ఆసక్తి కనిపిస్తుంది. యువ బ్యాటర్, విధ్వంసకారుడు యశస్వి జైస్వాల్‌కు అవకాశం ఇస్తారా? లేదా అనేది తేలాల్సి ఉంది. ఐపీఎల్ ముందు వరకు ఓపెనర్‌గా బెర్త్ ఖాయం చేసుకున్న జైస్వాల్‌కు విరాట్ కోహ్లి నుంచి చెక్ ఎదురైంది. శుభ్‌మన్ గిల్‌ను కాదని ఓపెనర్‌గా జట్టులోకి వచ్చిన యశస్వి జైస్వాల్.. ఇప్పుడు బెంచ్‌కు పరిమితం అవుతాడా? నం.3 బ్యాటర్‌గా జైస్వాల్‌ను వాడుకునే ఆలోచన ఉందా? అనేది ఆసక్తికరం. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్‌లకు తోడు హార్దిక్ పాండ్య మంచి ఫామ్‌లో ఉన్నారు. వార్మప్ మ్యాచ్ ప్రదర్శనతో నిరాశపరిచిన సంజు శాంసన్ తుది జట్టులో నిలిచేది అనుమానమే. శివం దూబె సైతం రేసులో నిలిచినా బెంచ్‌కు పరిమితం అయ్యే అవకాశాలే ఎక్కువ. బుమ్రాకు తోడుగా అర్షదీప్, సిరాజ్‌లలో ఎవరు ఉంటారో చూడాలి. స్పిన్నర్లలో కుల్దీప్, చాహల్ ఇద్దరు ఆడతారా, ఒకరికే అవకాశం ఇస్తారా అనేది తేలాల్సి ఉంది.

కూనతో జాగ్రత్త

ఐర్లాండ్ పసికూన జట్టే. కానీ ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఎవరినీ తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. గతంలో చిన్న జట్ల చేతిలో దెబ్బతిన్న అనుభవాలను భారత్ మరచిపోలేదు. అగ్రజట్టు భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలనే తహతహ ఐర్లాండ్‌లోనూ కనిపిస్తుంది. బ్యాటర్లలో ఆండీ బాల్‌బిర్నె, లార్కన్ టక్కర్.. బౌలర్లలో మార్క్ ఎడెర్, క్రెయిగ్ యంగ్‌లు ఐర్లాండ్‌కు కీలకం కానున్నారు.

సెమీస్‌లో స్వైటెక్

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024



పారిస్ : ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌కు టాప్ సీడ్ ఇగా స్వైటెక్ (పోలాండ్) మరింత చేరువైంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఐదో సీడ్ ఒండ్రుసోవ (చెక్ రిపబ్లిక్)పై స్వైటెక్ 6-0, 6-2తో ఏకపక్ష విజయం సాధించింది. ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన స్వైటెక్ చెమటోడ్చకుండానే సెమీఫైనల్లో అడుగుపెట్టింది. మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో కొకొ గాఫ్ (అమెరికా) అదరగొట్టింది. 6-4, 2-6, 6-3తో ఓన్స్ జబర్ (ట్యూనీషియా)పై మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించింది. గురువారం జరిగే సెమీఫైనల్లో స్వైటెక్‌తో గాఫ్ అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ 4-6, 6-1, 5-7, 7-6(7-2), 6-2తో హోల్గర్ రునెపై విజయంతో క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకున్నాడు.

లక్ష్యసేన్ ముందంజ

ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000



జకర్తా : ఇండోనేషియా ఓపెన్‌లో లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో 21-12, 21-17తో సులువైన విజయం సాధించాడు. జపాన్ షట్లర్‌ను చిత్తు చేసి టోర్నీలో ముందంజ వేశాడు. సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్‌పై 21-17, 21-12తో ప్రియాన్షు రజావత్ మెరుపు విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో ట్రెసా, గాయత్రి జోడీ 21-15, 21-11తో ముందంజ వేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి, సుమిత్ జంట 18-21, 21-16, 21-17తో రెండో రౌండ్‌కు చేరుకుంది. మహిళల సింగిల్స్‌లో అగ్ర షట్లర్ పి.వి సింధు నేడు బరిలోకి దిగనుంది.

ఉగాండా ఉఫ్



ప్రొవిడెన్స్ : ఐసీసీ టీ20 ప్రపంచకప్ గ్రూప్-సిలో అఫ్గనిస్థాన్ అలవోక విజయం సాధించింది. ఉగాండాపై 125 పరుగుల తేడాతో గెలుపొందింది. రెహ్మానుల్లా గుర్బాజ్ (76), ఇబ్రహీం జద్రాన్ (70) అర్థ సెంచరీలతో అఫ్గనిస్థాన్ తొలుత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఛేదనలో ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. పేసర్ ఫజల్ ఫరూకీ (5/9) ఐదు వికెట్లతో విజృంభించగా, స్పిన్నర్ రషీద్ ఖాన్ (2/12), నవీన్ ఉల్ హాక్ (2/4) రెండేసి వికెట్లతో మెరిశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.